

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఢిల్లీలో ఆప్-కాంగ్రెస్ పొత్తు ఖరారు

4 చోట్ల ఆప్, మూడుచోట్ల కాంగ్రెస్ పోటీ

గుజరాత్, గోవా, హరియాణా, చండీగఢ్

సీట్ల పంపకాలు దాదాపు పూర్తి 2

అమేఠీ నుంచి రాహుల్‌గాంధీ పోటీ?

శుక్రవారం | 23-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 326

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం, తిథి: చతుర్దశి మ. 3.35 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: ఆశ్లేష రా. 7.26 తదుపరి మఖ; వర్జ్యం: ఉ.6.58-8.45, దుర్ముహూర్తం: ఉ.9.01-9.47, మ.12.52-1.39, అమృతఘడియలు: సా.5.39-7.26, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 6.42, సూర్యాస్తమయం: 6.17

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



మంత్రివర్గ ఉపసంఘంతో నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు, భట్టి, ఉత్తమ్

మరో 2 వరాలకు వేళాయె!



జైకా ఇండియా ప్రతినిధితో సీఎం రేవంత్

గృహ జ్యోతి, 500కే సిలిండర్ పథకాల అమలుకు రంగం సిద్ధం

ఈ నెల 27 లేదా 29న మార్గదర్శకాలు విడుదల

- నెలకు 200 యూనిట్లలోపు అర్హులకు మార్చి నుంచి జీరో కరెంటు బిల్లులు
- నిరంతరం ప్రజా పాలన దరఖాస్తులు
- క్యాబినెట్ సబ్‌కమిటీతో సీఎం సమీక్ష
- 'సిలిండర్'కు మార్గం సుగమం!
- సబ్సిడీ సొమ్ము గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లకు
- ప్రభుత్వం, ఏజెన్సీల మధ్య ఒప్పందం
- లబ్ధిదారుడు 500 చెల్లిస్తే సిలిండర్
- 3 ఏళ్ల వినియోగ సగటును బట్టి కోటా
- దాదాపు రూ.1000 కోట్ల భారం

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మరో రెండు పథకాల అమలుకు రంగం సిద్ధమవుతోంది. 200 యూనిట్లలోపు వినియోగదారులకు ఉచిత విద్యుత్తు (గృహజ్యోతి), రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాల అమలుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈనెల 27 లేదా 29వ తేదీన ఈ రెండు పథకాల అమలుకు సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంఛనంగా నిర్ణయం తీసుకున్నారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులందరికీ లబ్ధి చేకూరేలా చూడాలని స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, గ్యారంటీల అమలుకు వేసిన మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉన్నతాధికారులతో గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేయించుకునే

మిగతా 15వ పేజీలో...

కరెంట్ కట్ చేస్తే.. కొలువులు ఊడతాయ్! 15

- సర్కార్‌ను బద్నాం చేసేందుకే కొన్నిచోట్ల విద్యుత్తు కోతలు
- గతంతో పోలిస్తే ఇప్పుడు విద్యుత్తు వినియోగం పెరిగింది
- అయినా, డిమాండ్‌కు తగ్గట్లుగా సరఫరా చేస్తున్నాం: రేవంత్
- విద్యుత్తు శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం
- గొప్పలకు పోయి తప్పుడు నివేదికలొద్దు
- అలా చేసేనందుకే జల జీవన్ మిషన్ నిధులు రావట్లేదు
- ఏపీ తాగునీటి తరలింపుపై కేఆర్ఎంబీకి లేఖ రాయండి
- బోర్ల మరమ్మతులకు ఎమ్మెల్యేల నిధులు వాడుకోండి: సీఎం

నలుగురు ప్రభుత్వోద్యోగులకు బేడీలు 3



ఆదిత్య కేశవసాయి

రవి

రఘుపతి

సంగు గణేశ్

'గొర్రెల పంపిణీ' కేసులో సర్కారు చర్యలు

- పరారీలో ప్రధాన నిందితుడు మొయిన్, ఆయన కుమారుడు
- థర్డ్‌పార్టీకి బాధ్యతల అప్పగింతతోనే అవినీతి షురూ
- దర్యాప్తు వేగవంతం చేసిన గచ్చిబౌలి ఠాణా, ఏసీబీ బృందాలు
- త్వరలో రాజకీయ ప్రముఖుల ప్రమేయంపై ఆధారాల సేకరణ!

సంబురంగ సమ్మక్కొచ్చె!

- మేడారం గద్దెపైకి సమ్మక్క
- వనదేవతకు మంత్రి సీతక్క స్వాగతం
- గాల్లోకి తుపాకీ పేల్చిన ఎస్పీ
- కొలువుదీరిన నలుగురు దేవతలు
- నేడు మేడారానికి గవర్నర్, సీఎం



గద్దెపై సమ్మక్కను కొలువుదీర్చిన అనంతరం పూజలు చేస్తున్న భక్తులు

మేడారం బృందం, వరంగల్, భీమదేవరపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అడవి చీకట్లను తరిమిన నిండు పున్నమి వెలుగులు.. భక్తి పారవశ్యంతో లక్షల మంది జేజేలు.. డప్పు చప్పుళ్లకు అనుగుణంగా గిరిజన సంప్రదాయ నృత్యాలు.. శివసత్తుల పూనకాల మధ్య వనదేవత సమ్మక్క మేడారం గద్దెపైకి వచ్చింది. ఫలితంగా మేడారం జాతర పతాక స్థాయికి చేరుకుంది. సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు బుధవారం రాత్రే గద్దెపై కొలువు దీరారు. గురువారం సమ్మక్క తల్లి రాకతో గద్దెపై నలుగురు దేవతలు నాలుగు దిక్కులా కొలువుదీరినట్లయింది. ఫలితంగా శుక్రవారం మేడారం వచ్చే భక్తుల సంఖ్య రెట్టింపయ్యే అవకాశం ఉంది. సమ్మక్కను గద్దెపైకి

మిగతా 16వ పేజీలో...

మేడారానికి జాతీయ హోదా ఇవ్వలేం

- దేశంలో ఎక్కడా అలా లేదు
- యునెస్కో గుర్తింపు కోసం కృషి
- ఈ ఏడాది నుంచే గిరిజన వర్సిటీ తరగతులు ప్రారంభం 16
- మేడారం పర్యటనలో కిషన్‌రెడ్డి

అధికారులపై సోమేశ్ ఒత్తిడి?

- రూ.1000 కోట్ల జీఎస్టీ అక్రమాలపై విచారణ నిలిపివేతకు ప్రయత్నాలు
- అప్పట్లో సోమేశ్‌కుమార్ వద్దే ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖలు
- ఆయన కనుసన్నల్లోనే ఆ ఇద్దరు అధికారులు.. ఇప్పుడు వారికి స్థానచలనం



హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలో 'రూ.1000 కోట్ల జీఎస్టీ అక్రమాలు' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం కలకలం రేపింది. వాణిజ్య పన్నుల శాఖలో చర్చనీయాంశంగా మారింది. దీనికి సహకరించిన అధికారులు ఎవరంటూ ఆరా తీశారు. ఇదే సందర్భంలో ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి(సీఎస్) సోమేశ్‌కుమార్.. ఆ శాఖ అధికారులపై ఒత్తిడి పెంచినట్లు తెలిసింది. నిజానికి ఈ అక్రమాలన్నీ సోమేశ్‌కుమార్ సీఎస్‌గా ఉన్నప్పుడే జరిగినట్లు గుర్తించారు. సీఎస్‌గా ఉన్నప్పుడు వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖలను సోమేశ్ తన వద్దే పెట్టుకున్నారు. ఈ రెండు శాఖల ద్వారా నిర్దేశిత రాబడిని నిక్కచ్చిగా, మరింత ఎక్కువగా సాధిస్తానంటూ అప్పటి సీఎం కేసీఆర్‌తో సోమేశ్ నమ్మబలికేవారు. దాంతో ప్రభుత్వం కూడా రెండు కీలక శాఖలను ఆయన వద్దే పెట్టింది. రేవంత్ సర్కారు రావడంతో వాణిజ్య పన్నుల శాఖకు కొత్తగా వచ్చిన అధికారులు.. రెవెన్యూ లీకేజీలను ఆరా తీయడం మొదలుపెట్టారు. ఇంటిగ్రేటెడ్ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్(ఐజీఎస్టీ)కి సంబంధించి 1000 కోట్ల మేర ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్(ఐటీసీ)ను డీలర్లు కొల్లగొట్టినట్లు నిగ్గుతేల్చారు. దీనిపై ఉన్నతాధికారులు లోతైన విచారణ చేయిస్తున్నారు. దీంతో సోమేశ్‌కుమార్

మిగతా 15వ పేజీలో...

ఆడపిల్లపై ఇంత నిర్దయా?



- నాన్న ఆత్మ క్షోభిస్తుంది
- ఏపీ సీఎం జగన్‌పై షర్మిల ఆగ్రహం
- 'చలో సెక్రటేరియట్' తీవ్ర ఉద్రిక్తం
- షర్మిలను ఈడ్చుకుంటూ తీసుకెళ్లి వాహనంలో పడేసిన పోలీసులు
- మంగళగిరి ఠాణాకు తరలింపు 3



గంజాయి కేసులో యూట్యూబర్ షణ్ముఖ్ అరెస్ట్ 16

- షణ్ముఖ్ అన్న సంపత్ తనను మోసం చేశాడంటూ విశాఖ వైద్యురాలి ఫిర్యాదు
- అతడి ఇంటికి వెళ్లిన పోలీసులు
- 18 గ్రాముల గంజాయి సీజ్
- అన్నదమ్ములు అదుపులోకి
- షణ్ముఖ్‌పై ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసు.. అతడి అన్నపై రేప్ కేసు

అవును.. అది కొవిడ్ వ్యాక్సిన్ల ఫలితమే!

- గుండె, మెదడు, రక్త సంబంధిత వ్యాధులకు కారణమదే
- 8 దేశాల్లో 9.9 కోట్ల మందిపై స్టడీ
- వారిలో 13 రకాల ఆరోగ్య సమస్యలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: కంటికి కనిపించని కరోనా వైరస్ మానవాళిపై పంజా విసిరిన వేళ.. ఆ ప్రాణాంతక వైరస్‌పై పోరాటంలో కొవిడ్-19 వ్యాక్సిన్ ఆశాదీపంలా కనిపించింది. వైరస్ స్వైరవిహారానికి అడ్డుకట్ట వేసింది. ఇంతవరకూ బాగానే ఉంది కానీ.. కరోనా వ్యాక్సిన్ తీసుకున్న వారిలో గుండె, రక్త సంబంధిత వ్యాధులు

మిగతా 2వ పేజీలో...



గదిలో వ్యక్తి నిద్రిస్తుండగా ఇల్లు కూల్చివేత

- శిథిలాలు మీద పడి అక్కడికక్కడే వ్యక్తి మృతి
- కూకట్‌పల్లి ఠాణా పరిధిలో ఘటన 16
- మృతుడు శ్రీకాకుళం జిల్లాకు చెందిన రాజు





పాము విషానికి సింథటిక్ హ్యూమన్ యాంటీబాడీ

» అభివృద్ధి చేసిన ఇండో-అమెరికా పరిశోధకులు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: పాము కాటు వల్ల ఏటా వేలాది మరణాలు సంభవిస్తున్నాయి. ముఖ్యంగా భారత్, ఆఫ్రికా దేశాల్లో ఎక్కువ మంది పాముకాటుకు గురవుతున్నారు. అయితే.. ఆఫ్రికా, ఆసియా, ఆస్ట్రేలియా అంతటా కనిపించే నాగుపాటు, కింగ్ కోబ్రా, బ్లాక్ మాంబాతో సహా అత్యంత విషపూరిత పాములు ఉత్పత్తి చేసే శక్తివంతమైన న్యూరోటాక్సిన్లను నిర్వీర్యం చేయగల సింథటిక్ హ్యూమన్ యాంటీబాడీల (ప్రతిరోధకాలు)ను బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ), అమెరికాలోని స్క్రిప్స్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ శాస్త్రవేత్తల బృందం సంయుక్తంగా అభివృద్ధి చేసింది. దీని కోసం పరిశోధకులు... హెచ్ఐవీ, కొవిడ్-19కు వ్యతిరేకంగా ప్రతిరోధకాలను పరీక్షించడానికి గతంలో ఉపయోగించిన విధానాన్ని అనుసరించారు. గతంలోగుర్రాలు, గాడిదలకు ముందుగా పాము విషం ఎక్కించి.. ఆ తర్వాత వాటి రక్తాన్ని సేకరించి యాంటీబాడీలు అభివృద్ధి చేసేవారు. సైన్స్ ట్రాన్స్‌ప్లాంటేషనల్ మెడిసిన్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనంలో.. పరిశోధకులు అభివృద్ధి చేసిన సింథటిక్ హ్యూమన్ యాంటీబాడీలు వివిధ రకాల పాము విషాల నుంచి రక్షణ అందించగల సార్వత్రిక యాంటీబాడీ ద్రావణాల తయారీకి మరో ముందడుగు అని పరిశోధకులు తెలిపారు.


చైనాలో వంతెనను ఢీకొన్న భారీ నౌక

» రెండుగా చీలిన బ్రిడ్జి.. ఐదుగురి మృతి



బీజింగ్, ఫిబ్రవరి 22: చైనాలోని గ్వాంగ్జూ నగరంలో ఓ భారీ వాణిజ్య నౌక వంతెనను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. గురువారం తెల్లవారుజామున ఫోష్మన్ నుంచి గ్వాంగ్జూ వైపు పెరల్ నదిలో ప్రయాణిస్తున్న నౌక మార్గమధ్యలో ఉన్న లిజింగ్షా వంతెనను బలంగా ఢీకొంది. దాని ధాటికి వంతెన రెండు ముక్కలుగా చీలిపోవడంతో ఒక బస్సు, మోటారుసైకిల్ సహా పలు వాహనాలు నదిలో పడ్డాయి. ప్రమాద సమయంలో బస్సులో డ్రైవర్ ఒకడే ఉండటంతో పెను ప్రమాదం తప్పిందని స్థానిక మీడియా పేర్కొంది. ప్రమాద స్థలానికి రెస్క్యూ దళాలు చేరుకున్నాయని, గాలింపు పూర్తయని తర్వాతే మృతుల సంఖ్య తేలే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. కాగా, ప్రమాదానికి కారణమైన నౌక కెప్టెన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

లోకం తీరు



ఢిల్లీలో ఆప్-కాంగ్రెస్ పొత్తు ఖరారు

» నాలుగుచోట్ల ఆప్, మూడుచోట్ల కాంగ్రెస్ పోటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ- కాంగ్రెస్ పొత్తు ఖరారైన మరునాడే ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)- కాంగ్రెస్ పొత్తు కూడా ఖరారైంది. ఢిల్లీలో నాలుగు సీట్లలో ఆప్, మూడు సీట్లలో కాంగ్రెస్ పోటీ చేసేందుకు ఇరు పార్టీల మధ్య ఒప్పందం కుదిరింది. అలాగే గుజరాత్, గోవా, చండీగఢ్, హరియాణాలలో సీట్ల పంపకాలపై కూడా కాంగ్రెస్- ఆప్ మధ్య అవగాహన ఏర్పడింది. గుజరాత్‌లో రెండు చోట్ల ఆప్, చండీగఢ్‌లోని ఏకైక స్థానానికి కాంగ్రెస్, గోవాలోని రెండు సీట్లలో చెరోచోట పోటీకి అవకాశాలున్నాయని ఇరు పార్టీల వర్గాలు తెలిపాయి. అలాగే హరియాణాలో ఆప్‌కు ఒక సీటు కేటాయించనున్నట్లు తెలిసింది. ఇక మహారాష్ట్రలో మహా వికాస్ అఘాడీ కూటమితో చర్చలు అంతిమ దశలో ఉన్నాయని, ఏ ఏ పార్టీ ఎన్ని సీట్లలో పోటీచేస్తుందో ఈ నెలాఖరు వరకు ప్రకటిస్తామని కాంగ్రెస్ మహారాష్ట్ర ఇన్‌చార్జి రమేశ్ చెన్నితాల ప్రకటించారు. కాగా, రాహుల్ గాంధీ గతంలో పోటీ చేసి ఓడిపోయిన యూపీలోని అమేథీ నుంచే మరోసారి పోటీ చేయనున్నారని, ప్రియాంక కూడా రాయ్‌బరేలీ నుంచి పోటీ చేస్తారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

కేజ్రీవాల్‌కు ఏడోసారి ఈడీ సమన్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: మద్యం పాలసీ కుంభకోణం కేసులో విచారణకు హాజరు కావాలంటూ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం ఏడోసారి సమన్లు పంపించింది. ఈ నెల 26వ తేదీన తమ కార్యాలయానికి రావాలని ఆదేశించింది. ఇంతవరకు పంపించిన సమన్లు అన్నింటినీ కేజ్రీవాల్ తిరస్కరిస్తూ వచ్చారు. ప్రస్తుతం కేసు కోర్టు పరిధిలో ఉన్నందున ఈడీ విచారణకు వెళ్లాల్సిన అవసరం లేదని ఆప్ వాదిస్తోంది. ఆరోసారి సమన్లు అందుకున్న తరువాత కేజ్రీవాల్ కోర్టును ఆశ్రయించారు. తాను దర్యాప్తునకు సహకరిస్తున్నానని, కానీ ఈడీ తనకు సమన్లు ఇస్తోందని పేర్కొన్నారు. సమన్లు ఇచ్చే సమయ సందర్భాన్ని కూడా ఆయన ప్రశ్నించారు. దాంతో ఈ కేసు విచారణ నిమిత్తం మార్చి 16న హాజరు కావాలని కోర్టు ఆయనను ఆదేశించింది. ఈ నేపథ్యంలో మళ్లీ ఈడీ సమన్లు ఇవ్వడం ఎందుకని ఆప్ నాయకులు అంటున్నారు.

కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గేకు జడ్-ప్లస్ భద్రత

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు జడ్-ప్లస్ భద్రతను దేశవ్యాప్తంగా కల్పించాలని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ఖర్గేకు ఉన్న ముప్పును దృష్టిలో ఉంచుకుని ఈ మేరకు ఈ నెల ప్రారంభంలోనే నిర్ణయం తీసుకున్నట్టు అధికారవర్గాలు గురువారం తెలిపాయి. ఈ నేపథ్యంలో సీఆర్‌పీఎఫ్‌కు చెందిన కమాండోలు ఖర్గేకు జడ్-ప్లస్ భద్రతను కల్పిస్తారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు, ఎన్నికలప్పుడు ప్రధాన ప్రతిపక్ష పార్టీ అధ్యక్షుడైన ఖర్గే దేశవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించే అవకాశం ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని భద్రతను పెంచాలని నిర్ణయించినట్టు ఆయావర్గాలు చెబుతున్నాయి. ఖర్గేకు మూడుషిఫ్ట్‌ల్లో దాదాపు 30 మంది సీఆర్‌పీఎఫ్ కమాండోలు ఇరవైనాలుగ్గంటలు భద్రతను కల్పిస్తారు. బుల్లెట్ ప్రూఫ్ వాహనం, పైలట్, ఎస్కార్ట్ వాహనాలు వంటివి భద్రతలో భాగంగా ఉంటాయి.

బైజూస్ రవీంద్రన్‌పై ఈడీ లుకౌట్ నోటీసులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: ప్రముఖ ఎడ్‌టెక్ సంస్థ బైజూస్ వ్యవస్థాపకుడు, సీఈవో రవీంద్రన్‌కు మరిన్ని కష్టాలు వచ్చిపడ్డాయి. ఆయనకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం లుకౌట్ నోటీసులు (ఎల్‌సీ) జారీ చేసింది. దేశం విడిచి వెళ్లకుండా చూడాలని సంబంధిత అధికార వర్గాలను ఆదేశించింది. విదేశీ మారక నిల్వల నిర్వహణ చట్టం (ఫెమా) కింద దర్యాప్తు చేపట్టిన ఈడీ.. గత ఏడాది బెంగళూరులోని బైజూస్ కార్యాలయాలతో పాటు రవీంద్రన్ నివాసంలో సోదాలు జరిపిన సంగతి తెలిసిందే. ఇప్పటికే రవీంద్రన్‌పై 'ఆన్ ఇంటిమేషన్ లుకౌట్ సర్క్యులర్' అమల్లో ఉంది. అంటే ఆయన విదేశాలకు వెళ్లినప్పుడు ఇమిగ్రేషన్ అధికారులు ఈడీకి ముందుగానే సమాచారం అందజేయాల్సి ఉంటుంది. తాజాగా దాన్ని సవరించి, పూర్తిస్థాయి ఎల్‌సీ జారీ చేసింది. దీంతో ఇకపై రవీంద్రన్ ఈడీ అధికారుల అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లలేరు. ఇదిలా ఉండగా, రవీంద్రన్‌ను సీఈవో పదవి నుంచి తొలగించేందుకు కొంత మంది బైజూస్ వాటాదారులు శుక్రవారం అసాధారణ బోర్డు సమావేశాని(ఈజీఎం)కి పిలుపునిచ్చారు.

నౌకాదళం కోసం 200 బ్రహ్మోస్ క్షిపణులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: భారత నౌకాదళం కోసం 200కు పైగా బ్రహ్మోస్ సూపర్‌సానిక్ క్రూజ్ మిసైళ్లు, అందుకు సంబంధించిన ఇతర రక్షణ పరికరాల కొనుగోలుకు.. దేశ భద్రతపై ఏర్పాటు చేసిన క్యాబినెట్ కమిటీ(సీసీఎస్) గురువారం ఆమోదం తెలిపింది. ఇందుకు రూ.19వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా. హిందూ మహాసముద్రంలో చైనా కదలికలు పెరిగిన వేళ నౌకాదళం కోసం ఈ క్షిపణులను కొనుగోలు చేయనుండటం ప్రాధాన్యం సంతరించుకొంది. భారత్, రష్యా సంయుక్తంగా ఏర్పాటు చేసిన బ్రహ్మోస్ ఏరోస్పేస్ కంపెనీ ఈ క్షిపణులను తయారు చేస్తోంది. కాగా, క్షిపణుల కొనుగోలుకు నౌకాదళం త్వరలోనే బ్రహ్మోస్ ఏరోస్పేస్‌తో అధికారిక ఒప్పందం చేసుకోనున్నట్లు సమాచారం. కొనుగోలు చేసిన తర్వాత ఈ క్షిపణులను వేర్వేరు యుద్ధనౌకలపై మోహరించనున్నారు.

దారుల్ ఉలూమ్‌పై కేసు పెట్టండి

» యూపీ సర్కారుకు బాలల హక్కుల కమిషన్ సూచన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: ప్రముఖ ఇస్లామిక్ విద్యాసంస్థ దారుల్ ఉలూం దేవ్‌బంద్‌పై కేసు పెట్టాలని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి సూచనలు ఇచ్చింది. ఆ సంస్థ వెబ్‌సైట్‌లో ఉన్న ఓ ఫత్వా అభ్యంతరకరంగా ఉందని తెలిపింది. ఈ మేరకు ఆ కమిషన్ ఛైర్‌పర్సన్ ప్రియాంక్ కనుంగో షహరాన్‌పూర్ జిల్లా సీనియర్ ఎస్పీకి లేఖ రాశారు. 'ఘజ్వా-ఎ-హింద్' పేరుతో ఇచ్చిన ఫత్వా ఆ వెబ్‌సైట్‌లో ఉందని తెలిపారు. విదేశీ ఆక్రమణదారుల త్యాగాలను గొప్పగా చెప్పాలంటూ అందులో ఉందని పేర్కొన్నారు. పిల్లల్లో దేశం పట్ల విద్వేషం పెంచేలా ఈ ఫత్వా ఉందని తెలిపారు. ఈ విషయమై జనవరి 2022, జులై 2023ల్లో జిల్లా యంత్రాంగానికి లేఖలు రాసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని గుర్తు చేశారు. ఇకనైనా స్పందించకపోతే జిల్లా యంత్రాంగం బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

అయోధ్యకు నెల రోజుల్లో 50 లక్షల మంది

అయోధ్య, ఫిబ్రవరి 22: రామభక్తులతో అయోధ్య కిటకిటలాడుతోంది. ఇప్పటికే దేశంలో ప్రముఖ దర్శనీయ పుణ్యక్షేత్రంగా మారింది. చాలా దూరం నడవాల్సి వస్తున్నా, పెద్ద పెద్ద క్యూ లైన్లలో నిల్చోవాల్సి వస్తున్నా ఎవరిలోనూ నిరుత్సాహం కనిపించడం లేదు. ప్రతి రోజూ సుమారు రెండు లక్షల మంది భక్తులు వస్తున్నారు. ప్రాణ ప్రతిష్ఠ జరిగిన అనంతరం 30 రోజుల్లో 50లక్షల మందికిపైగా భక్తులు వచ్చినట్టు అంచనా. కాగా, భక్తుల రాక భారీగా ఉండడంతో హోటళ్ల అద్దెలు విపరీతంగా పెరిగాయి. కొన్ని మంచి హోటళ్లు సగటున ఒక్క రాత్రికి రూ.6000 వరకు వసూలు చేస్తున్నాయి.

మెయిటీలకు ఎస్టీ హోదాపై సూచన ఉపసంహరణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: అశాంతికి నిలయంగా ఉన్న మణిపూర్‌లో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. మెయిటీల రిజర్వేషన్ల విషయమై గతంలో తాను ఇచ్చిన తీర్పులో ఒక పేరాను మణిపూర్ హైకోర్టు ఉపసంహరించుకొంది. "మెయిటీ/మీటీలను ఎస్టీ జాబితాలో చేర్చే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం త్వరగా పరిశీలించాలి" అన్న పేరాను ఉపసంహరించుకున్నట్టు బుధవారం తెలిపింది. గత ఏడాది మార్చి 23న తీర్పు చెప్పిన హైకోర్టు పేరా నెంబరు 17(3)లో ప్రభుత్వానికి ఈ సూచన చేసింది. దీనిని వ్యతిరేకిస్తూ మరుసటి రోజు నుంచే గిరిజనులు ఆందోళనకు దిగడంతో పరిస్థితులు హింసాత్మకంగా మారి అశాంతి నెలకొంది. ఈ తీర్పును సవాలు చేస్తూ గిరిజన సంఘాలు హైకోర్టులో అప్పీలు చేయడంతో పాటు, సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించాయి. తీర్పును పునఃపరిశీలించాలని సుప్రీంకోర్టు సూచించడంతో హైకోర్టు సమీక్ష జరిపింది. తీర్పులో మెయిటీలను ఎస్టీ జాబితాలో చేర్చే విషయాన్ని పరిశీలించాలన్న సూచనను తొలగించింది.

ప్రభుత్వం చెప్పిందని చేశాం!

రైతుల ఉద్యమంతో సంబంధం ఉన్న ఖాతాల సస్పెన్షన్‌పై 'ఎక్స్'.. భారత్‌లోనే బ్లాక్ చేసినట్లు వెల్లడి

» ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన మోదీ

» ప్రజలు గుణపాఠం చెబుతారు: రాహుల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: రైతుల నిరసనలతో ముడిపడి ఉన్న అనేక ఖాతాలను ఎలాన్ మస్క్ నేతృత్వంలోని సోషల్ మీడియా కంపెనీ 'ఎక్స్' గురువారం సస్పెండ్ చేసింది. ఇందులో పలువురు ప్రముఖ రైతు నాయకులు, వారి మద్దతుదారుల ఖాతాలు ఉన్నాయి. రైతుల ఉద్యమానికి సంబంధించిన ఖాతాలు, పోస్టులను నిలిపివేయాలని భారత ప్రభుత్వం సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలను ఆదేశించింది. అయితే సర్కారు ఉత్తర్వులు పాటించిన 'ఎక్స్'... ఈ చర్య తీసుకోవడంలో తన అసమ్మతిని వ్యక్తం చేసింది. భావప్రకటనా స్వేచ్ఛకు తాము కట్టుబడి ఉన్నామని నొక్కిచెప్పింది. ప్రభుత్వ సూచనలను అనుసరించి చర్యలు తీసుకున్నామని, దీనిపై ఖాతాదారులకు సమాచారం కూడా ఇచ్చినట్లు తెలిపింది. కేంద్రం ఆదేశాల ప్రకారం భారత్‌లో మాత్రమే ఈ ఖాతాలు, పోస్టులను బ్లాక్ చేస్తున్నామని స్పష్టం చేసింది. రైతుల 'చలో ఢిల్లీ' నిరసనకు సంబంధించి శాంతి భద్రతలను కాపాడటంలో భాగంగా కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు మొత్తం 177 సోషల్ మీడియా ఖాతాలను, వెబ్‌లింక్‌లను తాత్కాలికంగా సస్పెండ్ చేయాలంటూ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, స్నాప్‌చాట్ తదితర సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలను ఆదేశిస్తూ ఫిబ్రవరి 14న ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

మండిపడ్డ కాంగ్రెస్

రైతుల నిరసనలకు సంబంధించి 177 ఖాతాలను తాత్కాలికంగా నిలిపివేయాలని కేంద్రప్రభుత్వం 'ఎక్స్'ను ఆదేశించిన నేపథ్యంలో రాహుల్ స్పందించారు. 'మోదీ జీ.. మీరు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. ఈ విషయం ప్రజలకు తెలుసు. ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు' అని పేర్కొన్నారు. 'రైతులు కనీస మద్దతు ధర అడిగితే కాల్పులు జరపడం, యువత ఉద్యోగాలు అడిగితే వారి మాటైనా వినకపోవడం, మాజీ గవర్నర్ ఒకరు నిజం చెబితే.. ఆయన ఇంటికి సీబీఐని పంపడం, ప్రతిపక్ష పార్టీ బ్యాంకు ఖాతాను స్తంభింపజేయడం... ఇదేనా ప్రజాస్వామ్యానికి భారతదేశం తల్లిలాంటిదని చెప్పడంలో అర్థం?" అని ప్రశ్నించారు. అది మీడియా కావచ్చు, సోషల్ మీడియా కావచ్చు.. మోదీ ప్రభుత్వం నిజం మాట్లాడే గొంతుకలను నొక్కేస్తోందని మండిపడ్డారు. కాగా, దేశానికి వెన్నెముకలాంటి రైతుల సమస్యలపై చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కాంగ్రెస్‌పై ఆర్థిక ఉగ్రవాదానికి పాల్పడుతోందని ఆరోపించారు.



తమపై ప్రయోగించిన టియర్ గ్యాస్ డబ్బాలతో ఓ రైతు

మాజీ గవర్నర్ సత్యపాల్‌పై సీబీఐ దాడులు

అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలపై జమ్మూ-కశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ నివాసాల్లో గురువారం సీబీఐ సోదాలు చేసింది. పలు నగరాల్లో 30 చోట్ల ఈ దాడులు జరిగాయి. సుమారు వంద మంది అధికారులు ఈ సోదాల్లో పాల్గొన్నారు. ఆ కేంద్ర పాలిత ప్రాంతంలో రూ.2,200 కోట్లతో చేపట్టిన కిరు జలవిద్యుత్తు కేంద్రం సివిల్ పనుల్లో అక్రమాలు జరిగినట్టు 2022 ఏప్రిల్‌లో ఆయనతో పాటు, మరికొందరిపై సీబీఐ కేసు నమోదు చేసింది. అందులో భాగంగానే ఈ సోదాలు జరిగాయి. సత్యపాల్ కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సీబీఐ దాడులపై ఆయన స్పందిస్తూ "అనారోగ్యంతో బాధపడుతున్న సమయంలో నియంతృత్వ శక్తులు నా నివాసాల్లో దాడులు చేశాయి. సోదాల పేరుతో నా డ్రైవరు, సహాయకుడ్ని కూడా అనవసరంగా వేధించారు. ఈ దాడులకు భయపడను. ఉద్యమం చేస్తున్న రైతులకు మద్దతుగా ఉంటా. ఇలాంటి చర్యలు నాకు ఆందోళన కలిగించవు" అని ఆయన వ్యాఖ్యానించారు.

రైతు మృతి బాధాకరం: వెంకయ్య

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ సరిహద్దుల్లో కొనసాగుతున్న అన్నదాతల నిరసనల్లో ఓ రైతు మృతి చెందడం పట్ల మాజీ రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు మృతి బాధాకరమని ఆయన గురువారం ఎక్స్(ట్విటర్)లో పేర్కొన్నారు. అందరికీ సంతృప్తికరమైన ఫలితం వచ్చేలా ప్రభుత్వం, రైతులు చర్చలు నిర్వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మంచి వాతావరణంలో చర్చలు జరగాలని, శాంతిని కాపాడేందుకు ఇరువురు కృషి చేయాలని వెంకయ్య నాయుడు కోరారు. కాగా, పంజాబ్-హరియాణా సరిహద్దులో యువ రైతు శుభకరణ్ సింగ్ మృతిపై హత్య కేసు నమోదు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) డిమాండ్ చేసింది. రైతుల నిరసనోద్యమంలో పాల్గొన్న శుభకరణ్ బుధవారం పోలీసు కాల్పుల్లో మరణించాడు. అతని మృతికి సంతాపంగా 'బ్లాక్ డే' పాటించాలని, ట్రాక్టర్ల మార్చ్ నిర్వహించాలని ఎస్కేఎం పిలుపునిచ్చింది.

రష్యా సైన్యంలో సహాయకులుగా 100కు పైగా భారతీయులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: అధిక వేతనాలు ఆశ చూపి ఏజెంట్లు చేసిన మోసానికి కొంతమంది భారతీయులు రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో చిక్కుకుపోయారు. యుద్ధానికి దూరంగా ఉంచుతామనే హామీతో రష్యా వెళ్లిన వారంతా అక్కడి సైన్యంలో చేరి ఉక్రెయిన్ సరిహద్దులో బలవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ఇలా ఇరుక్కుపోయిన భారతీయులు వంద మందికి పైగానే ఉన్నారు. రష్యా రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ఓ సీనియర్ అధికారి ఈ విషయాన్ని మీడియాకు బహిర్గతం చేశారు. సైనిక భద్రతా సహాయకులు(ఆర్మీ సెక్యూరిటీ హెల్పర్)గా వీళ్లను తీసుకున్నామని, దాదాపు ఏడాదిన్నరగా ఈ నియామకాలు జరుగుతున్నాయని తెలిపారు. భారత్‌తో పాటు పాకిస్థాన్, నేపాల్, బంగ్లాదేశ్, ఉజ్బెకిస్థాన్ తదితర దేశాలకు చెందిన యువతను నియమించుకున్నామని పేర్కొన్నారు. ఇలా చేర్చుకున్న వారికి తాము చేపట్టాల్సిన విధులపై ముందుగానే అవగాహన కల్పించి శిక్షణకు పంపామని చెప్పారు. శిక్షణ అనంతరం వారిని వేర్వేరు సైనిక స్థావరాలకు పంపామని, అక్కడి అవసరాలకు తగినట్టు వారు పని చేయాల్సి ఉంటుందని వెల్లడించారు. ఇలా, భారత్ నుంచి తెలంగాణ, కర్ణాటక, గుజరాత్, జమ్మూకశ్మీర్, పంజాబ్ రాష్ట్రాలకు చెందిన వారు ఏజెంట్ల ద్వారా రష్యా వెళ్లినట్టు సమాచారం. వీళ్లంతా ఓ ఏడాది పాటు కచ్చితంగా ఉద్యోగంలో ఉండేలా ఒప్పందం చేసుకుని పనిలో చేరారు. ఇలా రష్యాలో చిక్కుకుపోయిన ఇద్దరు తెలంగాణ వాసులు సహా 12 మంది భారతీయులను స్వదేశానికి రప్పించాలని అసదుద్దీన్ ఒవైసీ కేంద్రానికి జనవరి 25న ఓ లేఖ రాశారు. అలాగే, తమ రాష్ట్రానికి చెందిన ముగ్గురు యువకులను వెనక్కి తీసుకురావాలని కర్ణాటక ప్రభుత్వం కూడా విదేశీ వ్యవహారాల శాఖను ఆశ్రయించింది.

ప్రయోగాత్మకంగా ఓపెన్‌బుక్ పరీక్షలు

» సీబీఎస్ఈ యోచన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22 : ఓపెన్‌బుక్ పరీక్ష (ఓబీఈ) విధానంపై కేంద్ర సెకండరీ విద్యాబోర్డు(సీబీఎస్ఈ) దృష్టి సారించింది. ఎంపిక చేసిన పాఠశాలల్లో 9 నుంచి 12 తరగతుల వరకు ఈ విధానాన్ని ఈ ఏడాది ఆఖరులో ప్రయోగాత్మకంగా అమలులోకి తేవాలని యోచిస్తోంది. గతేడాది డిసెంబరులో జరిగిన బోర్డు పాలకవర్గం ఆఖరు సమావేశంలోనే ఈ విధానంపై చర్చ జరిగింది. ఎంపిక చేసిన కొన్ని పాఠశాలల్లో 9- 10 తరగతుల్లో ఇంగ్లిషు, మ్యాథ్స్, సైన్సు సబ్జెక్టుల్లో.. 11- 12 తరగతుల్లో ఇంగ్లిషు, మ్యాథ్స్, బయాలజీ సబ్జెక్టుల్లో ఈ పరీక్షా విధానాన్ని ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టాలనుకొంటున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ పరీక్షలు రాయడానికి విద్యార్థులు ఎంత సమయం తీసుకుంటున్నారు, దీనిపై ఎవరి అభిప్రాయం ఏమిటన్నది తెలుసుకోవడమే తమ ఉద్దేశమని అధికారులు చెప్పారు. ఓపెన్‌బుక్ పరీక్ష విధానంలో భాగంగా నోట్సు టెక్స్‌బుక్కు, ఇతర స్టడీమెటీరియల్‌ను తమవెంట పరీక్ష హాలులోకి తీసుకెళ్లడానికి, పరీక్ష సందర్భంగా వాటిని రిఫర్ చేయడానికి విద్యార్థులకు అనుమతిస్తారు. విద్యార్థుల ఆలోచన శక్తి, సృజన- విశ్లేషణ, సమస్యాపూరణ సామర్థ్యాలను మదింపు చేయడానికి ఈ ప్రయోగాత్మక పరీక్ష విధానంలో ప్రాధాన్యం ఇస్తారు. ఈ పరీక్షలను ఏవిధంగా నిర్వహించాలన్న దానిపై జూన్‌లోగా ఒక అంచనాకు వస్తారు. విధివిధానాలు రూపొందిస్తారు. నవంబరు, డిసెంబరు నెలల్లో అమలులోకి తేవాలని యోచిస్తున్నారు. ఈ ప్రయోగం విజయవంతమైతే, భవిష్యత్తులో ఓపెన్‌బుక్ పరీక్ష విధానం విషయంలో మరింత ముందుకు వెళ్లాలని సీబీఎస్ఈ భావిస్తోంది.

తగిన ఆధారాల్లేవ్!

అమెరికాలో కందుల జాహ్నవి యాక్సిడెంట్ కేసులో నిందితుడైన అధికారికి విముక్తి



జాహ్నవి (ఫైల్)

వాషింగ్టన్, ఫిబ్రవరి 22: భారతీయ విద్యార్థిని జాహ్నవి కందుల(23) మరణానికి కారణమైన సియాటెల్ పోలీసు అధికారి కెవిన్ డేవ్ నేర అభియోగాలను ఎదుర్కోబోరని అధికారులు వెల్లడించారు. తగిన ఆధారాలు లేకపోవడమే కారణంగా పేర్కొన్నారు. 'జాహ్నవి మరణం హృదయ విదారకంగా ఉంది. కింగ్ కౌంటీతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులను ఆ ఘటన ప్రభావితం చేసింది' అని కింగ్ కౌంటీ ప్రాసిక్యూటింగ్ అటార్నీ లీసా మానియన్ బుధవారం విడుదల చేసిన నివేదికలో పేర్కొన్నారు. అయితే, ఈ కేసులో సహేతుకమైన సందేహానికి వీలులేని క్రిమినల్ కేసుగా నిరూపించదగిన ఆధారాలు లేవన్నారు. గతేడాది జనవరి 23న సియాటెల్‌లో రోడ్డు దాటుతున్న జాహ్నవిని కెవిన్ డేవ్ నడుపుతున్న పోలీసు గస్తీ వాహనం గంటకు 119 కిలోమీటర్ల వేగంతో ఢీకొంది. దీంతో జాహ్నవి 100 అడుగుల దూరం ఎగిరిపడి అక్కడికక్కడే మరణించారు.

అది కొవిడ్ వ్యాక్సిన్ల ఫలితమే!

(మొదటి పేజీ తరువాయి)

పెరుగుతున్నాయనే వార్తలు కలవరపెట్టాయి! వాటికి బలం చేకూర్చేలా ఈ మధ్యకాలంలో పెరుగుతున్న గుండె, మెదడు, రక్త సంబంధిత వ్యాధులకు కరోనా వ్యాక్సిన్లే కారణమని తాజా అధ్యయనం గుర్తించింది. వివిధ దేశాల్లో కరోనా వ్యాక్సిన్ తీసుకున్న వారిలో గుండె సమస్యలు, మెదడు, రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడం వంటి దుష్ప్రభావాలు కనిపిస్తున్నాయని ఈ అధ్యయనం పేర్కొంది. ఆ వివరాలను వ్యాక్సిన్ అనే సైన్స్ జర్నల్‌లో నివేదించారు.

ఎనిమిది దేశాల్లో పరిశోధనలు

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) పరిశోధనా విభాగమైన గ్లోబల్ వ్యాక్సిన్ డేటా నెట్‌వర్క్‌కు చెందిన పరిశోధకులు ఈ అధ్యయనం నిర్వహించారు. ఈ క్రమంలో కొవిడ్-19 వ్యాక్సిన్లు 13 రకాల ఆరోగ్య సమస్యలను తీవ్రతరం చేశాయని వారు వెల్లడించారు. భారత్ మినహా... అర్జెంటీనా, ఆస్ట్రేలియా, కెనడా, డెన్మార్క్, ఫిన్లాండ్, ఫ్రాన్స్, న్యూజిలాండ్, స్కాట్లాండ్ వంటి దేశాల్లో కరోనా వ్యాక్సిన్ తీసుకున్న 9.9 కోట్ల మందిపై వారు అధ్యయనం నిర్వహించారు.



ఈ క్రమంలో కొన్ని రకాల ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్లు తీసుకున్న వారిలో గుండె కండరాల వాపునకు కారణమయ్యే మయోకార్డిటిస్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని గుర్తించారు. దీనితోపాటు గులియన్ బారె సిండ్రోమ్, పెర్కిర్డిటిస్, సెరిబ్రల్ వీనస్ సైనస్ థ్రాంబోసిస్ వంటి కేసులు 1.5 రెట్లు పెరిగాయని పేర్కొన్నారు.

మోడెర్నా, ఫైజర్, ఆస్ట్రాజెనెకా తీసుకున్నవారిలో..

ఫైజర్-బయోఎన్‌టెక్, మోడెర్నాకు చెందిన ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్ల మొదటి మూడు దశల మోతాదులు తీసుకున్న వారిలో మయోకార్డిటిస్ కేసులను ఎక్కువగా గుర్తించారు. మోడెర్నా రెండో డోసు తీసుకున్న తర్వాత ఈ కేసులు అధికంగా పెరిగాయని పేర్కొన్నారు. అలాగే ఆస్ట్రాజెనెకా టీకాలు మూడు డోసులు తీసుకున్న వారిలో పెరికార్డిటిస్ అనే గుండెజబ్బులు వచ్చే ప్రమాదం 6.9 శాతం పెరిగిందని చెప్పారు. మోడెర్నా టీకాల నాలుగో డోసు తీసుకున్న వారిలో ఈ ప్రమాదం 2.6% పెరిగినట్టు గుర్తించారు. ఆస్ట్రాజెనెకా టీకాలు తీసుకున్నవారిలో రక్తం గడ్డకట్టే వ్యాధిబారిన పడే ప్రమాదం 3.2 రెట్లు ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. అలాగే రోగనిరోధక వ్యవస్థ, నరాలపై దాడి చేసే గులియన్ బారె సిండ్రోమ్‌ను కూడా గుర్తించినట్టు చెప్పారు.

కొవిడ్ టీకాతో ప్రయోజనాలే అధికం

కొవిడ్-19 టీకాలు తీసుకోవడం వల్ల కలిగే దుష్ప్రభావాల కంటే ప్రయోజనాలే ఎక్కువగా ఉన్నాయని పరిశోధకులు స్పష్టం చేశారు. కాబట్టి కొవిడ్ వ్యాక్సిన్ తీసుకోవడం ఇప్పటికీ సురక్షితమైన మార్గమని వారు వెల్లడించారు. కాగా, కొవిడ్-19 సోకిన ఏడాదిలోనే చాలామంది కోలుకోగా.. మరికొందరికి ఊపిరితిత్తులు శాశ్వతంగా దెబ్బతిన్నాయని తాజా అధ్యయనంలో గుర్తించినట్టు పరిశోధకులు తెలిపారు.

కాంగ్రెస్ నా కులాన్ని తిట్టింది

» నన్ను దూషించడమే ఆ పార్టీ ఏకైక ఎజెండా: ప్రధాని మోదీ



నవ్‌సారి, మోహసానా, ఫిబ్రవరి 22: కాంగ్రెస్ తన కులాన్ని తిట్టిందని.. తనను దూషించడం తప్ప ఆ పార్టీకి మరో ఎజెండా లేదని ప్రధాని మోదీ అన్నారు. వారి ఈ ధోరణి.. ఎన్డీఏ కూటమి 400కు పైగా సీట్లు సాధించాలన్న తమ సంకల్పాన్ని మరింత బలోపేతం చేస్తుందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఎంత ఎక్కువ బురదజల్లితే.. అంతగా 370 కమలాలు (బీజేపీ గుర్తు) వికసిస్తాయని పేర్కొన్నారు. గుజరాత్‌లోని నవ్‌సారి, మోహసానా జిల్లాల్లో గురువారం మోదీ విస్తృతంగా పర్యటించారు. రూ.8,350 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభల్లో మాట్లాడుతూ కాంగ్రెస్‌పై మండిపడ్డారు. అమూల్ పాల ఉత్పత్తుల తయారీ సంస్థ గుజరాత్ కో ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ (జీసీఎంఎంఎఫ్)ను ప్రపంచ నంబర్‌వన్ చేయాలని రైతులు, వాటాదారులకు మోదీ పిలుపునిచ్చారు. అహ్మదాబాద్‌లో గురువారం లక్షమందిపైగా రైతులు హాజరైన సభలో ప్రధాని మాట్లాడారు. స్వర్ణోత్సవం జరుపుకొంటున్న జీసీఎంఎంఎఫ్ ప్రస్తుతం ప్రపంచంలో 8వ స్థానంలో ఉందని, దీనిని టాప్‌లోకి తీసుకురావాలని కోరారు. 50కి పైగా దేశాల్లో అమ్ముడవుతున్న అమూల్ ఉత్పత్తులు పాడి రైతుల శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటాయన్నారు. కాగా, వచ్చేనెల 6వ తేదీన ప్రధాని మోదీ బెంగాల్ వెళ్లి సందేశ్‌ఖాలీ బాధిత మహిళలను కలువనున్నారు. ఆరోజు ఉత్తర 24 పరగణాల జిల్లాలో మహిళల ఆధ్వర్యంలో జరిగే ర్యాలీలో మోదీ పాల్గొంటారని బీజేపీ బెంగాల్ అధ్యక్షుడు సుకాంత మజుందర్ వెల్లడించారు.

ఆయుర్వేదంతో కొవిడ్ తగ్గిపోయింది: చంద్రచూడ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: తాను ఆయుర్వేద వైద్య సమర్థకుడిని అని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. గురువారం సుప్రీంకోర్టు ఆవరణలో అత్యాధునిక ఆయుష్ హోలిస్టిక్ వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఆయుర్వేద మందుల ద్వారా తాను ప్రయోజనం పొందానంటూ వ్యక్తిగత అనుభవాలను వివరించారు. కరోనా దగ్గర నుంచి తాను ఆయుర్వేదాన్ని వాడుతున్నట్టు చెప్పారు. ఇందుకు ప్రధాని మోదీ ప్రోత్సాహం ఉందని వెల్లడించారు. "నాకు మొదటి సారి కరోనా సోకినప్పుడు ప్రధాని మోదీ ఫోన్ చేసి కుశలప్రశ్నలు అడిగారు. ఆయుష్ విభాగం కార్యదర్శి వైద్యుడూ అయిన వ్యక్తితో మాట్లాడిస్తా.. ఆయన మందులు పంపిస్తారని చెప్పారు. ఆయన ఇచ్చిన మందులు వాడాక తగ్గింది. తరువాత రెండు సార్లు కరోనా సోకినా అల్లోపతి జోలికి పోలేదు. ఆయుర్వేదమే వాడాను" అంటూ వివరించారు.

సింహాలకు సీత, అక్బర్ పేర్లు మార్చండి

కోల్‌కతా, ఫిబ్రవరి 22: పెంపుడు కుక్కలకు ఎవరైనా దేవుడి పేర్లు పెట్టుకుంటారా అని గురువారం కలకత్తా హైకోర్టు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. సిలిగురిలో ఉన్న బెంగాల్ సఫారీ పార్కులోని సింహాలకు పెట్టిన సీత, అక్బర్ అన్న పేర్లను మార్చాలని ఆదేశించింది. ఆడ సింహానికి సీత అన్న పేరును పెట్టడాన్ని సవాలు చేస్తూ వీహెచ్‌పీ దాఖలు చేసిన వ్యాజ్యంపై జస్టిస్ సుగత భట్టాచార్య ఏకసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు అడ్వకేట్ జనరల్ దేబ్‌జ్యోతి చౌదరిని ఉద్దేశించి న్యాయమూర్తి మాట్లాడుతూ "మీ పెంపుడు కుక్కకు దేవుడు పేరో, ముస్లిం ప్రవక్త పేరో పెడుతారా? మనమయితే సీత, అక్బర్ పేరు పెట్టం. రవీంద్రనాథ్ టాగూర్ పేరు పెట్టాలని ఆలోచిస్తామా? సీతను దేశమంతటా ఆరాధిస్తారు. అక్బర్ సమర్థుడైన సెక్యులర్ చక్రవర్తి. ఆ పేర్లను తొలగించండి. బిజలీ వంటి పేర్లను పెట్టుకోండి" అని సూచించారు. ఇందుకు ఏఏజీ సమాధానం ఇస్తూ ఇవి త్రిపురలో 2016, 2017లో పుట్టాయని, వాటికి అక్కడ వారే పేరు పెట్టారని తెలిపారు.

'నువ్వే రూ.5 వేలు భర్తకు భరణం ఇవ్వు'

» ఓ మహిళకు షాకిచ్చిన ఇండోర్ ఫ్యామిలీ కోర్టు

ఇండోర్, ఫిబ్రవరి 22: వరకట్న వేధింపులపై తప్పుడు కేసులు పెరిగిపోతున్న వేళ మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ ఫ్యామిలీ కోర్టు ఓ ఆసక్తికర తీర్పు ఇచ్చింది. భర్తకు ప్రతి నెలా రూ.5వేల చొప్పున భరణం చెల్లించాలని భార్యను ఆదేశించింది. భర్తపై ఓ మహిళ పోలీసులకు చేసిన ఫిర్యాదుకు, న్యాయస్థానంలో చెప్పిన విషయాలకు పొంతన లేకపోవడంతో కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. ఉజ్జయినికి చెందిన అమన్ 2020లో తొలిసారి సదరు యువతిని కలిసి ఆమెతో ప్రేమలో పడ్డాడు. అప్పుడతడు 12వ తరగతి చదువుతున్నారు. యువతి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడంతో 2021 జూలైలో ఆమెను పెళ్లాడాడు. అయితే, ఆమె పెడుతున్న హింసను తట్టుకోలేక రెండు నెలలకే అమన్ తన తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లిపోయాడు. దీంతో తన భర్త కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసిన యువతి.. తర్వాత గృహహింస కేసు పెట్టి కోర్టుకు వెళ్లింది. తనకు భరణం ఇప్పించాలని కోరింది. తొలుత ఫిర్యాదుకు, తర్వాత ఆమె కోర్టులో చేసిన వాదనలకు పొంతన లేకపోవడంతో కోర్టు.. ఆ యువతే భరణం చెల్లించాల్సిందిగా ఆదేశించింది.

నలుగురు ప్రభుత్వోద్యోగులకు బేడీలు

'గొర్రెల పంపిణీ' కేసులో సర్కారు చర్యలు

- పరారీలో ప్రధాన నిందితుడు మొబిన్, ఆయన కుమారుడు
- థర్డ్‌పార్టీకి బాధ్యతల అప్పగింతతోనే అవినీతి షురూ
- దర్యాప్తు వేగవంతం చేసిన గచ్చిబౌలి ఠాణా పోలీసులు, ఏసీబీ బృందాలు
- త్వరలో రాజకీయ నేతల ప్రమేయంపై ఆధారాల సేకరణ!

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పథకంలో అక్రమాల కేసులో ఏసీబీ నలుగురు ప్రభుత్వోద్యోగులను అరెస్టు చేసింది. ఏపీ రైతుల నుంచి కొనుగోలు చేసిన గొర్రెలకు సంబంధించి, కాంట్రాక్టర్ మొబిన్, అతని కుమారుడు రూ.2.10కోట్లను దారి మళ్లించగా.. వారికి వేర్వేరు శాఖలకు చెందిన నలుగురు అధికారులు సహకరించినట్లు నిగ్గుతేల్చిన ఏసీబీ, వారిని గురువారం అరెస్టు చేసింది. అరెస్టయిన వారిలో కామారెడ్డి ఏరియా వెటర్నరీ ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ డి.రవి, మేడ్చల్ డీవీఅండ్ఏహెచ్‌వో కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎం.ఆదిత్య కేశవ సాయి, రంగారెడ్డి జిల్లా గ్రౌండ్ వాటర్ విభాగంలో డిస్ట్రిక్ గ్రౌండ్ వాటర్ ఆఫీసర్‌గా కొనసాగుతున్న పి.రఘుపతి రెడ్డి, వయోజన విద్య విభాగం డిప్యూటీ డైరెక్టర్ సంగు గణేశ్ ఉన్నారు. వీరిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా.. 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా అనుమానిస్తున్న మొబిన్, అతని కుమారుడు పరారీలో ఉన్నారు. ఏసీబీ ప్రత్యేక బృందాలు వీరిని గాలిస్తున్నాయి. మొబిన్ సూచనల మేరకే పైన పేర్కొన్న నలుగురు ప్రభుత్వోద్యోగులు వ్యవహరించినట్లు ఏసీబీ విచారణలో తేలింది. రూ.2.10 కోట్లను ఏపీ రైతుల ఖాతాలకు కాకుండా.. ఎవరి బ్యాంకు అకౌంట్లకు దారి మళ్లించారనేది ఇంకా తేలాల్సి ఉంది. ఏసీబీ ప్రాథమిక విచారణలో.. గొర్రెల కొనుగోళ్ల బాధ్యతలను థర్డ్ పార్టీకి అప్పగించడం వల్లే అవినీతి జరిగినట్లు తేలింది. ప్రధాన నిందితుడు అరెస్టయ్యాక.. ఈ కేసులో రాజకీయ నాయకులు, వారి అనుచరుల ప్రమేయంపై ఆధారాలను సేకరించే దిశలో ఏసీబీ అడుగులు వేస్తోంది.

అసలేం జరిగిందంటే..?

కాంట్రాక్టర్ మొబిన్, ఆయన కుమారుడు, పలు ప్రభుత్వ విభాగాలతో ఏర్పాటైన బృందాలతో కలిసి గత ఏడాది ఆగస్టు 13 నుంచి 23 మధ్యకాలంలో ఏపీలో పర్యటించారు. పల్నాడు, ప్రకాశం, గుంటూరు తదితర ప్రాంతాల్లోని 18 మంది రైతుల నుంచి 133 యూనిట్లు(2,793 గొర్రెలు) సేకరించారు. బిల్లుల చెల్లింపులకు రైతుల బ్యాంకు ఖాతాలు, ఆధార్ కార్డులు ఇతర పత్రాలను ప్రభుత్వాధికారులు సేకరించారు. అయితే రైతులకు దక్కాల్సిన రూ.2.10 కోట్లను ప్రైవేటు వ్యక్తుల బ్యాంకు ఖాతాలకు తరలించారు. ఎంతకీ తమ ఖాతాలకు డబ్బులు రాకపోవడంతో రైతులు పశుసంవర్ధక శాఖ డైరెక్టరేట్‌లో ఆరా తీశారు. నగదు చెల్లింపులు పూర్తయినట్లు అధికారులు తేల్చిచెప్పడంతో.. బాధితులు గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తును ప్రారంభించారు. రేవంత్ సర్కారు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని.. సమగ్ర దర్యాప్తునకు ఏసీబీకి ఆదేశాలు జారీ చేసింది. దాంతో ఏసీబీ అధికారులు గచ్చిబౌలి ఠాణా నుంచి రికార్డులను స్వాధీనం చేసుకుని, దర్యాప్తు మొదలు పెట్టారు.

అకాడమీ, అంబర్‌పేట్‌లలో పోలీసు శిక్షణ షురూ

- ప్రజలతో స్నేహంగా.. నేరస్థులతో కఠినంగా ఉండాలి: డీజీపీ

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుళ్లకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర పోలీసు శిక్షణ కేంద్రం(టీఎస్‌పీఏ)లో 685 మంది మహిళా కానిస్టేబుల్ అభ్యర్థుల శిక్షణను గురువారం డీజీపీ రవిగుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు విధుల్లో ప్రజలతో స్నేహపూరితంగా, నేరస్థులతో కఠినంగా వ్యవహరించాలన్నారు.అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ మాట్లాడుతూ.. అభ్యర్థులు ఎలాంటి ఒత్తిడికి గురవ్వకుండా శిక్షణను పూర్తిచేసుకోవాలని సూచించారు. ఒత్తిడి, ఇతర సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే.. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఐజీ ఎం.రమేశ్, అకాడమీ ఇన్‌చార్జి డైరెక్టర్ అనసూయ పాల్గొన్నారు. అంబర్‌పేటలోని పోలీసు శిక్షణ కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇక్కడ 481 మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు శిక్షణనిస్తారు.

తుపాకులగూడెంపై ఛత్తీస్‌గఢ్ పేచీ

- 88 మీటర్ల గరిష్ఠ స్థాయికి ముంపు
- ఆ మేర భూములకూ పరిహారం ఇవ్వాలిందేనని పట్టు
- సంక్లిష్టంలో ఎన్‌వోసీ ప్రక్రియ

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిపై ములుగు జిల్లాలో కడుతున్న తుపాకులగూడెం (సమ్మక్కసాగర్) బ్యారేజీకి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) జారీ చేసే విషయంలో ఛత్తీస్‌గఢ్ పేచీ పెట్టింది. బ్యారేజీ పూర్తిస్థాయి నీటినిల్వ 83 మీటర్లు కాగా.. అక్కడిదాకా ముంపునకు గురయ్యే భూములకే పరిహారం చెల్లిస్తామని తెలంగాణ ప్రభుత్వం ఇదివరకే తేల్చిచెప్పింది. అయితే గరిష్ఠ వరద 2022 జూలై 17, 19వ తేదీల్లో 88 మీటర్ల దాకా రికార్డయిందని, ఆ మేరకు ముంపునకు గురయ్యే భూములకు కూడా పరిహారం చెల్లించాల్సిందేనని ఛత్తీస్‌గఢ్ పట్టుబడుతోంది. తుపాకులగూడెం బ్యారేజీకి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వరాదని, ఆ బ్యారేజీతో తమ ప్రాంతంలో ముంపు సమస్య తీవ్రంగా ఉంటుందని కేంద్ర జలవనరుల సంఘానికి (సీడబ్ల్యూసీ) ఛత్తీస్‌గఢ్ ఫిర్యాదు చేసింది. 2021 సెప్టెంబరులో ఈ బ్యారేజీకి అనుమతి కోరుతూ తెలంగాణ ప్రభుత్వం డీపీఆర్ దాఖలు చేయగా... సీడబ్ల్యూసీలోని అన్ని డైరెక్టరేట్లు క్లియరెన్స్‌లు ఇచ్చినా...ఛత్తీస్‌గఢ్ అభ్యంతరాల కారణంగా డీపీఆర్ ముందుకు కదల్లేదు. ఛత్తీస్‌గఢ్ లేవనెత్తిన అభ్యంతరాలన్నీ తీర్చిన అనంతరం... ఆ రాష్ట్రం నుంచి ఎన్‌వోసీని తెచ్చి సమర్పించాలని సీడబ్ల్యూసీ తెలంగాణను ఇప్పటికే నిర్దేశించింది. దాంతో తెలంగాణ విజ్ఞప్తితో ఛత్తీస్‌గఢ్ అధికారులు బ్యారేజీని 2023 సెప్టెంబరు 6-9వ తేదీల్లో పరిశీలించారు. అయితే గరిష్ఠ వరదతో ముంపునకు గురయ్యే ప్రాంతాలను భూసేకరణ చేయాల్సిందేనని ఛత్తీస్‌గఢ్ తేల్చడంతో ఎన్‌వోసీ జారీ ప్రక్రియ సంక్లిష్టంగా మారింది. అయితే గరిష్ఠ వరదతో ముంపునకు పరిహారం ఇచ్చేది లేదని, పూర్తిస్థాయి నీటిమట్టం(ఎఫ్‌ఆర్‌ఎల్) ప్రకారమే ముంపునకు గురయ్యే భూములకే పరిహారం ఇవ్వగలమని తెలంగాణ తేల్చిచెప్పే అవకాశం ఉంది. కాగా రూ.9257 కోట్లతో చేపట్టిన తుపాకులగూడెం బ్యారేజీ 95 శాతం మేర పనులు కూడా పూర్తయ్యాయి.

'సీనరేజీ ఫీజు'పై సీఎంకు మస్కా!

సాధ్యం కాకున్నా 5 వేల కోట్ల రాబడి వస్తుందని వివరణ.. పదవీ కాలం పొడిగించుకోవడానికి ఉన్నతాధికారి గిమ్మిక్కు

- 18 ఏళ్ల కాలానికి 'వ్యత్యాస సీనరేజీ ఫీజు' వసూలుకు ఉత్తర్వు
- హై కోర్టు ఆదేశాలు, నిపుణుల కమిటీ అభిప్రాయం బేఖాతరు
- ఒత్తిడి చేస్తే కోర్టు ధిక్కార కేసు వేస్తామంటున్న తయారీదారులు



హైదరాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భూగర్భ గనుల సంచాలకుల కార్యాలయం కొత్త వివాదానికి తెరలేపింది. ఏమాత్రం ఆచరణ సాధ్యంకాని రాబడిని తెస్తామంటూ ఏకంగా ముఖ్యమంత్రి వద్దనే నమ్మబలికింది. కంకర తయారీదారుల నుంచి 'వ్యత్యాస సీనరేజీ ఫీజు' రూపంలో కనీసం రూ.5 వేల కోట్ల వరకు వసూలు చేస్తామని చెబుతోంది. ఇది కోర్టు ఆదేశాలకు విరుద్ధమని నిపుణులు హెచ్చరిస్తున్నా.. సాధించి తీరుతామంటోంది. ఇదంతా పదవీ కాలం పొడిగించుకోవడానికి ఓ ఉన్నతాధికారి గిమ్మిక్కుగా తెలుస్తోంది. ముడి రాయి(రఫ్ స్టోన్) నుంచి వివిధ పరిమాణాల్లో కంకర, రాతి ఇసుక (రాక్ శ్యాండ్)ను తయారు చేస్తుంటారు. దీనికోసం తయారీదారులు భూగర్భ గనుల సంచాలకుల కార్యాలయం నుంచి పర్మిట్లు తీసుకుంటారు. క్యూబిక్ మీటర్‌కు సీనరేజీ ఫీజును వారు చెల్లించాల్సి ఉంటుంది. కాగా, ఈ క్యూబిక్ మీటర్‌ను నిర్దేశించడానికి ఎంత 'గ్రావిటీ'ని పరిగణనలోకి తీసుకోవాలన్న అంశంపై 20 ఏళ్లుగా వివాదం ఉంది. తయారీదారులు 2.64 గ్రావిటీ డిమాండ్ చేయగా, గనుల శాఖ 1.5 గ్రావిటీనే పరిగణిస్తామని చెప్పింది. తయారీదారులు.. 2004లో హైకోర్టులో పిటిషన్ వేయగా వారికి అనుకూలంగా తీర్పు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం అప్పీల్ చేయడంతో హైకోర్టు డివిజన్ బెంచ్ సాంకేతిక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 2.64 గ్రావిటీనే ప్రామాణికమని నివేదించింది. ఈలోగా తయారీదారులు హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారు. హై కోర్టు 2009లో ఆదేశాలు జారీ చేస్తూ.. 2.64 గ్రావిటీనే లెక్కలోకి తీసుకోవాలని చెప్పింది.

రెండేళ్ల కిందట వెనక్కుతగ్గి..

నిపుణుల కమిటీ అభిప్రాయం, హైకోర్టు ఆదేశాలతో రెండేళ్ల కిందట గనుల శాఖ కొత్త మార్గాన్ని వెతికింది. క్యూబిక్ మీటర్ల ఆధారంగా ముడి రాయిని కొలిచే విధానానికి స్వస్తి చెప్పి, టన్నుకు నిర్దేశిత సీనరేజీ ఫీజు విధానాన్ని తెస్తూ 2022 మార్చి 31న జీవో నం.18ను జారీ చేసింది. 2022 మార్చి 31 నాటికి పూర్తయిన 18 ఏళ్లలో టన్నుల ప్రాతిపదికన ఫీజు చెల్లించినవారి నుంచి '1.5 గ్రావి టీ ఆధారిత క్యూబిక్ మీటర్ల' పద్ధతిన 'వ్యత్యాస సీనరేజీ ఫీజు' వసూలు చేయాలంటూ గనుల శాఖ అప్పటి డైరెక్టర్ కాత్యాయనీదేవి అంతర్గత మెమో ఇచ్చారు. దీంతో తయారీదారులు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిప్రాయాన్ని తీసుకున్నారు. మీ నిర్ణయం కోర్టు ధిక్కారం కిందకు వస్తుందని కాత్యాయనీ దేవికి సీనియర్ న్యాయవాది వివరించడంతో ఆమె ఉత్తర్వును ఉపసంహరించుకున్నారు.

ఇదీ తాజా వివాదం..

తయారీదారుల నుంచి వ్యత్యాస సీనరేజీ ఫీజును వసూలు చేయాలంటూ ప్రస్తుత డైరెక్టర్ ఈ నెల 12న అసిస్టెంట్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లను ఆదేశించారు. రూ.5 వేల కోట్లు సమకూరుతాయని ఆయన అంచనా వేశారు. దీనినే సీఎం రేవంత్‌రెడ్డికి వివరించారు. కాగా, రాష్ట్ర అధికారి ఆలోచన వెనుక వేరే ఉద్దేశం ఉంది. 6 నెలల్లో ఆయన పదవీ కాలం ముగియనుంది. సీఎం వద్ద మార్కులు కొట్టేసి, పదవీ కాలాన్ని పొడిగించుకోవడానికి గిమ్మిక్కులు ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. మరోవైపు అంతర్జాతీయంగా 2.64 గ్రావిటీనే ప్రామాణికమని, ఇతర రాష్ట్రాలూ దీనినే అమలు చేస్తున్నాయని తయారీదారులు అంటున్నారు. గనుల శాఖ మాత్రం 1.5 గ్రావిటీపై యోచిస్తోంది. 20 టన్నుల ముడి రాయిని 2.64 గ్రావిటీతో భాగిస్తే వచ్చేది క్యూబిక్ మీటర్ అవుతుంది. ఈ లెక్కన 7.57 క్యూబిక్ మీటర్లుగా నిర్ధారించవచ్చు. ఈ ఒక్కో క్యూబిక్ మీటర్‌కు రూ.50 చొప్పున సీనరేజీ ఫీజును వసూలు చేస్తే.. 7.57 క్యూబిక్ మీటర్లకు రూ.378 వసూలవుతుంది. 20 టన్నులను 1.5 గ్రావిటీతో భాగిస్తే 13.33 క్యూబిక్ మీటర్లు, రూ.666 మేర సీనరేజీ ఫీజు వస్తుంది. తయారీదారులు, గనుల శాఖ చెబుతున్నదానికి మధ్య రూ.288 తేడా వస్తోంది. ఈ వ్యత్యాస సొమ్మునే 18 ఏళ్లకు వసూలు చేయాలంటూ డైరెక్టర్ ఆదేశించారు. అయితే, సీఎం వద్ద అపోహలు సృష్టిస్తున్నారని కొందరు అంటున్నారు. బలవంతం చేస్తే తయారీదారులు కోర్టు ధిక్కార కేసు వేస్తారని హెచ్చరిస్తున్నారు.

'గూడెం'లో 28న టీడీపీ భారీ సభ

- టీడీపీ-జనసేన సమన్వయ కమిటీ నిర్ణయం
- చంద్రబాబు, పవన్ కల్యాణ్ హాజరు

అమరావతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి కార్యాచరణకు టీడీపీ-జనసేన నడుం బిగించాయి. ఇందులో భాగంగా ఈ నెల 28వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లి గూడెంలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించాయి. గురువారం విజయవాడ నొవాటెల్ హోటల్లో ఈ రెండు పార్టీల రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, పితాని సత్యనారాయణ, నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య. జనసేన నుంచి రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) చైర్మన్ నాదెండ్ల మనోహర్, ఆ పార్టీ నేతలు కందుల దుర్గేశ్, కొటికలపూడి గోవిందరావు, బొమ్మిడి నాయకర్, పాలవలస యశస్వి, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. చరిత్రాత్మక స్థాయిలో 6 లక్షల మందితో ఈ సభను నిర్వహిస్తున్నామని, తాడేపల్లిగూడెం పక్కన ఉన్న పత్తిపాడులో సభా ప్రాంగణం ఏర్పాటు చేస్తున్నట్లు అచ్చెన్నాయుడు తెలిపారు. రెండు పార్టీల తరఫున ఎవరు, ఎక్కడ పోటీ చేయాలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ నిర్ణయిస్తారు. ఈ వ్యవహారంతో సంబంధం లేకుండా ఉభయ పార్టీల నాయకులు, కార్యకర్తలు కలిసి ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించాం" అని అచ్చెన్నాయుడు తెలిపారు. కాగా, ఎన్డీయేలో చేరిక పూర్తయిన తర్వాత ప్రధాని మోదీ కూడా పాల్గొనేలా ఒక భారీ బహిరంగ సభ నిర్వహించాలని టీడీపీ-జనసేన నిర్ణయించాయి.

'కిడ్నీ పెయిర్డ్ డొనేషన్' పోర్టల్ ద్వారా స్టార్ ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడి చేసే విధానం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కిడ్నీలు చెడిపోయి, డయాలసిస్ చేయించుకుంటూ కిడ్నీ దాతల కోసం ఎదురుచూసేవారి కోసం స్టార్ ఆస్పత్రి 'కిడ్నీ పెయిర్డ్ డొనేషన్' పోర్టల్‌ను ప్రారంభించింది. స్టార్ ఆస్పత్రిలో గురువారం విలేకరుల సమావేశంలో ఆస్పత్రి ఎండీ డాక్టర్ గోపీచంద్ ఈ పోర్టల్‌కు సంబంధించి వివరాలు తెలియజేశారు. కిడ్నీని దానం చేయాలనుకునే వారు, కావాల్సిన వారు 'కిడ్నీ పెయిర్డ్ డొనేషన్' పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిలో ఓ వైపు డోనర్, రిసీవర్‌కు రెండో వైపు డోనర్, రిసీవర్‌ల వివరాలు సరిపోతే కిడ్నీ మార్పిడి చికిత్స చేయవచ్చన్నారు. రెండు వైపులా దాతల, స్వీకర్తల బ్లడ్‌గ్రూప్‌తోపాటు ఇతర వివరాలు సరిపోతే, ఒకేసారి శస్త్రచికిత్స నిర్వహిస్తామని" చెప్పారు. అవయవ మార్పిడి చికిత్సల్లో ప్రభుత్వ నిబంధలకు లోబడి, నైతిక సూత్రాలకు అనుగుణంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తామని తెలిపారు.

ఆడపిల్లపై ఇంత నిర్దయా?

నాన్న ఆత్మ క్షోభిస్తుంది.. అమ్మ ఎంతో బాధపడుతుంది.. ఏపీ సీఎం జగన్‌పై ఆయన సోదరి షర్మిల ఆగ్రహం

- ఆమె తలపెట్టిన 'చలో సెక్రటేరియట్' తీవ్ర ఉద్రిక్తం
- షర్మిలను అరెస్టు చేసేందుకు పోలీసుల ప్రయత్నం
- ఈడ్చుకుంటూ తీసుకెళ్లి వాహనంలో పడేసిన వైనం
- మంగళగిరి ఠాణాకు తరలింపు.. మధ్యాహ్నం విడుదల



కరకట్ట రోడ్డులో షర్మిలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

విజయవాడ/విజయవాడ/మంగళగిరి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జగన్ సర్కారు ప్రకటించిన దగా డీఎస్సీపై నిరసన తెలిపేందుకు ప్రయత్నించిన తనను ఈడ్చుకుంటూ తీసుకెళ్లి పోలీసు వ్యాన్‌లోకి ఎత్తివేయడంపై ఏపీసీసీ చీఫ్ షర్మిల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ఆడపిల్ల పట్ల ఇంత నిర్దయగా వ్యవహరించడం పాపమన్నారు. ఈ సంఘటనను చూచి తన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆత్మ క్షోభిస్తుందని, తన తల్లి విజయమ్మ ఎంతగానో బాధపడుతుందని చెప్పారు. ప్రజల కోసం కొట్లాడుతున్న తనపై మహిళనన్న కనికరమైనా చూపకుండా గాయపరిచారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలో లక్షలాది మంది యువత ఉపాధి లేకుండా రోడ్డున పడ్డారని.. డిగ్రీలు పూర్తిచేసిన ఎంతోమంది యువకులు ఆత్మహత్య చేసుకుంటున్నారని షర్మిల ఆందోళన వెలిబుచ్చారు. జగన్ వైఫల్యాల గురించి రాసిన విలేకరులపై దాడులు చేస్తున్నారని, ఇది ప్రజాస్వామ్యమేనా అని నిలదీశారు. 23 వేల ఉపాధ్యాయ పోస్టులతో కూడిన మెగా డీఎస్సీ కావాలంటూ పీసీసీ గురువారం తలపెట్టిన 'చలో సెక్రటేరియేట్' తీవ్ర ఉద్రిక్తంగా మారింది. విజయవాడలోని పీసీసీ కార్యాలయమైన ఆంధ్రరత్న భవన్ చుట్టూ పోలీసులు బుధవారమే మోహరించారు. దీంతో షర్మిల బుధవారం రాత్రి భవన్‌లోనే మకాం వేశారు. గురువారం ఉదయం కార్యాలయం నుంచి బయటకు వస్తే అరెస్టు చేయాలని పోలీసులు భావించారు. ఇది తెలిసి షర్మిల కార్యాలయం ఆవరణలోనే ధర్నాకు దిగారు. ఆమె బయటకు వస్తే అరెస్టు చేయాలని భావించిన పోలీసులు.. తర్వాత పోలీస్ కంట్రోల్ రూం వరకు ఆమె చేసే పాదయాత్రను అడ్డుకోకూడదని భావించారు. నేతలు, కార్యకర్తలతో కలిసి ఆమె కంట్రోల్ రూం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడి నుంచి వాహనాల్లో అమరావతి సచివాలయానికి బయల్దేరారు. ఉండవల్లి కరకట్ట మీద కొండవీడు ఎత్తిపోతల పథకం వద్ద తాడేపల్లి పోలీసులు వారిని అడ్డుకున్నారు. అక్కడ వాగ్వాదం, తోపులాట జరిగి, ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి వ్యాను ఎక్కించారు. దీనిని నిరసిస్తూ షర్మిల వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు చర్యలకు నిరసనగా కరకట్ట రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు ఆమెను కూడా ఈడ్చుకుంటూ తీసుకెళ్లి వ్యానెక్కించారు. ఈ సందర్భంగా జరిగిన పెనుగులాటలో ఆమె చేతికి గాయమైంది. వారందరినీ మంగళగిరి పట్టణ పోలీసుస్టేషన్‌కు తరలించి, మధ్యాహ్నం తర్వాత వదిలిపెట్టారు.

అవిశ్వాసాలు వీగిపోయాయి..

- మణికొండ, నాగారం, తూంకుంట మున్సిపాలిటీల్లో అసమ్మతి నేతలకు ఎదురుదెబ్బ



తూంకుంట కౌన్సిలర్ పూజాభరత్‌కు వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

నార్సింగ్, కీసర రూరల్, శామీర్‌పేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మణికొండ, నాగారం, తూంకుంట మునిసిపాలిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లపై పెట్టిన అవిశ్వాస తీర్మానాలు గురువారం వీగిపోయాయి. మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై గురువారం ఓటింగ్ జరిగింది. కౌన్సిల్‌లో 20 మంది సభ్యులకు గాను 10 మంది మాత్రమే ఓటింగ్‌కు హాజరయ్యారు. దీంతో సరైన బలం లేకపోవడంతో అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు ప్రత్యేకాధికారిగా వ్యవహరించిన రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకటరెడ్డి ప్రకటించారు. ఇక, మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, వైస్‌చైర్మన్ బండారు మల్లేష్‌యాదవ్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం కూడా వీగిపోయింది. చైర్మన్, వైస్‌చైర్మన్లపై అవిశ్వాసం ప్రకటిస్తూ మున్సిపాలిటీకి చెందిన 14మంది కౌన్సిలర్లు ఈనెల 5న కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు కీసర ఆర్డీవో.. మున్సిపల్ కార్యాలయంలో గురువారం అవిశ్వాస తీర్మానంపై సమావేశం నిర్వహించారు. చైర్మన్, వైస్ చైర్మన్లకు వేర్వేరుగా సమావేశాలు ఏర్పాటు చేయగా అవిశ్వాసం ప్రవేశపెట్టిన నేతలు హాజరుకాలేదు. దీంతో అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రకటించారు. అలాగే, మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలోని తూంకుంట మున్సిపల్ చైర్మన్ కారంగుల రాజేశ్వర్‌రావు, వైస్‌చైర్‌పర్సన్ పన్నాల వాణీవీరారెడ్డిపై పెట్టిన అవిశ్వాస తీర్మానం కూడా వీగిపోయింది. మొత్తం 16 మంది కౌన్సిలర్లలో 11 మంది అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేసి ఈ నెల 5న కలెక్టర్‌ను ఆశ్రయించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానంపై గురువారం సమావేశం నిర్వహించారు. అవిశ్వాసం పెట్టిన వారెవ్వరూ హాజరవ్వకపోవడంతో తీర్మానం వీగిపోయినట్లు ప్రకటించారు. కాగా, తమ వద్ద రూ.10 లక్షలు తీసుకున్న తూంకుంట ఒకటో వార్డు కౌన్సిలర్ పూజ భరత్ అవిశ్వాసానికి హాజరు కాకుండా తమను నట్టేట ముంచారని కాంగ్రెస్‌కు చెందిన ఇతర కౌన్సిలర్లు ఆరోపించారు. దొంగలని పేర్కొంటూ పూజభరత్ దంపతుల ఫోటోలు ముద్రించిన ఫ్లెక్సీలతో ఇతర కౌన్సిలర్లు ర్యాలీ చేసి తమ నిరసన తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పాక్‌లో పాతకథే!

పాకిస్థాన్‌లో వ్యవహారం ఎట్టకేలకు కొలిక్కివచ్చింది. ప్రభుత్వ ఏర్పాటు విషయంలో భుట్టోలూ, షరీఫ్‌ల మధ్య అవగాహన కుదిరిందని వారం క్రితమే వార్తలు వచ్చినా ఏ కారణంగానో ఇప్పటి వరకూ అది ఒక నిర్దిష్టరూపాన్ని సంతరించుకోలేదు. పాకిస్థాన్ ముస్లిం లీగ్–పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ మధ్య ఇప్పుడు కుదిరిన ఒప్పందం ప్రకారం రెండు పార్టీలూ కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నాయి. అంటే, ఎన్నికలకు ముందు, ఏడునెలల క్రితం వరకూ షాబాజ్ షరీఫ్ ప్రధానిగా అధికారంలో ఉన్న కూటమే తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. బెనజీర్ భుట్టో భర్త ఆసిఫ్ అలీ జర్దారీని ఈ రెండుపార్టీలూ దేశాధ్యక్షపదవికి ప్రతిపాదిస్తాయి. షరీఫ్ పార్టీకి చెందిన వ్యక్తి స్పీకర్ అవుతారు, సెనేట్ చైర్మన్, రెండు ప్రావిన్సుల గవర్నర్ల పదవులు భుట్టోలకు దక్కుతాయి. బలూచిస్థాన్‌లో రెండు పార్టీలూ కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయి. సుదీర్ఘజాప్యం తరువాత ఈ తరహా ఇచ్చిపుచ్చుకోవడాలన్నింటినీ చక్కగా తేల్చుకున్నప్పటికీ, ప్రభుత్వంలో పీపీపీ చేరదు, మంత్రిపదవులు స్వీకరించదు, షరీఫ్‌లకు భుట్టోల మద్దతు ఏకపక్షం కాదు. ఈ అంశాలవారీ మద్దతుకు జడిసే, ఎన్నికల తరువాత ప్రధాని అవుదామనుకున్న నవాజ్ షరీఫ్ వెనక్కుపోయి, సోదరుడిని తిరిగి ముందుకు నెట్టినట్టు ఉంది.

ఇమ్రాన్‌ఖాన్ పార్టీ ఇప్పుడు పార్లమెంటు దిగువసభలో ఓ కొత్త అవతారంలో విపక్షంలో కూచోబోతున్నది. పీటీఐ మద్దతుతో గెలిచిన స్వతంత్ర అభ్యర్థులంతా 'సున్నీ ఇత్తేహద్ కౌన్సిల్'లో చేరుతున్నట్టుగా ఎన్నికల సంఘానికి బుధవారం అఫిడవిట్లు ఇచ్చారు. 94 స్థానాలు గెలుచుకున్నామని ఇమ్రాన్ పార్టీ చేస్తున్న వాదనకు అనుగుణంగా ఇప్పుడు ఓ నలుగురు మినహా 89మంది స్వతంత్రులు ఈ అఫిడవిట్లు సమర్పించడం విశేషం. తద్వారా అత్యధిక స్థానాలున్న ఇమ్రాన్ పార్టీ మారువేషంలో విపక్షనేత హోదాను సైతం అందుకోబోతోంది. గతంలో విపక్షమన్నదే లేకుండా దేశాన్ని ఏలిన భుట్టోలు, షరీఫ్‌లకు ఇప్పుడు అసలు పరీక్ష ఎదురవుతోంది.

పార్లమెంటులో బలాబలాలను అటుంచితే, ఇమ్రాన్ పార్టీ వాదిస్తున్నట్టుగా ఈ కొత్త ప్రభుత్వం ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా అడ్డ తోవలో అధికారంలోకి వచ్చిందన్న భావన ప్రజలకు సైతం ఉండకపోదు. ఈ రెండుపార్టీలూ కలసికట్టుగా ఇమ్రాన్‌ను పదవీచ్యుతుడిని చేసి, సైన్యం ఆశీస్సులతో, సమస్త వ్యవస్థల సహకారంతో ఆయన పార్టీని ఎన్నికల్లో పోటీచేయనివ్వకుండా అడ్డుకున్న విషయం తెలిసిందే. ఎంతో కాలంగా జైల్లో ఉన్న ఇమ్రాన్‌మీద ఎన్నికలకు కొద్దిరోజుల ముందు కూడా మూడు కీలకమైన తీర్పులు వెలువడి తీవ్రమైన శిక్షలు పడ్డాయి. ఆ కేసుల్లో న్యాయాన్యాయాల కంటే సైన్యం ఇమ్రాన్ మీద కక్షకట్టిందన్న భావనే ప్రజలమీద ఎక్కువగా పనిచేసిందని ఫలితాలు చెబుతున్నాయి. పార్టీ దెబ్బతిన్నా, ప్రధానమీడియా సహకారం లేకున్నా, సామాజిక మాధ్యమాల ద్వారా పీటీఐ ప్రజలకు చేరువకాగలిగింది. నవాజ్ షరీఫ్ వెనక్కురాగానే ఆయనమీద కేసులన్నీ తొలగిపోయి, వీరోచితంగా బరిలోకి దిగినప్పటికీ సైన్యం ఆశించిన రీతిలో ఫలితాలు లేవు. స్వయంగా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయగల సత్తా ఏ ఒక్కపార్టీకీ దక్కని త్రిశంకుసభ ఏర్పడితే, ఎంత వేటాడివేధించినా ఈ ఎన్నికల్లో పీటీఐదే అగ్రస్థానం. పార్లమెంటులో గుర్తింపు ఉన్న ఒక చిన్న పార్టీలో తన స్వతంత్రులనంతా చేర్చిన ఇమ్రాన్ తిరిగి సైన్యం మీదా, ప్రభుత్వం మీదా యుద్ధాన్ని కొనసాగించబోతున్నారు.

భవిష్యత్తు అర్థమై, నిత్యం బతుకుపోరాటం తప్పదని తెలిసిన నవాజ్ షరీఫ్ తాను తప్పుకొని, సైన్యానికి వీరవిధేయుడిగా ముద్ర పడిన సోదరుడినే తిరిగి ప్రధానమంత్రి పదవిలో కూచోబెట్టారు. ఇమ్రాన్–సైన్యం యుద్ధం మరింత బలంగా సాగుతూంటే, ముప్పై ఐదుశాతం ద్రవ్యోల్బణంతో, ఆహార కొరతతో, భారీ అప్పులతో సతమతమవుతున్న పాకిస్థాన్‌ను గాడినపెట్టడం అయ్యేపనికాదని ఆయనకు అర్థమైవుంటుంది. భారీ అప్పు ఇస్తూ ఐఎంఎఫ్ విధించిన ఆంక్షలను అమలుచేయాలంటే, ప్రభుత్వ విమానయానసంస్థ సహా చాలా ప్రభుత్వ సంస్థలను అమ్మివేయాలి, ప్రభుత్వ వ్యయాన్ని బాగా తగ్గించుకొని, ప్రజలమీద భారీగా పన్నులు వేయాలి. షాబాజ్ షరీఫ్ ఈ చర్యలకు ఉపక్రమించకతప్పదు, రాజకీయమనుగడకోసం భుట్టోలు వాటిని అడ్డుకోకాతప్పదు. ప్రభుత్వంలో చేరకుండా బిలావల్ భుట్టో జర్దారీ తెలివిగానే జాగ్రత్తపడ్డాడు. పాకిస్థాన్‌ను రక్షించడానికే మళ్ళీ ప్రధాని అవుతున్నానంటున్న షాబాజ్ షరీఫ్ ఆ మాటమీద ఎంతకాలం నిలబడతాడో చూడాలి.


2024: కాంగ్రెస్‌కు అంతిమ పరీక్ష

న్యూఢిల్లీ అధికార నడవాలలో ఇప్పుడు ఒక ఆసక్తికరమైన పిచ్చాపాటీ జరుగుతోంది. కాంగ్రెస్ మయమవుతున్న (కాంగ్రెస్ –యుక్త్) బీజేపీలోకి, కాంగ్రెస్‌ను విడనాడి వెళ్లనున్న తదుపరి నాయకుడు ఎవరు? నిజంగా ఉత్కంఠభరితమైన ఊహాగానం, అవునా? 2024 లోక్‌సభ ఎన్నికలలో తాము 400కి పైగా సీట్లు గెలుచుకుని తీరతామని బీజేపీ నిశ్చిత స్వరంతో, తిరుగులేని రీతిలో చెబుతుండగా నీరసపడిన కాంగ్రెస్ ఒక మహా ఇబ్బందికరమైన ప్రశ్నను ఎదుర్కొంటున్నది: భారత పురాతన రాజకీయపక్షం రాబోయే సార్వత్రిక ఎన్నికలలో కనీసం 50కి పైగా సీట్లనైనా కైవసం చేసుకోగలదా?

2014 లోక్‌సభ ఎన్నికలను గుర్తు చేసుకోండి. కేవలం 44 సీట్లు మాత్రమే కాంగ్రెస్‌కు దక్కాయి. భారత జాతీయ కాంగ్రెస్ స్వతంత్ర భారత సార్వత్రిక ఎన్నికలలో ఇంత తక్కువ సీట్లను మాత్రమే గెలుచుకోవడం అదే మొదటి సారి. మరి 2019 సార్వత్రిక ఎన్నికలలోనైనా కాంగ్రెస్ పరిస్థితి మెరుగుపడిందా? ఊహూ! 2014లో కంటే కేవలం 8 సీట్లు మాత్రమే అదనంగా గెలుచుకోగలిగింది. కేరళ, తమిళనాడులో అధికార పార్టీలతో పొత్తు పెట్టుకుని పోటీ చేయడం వల్లే 2019లో 52 సీట్లను కాంగ్రెస్ గెలుచుకోగలిగింది. 2024 సార్వత్రిక ఎన్నికలలో సైతం కేరళ, బహుశా తెలంగాణ మినహా మరే రాష్ట్రంలోనైనా కాంగ్రెస్ గెలుచుకోగల సీట్ల సంఖ్య రెండంకెలలో ఉండటమనేది కనాకష్టమని ఒపీనియన్ పోల్స్ దాదాపుగా అన్నీ ముక్తకంఠంతో ఘోషిస్తున్నాయి. 2014లోనూ, 2019లోనూ కేంద్రంలో బీజేపీ అధికారానికి రావడానికి ఒక బలమైన కారణం 'వాయవ్య భారత' రాష్ట్రాల సంపూర్ణ మద్దతే అని చెప్పి తీరాలి. మరి ఈసారీ భారతదేశ పశ్చిమ తీర ప్రాంతాల నుంచి హిందీ భాషా రాష్ట్రాల దాకా ఎల్లెడలా ఓటర్లు బీజేపీ వైపే ఉన్నారు. ఈ వాస్తవాన్ని గుర్తించినందునే కాంగ్రెస్ ప్రస్థానం మరింత కష్టభరితంగా సాగుతోంది. 2019లో వాయవ్య భారత్‌లోని పది రాష్ట్రాలలోని మొత్తం 243 సీట్లలో కేవలం 6 సీట్లను మాత్రమే కాంగ్రెస్ గెలుచుకోగలిగింది.

ఎన్నికల పోరాటాలలో కాంగ్రెస్ పరాజయాలు 2014లో నరేంద్ర మోదీ ఉత్థానంతోనే ప్రారంభమవలేదు. 1984లో ఇందిర హత్యానంతరం ప్రచండంగా వీచిన కాంగ్రెస్ అనుకూల సానుభూతి పవనాలలో లభించిన చరిత్రాత్మక విజయం తరువాత మరే సార్వత్రిక ఎన్నికలలోనూ సాధారణ మెజారిటీ సీట్లను గెలుచుకోవడంలో కాంగ్రెస్ ఘోరంగా విఫలమయింది. 1984 అనంతరం నాలుగు దశాబ్దాల కాలంలో 200కి పైగా సీట్లను కాంగ్రెస్ గెలుచుకోవడమనేది కేవలం రెండుసార్లు మాత్రమే సంభవించింది. 1991 సార్వత్రిక ఎన్నికలలో మొదటి దశ పోలింగ్ అనంతరం రాజీవ్ గాంధీ దుర్మరణం కారణంగా మారిన రాజకీయ పరిస్థితులలోనూ, ఆ తరువాత 2009లో డాక్టర్ మన్మోహన్ సింగ్ నాయకత్వానికి విస్తృత ప్రజామోదం లభించినప్పుడు మాత్రమే భారత జాతీయ కాంగ్రెస్ 200కి పైగా సీట్లను గెలుచుకోగలిగింది.

లోక్‌సభలో కాంగ్రెస్ సంఖ్యాబలం అంతకంతకూ తగ్గిపోతోంది. అయితే ఈ దుస్థితిని నివారించుకుని తన బలాన్ని మెరుగుపరుచుకొనేందుకు గత దశకంలో కాంగ్రెస్ ఏమి చేసింది? రాజ్యాంగ సంస్థ– ఎన్నికల సంఘం, దర్యాప్తు సంస్థలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐతో పాటు న్యాయవ్యవస్థ, మీడియాపై అధికారపక్షం సంపూర్ణ నియంత్రణ సాధించడం వల్లే పరిస్థితులు పూర్తిగా తమకు ప్రతికూలంగా మారాయని, సమస్థాయిలో పోటీ పడే అవకాశాలు మృగ్యమయ్యాయని కాంగ్రెస్ నాయకులు తరచు ఆక్రోశిస్తున్నారు. ఇందులో నిజం లేదని ఎవరైనా ఎలా అనగలరు? నిస్సిగ్గుగా అధికార దుర్వినియోగానికి పాల్పడి, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూలగొడుతుండడం వల్లే బీజేపీ తన రాజకీయ ప్రత్యర్థులపై అన్ని విధాల ఆధిక్యత సాధించింది.



కాంగ్రెస్ పునరుజ్జీవన మార్గమేమిటి? 'కొత్త' బీజేపీ వలే మరింత నిరంకుశత్వ పార్టీగా వ్యవహరించడం కాకుండా, 'పాత' కాంగ్రెస్ వలే అందరినీ కలుపుకుని పోవాలి. మరింత సమ్మిళిత పార్టీగా రూపొందడమే కాంగ్రెస్‌కు పాత వైభవాన్ని పునరుద్ధరించగలదు. ఇందుకు కొత్తతరం నాయకుల ప్రతిభాపాటవాలను గుర్తించి తీరాలి. వృద్ధ నాయకులపై ఆధారపడకుండా యువ నేతలను మరింతగా ప్రోత్సహించాలి. ఇటువంటి మార్పుతో సత్ఫలితాలు సమకూరుతాయనడానికి తెలంగాణలో రేవంత్ రెడ్డి నాయకత్వమే ఉదాహరణ.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

అయితే బీజేపీకి ప్రత్యామ్నాయంగా తనను తాను పునర్వ్యవస్థీకరించుకోలేని కాంగ్రెస్ అశక్తత ఆ పార్టీ పతనానికి ఏ మేరకు దోహదం చేసింది? రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలు ప్రజలతో పటిష్ఠ, ఆత్మీయ సంబంధాలను పునరుద్ధరించుకోవడంలో కాంగ్రెస్‌కు విశేషంగా తోడ్పడుతున్నాయనడంలో సందేహం లేదు. అయితే దశాబ్దాల తరబడి ప్రజలతో సంస్థాగతంగా మమేకమవడాన్ని కాంగ్రెస్ పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఇదొక ఘోర తప్పిదం. అప్పుడప్పుడు జోడో యాత్ర లాంటి విన్యాసాలు ఆ నిర్లక్ష్యంతో వాటిల్లిన నష్టాన్ని పూరించ లేవు. రాహుల్ ఒక సాహసోపేతుడైన నాయకుడుగా కన్పిస్తున్న మాట వాస్తవం. అయితే ఆయన తుఫానులో చిక్కుకున్న నౌకకు కెప్టెన్ లాంటి వాడని చెప్పక తప్పదు. నౌకను ముందుకు తీసుకువెళ్లడానికి కెప్టెన్ కృతనిశ్చయంతో ఉన్నాడు, సందేహం లేదు. అయితే ధ్వంసమవుతున్న నౌకతో ఆయన చేయగలిగేదేమిటి? నౌకను ఒడిదుడుకులు లేకుండా ముందుకు నడపడం ఎలా సాధ్యమవుతుంది? అలాగే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను కూడా చూడండి. మండల స్థాయి పార్టీ నేతలు, కార్యకర్తలతో కూడా సంబంధాలు పెట్టుకోవడానికి ఆయన చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నారు. అయితే బలమైన ప్రత్యర్థిపై సుదీర్ఘ పోరాటం చేయగల దృఢ సంకల్పం, ధైర్యం, సామర్థ్యం ఆయనకు ఉన్నాయా?

ఇప్పుడు ఎనిమిది రాష్ట్రాలలో బీజేపీ ప్రభుత్వాలకు సారథ్యం వహిస్తున్న ముఖ్యమంత్రులు ఒకప్పుడు కాంగ్రెస్‌లో ఉన్నవారే. గత ఒక దశాబ్ద కాలంలోనే కనీసం 13 మంది మాజీ ముఖ్యమంత్రులు కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పి బీజేపీలో చేరారు. అధికార లాలసే ఇందుకు కారణమని చెప్పక తప్పదు. సదా అధికార పక్షంలో ఉండడమే అన్ని విధాల శ్రేయస్కరమని ఆ ఫిరాయింపుదారులలో కొంత మంది భావించివుంటారు. సరే, తమపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐ దాడులు జరగవచ్చనే భయంతోనే మరికొందరు కాంగ్రెస్‌ను విడనాడి అధికార పక్షం గూటికి చేరారు. మరీ ముఖ్యంగా పార్టీ కేంద్ర నాయకత్వ ధోరణులకు విసిగిపోయిన ఇంకొందరు తిరుగుబాటుకు పూనుకున్నారు. సీనియర్ నాయకులు కొత్త తరం నేతలకు నాయకత్వ బాధ్యతలు అప్పగించడానికి ససేమిరా అనడం వల్లే మధ్యప్రదేశ్‌లో జ్యోతిరాదిత్య సింధియా, అసోంలో హిమంత బిశ్వశర్మ కాంగ్రెస్ నుంచి నిష్క్రమించారు. ఇప్పుడు వారు తమకు ఒక ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకుంటున్నారు గతంలో కాంగ్రెస్‌లో సర్దుబాటు వైఖరితో వ్యవహరించే ఆచరణాత్మక నాయకత్వ విధానాలు వర్ధిల్లాయి. ప్రతీ ఒక్కరి ప్రయోజనాలు నెరవేరేవి. తత్కారణంగా అందరూ పార్టీ శ్రేయస్సును కోరుకునేవారు. అయితే ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. 'వారు', 'మనమూ' అన్న వైఖరితో వ్యవహరించడం సాధారణమైపోయింది.

2013లో జైపూర్ ప్లీనరీలో 'అధికారం విషతుల్యమైనది' అని రాహుల్ గాంధీ ఉద్ఘాటించారు. అధికార సాధనే ప్రధాన అస్తిత్వ సూత్రంగా ఉన్న పార్టీ నాయకుల, కార్యకర్తల నుద్దేశించి తాను మాట్లాడుతున్నానన్న విషయాన్ని ఆయన మరచిపోయారు. కాంగ్రెస్‌కు భిన్నంగా బీజేపీ, సంఘ్ పరివార్ అనే ఒక సైద్ధాంతిక మహాశక్తి రాజకీయ విభాగం. కార్యకర్తలలో భావజాల సౌభ్రాతృత్వమే బీజేపీని కష్ట కాలంలో సైతం సమైక్యంగా ఉంచింది. 1984లో కేవలం రెండు సీట్లు మాత్రమే సాధించిన సందర్భంలో కూడా కార్యకర్తలు కానీ, నాయకులు గానీ ఎవరూ బీజేపీని వీడ లేదు. పార్టీ పురోగతికే అందరూ అంకితమయ్యారు. ఇప్పుడు ఆ పార్టీ వ్యవహారాలలో నరేంద్ర మోదీ మాటకే తొలి, మలి ప్రాధాన్యం. ఆ మాటే తుది నిర్ణయం. ప్రతి ఒక్కరూ ఆయన నిర్దేశించిన దాన్ని పొదల దాల్చాల్సిందే అధికార కేంద్రీకరణ పట్ల ఎంతగా అసంతృప్తి ఉన్నప్పటికీ అధినేత ఆదేశాలను ధిక్కరించేందుకు ఎవరూ సాహసించడం లేదు. సాహసించలేరు కూడా. ఆ ఆదేశాలను విధిగా పాటిస్తున్నారు.

కాంగ్రెస్ పునరుజ్జీవన మార్గమేమిటి? 'కొత్త' బీజేపీ వలే మరింత నిరంకుశత్వ పార్టీగా వ్యవహరించడం కాకుండా, 'పాత' కాంగ్రెస్ వలే అందరినీ కలుపుకుని పోవాలి. మరింత సమ్మిళిత పార్టీగా రూపొందడమే కాంగ్రెస్‌కు పాత వైభవాన్ని పునరుద్ధరించగలదు. ఇందుకు కొత్తతరం నాయకుల ప్రతిభాపాటవాలను గుర్తించి తీరాలి. పార్టీ వ్యవహారాలలో వారికి కీలక బాధ్యతలు అప్పగించాలి. రాష్ట్ర స్థాయిలోనూ వృద్ధ నాయకులపై ఆధారపడకుండా యువ నేతలను మరింతగా ప్రోత్సహించాలి. ఇటువంటి మార్పుతో సత్ఫలితాలు సమకూరుతాయనడానికి తెలంగాణలో రేవంత్ రెడ్డి నాయకత్వమే ఒక ఉదాహరణ. ఈ 54 ఏళ్ల నాయకుడు కొత్త ఆలోచనలు, వినూత్న కార్యాచరణ, జవాబుదారీతనంతో పార్టీని మళ్లీ అధికార పీఠానికి చేర్చాడు. రాజస్థాన్‌లో సచిన్ పైలట్‌ను, కేరళలో శశిథరూర్‌ను, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో యువనేతలకు కీలక ప్రాధాన్యమిస్తే... తెలంగాణలో రేవంత్ రెడ్డి వలే సత్ఫలితాలను సాధించలేరని ఎవరనగలరు?

ఇక రాహుల్ గాంధీ, గాంధీ పరివార్ విషయానికి వస్తే గాంధీ కుటుంబనామం, కీర్తి ప్రతిష్ఠలు సంప్రదాయ కాంగ్రెస్ శ్రేణుల వెలుపల వారిని ఉత్తేజపరచడమనేది అంతకంతకూ తగ్గిపోతోంది. లోక్‌సభ ఎన్నికలలో వరుసగా మూడోసారి పరాజయం కాంగ్రెస్ పాలిట మహా విపత్తు అవుతుందనడంలో సందేహం లేదు. దేశ రాజకీయాలలో ఒక ప్రభావ శక్తిగా ఆ పార్టీ మరింత శీఘ్రగతిన కృశించిపోవడం ఖాయం. కాంగ్రెస్‌ను గాంధీలు మాత్రమే సమైక్యంగా నిలబెట్టగలరనే విశ్వాసాన్ని కాంగ్రెస్‌వాదులు ఎంత త్వరగా విడనాడితే అంత మంచిది. ఇంకెంత మాత్రం ఓటర్లను ఆకర్షించలేకపోతున్న ఒక కుటుంబంపై ఆధారపడడమా లేక ఆ కుటుంబంతో పార్టీ బొడ్డు తాడును అంతిమంగా తెంచివేయడమా అనే విషయమై కాంగ్రెస్ వెన్వెంటనే నిర్ణయం తీసుకోవలసి ఉన్నది. కాంగ్రెస్ తక్షణ భవిష్యత్తును నిర్ణయించడంలో 2024 లోక్‌సభ ఎన్నికలు ఆ పార్టీకి ఒక అంతిమ పరీక్ష లాంటివి. కాంగ్రెస్ వాదులారా, ఇప్పటికైనా మేల్కొంటారా?

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

ఆ ఘోరాలు పునరావృతం కానీయొద్దు!

తెలంగాణ మహిళా మంత్రులు గౌరవనీయ సీతక్క, కొండా సురేఖలకు...

ఫిబ్రవరి 2న భువనగిరి పట్టణంలోని హాస్టల్లో పదవ తరగతి చదువుతున్న భవ్య, వైష్ణవిల అనుమానాస్పద మరణం రాష్ట్ర ప్రజలను కలచివేసింది. ఈ వార్త విని మహిళా సంఘాలుగా మేము భవ్య వైష్ణవిల తల్లిదండ్రులను, హాస్టలును, అధికార యంత్రాంగాన్ని సందర్శించాము. మా నిజనిర్ధారణలో అనేక ఆందోళనకరమైన విషయాలు తెలిశాయి. కొత్త ప్రభుత్వ పాలన మొదలై ఆరు నెలలు కూడా కాకముందే మా నమ్మకాలను వమ్ము చేయకుండా ఈ విషయంపై దృష్టిపెట్టి న్యాయం చేస్తారని మహిళా మంత్రులైన మీకు విజ్ఞప్తి చేస్తున్నాం.

భవ్య, వైష్ణవిల తల్లిదండ్రులు, బంధుమిత్రులు కన్నీరు మున్నీరై విలపిస్తూ చెప్పిన విషయాలను విశ్వసించాల్సిన అవసరం ఉంది. హాస్టల్లో వార్డెన్ శైలజ, ఆటో డ్రైవర్ ఆంజనేయులు సరిగా ప్రవర్తించటం లేదని, డ్రైవర్ అమ్మాయిల రూముల్లోకి వస్తున్నాడని, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, హాస్టల్‌కు వెళ్లనని కూడా సంక్రాంతి సెలవులకు వచ్చినప్పుడు భవ్య తల్లికి చెప్పుకుంది. భవ్య, వైష్ణవిలు ఏడవ తరగతి విద్యార్థులపై చేయి చేసుకుంటే తల్లిదండ్రులను పిలిపించి వారి ముందు కౌన్సిలింగ్ ఇప్పించాల్సింది పోయి, వార్డెన్, ఆటో డ్రైవర్ కౌన్సిలింగ్ పేరు మీద పాఠశాల నుండి హాస్టల్‌కు తీసుకువచ్చి విపరీతంగా కొట్టి వాళ్ళ చావుకు కారకులయ్యారు. సాయంత్రం ఐదున్నర నుంచి ఏడున్నర వరకు, అంటే సుమారు రెండు గంటలు, ఇద్దరు అమ్మాయిలు హాస్టల్లో లేరనే సమాచారం కూడా ఉన్నది. ఇలాంటి కీలకమైన సాక్ష్యాలు ఎన్నో ఉన్నాయి. కానీ పోలీసులు వేటినీ పరిగణనలోకి తీసుకోవడం లేదు. సాయంత్రం ఐదున్నరకు వైష్ణవి తండ్రితో ఫోన్‌లో మాట్లాడిందని కూడా వైష్ణవి తండ్రి నాగరాజు తెలియజేస్తున్నాడు. రాత్రి తొమ్మిదికల్లా చనిపోయిందనే వార్త మొదట నాగరాజుకి చేరనే చేరింది. ఇంత అకస్మాత్తుగా బలమైన కారణం లేకుండా ఆత్మహత్య ఎలా చేసుకుంటారు? పైగా ఆత్మహత్య చేసుకునేంత పిరికి వాళ్ళు కారు. 14 సంవత్సరాలలోనే ఒక అర్థవంతమైన జీవితాన్ని జీవిస్తున్నవారు అర్థాంతరంగా ఆత్మహత్య చేసుకోవడం నమ్మశక్యంగా లేదు.

ఇక చనిపోయిన రోజు వార్డెన్ తల్లిదండ్రుల ముందుకు కనీసం రాలేదు. పిల్లల గురించి మాట్లాడలేదు. తప్పు చేయకుంటే ఎదురుపడ్డానికి భయమెందుకు? పోలీసులు శవాన్ని చూపిస్తే పిల్లల వంటిపై గాయాలు బయటపడి ఆందోళన చేస్తారనే ఉద్దేశంతో తల్లిదండ్రులతో సంతకం చేయించుకున్న తర్వాతే శవాలను మొక్కుబడిగా చూపెట్టారు. తల్లిదండ్రుల ఒత్తిడి మేరకే మళ్లీ శరీరాలను పరిశీలించి గాయాలను కనిపెట్టారు. 'గాయాలు ఏమీ లేవు' అని పోలీసులు ఎలా నిర్ధారించి మీడియా ముఖంగా ప్రకటిస్తారు? సూసైడ్ నోట్ కూడా పూర్తిగా సృష్టించబడిందన్నది నిర్వివాదాంశం. భవ్య ఆత్మహత్య చేసుకుంటే అత్యంత ప్రేమించే తల్లికి క్షమాపణ చెప్పి ఉండేది. కానీ ఇక్కడ నిత్యం వ్యతిరేకించే వార్డెన్‌ను 'మంచిది' అని మూడు సార్లు ప్రస్తావించడం హాస్యాస్పదం. పోస్టుమార్టం కన్నా ముందు పంచనామా కార్యక్రమం కూడా చట్టబద్ధంగా జరుపలేదు. ఇకపోతే వైష్ణవి తండ్రితో ఖాళీ పేపరుపై సంతకం తీసుకున్నారని, ఫిర్యాదు కూడా పోలీసులే రాశారనే ఆరోపణ కూడా బాధితులవైపు నుంచి వస్తున్నది.

ప్రవీణ్ రెడ్డికి చెందిన సాయికృప ప్రైవేటు భవనంలో ప్రైవేట్ ఐటీఐ, జూనియర్ కాలేజ్, బాలుర హాస్టల్స్ వీటితో పాటు ప్రభుత్వ బాలికల హాస్టల్ మొత్తం నాలుగు రకాల హాస్టల్స్ ఒక్కచోటే అమ్మయిలవీ అబ్బాయిలవీ నడుపుతారా? పైగా ఈ అమ్మాయిల హాస్టల్‌కు కేవలం రెండు నెలల నుంచి మాత్రమే ముసలి నైట్ వాచ్‌మెన్‌ను నియమించారు. పేద పిల్లలంటే, అందులో అమ్మాయిలంటే, అంత చులకనా? ఎన్నికల ముందు మహిళల ఓట్ల కోసం అడగకుండానే పోటీల మీద ఉచితాలు ప్రకటిస్తారు. ఎన్నికల తర్వాత మాత్రం చదువుకోవాలనే ఉత్సాహం ఉన్న అమ్మాయిలకు మెరుగైన సౌకర్యాలను, మంచి వాతావరణాన్ని అందించలేకపోతున్నారు. ప్రజలు ఆందోళన చేపడుతున్నా మహిళలకు రక్షణ కల్పించలేక పోతున్నారు.

పదేండ్ల గత ప్రభుత్వ హయాంలో ప్రియాంక, భూమిక అనే ఇద్దరు గిరిజన విద్యార్థినులను అత్యంత దారుణంగా చంపి ఆత్మహత్య అని చిత్రీకరించిన సంఘటనతో పాటు అనేక సంఘటనలను మహిళా సంఘాలు ఇంకా మర్చిపోలేదు. మళ్లీ పునరావృతమవుతున్న పరిస్థితికి అవకాశం ఇస్తారా? ఇప్పటికైనా భవ్య, వైష్ణవిల మరణాలపై నిజానిజాలను నిజాయితీగా సిట్టింగ్ జడ్జి చేత విచారణ చేపట్టవలసిందని కోరుతున్నాం. ఇన్ని అనుమానాలు సృష్టించిన వార్డెన్ శైలజను, ఆటో డ్రైవర్‌ను వెంటనే అరెస్టు చేయవలసిందిగా డిమాండ్ చేస్తున్నాము. రాష్ట్రంలోని అన్ని వసతి గృహాలను పర్యవేక్షించి, మెరుగుపరిచి, సొంత భవనాలలో నిర్వహించవలసిందిగా కూడా విజ్ఞప్తి చేస్తున్నాం.

– చైతన్య మహిళా సంఘం

వరంగల్ జైలు నిర్మాణం ఎప్పుడు?

గత ప్రభుత్వం చారిత్రాత్మకమైన ఓరుగల్లు జైలుని కూల్చి అదే స్థలంలో ఆస్పత్రి నిర్మాణం పనులు చేపట్టింది. మమునూరులో అంతకు రెట్టింపు స్థలాన్ని నూతన జైలు నిర్మాణం కోసం కేటాయించింది కానీ నిర్మాణ పనులు ప్రారంభించలేదు. రూ. 250 కోట్ల అంచనా వ్యయంతో, అత్యాధునిక సౌకర్యాలతో కొత్త సెంట్రల్ జైలును నిర్మిస్తామని ప్రకటించినా, ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. అప్పటి జైళ్ల శాఖ అధికారులు కూడా ప్రజలకు ఉపయోగమవుతుందని వరంగల్ జైలు స్థలం ఆస్పత్రికి ఇవ్వడానికి ఒప్పుకున్నారు. అధునాతన జైలును ప్రభుత్వం నిర్మిస్తుందనే నమ్మకంతోనే స్థలాన్ని ఇచ్చారు. కానీ నూతన జైలు నిర్మాణం కోసం ముగ్గు కూడా పోసి పని ప్రారంభించలేదు.

వరంగల్ జైలు కూల్చివేసినప్పుడు దాదాపు 970 మంది ఖైదీలను నిజామాబాద్, హైదరాబాద్, ఆదిలాబాద్ తదితర జైళ్లకు తరలించారు. ఖైదీలను కలవడానికి వారి కుటుంబ సభ్యులకు వారానికి రెండుసార్లు ములాఖత్ ఉంటుంది. వరంగల్ జైలు కూల్చిన తర్వాత, ఇక్కడి ప్రజలు ప్రయాణం చేసి ములాఖత్‌కి వెళ్లేసరికి సమయం అయిపోవడం, మహిళలు ఒంటరిగా ప్రయాణం చేసి రావడం ఇబ్బందికరంగా మారింది. కొందరు ఈ తిప్పలు పడలేక ములాఖత్‌కి వెళ్లడం తగ్గించుకున్నారు. అలాగే కోర్టు రిమాండ్ విధించిన వారిని వరంగల్ నుంచి హైదరాబాద్, తదితర ప్రాంత జైళ్లకు తరలించడం పోలీసు సిబ్బందికి ఇబ్బందికరంగా మారింది. డీజిల్, పెట్రోల్ ఖర్చులు తడిసిమోపెడవడంతో పాటు సిబ్బందికి డ్యూటీలు సమస్యగా మారాయి. వరంగల్ జైలు కూల్చినప్పటికి దాదాపు 267 మంది ఉద్యోగులు, ఇంకా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉండేవారు. కొందరు సొంత ఇంటి నిర్మాణం చేసుకున్నారు, పిల్లల చదువుల కోసం ఏర్పాట్లు చేసుకున్నారు. వరంగల్ జైలు కూల్చివేసి ఉద్యోగులను దూర ప్రాంతాలకు పంపించివేయడంతో, కుటుంబసభ్యులను వదిలి ఒంటరిగా జీవించలేక చాలా మంది అనారోగ్యం బారినపడ్డారు. కొందరు రిటైర్‌మెంట్‌కు దగ్గరలో ఉన్నారు. ఎంతో మంది పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వరంగల్‌లో నూతన జైలు నిర్మాణం పనులు వెంటనే ప్రారంభించి, తగిన నిధుల కేటాయింపుతో నిర్మాణం త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– ముచ్కుర్ సుమన్ గౌడ్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి,ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

మళ్లీ మందిర్... మండల్ మార్గమేనా?

నిశితంగా చూస్తే రెండు బీసీ (కాకా కలేల్కర్, మండల్) కమిషన్లు అనేక పరిమితులతో కూడిన సమాచారంతో కులాల వర్గీకరణను చేపట్టాయి. అప్పటికీ ఇప్పటికీ పరిస్థితుల్లో గణనీయ మార్పులు వచ్చాయి. వెనుకబాటుతనాన్ని తాజాగా నిర్వచించాల్సిన అవసరం కనపడుతోంది. ఆర్థిక, విద్యాస్థాయిలను పరిగణనలోకి తీసుకుంటే రిజర్వేషన్లలో చేర్పులు, మార్పులు, తొలగింపులు, వర్గీకరణలు కచ్చితంగా అవసరమవుతాయి. బిహార్ కుల సర్వే ఫలితాలను చూస్తే ఇదే అర్థం అవుతుంది.

మూడు పరిణామాల ప్రస్తావన లేకుండా సమకాలీన భారత చరిత్రను సమగ్రంగా చెప్పుకోలేం. ప్రైవేటు రంగానికి పెద్దపీట వేసే ఆర్థిక సంస్కరణలు వాటిల్లో మొదటిది. రెండోది అయోధ్యలో రామజన్మభూమి– బాబ్రీ మసీదు చుట్టూ తిరిగిన రాజకీయం. మూడోది.. వెనుకబడిన వర్గాలకు (బీసీలు) రిజర్వేషన్లు ప్రతిపాదించిన మండల్ కమిషన్ సిఫార్సులు. మొదటిదానిపై రాజకీయ పార్టీల మధ్య భేదాభిప్రాయాల్లేవు. మందిర్–మండల్ విధానాలను అలా భావించలేం. అవి ఇంకా విభేదాలను రగుల్చుతూనే ఉన్నాయి. రామాలయం చుట్టూ నెలకొల్పిన ఉద్వేగాలను ఆధారం చేసుకుని వచ్చే ఎన్నికల్లో భారీ ఆధిక్యతతో గెలవాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. కులాలు కలిగించిన అసమానతలు, విభేదాలను నిర్వీర్యం చేయగలిగిన శక్తి హిందూ జాతీయవాదానికి ఉందనే నమ్మకం బీజేపీ రాజకీయాలకు కీలకం. మత ధర్మాన్ని, సంస్కృతిని మహోన్నతంగా భావించే జాతీయవాదానికి ఎన్ని సుభాష్యాలు చెప్పినా ఇతర మతాల ప్రజలకు సమానస్థాయిని ఇవ్వకపోవటం అందులో ప్రముఖంగా ఉంటుంది. చాలా దేశాల్లో అదే జరిగింది. హిందూ మతాన్ని ఒక జీవన విధానంగా భావించాలనే వాదన మనందరికీ తెలిసిందే. దాంతో విభేదించాల్సిన పనిలేదు. ఏ మతమైనా జీవన విధానమే. పాపపుణ్యాలూ, మంచీచెడూ, మనుషుల్లో తక్కువా ఎక్కువలు, ఇహపరలోక పరమార్థాలు, రాజ్యాధికారానికి అర్హతలు లాంటి వాటిని నిర్దేశించటం అన్ని మతాల్లోనూ ఉంటాయి.

హిందూ సంస్కృతిలోని మంచిచెడుల లోతుల్లోకి వెళ్లకుండా కులాల పరంగా అధికారం, పదవుల పంపకాలపై దృష్టిపెట్టటం ఇప్పటి మండల్ రాజకీయాల్లో కీలకం. అంబేడ్కర్‌లాగా కులాల అసమానతలకు ఆధారంగా ఉన్న మతభావాలపై పోరాటం సాగించటానికి మండల్ వాదులు సుముఖంగా లేరు. మందిర్ రాజకీయాలతో బాగా నష్టపోయిన కాంగ్రెస్ ఇప్పుడు మండల్ అజెండాపై ఆశలు పెట్టుకుని బలం పుంజుకోవాలని చూస్తోంది. దీన్నే అస్త్రంగా చేసుకుని ఇటీవల జరిగిన అయిదు రాష్ట్రాల ఎన్నికల బరిలోకి దిగినా తెలంగాణలో తప్ప ఎక్కడా గెలవలేదు. కులగణనకు హామీ ఇచ్చినా ఎటువంటి ప్రభావాన్ని చూపలేదు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతే కాంగ్రెస్‌ను గెలిపించింది. కులగణన, కుల న్యాయాలు ప్రభావం చూపలేదు. అయినా మండల్ రాజకీయాలపై కాంగ్రెస్ ఆశలు అణగారలేదు. తెలంగాణ అసెంబ్లీలో కులగణనకు తీర్మానాన్ని ప్రవేశపెట్టటమే ఇందుకు నిదర్శనం.

సామాజిక న్యాయ రాజకీయాలకు ప్రధాన ఆధారం మండల్ కమిషన్ సిఫార్సులు. దానికంటే ముందు 1953లో కాకా కలేల్కర్ (తొలి బీసీ) కమిషన్ ఏర్పాటైంది. కులాలు, వాటి వెనుకబాటు, వాటికి కల్పించాల్సిన రిజర్వేషన్ల గురించి ఆ రెండు కమిషన్లు ఏం చెప్పాయో పరిశీలిస్తే చాలా విషయాలు తెలుస్తాయి. పరిమితులూ అర్థమవుతాయి. ఇప్పటికి అవి ఎంతమేరకు పనికొస్తాయో అంచనానూ వేయవచ్చు. కలేల్కర్ కమిషన్ 1955 మార్చి 30న నివేదికను ఇచ్చింది. మండల్ కమిషన్ 1978 డిసెంబర్ 20న ఏర్పాటై 1980 డిసెంబర్ 31న నివేదికను సమర్పించింది. 20 ఏళ్ల తర్వాత రిజర్వేషన్లను సమీక్షించాలని మండల్ కమిషన్ చెప్పినప్పటికీ అందుకు ఏ పార్టీ ఇప్పటికీ సిద్ధంగా లేదు. బీసీల జనాభా ఎంతో తేలాలన్న డిమాండు 1980లకు ముందూ ఉంది. ఆ వర్గాల జనాభా 52 శాతం ఉంటుందని మండల్ కమిషన్ అంచనా వేసినా అది శాస్త్రీయంగా వేసిన లెక్కకాదు. చాలా పరిమితులతో వేసిన అంచనాగానే కమిషనే పేర్కొంది. కులాల లెక్కలను సేకరించటం 1881 మొదలై 1931తో ఆగిపోయింది. ఆ అర్ధ శతాబ్దిలో ప్రతి పదేళ్లకొకసారి పెరిగిన ఆయా కులాల జనాభా పెరుగుదల రేటును మండల కమిషన్ పరిగణనలోకి తీసుకుంది. ఆ తర్వాతి అర్ధ శతాబ్దికి (1931–1981) ఆ రేటుని అన్వయించి బీసీల సంఖ్య విషయంలో నిర్ధారణకు వచ్చింది. హిందూ బీసీల సంఖ్య 43.70 శాతంగా పేర్కొంది. ముస్లింలు, ఇతర మతాల్లో బీసీలు 8.40 శాతంగా ఉంటారని లెక్కించింది.

వేల కులాల్లో బీసీలుగా ఎవరిని పరిగణించాలన్నది అప్పటికీ ఇప్పటికీ పెద్ద సవాలే. ఇందుకోసం సామాజిక, విద్య, ఆర్థిక అంశాలకు సంబంధించి 11 సూచికలను కమిషన్ గుర్తించింది. సామాజిక అంశాలకు సంబంధించి నాలుగు సూచికలను గుర్తించి ఒక్కొక్క దానికి మూడు పాయింట్లు ఇచ్చింది. విద్యకు సంబంధించి మూడు సూచికలకు ఒక్కో దానికి 2 పాయింట్లను కేటాయించింది. ఆర్థిక అంశాలకు నాలుగు సూచికలను గుర్తించి ఒక్కో పాయింటును ఇచ్చింది. ఈ పాయింట్ల వ్యవహారాన్ని చూస్తే కులం సామాజిక స్థాయికే (12 పాయింట్లు) మండల్ కమిషన్ ప్రాధాన్యం ఇచ్చింది. ఒక కులానికి 11 గానీ అంతకు మించి గానీ పాయింట్లు వస్తే దాన్ని బీసీ కులంగా పరిగణించింది. ఏదైనా కులాన్ని వెనుకబడిన కులంగా మిగతా కులాలు భావిస్తే మూడు పాయింట్లు ఇచ్చారు. శారీరక శ్రమపైనే జీవిస్తే మరో మూడు పాయింట్లు వేశారు. రాష్ట్ర సగటు వివాహ వయస్సు కంటే తక్కువగా.. 17 ఏళ్లకు లోపల పెళ్లి చేసుకునే మహిళల సంఖ్య 25శాతం, పురుషుల సంఖ్య 10శాతం ఏదైనా కులంలో అధికంగా ఉంటే ఆ కులానికి మూడు పాయింట్లు ఇచ్చారు. పట్టణాల విషయంలో ఈ శాతాలు 10, 5 ఉంటే సరిపోతుంది. ఏదైనా కులంలో రాష్ట్ర సగటుకు మించి 25 శాతం అధికంగా మహిళలు బయట పనులకు వెళితే మరో 3 పాయింట్లు కేటాయించారు.



■ రాహుల్ కుమార్

చదువు విషయంలోనూ ఇలాగే పాయింట్లు ఇచ్చారు. ఏదైనా కులంలోని పిల్లలు (5–15 ఏళ్లు) రాష్ట్ర సగటుకు మించి 25 శాతం అధికంగా పాఠశాలకు వెళ్లని పరిస్థితి ఉంటే విద్యా వెనుకబాటుకు ఒక సూచిక అయింది. పాఠశాలను పూర్తిగా మానివేసే పిల్లల సంఖ్య రాష్ట్ర సగటును మించి ఇదే శాతంలో ఉంటే మరో సూచికగా తీసుకున్నారు. రాష్ట్ర సగటు కంటే 25 శాతం తక్కువగా మెట్రిక్యులేట్స్ ఉంటే ఆ అంశాన్నీ సూచికగా పరిగణించారు.

ఆర్థిక విషయాలకు వస్తే.. రాష్ట్ర సగటు కంటే 25 శాతం తక్కువ ఆస్తులున్న కుటుంబాలు, 25 శాతం ఎక్కువగా కచ్చా గృహాల్లో ఉండేవారు, మంచి నీళ్ల కోసం అర కిలోమీటరు వెళ్లాల్సిన కుటుంబాలు 50 శాతానికి మించితేనూ.. అప్పులు చేసే కుటుంబాలు 25 శాతం ఎక్కువ ఉంటే.. బీసీల్లో చేర్చటానికి ప్రాతిపదికగా తీసుకున్నారు.

దేశ వ్యాప్తంగా (405 జిల్లాల్లో) మొత్తం మీద 910 గ్రామాలను, 405 పట్టణ ప్రాంతాలను ఎంపిక చేసుకుని బీసీ కులాలు ఇవీ అని నిర్ధారించటంపై అప్పట్లోనే విమర్శలు వచ్చాయి. ఎంతో వైవిధ్యం, సంక్లిష్టతలు ఉన్న సమాజంలో ఇలా నిర్ధారించటం అసమగ్రమని వ్యాఖ్యానాలు వెలువడ్డాయి. ఫలానా కులాలను బీసీలుగా పేర్కొన్న తర్వాత వాటి జనాభాని తేల్చటం కూడా పెద్ద సవాలే. అందుకే కులాలవారీ లెక్కలను సేకరించాలని రెండు కమిషన్లు సిఫార్సు చేశాయి.

కేంద్ర ఉద్యోగాల్లో (15,71,638) బీసీల ప్రాతినిధ్యం 12.55 శాతం మాత్రమేనని మండల్ కమిషన్ నిర్ధారించింది. ఎస్సీ–ఎస్టీల ఉద్యోగుల (18.72 శాతం) కంటే కూడా బీసీలు తక్కువగా ఉన్నారని పేర్కొంది. నిజానికి ఆనాడు కేంద్రం దగ్గర బీసీ ఉద్యోగుల లెక్కల్లేవు. అందుకని కమిషనే ఒక ప్రశ్నావళి లాంటిది పంపి సమాధానాలు రాబట్టింది.



అవి సంపూర్ణమని చెప్పలేం. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య కులాలకు (ద్విజులు) చెందని వారిని బీసీలుగా పరిగణించాలని స్పష్టం చేసింది. అలాగే ఆ ఉద్యోగి తండ్రి, తాత విద్య ప్రాథమిక స్థాయి దాటని వారై ఉండాలని కూడా స్పష్టం చేసింది. ఈ రెండు కొలమానాలకు తూగిన వారే బీసీ ఉద్యోగులు అవుతారని పేర్కొంది. కమిషన్ సైతం ఈ కొలమానాలను సమగ్రమైనవిగా భావించలేదు. ఉద్యోగులు కూడా అరకొర సమాధానాలనే ఇచ్చారు.

మండల్ కమిషన్ లెక్కమేరకు 1980 నాటికి బీసీ ఉద్యోగులు 12.55 శాతమే ఉన్నారని అంగీకరించినా వాళ్లందరూ ఓపెన్ కేటగిరిలోనే ఎంపికయ్యారని భావించొచ్చు. 1992 నుంచి బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అమలయ్యాయి. ఈ 30 ఏళ్లలో పెరిగిన విద్యావకాశాలను, మెరుగైన ఆర్థిక స్థితిని పరిగణనలోకి తీసుకుంటే బీసీ ఉద్యోగుల సంఖ్య 40–50 శాతం కచ్చితంగా ఉండే అవకాశం ఉంది. తాజా సర్వే ప్రకారం బిహార్‌లో 39.19 శాతం బీసీ ఉద్యోగులు ఉన్నారు. ఉత్తరాదితో పోల్చితే దక్షిణాదిన బీసీ ఉద్యోగస్తులు ఎక్కువే ఉంటారు. 1970ల నుంచి బీసీ రిజర్వేషన్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అమలయ్యాయి. తాజా లెక్కలను తీస్తే తెలుగు రాష్ట్రాల్లో బీసీ ఉద్యోగులు 50 శాతానికి దగ్గరలోనే ఉండే అవకాశం ఉంటుంది.

కలేల్కర్ కమిషన్ 2,399 కులాలను బీసీలుగా పరిగణిస్తే మండల్ కమిషన్ ఆ సంఖ్యను 3,733కు పెంచింది. కొలమానాలను బట్టి కులాల సంఖ్య విపరీతంగా పెరిగింది. రిజర్వేషన్లకు కులాన్ని ప్రధాన ప్రాతిపదికగా తీసుకోవాలనే విషయంపై మండల్ కమిషన్‌లో ఏకాభిప్రాయం వ్యక్తమైంది. కానీ కలేల్కర్ కమిషన్‌లో 5గురు సభ్యులు రిజర్వేషన్ ప్రాతిపాదికపైనే అసమ్మతిని వ్యక్తం చేశారు. కలేల్కరే స్వయంగా వెనుకబాటుని నిర్ధారించటానికి కులాన్ని ఏకైక ప్రాతిపదికగా తీసుకోటాన్ని వ్యతిరేకించారు. ఇక ఉద్యోగాలకు సంబంధించి ఒక్కో కేటగిరీకి ఒక్కో విధంగా రిజర్వేషన్లను కలేల్కర్ కమిషన్ ప్రతిపాదించింది. సాంకేతిక, వృత్తి విద్యా సంస్థల్లో ఏకంగా 70 శాతం రిజర్వేషన్లను సిఫార్సు చేసింది. శీఘ్ర ఆర్థికాభివృద్ధితో అన్ని అసమానతలు సర్దుకుంటాయని విశ్వసించిన ఆనాటి నెహ్రూ ప్రభుత్వం వైరుధ్యాలతో కూడిన కలేల్కర్ కమిషన్ నివేదికను తిరస్కరించింది. మండల్ కమిషన్ నివేదికలో కొన్ని విచిత్రాలు కనపడతాయి. బీసీ కులాలు (333) అత్యధికంగా ఉన్న రాష్ట్రం కర్ణాటక. 292 కులాలతో ఉమ్మడి ఏపీ రెండో స్థానంలోనూ, 288 కులాలతో తమిళనాడు మూడో స్థానంలోనూ ఉన్నాయి. యూపీలో 116, బిహార్‌లో 168 బీసీ కులాలే లెక్కతేలాయి.

నిశితంగా చూస్తే రెండు బీసీ కమిషన్లు అనేక పరిమితులతో కూడిన సమాచారంతో కులాల వర్గీకరణను చేపట్టాయి. అప్పటికీ ఇప్పటికీ పరిస్థితుల్లో గణనీయ మార్పులు వచ్చాయి. వెనుకబాటుతనాన్ని తాజాగా నిర్వచించాల్సిన అవసరం కనపడుతోంది. ఆర్థిక, విద్యాస్థాయిలను పరిగణనలోకి తీసుకుంటే రిజర్వేషన్లలో చేర్పులు, మార్పులు, తొలగింపులు, వర్గీకరణలు కచ్చితంగా అవసరమవుతాయి. బిహార్ కుల సర్వే ఫలితాలను చూస్తే ఇదే అర్థం అవుతుంది. అక్కడి ప్రభుత్వ ఉద్యోగాల్లో యాదవులకే అగ్రస్థానం ఉందని వెల్లడైంది. వ్యవసాయ భూములు, యంత్రాలు, వాహనాల యాజమాన్యంలో సైతం ఆధిక్యత వారిదే. ఎమ్మెల్యేల్లో నాలుగో వంతు యాదవులదే. అగ్రకులాలను చాలా కొలమానాల్లో దాటేశారు.

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

ఆంధ్రజ్యోతి
వరంగల్ ఉమ్మడి జిల్లా
శుక్రవారం 23 ఫిబ్రవరి 2024


సమ్మక్క రాక కోసం గద్దెల ప్రాంగణం ఎదుట ఎదురుచూస్తున్న భక్తులు

మమ్మేలు తల్లీ.. శరణు.. శరణు..

కోటిన్నర మందికిపైగా భక్తులు ఎప్పుడెప్పుడా అని ఒళ్లంతా కళ్లు చేసుకొని ఉత్కంఠగా ఎదురుచూసిన అద్భుతం ఆవిష్కృతమైంది. మహాజాతరలో ప్రధాన ఘట్టమైన సమ్మక్క ఆగమనం ప్రశాంతంగా పూర్తయ్యింది. గురువారం రాత్రి ఆ తల్లిని చిలకలగుట్ట నుంచి పూజారులు అట్టహాసంగా మేడారానికి తీసుకువచ్చి ఘనంగా గద్దెపై ప్రతిష్ఠించారు. జై సమ్మక్క.. జైజై సమ్మక్క.. అంటూ భక్త కోటి గొంతుకలు పిక్కటిల్లిన నినాదాలతో గద్దెల ప్రాంగణం మారుమోగింది. తల్లిని మనసు నిండా నింపుకొని, తనువంత పులకరించగా తనివితీరా దర్శించుకొని భక్తిపారవశ్యంతో పరవశించిపోయారు. 'తల్లీ నీ దర్శన భాగ్యంతో మా బతుకులు ధన్యమయ్యాయి' అని మురిసిపోయారు. 'కరుణించి కాపాడుతల్లీ.. రెండేళ్లకు మళ్లొస్తాం..' అంటూ మొక్కుకున్నారు. బంగారం (బెల్లం) సమర్పించుకున్నారు. శివసత్తుల పూనకాలు, భక్తుల కోలాహలంతో మేడారం గద్దెల ప్రాంగణం భక్తజన సంద్రంగా మారింది. సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు బుధవారం రాత్రే గద్దెలపై కొలువు దీరగా గురువారం సమ్మక్క తల్లి రాకతో జాతర పరిపూర్ణతను సంతరించుకున్నది. నలుగురు వన దేవతలు నాలుగు దిక్కులా గద్దెలపై కొలువుతీరి అశేష భక్తజనకోటికి ఆశీస్సులందిస్తున్నారు.


చిలకలగుట్టనుంచి సమ్మక్కను తీసుకువస్తున్న పూజారులు


సమ్మక్క రాకను ఆహ్వానిస్తూ గాల్లోకి కాల్పులు జరుపుతున్న ములుగు ఎస్పీ శబరీష్

గద్దెపైకి చేరుకున్న ఇలవేల్పు సమ్మక్క

- చిలకల గుట్ట నుంచి భారీ బందోబస్తు మధ్య గుడిలోకి..
- అధికారిక లాంఛనాలతో ఘన స్వాగతం
- గాలిలో కాల్పులు జరిపి ఎస్పీ గౌరవ వందనం
- నీరాజనం పట్టిన మంత్రి, ప్రజాప్రతినిధులు
- కొలువుదీరిన నలుగురు వన దేవతలు
- శిఖరాగ్రానికి మేడారం జాతర
- పోటెత్తిన భక్త ప్రవాహం
- శిగాలెత్తిన శివసత్తులు
- ప్రశాంతంగా ముగిసిన ప్రధాన ఘట్టం
- నేడు తల్లులను దర్శించుకోనున్న సీఎం!


సమ్మక్కను గద్దెపై ప్రతిష్ఠిస్తున్న పూజారులు

పతాక స్థాయికి జాతర

సమ్మక్క గద్దెపైకి చేరడంతో మహాజాతర పతాక స్థాయికి చేరుకుంది. బుధవారమే సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపైకి వేంచేసిన విషయం తెలిసిందే. గురువారం రాత్రి సమక్క రాకతో జాతరకు పరిపూర్ణత చేకూరింది. నలుగురు వన దేవతలు నాలుగు దిక్కులా కొలువైన ఉండగా.. ఈఅపూర్వ ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులకు రెండు కళ్లు చాలడంలేదు. వనదేవతల చల్లని చూపులు తమపై వర్షిస్తున్నాయన్న దివ్యమైన అనుభూతికి లోనవుతున్నారు. తన్మయత్వంతో ఊగిపోతున్నారు. సమ్మక్క గద్దెపైకి చేరుకున్న మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చే భక్తుల రాక మరింత పెరిగింది. క్యూలైన్లన్నీ కిటకిటలాడుతున్నాయి.


ముగ్గులు వేసి నాట్యాలతో సమ్మక్కను ఆహ్వానిస్తున్న మహిళలు

మేడారం బృందం, ఫిబ్రవరి 22 : నిండు పున్నమి వెన్నెల కాంతుల నడుమ, భక్తుల కేరింతల మధ్య సమ్మక్క తల్లి వనం నుంచి జనంలోకి తల్లి వచ్చింది. భక్తుల కష్టాలు కడతేర్చేందుకు, వారి కోర్కెలను ఈడేర్చేందుకు గద్దెపై ఆసీనురాలైంది. తనను దర్శించుకోవడానికి వ్యయ ప్రయాసాలకు ఓర్చి వచ్చిన లక్షలాది మంది భక్తులకు ఆశీస్సులను అందచేస్తోంది. రెండేళ్ల తర్వాత మరోసారి చిలకగుట్ట నుంచి మేడారానికి చేరుకొని భక్తులను ఆనందపరవశులను చేస్తోంది. సమ్మక్క తల్లిని దర్శనం చేసుకున్న భక్తజనం తన్మయత్వం పొంగిపోతున్నారు. శివసత్తులు సిగాలు ఊగుతూ భక్తిభావంతో పరవశించిపోతున్నారు. గురువారం రాత్రి సమ్మక్క గద్దెకు చేరడంతో జాతర పతాకస్థాయికి చేరింది. భక్తుల సంబరాలు అంబరాన్ని అంటాయి.

అడవి నుంచి వనం

సమ్మక్క తల్లిని గద్దెపైకి తీసుకువచ్చే తంతు ఉదయం నుంచే మొదలైంది. పూజారులు తెల్లవారుజామునే మేడారంలోని సమ్మక్కగుడికి చేరుకున్నారు. గుడి ప్రాంగణాన్ని ఊడ్చి శుభ్రం చేశారు. మామిడి తోరణాలను కట్టారు. అలుకుచల్లి అందంగా ముగ్గులు వేశారు. తర్వాత పూజారులు అడవికివెళ్లి వనాన్ని తీసుకువచ్చారు. ఉదయం 9గంటలకు డప్పుచప్పుళ్ల మధ్య వనాన్ని తీసుకువస్తుండగా సమ్మక్క గుడి సమీపంలో బొడ్రాయి వద్ద మహిళలు నీళ్లబిందెలతో ఎదురువచ్చి పూజారుల కాళ్లు కడిగారు. మంగళహారతులు పట్టారు. ఉదయం 10.30 గంటలకు పూజారులు వనాన్ని మేడారంలోని సమ్మక్క గద్దెపై ఉంచి పూజలు చేశారు. వనం తీసుకువచ్చే కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) కూడా పూజారులతో పాటు పాల్గొన్నారు. ఆ తర్వాత మధ్యాహ్నం సమక్క పూజారుల్లో ఒకరైన సిద్దబోయిన మునేందర్ ఇంట్లో అడేరాలను (పసిడి కుండలు) సిద్ధం చేశారు. డోలు వాయిద్యాల మధ్య వాటిని సమ్మక్క గుడికి తరలించారు. గుడిలోని తల్లి మిగతా పూజాసామగ్రిని శుద్ధి చేశారు. పూజల అనంతరం మేకలు, కోళ్లను బలిచ్చారు.

చిలుకల గుట్ట నుంచి..

సాయంత్రం అసలు ఘట్టం ప్రారంభమైంది. ప్రధాన వడ్డె అయిన కొక్కెర క్రిష్ణయ్యతోపాటు మరో నలుగురు పూజారులు సిద్దబోయిన మునేందర్, సిద్దబోయిన మహేష్, సిద్దబోయిన లక్ష్మణ్‌రావు, చందా గోపాల్ రావు, పరమయ్య, జలకపు వడ్డె మల్లెల ముత్తయ్య, కొమ్ముంవడ్డె సిద్దబోయిన స్వామి, జనార్దన్‌తో పాటు దూపపు వడ్డె సాయంత్రం 5 గంటలకు చిలుకల గుట్టకు బయలు దేరి వేళ్లారు. పూజారులు చిలకులగుట్టపైకి

మిగతా 8వ పేజీలో..



నేడు మేడారానికి గవర్నర్ రాక



మేడారం బృందం, ఫిబ్రవరి 22: తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శుక్రవారం మేడారం సందర్శించనున్నారు. ఉదయం 9.20 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో మేడారానికి బయలు దేరుతారు. 10.25 గంటలకు మేడారంలో హెలిక్యాప్టర్‌లో దిగుతారు. 10.30గంటలకు మేడారం గద్దెల వద్ద తులాభారం ద్వారా నిలువెత్తు బంగారాన్ని తల్లులకు సమర్పిస్తారు. గద్దెల వద్ద తల్లులకు పూజలు నిర్వర్తిస్తారు. 11.25 గంటలకు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారు. గవర్నర్ మేడారం సందర్శించడం ఇది మూడోసారి. గవర్నర్ రాక సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈ ఏడాదే గిరిజన యూనివర్సిటీ తరగతులు

- జాకారం వైటీసీలో తాత్కాలిక తరగతులు నిర్వహిస్తాం..
- మేడారం జాతరకు యునెస్కో గుర్తింపునకు ప్రతిపాదనలు పంపుతాం
- మేడారం జాతరకు జాతీయ హోదా సాధ్యం కాదు..
- వేయిస్తంభాల గుడి కల్యాణ మండపాన్ని త్వరలోనే ప్రారంభిస్తాం..
- మామునూరు ఎయిర్‌పోర్టుకు గత ప్రభుత్వం భూసేకరణ చేయలేదు..
- కేంద్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి


మొక్కులు సమర్పించేందుకు వస్తున్న కిషన్‌రెడ్డి, పక్కన సీతక్క

8

ములుగును సమ్మక్క- సారక్క జిల్లాగా ప్రకటించాలి

వడ్డెపల్లి, ఫిబ్రవరి 22: ములుగును సమ్మక్క- సారక్క జిల్లాగా ప్రకటించాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పోరిక ఈశ్వర్‌సింగ్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ రాంనగర్‌లోని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ నవీన్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడారం జాతరకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ములుగును సమ్మక్క - సారలమ్మ జిల్లాగా ప్రకటించాలని కోరారు. సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సమ్మయ్య రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడే బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 35 ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.00,6.00,9.00
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

భ్రమరాంబ 70ఎంఎం - కూకట్‌పల్లి 11.30,2.45,6.30,9.45 | రాజధాని 70ఎంఎం - దిల్‌సుఖ్‌నగర్ 2.15,6.15,9.15 | ప్రశాంత్ 70ఎంఎం - సికింద్రాబాద్ 11.00,2.00,6.00,9.00
తాక్భూరి కాంప్లెక్స్ - ఇ.సి.ఐ.ఎల్ 2.00,6.00,9.00 | సుష్మ 70 ఎ/సి - వనస్థలిపురం 11.15,2.15,6.15,9.15 | శ్రీరమణ కాంప్లెక్స్ - అంబర్‌పేట 2.00,6.00,9.00 | స్వప్న కాంప్లెక్స్ ఎ/సి - కాటెదాన్ 11.15,6.15,9.00

ఏసియన్ సత్యం - అమీర్‌పేట 11.00,1.50,7.30,10.15
ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 2.40pm
ఎ.ఎం.బి. సినిమాస్ - గచ్చిబౌలి 10.45,1.30,7.45,10.35
INOX జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ 11.30,7.50
INOX ఎం.పి మాల్ - కాచిగూడ 11.00,8.00
INOX జిఎస్ఎమ్ - మదీనగూడ 11.10,8.00
INOX నెక్లెస్ సత్య - కవాడిగూడ 5.00,10.40
INOX అశోకా - కూకట్‌పల్లి హై జంక్షన్ 5.00,10.40
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 1.55,8.10
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 10.45,8.00,10.45
PVR ఆర్.కె. - బంజారాహిల్స్ 1.35,8.00
PVR ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్ 4.55,8.05
PVR గలేరియా - పంజాగుట్ట 1.25,8.10
PVR ఐకాన్ - హైటెక్‌సిటీ 1.30,8.10
PVR పివిఆర్ - ఎర్రమంజిల్ 1.25,10.30
PVR పివిఆర్ - ముసారాంబాగ్ 1.30,10.55
PVR ప్రెస్టీజ్‌మాల్ - గచ్చిబౌలి 11.15,8.00
PVR అట్రియమ్ - గచ్చిబౌలి 1.30,7.50
PVR ఎస్2 నోమ - మల్లాపూర్ 1.00,10.10
శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 1.40,10.00
సినిమాస్ - బాలానగర్ 1.40,10.50
సినిమాస్ - చందానగర్ 1.40,10.00
లక్ష్మీనరసింహ - మియాపూర్ 1.35,8.00
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి 1.35,8.00
MOVIETIME మూవీటైమ్ - అమీర్‌పేట 11.15,4.30,10.00
MOVIETIME ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి 11.30,2.30,10.40
MOVIETIME స్కైమాల్ - సనత్‌నగర్ 10.30,7.15
Cinepolis మంజీరామాల్ - కూకట్‌పల్లి 11.45,4.55
Cinepolis సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి 11.30,5.10,10.45
Cinepolis మంత్రామాల్ - అత్తాపూర్ 5.05,10.40
Cinepolis సుధా - శాలిబండ 12.00,5.15,10.30
Cinepolis డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్ 5.40,11.15
టివోలి - సికింద్రాబాద్ 4.50pm
విజయలక్ష్మి - ఎల్.బి.నగర్ 1.45,7.30
సినీ ప్లానెట్ - కొంపల్లి 1.55,7.25,10.20
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 11.00,1.50,7.40,10.40
రాధిక - కాప్రా 11.05,7.40,10.45
ఎంక్యూబ్ - అత్తాపూర్ 10.55,7.35,10.30
శివగంగ - దిల్‌సుఖ్‌నగర్ 11.15,6.15,9.00
జె.పి. సినిమాస్ - చందానగర్ 11.05,1.35,4.50,7.45,10.40
ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 11.05,1.55,4.30,7.40,10.40
లక్ష్మీకళ - మూసాపేట్ 11.40,6.30,9.40
ఏసియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం 11.10,1.55,7.40,10.35
ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్ 2.30,9.15
షా షహెన్‌షా - చింతల్ 2.45,9.45
జిపిఆర్ - కూకట్‌పల్లి 10.30,7.15,10.15
మూవీమ్యాక్స్ - మౌలాలి 11.00am

జెమిని కాంప్లెక్స్ - వరంగల్ | ఎస్2 70 - వరంగల్ | శ్రీదేవి ఎ/సి - హన్మకొండ | శ్రీనివాస - కరీంనగర్ | ప్రతిమ ఎ/సి - కరీంనగర్ | వినోద 70ఎంఎం - ఖమ్మం | తిరుమల - మహబూబ్‌నగర్ | వెంకటేశ్వర - గద్వాల్ | మిట్రోస్ సినీప్లెక్స్ - మిర్యాలగూడ | తిరుమల - సూర్యాపేట | విష్ణురాం సినిమాస్ - కోదాడ | జెమిని - మంచిర్యాల | గీతా ఎ/సి - నిజామాబాద్ | వేణుమాల్ - నిజామాబాద్ | జీవన్‌రెడ్డి మాల్ - ఆర్మూర్ | పూరణ్ 70ఎంఎం - రాయచూర్

GEETHA FILM DISTRIBUTORS

నేడే బ్రహ్మాండమైన విడుదల



PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 10.30am
INOX జిఎస్ఎమ్ - మదీనాగూడ 10.40pm
INOX నెక్లెస్ సత్య - కావాడిగూడ 11.40am
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి 7.40pm
MOVIETIME మూవీటైమ్ - అమీర్‌పేట్ 2.00pm
ఏషియన్ సినిమాస్ - వరంగల్ | రంగా 70 ఎంఎం ఎ/సి - వనపర్తి | రామకృష్ణ 70 - నాగర్‌కర్నూల్ | శ్రీనివాస 70ఎంఎం - వర్ధన్నపేట్ | భవాని 70ఎంఎం - కొత్తకోట

NTR CINEMAS - 9030161717


నేడే బ్రహ్మాండమైన విడుదల



INOX జిఎస్ఎమ్ - మదీనగూడ 12.00pm
INOX అశోక - కూకట్‌పల్లి హై జంక్షన్ 10.40am
లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి
PVR ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్
PVR గలేరియా - పంజాగుట్ట
INOX జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
సినీ ప్లానెట్ - కొంపల్లి
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్

CONTACT:9246647336

నేడే బ్రహ్మాండమైన విడుదల



దేవి 70 ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.00,2.30,6.00,9.30
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

మల్లికార్జున 70 - కూకట్‌పల్లి 11.15,2.30 | మెగా 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15 | మహాలక్ష్మి 70 - కొత్తపేట 11.15,6.15


ప్రసాద్స్ - ఎన్‌టిఆర్ గార్డెన్స్ 9.10am
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 1.20pm
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 11.00pm
PVR ఆర్.కె. - బంజారాహిల్స్ 5.00pm
PVR ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్ 2.35pm
PVR గలేరియా - పంజాగుట్ట 5.00pm
PVR ఐకాన్ - హైటెక్‌సిటీ 11.00pm
PVR పివిఆర్ - ఎర్రమంజిల్ 4.50pm
PVR పివిఆర్ - ముసారాంబాగ్ 7.45pm
PVR ప్రెస్టీజ్ మాల్ - గచ్చిబౌలి 1.25pm
PVR అట్రియమ్ - గచ్చిబౌలి 4.25pm
PVR ఎస్2 నోమ - మల్లాపూర్ 1.30pm
INOX జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ 4.40pm
INOX జిఎస్ఎమ్ - మదీనగూడ 1.50pm
INOX నెక్లెస్ సత్య - కవాడిగూడ 10.40pm
INOX అశోకా - కూకట్‌పల్లి హై జంక్షన్ 10.40am
మంజీరామాల్ - కూకట్‌పల్లి 11.30am
మంత్రామాల్ - అత్తాపూర్ 2.50pm
ఏషియన్ సత్యం - అమీర్‌పేట 10.40am
ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం 1.30pm
సినీ ప్లానెట్ - కొంపల్లి 4.25pm
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 4.25pm
ఏషియన్ రాధిక - కాప్రా 1.35pm
ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్ 1.35pm
ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 7.35pm
శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 1.30pm
సినిమాస్ - బాలానగర్ 10.50pm
సినిమాస్ - చందానగర్ 10.50pm
లక్ష్మీనరసింహ - మియాపూర్ 5.00pm
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి 4.40pm
విజయలక్ష్మి - ఎల్బీనగర్ 11.00,4.30
టివోలి - సికింద్రాబాద్ 11.00am
జిపిఆర్ - కూకట్‌పల్లి 1.30pm
మూవీటైమ్ - అమీర్‌పేట 10.00pm
మూవీమ్యాక్స్ - మౌలాలి 6.30pm
జె.పి.సినిమాస్ - చందానగర్ 10.35,4.30

లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట 11.30pm
తాక్భూరి - ఇసిఐఎల్ 11.00,2.15,6.15,9.15
శ్రీరమణ 70ఎంఎం - అంబర్‌పేట 11.00,2.00,6.00,9.00
శ్రీకృష్ణ 70ఎంఎం - అలియాబాద్ 11.00,2.00,6.00,9.00
SV సినీప్లెక్స్ 70 - పటాన్‌చెరు 11.00,2.00,6.00,9.00
వెంకటరమణ పద్మావతి 70ఎంఎం - కాచిగూడ 11.30 AM
సాయిపూజ 70ఎంఎం - సూరారం 11.00,2.00,6.00,9.00
లక్ష్మి 70 - శంషాబాద్ 11.30,2.30,6.00,9.00
సంతోష్ - ఇబ్రహీంపట్నం 11.00,2.00,6.00,9.00
వెంకటసాయి 70 - కీసర 11.00,2.00,6.00,9.00
సర్దకి 70 - అల్వాల్ 11.30,2.30,6.00,9.00
మహేశ్వరి - మహేశ్వరం 11.00,2.00,6.00,9.00
వెంకటేశ్వర 70 - గుమ్మడిదల 11.00,2.00,6.00,9.00
రామకృష్ణ 70 ఎంఎం ఎ/సి - అబిడ్స్ 11.30,2.30
ఆరాధన - తార్నాక 11.00,2.00,9.00

వెంకటరామ - వరంగల్ | ఎస్2 - వరంగల్ | సాయిరాం ఎ/సి - ఖమ్మం | ప్రతిమ - కరీంనగర్ | శివ 70ఎంఎం - కరీంనగర్ | శ్రీనివాస 70 - కరీంనగర్ | గీతా - నిజామాబాద్ | తిరుమల - సూర్యాపేట | వేణుమాల్ - నిజామాబాద్ | పివిఆర్ సినిమాస్ - ఆర్మూర్ | శ్రీనివాస - మహబూబ్‌నగర్ | శ్రీదేవి మాల్ - హన్మకొండ | అశోక 70 - హన్మకొండ | మల్టీప్లెక్స్ - గద్వాల్ | పార్థసారథి - కల్వకుర్తి | విజయభాస్కర్ - భద్రాచలం | బిహెచ్ఈఆర్ 70 - కోదాడ | రంగ 70 ఎంఎం - కోదాడ | శాంతి 70 ఎ/సి - పాల్వంచ | లక్ష్మి 70 - మహబూబాబాద్ | వెంకటేశ్వర 70 - దేవరకొండ | లక్ష్మీశ్రీనివాస - ములుగు | మహేశ్వర 70 - కొత్తగూడెం | బాలాజీ 70 - ములుగు | ఊర్వశి 70 - భూపాలపల్లి | బృందావన్ 70 - ఆర్మూర్ | భవాని 70ఎంఎం - కాజీపేట | శాంతి 70ఎంఎం - నర్సాపూర్ | పిక్చర్‌ప్యాలెస్ - ఆసిఫాబాద్ | సీతారామ 70 - ఇల్లందు | శ్రీకృష్ణ 70 - అలియాబాద్ | వెంకటేశ్వర - తిరుమలగిరి | శ్రీనివాస ఎ/సి - మిర్యాలగూడ | తిరుమల ఎ/సి - నల్గొండ | ప్రియా డీలక్స్ - కామారెడ్డి | ఊర్వశి 70 - గోదావరిఖని | సాయిబాబా 70 - షాద్‌నగర్ | లక్ష్మి 70ఎంఎం - ఆందూర్ | మహేశ్వరి - జహీరాబాద్ | మహేశ్వరి - సదాశివపేట | శ్రీనివాస ఎ/సి - సిద్దిపేట | సీతారామ - మణుగూరు | శాంతి 70 - నర్సాపూర్ | లక్ష్మీశ్రీనివాస 70 - మధిర | లక్ష్మీశ్రీనివాస - అశ్వరావుపేట | బాలాజీ 70 - సత్తుపల్లి | స్వప్న క.మం - జనగాం | కాకతీయ 70 - పరకాల | నటరాజ్ ఎ/సి - సిరిసిల్ల | నటరాజ్ - ఆదిలాబాద్ | శ్రీరామ ఎ/సి - జగిత్యాల | శ్రీనివాస 70 - జడ్చర్ల | వెంకటేశ్వర ఎ/సి - వనపర్తి | వెంకటరమణ - సిర్పూర్ కాగజ్‌నగర్ | అన్నపూర్ణ 70 - జమ్మికుంట | శివసాయి 70 ఎ/సి - బీదర్ | రామకృష్ణ ఎ/సి - తొర్రూర్ | వెంకటేశ్వర - మంచిర్యాల | కమల 70ఎంఎం - భైంసా | మహాలక్ష్మి - లక్సెట్టిపేట | లక్ష్మీశ్రీనివాస - మధిర | శ్రీనివాస - హుజూర్‌నగర్ | శ్రీనివాస - ఆమనగల్ | సీతారామ - సంగారెడ్డి | తిరుమల 70 - గజ్వేల్ | మిట్రోస్ 70 - మిర్యాలగూడ | అంజిరెడ్డి 70 - చౌటుప్పల్ | భద్రాద్రి 70ఎంఎం - భువనగిరి | మినీ - రాయచూర్ | పూర్ణిమ - రాయచూర్ | కనకదుర్గ 70 - గంగావతి | శరణబసవేశ్వర - సింధనూర్ | లక్ష్మి 70 ఎంఎం - కల్వకుర్తి | మల్లికార్జున 70 - మాన్వి

SRI VIJAYA FILMS

నేడే బ్రహ్మాండమైన విడుదల



సప్తగిరి 70 ఎంఎం- ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.00,2.00,6.00,9.00
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

SVC శ్రీలక్ష్మి/ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్ 11.30,2.30,6.30,9.30 | SVC శివశక్తి 70 ఎంఎం - కాప్రా 11.00,2.00,6.00,9.00

మెగా 70ఎంఎం - దిల్‌సుఖ్‌నగర్ 6.00,9.00
మల్లికార్జున 70 - కూకట్‌పల్లి 6.30,9.30
తాక్భూరి కాంప్లెక్స్ - ఇ.సి.ఐ.ఎల్ 11.00,6.00
లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్ 2.30,9.30
వెంకటరమణ పద్మావతి - కాచిగూడ
శ్రీ సాయిరాం 70 - మల్కాజ్‌గిరి 6.30,9.30
మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట 11.30,2.30
శ్రీదేవి 70 ఎ/సి - చిలకలగూడ 6.00,9.00
శ్రీ రమణ కాంప్లెక్స్ - అంబర్‌పేట 6.15,9.15
స్వప్న 70 ఎ/సి - కాటేదాన్ 11.00,6.00

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 9.15,11.55,8.10
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి 10.30,7.30
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 11.05,7.30
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 10.00,4.40,7.20,10.50
PVR ఆర్.కె. - బంజారాహిల్స్ 11.00,10.50
PVR ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్ 11.10,8.00
PVR గలేరియా - పంజాగుట్ట 11.05,4.30,11.00
PVR ఐకాన్ - హైటెక్‌సిటీ 2.20,10.50
PVR పివిఆర్ - ఎర్రమంజిల్ 11.00,8.00
PVR పివిఆర్ - ముసారాంబాగ్ 2.45,8.00
PVR ప్రెస్టీజ్ మాల్ - గచ్చిబౌలి 10.25,7.20
PVR అట్రియమ్ - గచ్చిబౌలి 11.35,7.30
PVR ఎస్2 నోమ - మల్లాపూర్ 4.40,10.40
INOX జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ 10.50,1.45,7.50
INOX ఎం.పి మాల్ - కాచిగూడ 10.00,4.30,10.50
INOX జిఎస్ఎమ్ - మదీనగూడ 10.30,7.30,10.30
INOX నెక్లెస్ సత్య - కవాడిగూడ 11.10,2.10,7.50
INOX అశోకా మాల్ - కూకట్‌పల్లి హై జంక్షన్ 11.10,2.10,7.50
మంజీరామాల్ - కూకట్‌పల్లి 2.40,7.50
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి 2.10,7.45
మంత్రామాల్ - అత్తాపూర్ 2.10,7.45
సుధా - శాలిబండ 2.40,7.55
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్ 2.10,7.45
ఏషియన్ సత్యం - అమీర్‌పేట్ 4.25,10.25
సినీమార్ట్ - ఆర్.సి.పురం 10.35,1.30,7.25
సినీ ప్లానెట్ - కొంపల్లి 4.15,10.35
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 1.45,7.15
ఏషియన్ రాధిక - కాప్రా 10.45,7.15
ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్ 10.45,7.35
ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 1.40,4.25,10.30
శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 4.50,10.50
సినిమాస్ - బాలానగర్ 1.50,7.50
సినిమాస్ - చందానగర్ 1.50,7.50
లక్ష్మీనరసింహ - మియాపూర్ 11.45,10.50
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి 7.50,10.50
జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి 7.30,10.30
మూవీటైమ్ - అమీర్‌పేట 10.00,1.30,7.30
ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి 10.00,2.30,8.00,10.45
స్కైమాల్ - సనత్‌నగర్ 1.15,7.15
టివోలి - సికింద్రాబాద్ 5.00,10.40
విజయలక్ష్మి - ఎల్.బి.నగర్ 1.50pm
శివగంగ - దిల్‌సుఖ్‌నగర్ 11.00,6.00
షా షహెన్‌షా - చింతల్ 11.30,6.30
లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్ 2.30,9.30
మూవీమ్యాక్స్ - మౌలాలి
జె.పి.సినిమాస్ - చందానగర్ 10.45,4.15,10.35

జెమిని కాంప్లెక్స్ - వరంగల్ | ఎస్2 70 - వరంగల్ | శ్రీదేవి ఎ/సి - హన్మకొండ | ఆదిత్య 70ఎంఎం - ఖమ్మం | ప్రతిమ ఎ/సి - కరీంనగర్ | సాయికృష్ణ ఎ/సి - కరీంనగర్ | శ్రీనివాస - కరీంనగర్ | వేణుమాల్ - నిజామాబాద్ | సినిమాస్ 70 - ఆర్మూర్ | తిరుమల - మహబూబ్‌నగర్ | పరమేశ్వరి ఎ/సి - షాద్‌నగర్ | మల్టీప్లెక్స్ ఎ/సి - గద్వాల్ | మిట్రోస్ సినీప్లెక్స్ - మిర్యాలగూడ | తిరుమల - సూర్యాపేట | విష్ణురాం సినిమాస్ - కోదాడ | జెమిని - మంచిర్యాల | వెంకటేశ్వర 70 - నల్గొండ | విష్ణురూప్ 70 - కొత్తగూడెం | కృష్ణ క.మం - జనగాం | నారాయణ 70ఎంఎం - నిర్మల్ | ఈశ్వర్ మల్టీమాల్ - సూర్యాపేట | వెంకటేశ్వర 70ఎంఎం - చొప్పదండి | పూరణ్ 70ఎంఎం - రాయచూర్

నేడే బ్రహ్మాండమైన విడుదల



లక్ష్మీకళ - మూసాపేట్ 11.30am
విజయలక్ష్మి - ఎల్.బి.నగర్ 4.40pm
లక్ష్మీనరసింహ - మియాపూర్ 2.45pm
టివోలి - సికింద్రాబాద్ 4.40pm

ఎ.ఎం.బి. - గచ్చిబౌలి 10.50am
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 5.00pm
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 8.50pm
PVR ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్ 2.25pm
PVR గలేరియా - పంజాగుట్ట 12.10pm
PVR ఐకాన్ - హైటెక్‌సిటీ 6.00pm
PVR పివిఆర్ - ఎర్రమంజిల్ 4.40pm
PVR పివిఆర్ - ముసారాంబాగ్ 1.50pm
PVR అట్రియమ్ - గచ్చిబౌలి 5.40pm
PVR ఎస్2 నోమ - మల్లాపూర్ 1.30pm
INOX జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ 2.00pm
INOX ఎం.పి మాల్ - కాచిగూడ 1.50pm
INOX జిఎస్ఎమ్ - మదీనగూడ 2.40pm
INOX నెక్లెస్ సత్య - కవాడిగూడ 12.10pm
INOX అశోకా మాల్ - కూకట్‌పల్లి హై జంక్షన్ 1.50pm
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి 3.05pm
మంత్రామాల్ - అత్తాపూర్ 5.40pm
సుధా - శాలిబండ 2.25pm
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్ 3.10pm
ఏషియన్ సత్యం - అమీర్‌పేట్ 1.55pm
సినీమార్ట్ - ఆర్.సి.పురం 1.45pm
సినీ ప్లానెట్ - కొంపల్లి 10.40am
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 1.50pm
ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్ 4.40pm
ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 10.45am
శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 2.20pm
సినిమాస్ - బాలానగర్ 8.15pm
సినిమాస్ - చందానగర్ 8.15pm
జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి 1.45pm
జె.పి.సినిమాస్ - చందానగర్ 7.30pm

నేడే బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 70 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00am
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

రామకృష్ణ 70ఎంఎం ఎ/సి - అబిడ్స్ 6.00,9.15

సత్యం - అమీర్‌పేట్ 1.35pm
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి 1.20pm
INOX జివికెమాల్ - బంజారాహిల్స్ 1.10pm
INOX ఎం.పి మాల్ - కాచిగూడ 1.40pm
INOX జిఎస్ఎమ్ - మదీనగూడ 4.30pm
INOX నెక్లెస్ సత్య - కవాడిగూడ 4.45pm
INOX అశోకా - కూకట్‌పల్లి హై జంక్షన్ 4.35pm
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 4.30pm
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 1.30pm
PVR ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్ 4.20pm
PVR గలేరియా - పంజాగుట్ట 4.50pm
PVR ఐకాన్ - హైటెక్‌సిటీ 1.35pm
PVR పివిఆర్ - ఎర్రమంజిల్ 4.20pm
PVR పివిఆర్ - ముసారాంబాగ్ 1.35pm
PVR ప్రెస్టీజ్‌మాల్ - గచ్చిబౌలి 4.40pm
PVR అట్రియమ్ - గచ్చిబౌలి 4.20pm
PVR ఎస్2 నోమ - మల్లాపూర్ 3.50pm
శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 3.40pm
సినిమాస్ - బాలానగర్ 3.40pm
సినిమాస్ - చందానగర్ 3.40pm
మంత్రామాల్ - అత్తాపూర్ 4.05pm
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్ 1.15pm
సినీ ప్లానెట్ - కొంపల్లి 4.30pm
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 10.45,7.25
రాధిక - కాప్రా 4.15pm
శివగంగ - దిల్‌సుఖ్‌నగర్ 2.30pm
జె.పి.సినిమాస్ - చందానగర్ 1.25,7.15
ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 10.20pm
లక్ష్మీకళ - మూసాపేట్ 6.15pm
సినీమార్ట్ - ఆర్.సి.పురం 4.15,10.35
ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్ 6.00pm
షా షహెన్‌షా - చింతల్ 6.15pm
జిపిఆర్ - కూకట్‌పల్లి 4.45pm

CONTACT NO: 6309706910

నేడే బ్రహ్మాండమైన విడుదల



రాజధాని 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.00am | తాక్భూరి - ఇసిఐఎల్ 6.00pm | శ్రీరమణ 70 - అంబర్‌పేట 11.00am

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 11.00am
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 5.25pm
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 1.10pm
PVR ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్ 5.20pm
PVR గలేరియా - పంజాగుట్ట 5.25pm
PVR ఐకాన్ - హైటెక్‌సిటీ 4.55pm
PVR పివిఆర్ - ఎర్రమంజిల్ 1.30pm
PVR పివిఆర్ - ముసారాంబాగ్ 5.00pm
PVR ప్రెస్టీజ్ మాల్ - గచ్చిబౌలి 1.55pm
PVR అట్రియమ్ - గచ్చిబౌలి 4.30pm
PVR ఎస్2 నోమ - మల్లాపూర్ 10.35pm
INOX జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ 2.40pm
INOX ఎం.పి మాల్ - కాచిగూడ 10.40pm
INOX జిఎస్ఎమ్ - మదీనగూడ 7.35pm
INOX నెక్లెస్ సత్య - కవాడిగూడ 1.00pm
INOX అశోకా మాల్ - కూకట్‌పల్లి హై జంక్షన్ 4.45pm
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి 5.10pm
మంత్రామాల్ - అత్తాపూర్ 1.25pm
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్ 5.05pm
ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం 4.25pm
సినీ ప్లానెట్ - కొంపల్లి 1.35pm
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 10.55am
ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్ 4.40pm
ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 7.15pm
శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 1.00pm
సినిమాస్ - బాలానగర్ 1.00pm
సినిమాస్ - చందానగర్ 1.00pm
జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి 1.15pm
మూవీటైమ్ - అమీర్‌పేట 2.00pm
టివోలి - సికింద్రాబాద్ 11.45am
విజయలక్ష్మి - ఎల్.బి.నగర్ 10.30pm
జె.పి.సినిమాస్ - చందానగర్ 1.35pm

PVR ఎస్2 సినిమాస్ - వరంగల్ | PVR వేణు మాల్ - నిజామాబాద్ | PVR జీవన్‌రెడ్డి మాల్ - ఆర్మూర్ | పూరణ్ సినిమాస్ - రాయచూర్

విజయవంతమైన 3వ వారం



అర్జున్ 70ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి 11.30,2.30,6.30,9.30 | కోణార్క్ 70ఎంఎం - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 2.40,8.10
ఏషియన్ సత్యం - అమీర్‌పేట్ 4.15pm
ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం 7.30pm
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 4.30pm
మూవీటైమ్ - అమీర్‌పేట 9.45pm
ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి 7.45pm
స్కైమాల్ - సనత్‌నగర్ 9.45pm
లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్ 2.45pm
మూవీమ్యాక్స్ - మౌలాలి 10.00pm
జె.పి.సినిమాస్ - చందానగర్ 1.25pm

GLOBAL CINEMAS LLP

A VI ANAND FANTASY
From the Director of

SUPER HIT నేడే చూడండి



సుదర్శన్ 35 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.15,6.00,9.15
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

SVC సంగీత 70 - ఆర్.సి.పురం 11.00,2.30,6.00,9.00 | SVC ఈశ్వర్ 70 - అత్తాపూర్ 11.00,2.15,6.00,9.15 | SVC శ్రీలక్ష్మి/ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్ 11.15,2.30,6.15,9.30
రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15 | శ్రీసాయిరాం - మల్కాజ్‌గిరి 11.15,2.30,6.15,9.45

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 2.30,10.30
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి 10.20,4.35,7.30,10.40
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 1.05,10.30
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 10.10,7.50,11.00
PVR ఆర్.కె. - బంజారాహిల్స్ 2.00pm
PVR ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్ 11.00,11.00
PVR గలేరియా - పంజాగుట్ట 11.05,8.00
PVR ఐకాన్ - హైటెక్‌సిటీ 11.20,7.50
PVR పివిఆర్ - ఎర్రమంజిల్ 11.00,11.00
PVR పివిఆర్ - ముసారాంబాగ్ 11.45,11.00
PVR ప్రెస్టీజ్ మాల్ - గచ్చిబౌలి 2.00pm
PVR అట్రియమ్ - గచ్చిబౌలి 11.20,10.30
PVR ఎస్2 నోమ - మల్లాపూర్ 7.40pm
INOX జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ 4.10,10.40
INOX ఎం.పి మాల్ - కాచిగూడ 2.00pm
INOX జిఎస్ఎమ్ - మదీనగూడ 5.00,10.30
INOX నెక్లెస్ సత్య - కవాడిగూడ 2.20,7.50
INOX అశోకా - కూకట్‌పల్లి హై జంక్షన్ 1.45,7.30
మంజీరా మాల్ - కూకట్‌పల్లి 4.30pm
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి 4.30pm
మంత్రామాల్ - అత్తాపూర్ 12.00,7.00
సుధా - శాలిబండ 4.25pm
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్ 12.00,10.40
సత్యం - అమీర్‌పేట్ 1.40,7.45,10.25
సినీమార్ట్ - ఆర్.సి.పురం 4.50,10.25
సినీ ప్లానెట్ - కొంపల్లి 1.35,7.35
సినీస్క్వేర్ - ఉప్పల్ 4.25,10.20
ఏషియన్ రాధిక - కాప్రా 4.40,10.35
ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్ 4.35,10.25
ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 1.40,7.35
శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 7.50pm
సినిమాస్ - బాలానగర్ 4.50pm
సినిమాస్ - చందానగర్ 4.50pm
లక్ష్మీనరసింహ - మియాపూర్ 1.40pm
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి 1.40pm
జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి 4.15,10.30
మూవీటైమ్ - అమీర్‌పేట 7.30pm
ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి 12.00,5.30
స్కైమాల్ - సనత్‌నగర్ 4.00pm
టివోలి - సికింద్రాబాద్ 7.40pm
విజయలక్ష్మి - ఎల్.బి.నగర్ 7.30,10.30
శివగంగ - దిల్‌సుఖ్‌నగర్ 2.00,9.15
షా షహెన్‌షా - చింతల్ 2.30,9.30
మూవీమ్యాక్స్ - మౌలాలి 10.30,1.30,4.30,7.30,10.30
జె.పి.సినిమాస్ - చందానగర్ 1.40,7.40

వరంగల్: మహాలక్ష్మి - స్టేషన్‌ఘన్‌పూర్ | ఏషియన్ మల్టీప్లెక్స్ - వేములవాడ | వెంకటేశ్వర - పరకాల | శ్రీలక్ష్మి ఎ/సి - తొర్రూర్ | మహేశ్వరరంగ - నర్సంపేట | సూర్య క.మం. - నెక్కొండ
ఖమ్మం: వెంకటేశ్వర - పాల్వంచ | యామిని ఎ/సి - వైరా | శ్రీదుర్గ - బోనకల్
సాయిబాబా - సత్తుపల్లి | లక్ష్మీ సినీప్లెక్స్ - కల్లూరు | వెంకటరమణ - కల్లూరు
కరీంనగర్: వెంకటేశ్వర - కోహెడ | శ్రీనివాస ఎ/సి - రాజారాంపల్లి | చంద్ర ఎ/సి - ధర్మపురి | రామకృష్ణ - ఎల్లారెడ్డిపేట | రాజశ్రీ సినిమా - రాయికల్ | VKM మల్టీప్లెక్స్ - హుస్నాబాద్ | శ్రీనివాస - చొప్పదండి
నిజామాబాద్: పరమేశ్వర - జక్రాన్‌పల్లి | సుదర్శన్ - భీంగల్ | వెంకటేశ్వర - పిట్లం | వెంకటేశ్వర - ధర్పల్లి
మహబూబ్‌నగర్: వెంకటేశ్వర - పెబ్బేరు | శ్రీనివాస - కల్వకుర్తి
నల్గొండ: లక్ష్మి ఎ/సి - మాల్
లక్ష్మి 70 - యాదగిరిగుట్ట | వెంకటేశ్వర - చండూరు | వెంకటరమణ - వేములపల్లి | సత్యనారాయణ - చండూర్ | విజయలక్ష్మి - నాంపల్లి | సుందరాం - పోచంపల్లి | తార సినిమా - మోత్కూర్ | పద్మావతి - హాలియా
ఆదిలాబాద్: రాఘవేంద్ర - జన్నారం
శ్రీనివాస - చెన్నూర్
మెదక్: సాయి డీలక్స్ - నర్సాపూర్ | వెంకటేశ్వర - నారాయణఖేడ్ | వెంకటేశ్వర - తూప్రాన్ | శ్రీనివాస - దుబ్బాక | లక్ష్మి - శంకరంపేట
రంగారెడ్డి: సాయిబాబా - శంకర్‌పల్లి



మార్చి 4 నుంచి ఎంబీఏ, ఎంసీఏ పరీక్షలు

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 22 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని రెగ్యులర్ ఎంబీఏ, ఎంసీఏ 2023-24 అకాడమిక్‌కు సంబంధించిన మొదటి సెమిస్టర్ పరీక్షలు మార్చి 4 నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, డాక్టర్ చాడ రాధికారెడ్డిలు గురువారం ప్రకటించారు. మార్చి 4, 6, 11, 13, 15 ఎంసీఏ పరీక్షలు అలాగే మార్చి 4, 6, 11, 13, 15, 18, 20 తేదీల్లో ఎంబీఏ పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని వెల్లడించారు. రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూమెంట్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాలని కోరారు.


సమ్మక్క ఆగమనంతో భక్త జనంతో హోరెత్తిన గద్దెల ప్రాంగణం

జంపన్నవాగులో జన ప్రవాహం

జంపన్నవాగు వద్ద ఇసుకేస్తే రాలనంత జనం వచ్చారు. బుధవారం సారలమ్మ గద్దెకు చేరుకోగా, గురువారం సమ్మక్క గద్దెకు రానుండడంతో భక్తులు తమ ఇష్టదైవాలైన సమ్మక్క, సారలమ్మను దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. శివసత్తులు జంపన్నవాగుల్లో యబ్బి అంటూ.. దేవుడు ఊగారు. భక్తులు వారి కష్టసుఖాలను చెప్పుకుంటూ శివసత్తుల ద్వారా తమ భవిష్యత్ ఎలా ఉంటుందోనని అడిగి తెలుసుకున్నారు. అయితే రెడ్డిగూడెం బొడ్రాయి నుంచి జంపన్నవాగు వరకు భారీ సంఖ్యలో భక్తుల తాకిడి ఉంది. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు కలుగజేసుకొని భక్తులను నియంత్రించడంతో ట్రాఫిక్ అంతరాయం లేకుండా భక్తులు సాఫీగా సాగి పోయారు.



శిగాలూగుతున్న వనం

- జనసంద్రమైన జంపన్నవాగు
- గద్దెపైకి సమ్మక్క రావడంతో జోరుగా మొక్కులు
- ప్రశాంతంగా ముగిసిన అద్వితీయ ఘట్టం
- పతాక స్థాయికి సంరంభం
- కిటకిటలాడిన తల్లుల గద్దెలు

మేడారం మహాజాతరకు పోటెత్తుతున్న భక్తులు


చిలకలగుట్ట వద్ద సమ్మక్క రాక కోసం చెట్టుపై నుంచి ఎదురు చూస్తున్న భక్తులు

మేడారం బృందం, ఫిబ్రవరి 22: మేడారం సమ్మక్క - సారలమ్మ జాతర భక్తిపారవశ్యంతో ఊగుతోంది. జాతర రెండో రోజు గురువారం మొక్కులు జోరుగా సాగుతున్నాయి. గురువారం రాత్రి సమ్మక్క ఆగమనంతో జాతర పతాకస్థాయికి చేరింది. తల్లిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో మేడారం జానారణ్యంగా మారింది. ప్రస్తుతం జాతరలో కోటి మందికి పైగా భక్తులు విడిది చేసి ఉన్నారు. బుధవారం సారలమ్మ గద్దె మీదికి చేరుకోవడంతో జాతరలో తొలిఘట్టం ప్రశాంతంగా ముగిసింది. గురువారం సమ్మక్క రాకతో ప్రధాన ఘట్టం కూడా విజయవంతంగా ముగిసింది. వనదేవతల కోసం వేయికళ్లతో ఎదురుచూస్తున్న భక్తులు దర్శనం కోసం క్యూలైన్లో బారులు తీరి నిల్చున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి, పొరుగు రాష్ట్రాల నుంచి ప్రవాహంలా తరలివచ్చారు. గురువారం భక్తుల రాక మరింత పెరిగింది. జాతరకు వెళ్లే రోడ్లన్నీ వాహనాలతో కిటకిటలాడుతున్నాయి. ఎటుచూసినా ఇసుకవేస్తేరాలనంత జనం.

సమ్మక్క ఆగమనంతో..

సమ్మక్క గురువారం రాత్రి గద్దెపైకి చేరుకోవడంతో జాతరలో ఓ అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. సాయంత్రం సుమారు 5 గంటలకు ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్య నేతృత్వంలో పూజారుల బృందం చిలుకల గుట్టకు బయలు దేరింది. క్రిష్ణయ్య ఒక్కరే తల్లి కుంకుమ భరిణె రూపాన్ని తీసుకొని కిందకు చేరుకున్నారు. ఎస్పీ శబరీష్ ఏకే 47 రైఫిల్‌తో నాలుగు రౌండ్ల కాల్పులు జరిపి గౌరవ వందనం చేశారు. రాత్రి 9.28 గంటలకు తల్లి గద్దె మీదకు చేరుకున్నది.

ప్రముఖుల రాక

మేడారాన్ని గురువారం పలువురు ప్రముఖులు సందర్శించారు. కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలు, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు తల్లులను దర్శించుకున్నారు. మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ మాలోతు కవిత తదితరులు మొక్కులు చెల్లించారు. శుక్రవారం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం వేముల రేవంత్ రెడ్డి తదితరులు మేడారానికి వస్తున్నారు. గురువారం నుంచి జాతరలో హెలికాప్టర్ సేవలు ప్రారంభమయ్యాయి.




జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు





చెరువులో పడి ఇద్దరి మృతి

- గేదెలకు నీరు తాపించేందుకు వెళ్లడంతో ఘటన
- రెండు కుటుంబాల్లో విషాదం
- కేసు నమోదు చేసిన పోలీసులు


అనిల్(ఫైల్) గోపాల్(ఫైల్)

ఐనవోలు, ఫిబ్రవరి 22: చెరువులో మునిగి ఇద్దరు మృతిచెందిన సంఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం గర్మిళ్లపల్లిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గబ్బెట బాబు, లక్ష్మిలకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు అనిల్(29), ఉన్నాడు. అనిల్ పదో తరగతి వరకు చదువుకుని కూలీ పనులు చేసుకుంటూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్నాడు.

రాంనగర్‌కు చెందిన బర్ల రాజు, రాధిక దంపతులకు శివ, గోపాల్(11) ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడైన గోపాల్ నందనంలో 7వ తరగతి చదువుతున్నాడు. మూడు రోజుల కిందట గర్మిళ్లపల్లిలోని మేనత్త ఇంటికి తల్లితో కలిసి వచ్చారు. అయితే గురువారం సాయంత్రం అనిల్, శివ, గోపాల్ ముగ్గురు కలిసి రెండు పాడిగేదెలకు నీటిని తాపించేందుకు రాయినిచెరువులోకి తోలుకెళ్లారు.. ఒక గేదెపై గోపాల్, శివ కూర్చోగా, మరో గేదెపై అనిల్ సరదాగా కూర్చున్నారు. గేదేలు నీటిలోకి కొద్ది దూరం వెళ్లిన అనంతరం గేదె నీటి గుంతలో పడడంతో గేదె మీద కూర్చున్న అన్నదమ్ములు చెరువులో పడిపోయారు. గోపాల్‌కు ఈత రాక నీటిలో మునిగిపోతుండగా మరో గేదెపై ఉన్న అనిల్ గోపాల్‌ను కాపాడేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో నీటిలో మునిగిపోతున్న గోపాల్, అనిల్‌ను భయంతో గట్టిగా పట్టుకోవడంతో నీటమునిగిన ఇద్దరు ఊపిరాడక మృతిచెందారు. గమనించిన శివ పరుగుపరుగున వెళ్లి గ్రామస్థులకు విషయాన్ని తెలపగా వారు వచ్చి చూసే సరికి ఇద్దరు మృతిచెందారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు జఫర్‌గడ్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


సంఘటన స్థలంలో రోదిస్తున్న కుటుంబసభ్యులు

జాతరను జాతీయ పండుగగా గుర్తించాలి

- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- ముల్కనూర్, కొత్తకొండలో మొక్కులు చెల్లింపు

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 22: కేంద్ర ప్రభుత్వం మేడారం జారతకు జాతీయ హోదా కల్పించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం మండలంలోని ముల్కనూర్, కొత్తకొండ గ్రామాల్లోని సమ్మక్క-సారలమ్మ తల్లులను మంత్రి పొన్నం దర్శించుకున్నారు. ముల్కనూర్‌లో 90కిలోల తన ఎత్తు బంగారాన్ని (బెల్లం) మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మేడారానికి జాతీయ హోదా కల్పించకుంటే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే జాతీయ హోదాను ప్రకటిస్తామన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు మేడారం జాతరకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి జాతరకు మహిళలు అధిక సంఖ్యలో వెళ్లి తల్లులకు మొక్కులు చెల్లించడానికి అవకాశం కల్పించామన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మేడారం జాతరకు వెళ్లే భక్తుల కోసం 6వేల బస్సులను నడిపిస్తున్నామన్నారు. వర్షాలు బాగా కురియాలని, పంటలు సమృద్ధిగా పండి రైతులకు న్యాయం జరగాలని మొక్కులు చెల్లించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీపీ బారి ముల్కనూర్, జాతర ఇన్‌చార్జి ఈవో కిషన్‌రావు, కొత్తకొండ జాతర చైర్మన్లు మాడ్గుల వీరస్వామి, పూదరి రవీందర్, మాజీ ఎంపీపీలు అశోక్‌ముఖర్జీ, కొడూరి సరోజన, ఆదరి రవీందర్, కొల్గూరు రాజు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చిట్టంపల్లి అయిలయ్య, కొత్తకొండ దేవస్థానం మాజీ చైర్మన్లు చంద్రశేఖర్‌గుప్తా, పిడిశెట్టి కనకయ్య, ఎంపీటీసీలు యాటపోలు రాజమణి, అప్పని పద్మ తదితరులు పాల్గొన్నారు.


ముల్కనూర్‌లో ఎత్తు బంగారంతో మొక్కులు చెల్లించేందుకు వస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

మహిళా పోలీసులు ఎంతో కీలకం

- రాష్ట్ర పోలీసు శాఖ ఆపరేషన్స్ అడిషనల్ డీజీపీ విజయ్‌కుమార్

మామునూరు, ఫిబ్రవరి 22 : రాష్ట్రంలో మహిళా పోలీసులకు తెలంగాణ ప్రభుత్వ సహకారం ప్రశంసనీయమని రాష్ట్ర పోలీసు శాఖ ఆపరేషన్స్ అడిషనల్ డీజీపీ విజయ్‌కుమార్ సూచించారు. వరంగల్ జిల్లా మామునూరు పోలీసు శిక్షణ కళాశాలలో గురువారం 834 మంది సివిల్ మహిళా పోలీసు కానిస్టేబుళ్లకు 9నెలల శిక్షణను విజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శిక్షణార్థులు తమ శక్తి సామర్థ్యాలతో పోలీసు ప్రతిష్టను పెంచాలన్నారు. ప్రజాసేవలో పోలీసుల పాత్ర ఎంతో ముఖ్యమైందన్నారు. కొత్తగా మహిళ పోలీసు కానిస్టేబుళ్లగా ఉద్యోగంలో చేరి తీసుకునే శిక్షణలో క్రమ శిక్షణతో వ్యవహరించాలన్నారు. కష్టపడి నిరంతరం ప్రజాసేవ చేయడమే ప్రధానంగా ఉండాలన్నారు. పోలీసు శాఖలో మహిళల సంఖ్య చాలా తక్కువగా ఉండేదని, 33శాతం మహిళా రిజర్వేషన్‌లతో వారి సంఖ్య పెరిగిందన్నారు. పోలీసు శాఖలో చేరి తమ ప్రతిభను చాటుతున్నారని విజయ్‌కుమార్

మిగతా 10వ పేజీలో..


మాట్లాడుతున్న ఏడీజీపీ విజయ్ కుమార్








కాజీపేట నుంచి భక్తులను తరలించేందుకు సిద్ధంగా ఉన్న హెలికాప్టర్

మేడారానికి హెలికాప్టర్ సేవలు

- 25 వరకు ప్రతీరోజు నాలుగు ట్రిప్పులు
- ఒక్కొక్కరికి అప్ అండ్ డౌన్ రూ.28,990

కాజీపేట, ఫిబ్రవరి 22: కాజీపేట సెయింట్ గ్యాబ్రియల్ స్కూల్ గ్రౌండ్ నుంచి మేడారానికి గురువారం నుంచి హెలికాప్టర్ సేవలు ప్రారంభమయ్యాయి. ఆరుగురు వ్యక్తులతో వెళ్లే ఈ హెలికాప్టర్ ప్రతీ రోజు నాలుగు ట్రిప్పులు నడుపుతుంది. ఇందులో ఒక్కొక్కరికి అప్‌అండ్‌డౌన్ రూ.28,999 చార్జీలు నిర్ణయించారు. ప్రతీరోజు ఉదయం 8.30, 10.30, మధ్యాహ్నం 1.50, 3.30 సమాయాల్లో అందుబాటులో ఉంటుంది. టిక్కెట్లు మాత్రం హెలీటాక్సీ డాట్ కామ్ అనే వెబ్‌సైట్‌లో మాత్రమే బుక్‌చేసుకోవాల్సి ఉంటుంది. ఈ హెలికాప్టర్ సేవలు ఈ నెల 22 నుంచి 25 వరకు కొనసాగనున్నాయి. బెంగళూరుకు చెందిన తుంబీ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ సేవలు అందిస్తోందని ఎయిర్‌లైన్స్ అధికారులు తెలిపారు. గత జాతరలో కూడా ఈ ఏజెన్సీయే సేవలు అందించిందని చెప్పారు. హెలిప్యాడ్ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ట

ఈ ఏడాదే గిరిజన యూనివర్సిటీ తరగతులు

- మేడారం జాతరకు జాతీయ హోదా సాధ్యం కాదు..
- కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి

వరంగల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ములుగులో సమ్మక్క-సారలమ్మ పేరుతో ఏర్పాటు చేస్తున్న కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలో ఈ ఏడాది నుంచే తరగతులు నిర్వహిస్తామని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. గురువారం ములుగు జిల్లా మేడారం మహాజాతరలో సమ్మక్క-సారలమ్మ తల్లులకు తులాభారం వేసి బంగారంతో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు.

ఇటీవలే ప్రధాని నరేంద్రమోదీ వనదేవతల పేరుతో ఈ యూనివర్సిటీని ఏర్పాటుచేసి ఈ యేడాది నుంచే తరగతులు నిర్వహించేలా ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. సుమారు రూ.900 కోట్లతో సమ్మక్క-సారలమ్మల సెంట్రల్ యూనివర్సిటీ నిర్మాణం జరుగుతోందని, అయితే తాత్కాలికంగా జాకారంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో తరగతులు నిర్వహిస్తామన్నారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో తరగతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది నుంచే తరగతులు జరిగేలా అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. మేడారం జాతరకు వచ్చే భక్తులకు ప్రధాని నరేంద్రమోదీ శుభాకాంక్షలు చెబుతూ.. యూనివర్సిటీ గురించి తనకు ఫోన్ చేసి ఆరా తీశారని తెలిపారు. ఇప్పటికే 337 ఎకరాల భూమియూనివర్సిటీకి సేకరించామని, మిగతా భూమి కూడా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరామన్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం ప్రధాని నరేంద్రమోదీ యూనివర్సిటీ తరగతుల భవనాలకు, క్యాంపస్ భవనాలకు శంకుస్థాపన చేస్తారని ఆయన స్పష్టం చేశారు. ఈ యూనివర్సిటీలో స్థానిక గిరిజన విద్యార్థులకు ఎక్కువ సీట్లు కేటాయిస్తామని


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు.

ఎయిర్‌పోర్టుల నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వం తప్పిదం ఏమీ లేదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. వరంగల్‌లోని మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కావాల్సిన భూమిని ఇవ్వాలని గత ముఖ్యమంత్రిని అనేకసార్లు కోరినప్పటికీ ఫలితంలేకుండా పోయిందన్నారు. భూవి ఇవ్వకపోవడం వల్లనే మామునూరులో ఎయిర్‌పోర్టు నిర్మాణం జరగలేదని, ప్రస్తుత కొత్త ముఖ్యమంత్రిని మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి భూమి కేటాయించాలని త్వరలో కలిసి కోరుతానని తెలిపారు. మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వలేమని, దేశంలో ఏ దేవాలయం, జాతర్లకు నేషనల్ ఫెస్టివల్ హోదా ఇవ్వలేదని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. రామప్ప తరహాలోనే మేడారం జాతరకు కూడా యునెస్కో గుర్తింపు వచ్చేలా దృష్టి సారిస్తామని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా కిషన్‌రెడ్డి తెలిపారు.

ఇప్పటికే దేశంలో 8 ప్రాంతాల్లోని కట్టడాలను వారసత్వ కట్టడాలుగా గుర్తింపు ఇవ్వాలని కోరుతూ.. యునెస్కోకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. మేడారం మహాజాతరను కూడా వారసత్వంగా వస్తున్న నేపథ్యంలో యునెస్కో గుర్తింపు కోసం ప్రతిపాదనలు పంపించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. వరంగల్‌లోని వేయిస్తంబాల ఆలయ కల్యాణ మండపం దాదాపు పూర్తి కావచ్చిందని తెలిపారు. ఈ నెలాఖరులోగా పనులు పూర్తి చేసి ప్రత్యేక పూజల అనంతరం కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జాయింట్ కలెక్టర్ శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క, సారలమ్మలకు మొక్కులు

మేడారం : మేడారం సమ్మక్క, సారలమ్మలను కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలు, పర్యాటక శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి గురువారం సందర్శించారు. కేంద్ర మంత్రి ఉదయం 11 గంటలకు ప్రత్యేక హెలీక్యాప్టర్ ద్వారా మేడారానికి చేరుకున్నారు. హెలీప్యాడ్ వద్ద మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) కిషన్ రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్ ఇతర ఉన్నతాధికారులు ఈ సందర్భంగా హాజరయ్యారు. అనంతరం కిషన్‌రెడ్డి తల్లుల గద్దె వద్ద తులాభారం ద్వారా నిలువెత్తు బంగారాన్ని సమర్పించారు. తల్లుల గద్దెల వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు కేంద్ర మంత్రికి పసుపు కుంకుమ బొట్టు పెట్టి, కందువా కప్పి సత్కరించారు.

బీఎస్ఎన్ఎల్ సేవలు భేష్

మేడారం బృందం : మేడారం మహాజాతరలో టెలికాం వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. కోటికి పైగా సిమ్‌లు జాతరలో ఉండటంలో మొబైల్ సర్వీసులకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. భక్తులు జాతరలో దిగిన ఫొటోలు వెంటనే సోషల్ మీడియాలో స్టేటస్‌లుగా షేర్ చేసుకోలేక పోతున్నారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ మొబైల్ వినియోగదారులకు మాత్రమే పూర్తి స్థాయిలో ఫోన్ కాల్స్ కలుస్తున్నాయి. మేడారం పరిసర ప్రాంతాల్లో ప్రైవేటు కంపెనీలు మొబైల్ టవర్లు ఏర్పాటు చేసినప్పటికీ బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ వ్యవస్థ విస్తృత స్థాయిలో ఉండటంతో వినియోగదారులు క్షేత్ర స్థాయిలో మొబైల్ కాల్స్, ఇంటర్‌నెట్ సేవలను వినియోగించుకుంటున్నారు.

భక్తుల సౌకర్యాల పరిశీలన


వైద్య సేవలను పరిశీలిస్తున్న స్పెషల్ అధికారులు

మేడారం, ఫిబ్రవరి 22: మేడారం మహాజాతరను పురస్కరించుకుని తరలివస్తున్న భక్త జనానికి రూ.105 కోట్ల నిధులతో ప్రభుత్వం సకల సౌకర్యాలను కల్పించింది. ఈ క్రమంలో జాతర నిర్వహణ కోసం ప్రభుత్వం స్పెషల్ అధికారులను నియమించింది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ జాతర నిర్వహణను కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం స్పెషల్ అధికారులు ఆర్వీ కర్ణన్, కృష్ణఆదిత్య భక్తుల దర్శనాలను, ఉచిత వైద్య సేవలను, పారిశుధ్య పనులను పరిశీలించారు. సంబంధిత అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు.

ప్రముఖుల ప్రత్యేక పూజలు



మేడారం, ఫిబ్రవరి 22 : మేడారం మహాజాతరను పురస్కరించుకొని వనదేవతల దర్శనానికి పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో తరలివచ్చి తల్లుల గద్దెలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ క్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యురాలు మాలోత్ కవిత, మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి సమ్మక్క, సారలమ్మ గద్దెలకు చేరుకొని పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయ, బెల్లం, చీరె సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పూజారులు తల్లుల ప్రసాదాలను అందజేసి కండువాలతో సన్మానించారు.

తల్లులకు తులాభారం సమర్పించిన మాజీ ఐఏఎస్

మేడారం మహాజాతర సందర్భంగా వనదేవతల దర్శనానికి ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించిన ప్రభాకర్‌రెడ్డి దంపతులు గురువారం వచ్చి నిలువెత్తు బంగారం(బెల్లం) సమర్పించారు. పూజారులు, అధికారులు ఆయనను ఘనంగా స్వాగతించి తల్లులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వనదేవతల ప్రసాదం అందజేసి కండువా కప్పి సన్మానించారు. అయితే ఆయన విధులు నిర్వహిస్తున్న సమయంలో జంపన్న వాగు జంట వంతెనలకు ప్రత్యేక రూపకల్పన చేశారని పలువురు ప్రశంసించారు.


తల్లుల సన్నిధిలో ఎమ్మెల్సీ సత్యవతి, ఎంపీ కవిత


పోలీసులు నెట్టివేయడంతో కిందపడిన భక్తులు


పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మహిళ

పోలీసుల అత్యుత్సాహం

- భక్తులను నెట్టేసి.. తమ కుటుంబీకులకు అనుమతి
- తీవ్ర స్థాయిలో మండిపడ్డ కరీంనగర్‌కు చెందిన ఓ భక్తురాలు

మేడారం బృందం, ఫిబ్రవరి 22: ఖాకీల ఓవర్ యాక్షన్ మళ్లీ షురువైంది. భక్తులకు బాసటగా నిలవాల్సిన పోలీసులు.. సామాన్య భక్తులపై తమ ప్రతాపాన్ని చూపారు. అయితే, తమ కుటుంబీకులు, బంధువులకు దర్శన భాగ్యం కలిగించేందుకు పోటీ పడ్డారు. ఈ ఘటన గురువారం గద్దెల ప్రాంగణంలోని దేవాదాయ శాఖ, మీడియా పాయింట్‌కు వెళ్లే దారిలో జరుగగా, ఓ ఎస్సైతో పాటు ట్రైనీ ఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్లు అతిగా ప్రవర్తించారు. మహిళలు, చిన్నపిల్లల పట్ల కఠినంగా వ్యవహరించారు. ఓ దఫాలో సామాన్య భక్తులందరిపై చేయి చేసుకొని నెట్టివేయడంతో కొంత మంది భక్తులు కింద పడిపోయారు. అయినప్పటికీ ఆగకుండా దుర్భాషలాడారు. దీంతో కరీంనగర్‌కు చెందిన ఓ మహిళా భక్తురాలు పోలీసుల తీరుపై మండిపడ్డారు. పోలీసులై ఉండి ఇలానే వ్యవహరిస్తారా.. అంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సుమారు 10 నిమిషాల పాటు సదరు మహిళా భక్తురాలికి, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం చేటు చేసుకుంది. మరోవైపు తమ కుటుంబసభ్యులు, తెలిసిన వారికి మాత్రం తల్లుల దర్శనానికి ఇబ్బందులు లేకుండా దగ్గరుండి చూసుకోవడం విమర్శలకు తావిస్తోంది. ఐడీ కార్డు కలిగిన వ్యక్తులను మినహా వారి వెంట ఏ ఒక్కరిని లోనికి అనుమతించకుండా కట్టడి చేసిన ఖాకీలు.. తమ వారిని మాత్రం సాఫీగా లోనికి పంపడం పట్ల పలువురు భక్తులు విస్మయం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు ఇలాంటి అధికారుల తీరు పట్ల దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

సమ్మక్క పూజారికి అస్వస్థత

- ఆస్పత్రికి తరలించిన రెస్క్యూ టీమ్


పూజారి వెంకటేష్‌కు చికిత్స అందిస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

మేడారం బృందం, ఫిబ్రవరి 22: మేడారం మహాజాతరలో కీలకంగా వ్యవహరించే సమ్మక్క తల్లి పూజారి సిద్దబోయిన వెంకటేష్ గురువారం అస్వస్థతకు గురయ్యారు. గద్దెల ప్రాంగణంలో సమక్క గద్దె వద్ద పూజల్లో నిమగ్నమైన ఆయన ఎండవేడిమి తట్టుకోలేక ఒక్కసారిగా కుప్పకూలాడు. ఆవెంటనే పక్కనే ఉన్న సింగరేణి రెస్క్యూ టీమ్ హుటాహుటిన చేరుకొని పూజారి వెంకటేష్‌ను స్ట్రెచ్చర్ ద్వారా పక్కనే ఉన్న 30 పడకల ఆస్పత్రికి తరలించారు. డీఎంహెచ్‌వో అప్పయ్య అక్కడికి చేరుకొని వెంకటేష్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని ప్రత్యేక చికిత్స అందించారు. కొద్దిసేపటికి తేరుకొని తిరిగి గద్దెల ప్రాంగణానికి వెళ్లారు.

భక్తులు ప్లాస్టిక్ వినియోగించవద్దు

- మేడారం జాతరలో కాలుష్య నియంత్రణకు చర్యలు
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిరక్షణలో భాగంగా మేడారం జాతరకు వస్తున్న భక్తులు ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువులను ఉపయోగించవద్దని రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ విజ్ఞప్తి చేశారు. మేడారం జాతరకు భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారని, ఈ కారణంగా నీటి కాలుష్యం, వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యం పెరుగుతున్నాయని తెలిపారు. జంపన్న వాగులో స్నానాలు, దుస్తులు ఉతకడం, జీవాలను కడగడం వంటివి చేయడం ద్వారా నీరు కలుషితం అవుతుందన్నారు. భక్తులు కట్టెల పొయ్యిలను వినియోగించడం, వాహనాల వల్ల వచ్చే కాలుష్యం, వాహనాల రాకపోకలతో వచ్చే దుమ్ము, ధూళి పెరగడంతో వాయు కాలుష్యం పెరుగుతుందన్నారు. వీటిని కొంత వరకైనా తగ్గించేందుకు పీసీబీ ఆధ్వర్యంలో పలు చర్యలు చేపట్టామని తెలిపారు. రోడ్డుపై నీరు చల్లడం ద్వారా దుమ్ము, ధూళి లేవకుండా చూస్తున్నారన్నారు. గద్దెల చుట్టూ సిమెంట్ రోడ్‌ను వేశారు. రోడ్డు ఉపరితలంపై కంకర వేసి చదును చేస్తున్నారు. మొక్కలు పెంచడం ద్వారా కొంతవరకు కాలుష్యాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. చిన్న వాహనాలను అనుమతించకుండా, భక్తులను బస్సుల్లో తరలిస్తున్నామని తెలిపారు. ఆలయానికి దూరంగా పార్కింగ్ ఏర్పాట్లతో పాటు భక్తులు కలపను వంటలకు వినియోగించకుండా చూస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా జాతరలో ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కార్యక్రమాలతో పాటు ప్లాస్టిక్‌ను తొలగించే ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

గుండెపోటుతో వృద్ధుడి మృతి

- మేడారం జంపన్నవాగు వద్ద ఘటన
- స్వస్థలం జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం


కొమురయ్య (ఫైల్)

మేడారం బృందం, ఫిబ్రవరి 22: మేడారం తల్లుల దర్శనానికి వచ్చిన ఓ భక్తుడు గురువారం జంపన్నవాగు వద్ద గుండెపోటుకు గురై మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, తోటి భక్తులు తెలిపిన ప్రకారం...జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొడవటూరు గ్రామానికి చెందిన చింతల కొమురయ్య (65) ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారానికి వచ్చాడు. ఈ క్రమంలో జంపన్నవాగులో స్నానం చేసేందుకు రాగా, స్వల్ప అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు 108కు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న 108 సిబ్బంది కొమురయ్యను పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు కొమురయ్య మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లినట్లు వైద్యులు తెలిపారు.

తులాభారమే ఉయ్యాల


తులాభారంలో పాపను ఆడిస్తున్న తల్లి

మేడారం గద్దెల ప్రాంతంలో ఓ బిడ్డ ఉపిరాడక ఉక్కిరిబిక్కిరి అయి ఏడ్చి గోల చేసింది. దీంతో ఆ తల్లి పక్కనే ఉన్న తులాభారంలో పడుకోబెట్టి అటూ ఇటూ ఊపుతూ జోలపాటపాడింది.దీంతో పాప నిద్రలోకి జారుకుంది. ఎత్తు బంగారానికి వినియోగించే తులాభారం ఆపాపకు ఊయల అవడం ఇక్కడ విశేషం.

- మేడారం బృందం



గద్దెల ప్రాంగణంలో సెల్ఫీల మోజు

మేడారంలో సెల్ఫీల మోజు ఎక్కువైంది. సెల్ఫీలు దిగి పోస్టు చేయడం ట్రెండ్‌గా మారింది. తల్లుల దర్శనం అనంతరం ఫ్రెండ్స్‌తో, ఫ్యామిలీతో సెల్ఫీలు దిగుతుండడంతో గద్దెల ప్రాంగణంతా భక్తులతో కిక్కిరిసిపోతోంది.

- మేడారం బృందం

ప్రకృతి ఒడిలో..

వనజాతరలో మూలాలను వెతుక్కుంటున్న మనిషి


సమ్మక్క సారలమ్మల గద్దెల వద్ద కిక్కిరిసిన భక్తులు

హనుమకొండ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర జనానికి ఒక ఆట విడుపు. అటు భక్తితో పాటు ఇటు రక్తిని కూడా పంచుతోంది. యాంత్రిక జీవనంతో విసిగి పోయిన మనిషికి మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర ఓ స్వాంతన. నాలుగు రోజుల పాటు దైనందిన జీవన ఒత్తిడుల నుంచి దూరంగా ఊరట పొందే ఒక తాత్కాలిక ఉపశమన వేదిక. నాగరిక జీవన యాత్రలో తనను తాను మరిచి పోయిన మనిషి తన మూలాలను వెతుక్కునే ఒక మజిలీ. మేడారం జాతర అంటే జనానికి ఎందుకింత ఉత్సాహం. తల్లులను దర్శించుకోవాలన్న తపన వెనుక ఒక భక్తిభావనేనా.. ఇంకేదైనా ఉందా? ప్రతీ రెండేళ్లకు ఒకసారి జరిగే ఈ జాతరకు రావాలని ప్రతి ఒక్కరూ ఎందుకు తహతహ లాడుతుంటారు? కుటుంబ సభ్యులతో కలిసి తల్లులను దర్శించుకొని మొక్కులను చెల్లించడంతో పాటు ఓ నాలుగు రోజులపాటు తనను తాను మరిచిపోయి ప్రకృతితో మమేకం కావాలన్న తపన. దట్టమైన అడవి మధ్యలో ప్రకృతిలో కాస్తంత సేద తీరాలన్న ఆకాంక్ష ఒక కారణం. మనిషి యాంత్రికజీవనంతో నిత్యం సతమత మవుతున్నాడు. చుట్టూ సమస్యలు. రకరకాల ఒత్తిళ్లు. వీటితో విసిగిపోతున్న మనిషి ప్రశాంతత, విశ్రాంతి కోసం వెంపర్లాడడం సహజం. ఇలాంటి వాతావరణం కాంక్రీట్ జంగిల్ లాంటి నగరాల్లో దుర్భిణి వేసి వెతికినా దొరకదు. నగరంలో దొరికే ఎంత ఖరీదైన వినోదమైన మనసుకు ప్రశాంతత నివ్వదు. తాను కోరుకున్న స్వాంతనను పొందలేడు. ఏదో అసంతృప్తి. ఇంకేదో కావాలన్న తపన. ఈ క్రమంలోనే మనిషి తన మూలాలను వెతుక్కునే ప్రయత్నంలో.. మేడారం జాతర ఒక వరంగా మారింది. అటు భక్తితో పాటు ఇటు రక్తిని పొందటానికి అనువైన ప్రాంతం.

పండు వెన్నెల్లో..

మేడారం అనగానే కోటిన్నర మందికి పైగా భక్తులతో నిండిన జాతర ఒక్కటే కాదు. వనదేవతలు కొలువుదీరిన తీర్థం మాత్రమే కాదు. మిగతా జాతరల కన్నా భిన్నం. అసలు జాతర అంటేనే జన సమూహం. ఈ సమూహంలో భాగస్వామి కావాలనుకునే మనిషి జీవన పరుగులో కోల్పోయిన సంబంధాలను తిరిగి కలుపుకునే ప్రయత్నం చేస్తాడు. మేడారం జాతరలో కూడా జరిగేది ఇదే. కోల్పోయిన తన మూలాలను వెతుక్కునే ఆరాటం కూడా కనిపిస్తుంది. ప్రకృతికి దగ్గర కావడం ద్వారా ఆత్మావలోకనం చేసుకునే మజిలీ మేడారం. మాఘ శుద్ధ పౌర్ణమి రోజుల్లోనే జరిగే ఈ జాతరలో నాలుగు రోజుల పాటు గడపడం ఒక అద్వితీయమైన అనుభూతి. పాలకుల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడి వీర మరణం పొందిన సమ్మక్క, సారలమ్మ వనదేవతల నుంచి జీవన గతిలోని సవాళ్లను ఎదుర్కొనే స్ఫూర్తిని పొందటంతో పాటు దట్టమైన అడవిలో పచ్చని చెట్ల మధ్య ప్రకృతి ఒడిలో నిండు పున్నమి వెన్నెల్లో సేద తీరడం ద్వారా పొందే అనుభూతి అద్వితీయం. మనసుకు కలిగే స్వాంతన అపురూపం. తల్లుల సన్నిధిలో ఈ నాలుగు రోజులు భక్తులు అన్నీ దైనందిన సమస్యలను మరిచిపోతారు. అమ్మల సేవలో తరిస్తారు. కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా గడుపుతారు. ధనిక, పేద అంతరాలు కానరావు. ఆదివాసీలతో కలిసి ప్రకృతితో మమేకమై గడిపే అవకాశం ఈ ఒక్క జాతరలోనే లభిస్తుంది. ఆదివాసీల ఆటవిక జీవన మాధుర్యాన్ని చవి చూడాలన్న తపన ఈ జాతరలో నాగరికుల్లో కనిపిస్తోంది. ఇక్కడ మనిషి స్వేచ్ఛా రెక్కలను కట్టుకొని హాయిగా ఎగరవచ్చు. సంతోషాన్ని పదుగురుతో పంచుకోవచ్చు. అందుకే మేడారం అంటే అంత మక్కువ.

మమ్మేలు తల్లీ.. శరణు.. శరణు..

5వ పేజీ తరువాయి

కొంత దూరం వెళ్లిన తర్వాత ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్య మినహా వెగతావారు మధ్యలోనే ఆగిపోయారు. క్రిష్ణయ్య ఒక్కరే గుట్ట పైభాగాన తల్లి స్థావరం వద్దకు వెళ్లారు. అక్కడ సుమారు రెండుమూడు గంటల పాటు రహస్య పూజలు నిర్వహించారు. ఆ తర్వాత క్రిష్ణయ్య తల్లి రూపాన్ని తీసుకొని మధ్యలో వేచి ఉన్న మిగతా పూజారులతో కలిసి గుట్ట కిందకు వచ్చారు. తల్లి రాకకోసం గుట్ట కింద మంత్రి సీతక్క, గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ శరత్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్, రాచకొండ సీపీ తరుణ్‌జోషి, ఓఎస్డీ అశోక్‌కుమార్, స్పెషలాఫీసర్లు కృష్ణ ఆదిత్య, ఆర్వీ కర్ణన్, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ భవేష్‌మిశ్రా, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్‌లు శ్రీజ, వేణుగోపాల్, ఐపీఎస్ అధికారులు సాయిచైతన్య, సుధీర్ కేకన్, సంకీర్త్, రూపేష్, అఖిల్ మహాజన్, ఇతర ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు వేలాది మంది భక్తులు ఉత్కంఠగా ఎదురు చూశారు.

తల్లి రాకను కనులారా వీక్షించేందుకు కొందరు భక్తులు చెట్లకొమ్మలపైకి ఎక్కి కూర్చున్నారు. సమ్మక్క తల్లి వచ్చే వరకు గుట్ట కింద ఆదివాసీ కళాకారులు డోలు వాయిద్యాలతో నృత్యాలు చేశారు. ఆదివాసీ యువకులు సైతం ఉత్సాహంగా చిందులు వేశారు. వీరితో మంత్రి సీతక్క పాదం కలిపారు. కోయ మహిళలతో కలిసి నృత్యం చేశారు. సమ్మక్క తల్లి వస్తున్న సంకేతం పూజారులు ఇవ్వగానే భక్తుల్లో భక్తి ఆవేశం ఒక్కసారిగా కట్టలు తెంచుకున్నది. జై సమ్మక్క.. అంటూ నినాదాలతో హోరెత్తించారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. పోలీసు బలగాలు తల్లిని తీసుకువస్తున్న పూజారులకు రక్షణ వలయంగా నిలుచున్నారు. తల్లిని దగ్గరగా చూసేందుకు భక్తులు ముందుకు చొచ్చుకురాకుండా రోప్‌పార్టీలు వారిని అడ్డుకున్నారు. 6.51గంటలకు మరోసారి సమ్మక్కతల్లికి గౌరవ సూచకంగా ములుగు ఎస్పీ శబరీష్ ఏకే 47 రైఫిల్‌తో నాలుగు రౌండ్లు గాలిలో కాల్పులు జరిపి వందనం సమర్పించారు. చిలుకల గుట్ట ప్రధాన ద్వారం వద్ద 7.07గంటలకు మూడు రౌండ్లు పేల్చి తల్లి వస్తున్నట్టుగా భక్తులకు సంకేతాలు పంపారు.

దారి పొడవునా..

పూజారులు సమ్మక్కను తోడ్కొని మేడారం గద్దెలవైపు వేగంగా కదిలారు. దారిమధ్యలో చెలపయ్య చెట్టు దగ్గర అమ్మవారికి జంతుబలి ఇచ్చిన అనంతరం ముందుకు కదిలారు. మార్గమధ్యలో మహిళలు బిందెలతో నీళ్లారపోశారు. మంగళహారతులు పట్టారు. పెద్దఎత్తున కోళ్లను, మేకలను బలి ఇచ్చారు. సమ్మక్క ప్రయాణించే మార్గాన్ని ముగ్గులతోఅందంగా అలంకరించారు. ఎటువంటి ఆటంకాలు కలగకుండా చూశారు. తరలివస్తున్న సమ్మక్కను దర్శించుకునేందుకు దారిపొడవునా వేలాదిమంది భక్తులు బారులు తీరి నిల్చున్నారు. పూజారులతో పాటు గద్దెల వరకు వెంటనడిచారు. సమ్మక్క రాక సందర్భంగా శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. తల్లి నామస్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. రాత్రి సుమారు 10 గంటలకు సమ్మక్క గద్దెకు చేరింది. పూజారులు తల్లిని గద్దెపై ప్రతిష్టించే సమయంలో భక్తుల దర్శనాలను కొద్దిసేపు నిలిపివేశారు. కరెంట్ సరఫరాను కూడా బంద్ చేశారు. సమ్మక్కను పూజారులు గద్దెపై నిలిపిన తర్వాత పది నిముషాల పాటు రహస్య పూజలు నిర్వహించి వెనుదిరిగిన తర్వాత విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఆ తర్వాత దర్శనాలు జోరందుకున్నాయి.

ప్రసాదం.. ప్రహసనం

- సమ్మక్క బెల్లం కోసం భక్తుల ఆరాటం
- అందరికీ అందేలా ఏర్పాట్లు చేయని అధికారులు

మేడారం, ఫిబ్రవరి 22 : సమ్మక్క.. సారక్క ప్రసాదముల్లో.. అనే పిలుపు గ్రామీణ ప్రాంతాల వారికి సుపరిచితం. వరాలిచ్చే తల్లులకు ఎత్తు బంగారం సమర్పించి తిరిగి చిటికెడు ప్రసాదాన్ని భక్తులు ఆశించడం సర్వసాధారణం. అయితే ఎంతో ప్రయాసలకోర్చి తాము తల్లులకు మొక్కులు అప్పగిస్తుంటే కాస్త ప్రసాదం(బెల్లం) తమకు అందడంలేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గద్దెలకు తాకిన చిటికెడు బెల్లాన్ని సొంతం చేసుకోవడం భక్తులు పోరాటం చేయాల్సివస్తోంది. ఈ క్రమంలో భక్తులు తీవ్ర నిరాశనిస్పృహలకు లోనవుతున్నారు. తొక్కిసలాటలో కొన్నిసార్లు గాయపడుతున్నారు. కొందరు అస్వస్థత చెందుతున్నారు. అయినా ఈ విషయంలో అధికారులు తగు చర్యలు తీసుకోవడంలేదు. ఎప్పటికప్పుడు భక్తులందరికీ సమ్మక్క బంగారం అందిస్తామని చెబుతున్న అధికారులు ఈసారి కూడా చేతులెత్తేయడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇనుప చువ్వల మధ్య బందీగా..

ఒకప్పుడు వన దేవతల గద్దెలు ఆరుబయటనే ఉండేవి. దర్శనానికి వచ్చిన భక్తులు నేరుగా గద్దెలపైకి వెళ్లి బండారి కర్ర స్తంభాన్ని గుండెలకు హత్తుకొని మొక్కు తీర్చుకునేవారు. ఎత్తుబంగారం(బెల్లం), కొబ్బరి కాయలను సమర్పించేవారు. తల్లులను తాకిన బంగారం, కొబ్బరి ముక్కలను తీసుకెళ్లేవారు. అయితే క్రమేపీ భక్తుల రద్దీ పెరగడంతో పరిస్థితి మారిపోతోంది. గద్దెలచుట్టూ ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేశారు. సాధారణ రోజుల్లో మినహాయించి మహాజాతర వారం ముందు నుంచే గద్దెలపైకి భక్తులు వెళ్లకుండా గేటు వేస్తున్నారు. తొక్కిసలాట జరగకుండా భక్తులను నియంత్రించడంలో ఈ చర్య ఆమోదయోగ్యమైనప్పటికీ దేశ నలుమూలల నుంచి ఇంత దూరం వచ్చి తల్లుల గద్దెలను తనివితీరా స్పృశించలేకపోయామనే ఆవేదన భక్తులను వేధిస్తోంది. మొక్కు బెల్లాన్ని గద్దెలకు సమర్పించే సమయంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చేసేదేమిలేక తమ



సమ్మక్కప్రసాదం భక్తులకు అందించేందుకు

మొక్కు బెల్లం (బంగారాన్ని) గద్దెల పైకి విసిరేస్తున్నారు. దీంతో లోపల ఉన్నవారు గాయపడుతున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి..

సమ్మక్క ప్రసాదం భక్తులకు అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు. అధికారులు పక్కా ప్రణాళికతో వ్యవహరిస్తే ఇది అసాధ్యమేమీ కాదని అభిప్రాయపడుతున్నారు. తల్లుల దర్శనం తర్వాత బయటకు వెళ్లే మార్గాల్లో క్యూలైన్ పక్కనే ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసి వలంటీర్ల చేత భక్తులకు అందించాలని అంటున్నారు. లేదంటే జాతరలో ఎంపికచేసిన ప్రదేశాల్లో ప్రత్యేక కౌంటర్‌లను ఏర్పాటు చేసి పంపిణీ చేయాలని కోరుతున్నారు.

గద్దెల శుద్ధి పేరిట కానుకలు మాయం..?

గద్దెలపై భక్తులు సమర్పించే బంగారం(బెల్లం) తొలగించి శుద్ధిచేసే కాంట్రాక్టు పొందిన వ్యక్తులు పనిలోపనిగా విలువైన కానుకలను మాయం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు భక్తులు తల్లులకు మొక్కుగా చిన్నచిన్న బంగారు, వెండి ఆభరణాలు, డబ్బులను కొత్త గుడ్డలో కట్టి గద్దెలపైకి విసిరేస్తారు. ఇవి బెల్లానికి అతుక్కుపోతాయి. ఎప్పటికప్పుడు గద్దెలపై నుంచి బెల్లాన్ని తొలగించే క్రమంలో ఈ కానుకలు అనేకం చాటుమాటుగా బయటకు వెళ్తున్నాయి. ఇలా సేకరించిన బెల్లానికి అంటుకొని వచ్చిన విలువైన కానుకలను కాంట్రాక్టర్లు జేబులో వేసుకుంటున్నారని, ఈ దందాపై అధికారులు ఓ కన్నేసి ఉంచాలని భక్తులు కోరుతున్నారు.

ప్రసాదం కావాలంటే ముడుపులు ఇవ్వాల్సిందే..

గద్దెల ప్రాంగణంలో భక్తులు తల్లులకు బంగారం (బెల్లం) సమర్పించిన తరువాత తిరిగి ప్రసాదం అందుకోవడానికి భక్తులు ముడుపులు చెల్లించాల్సివస్తోంది. కాస్త ప్రసాదం కావాలంటే అక్కడ పని చేసే సిబ్బందికి రూ.10 నుంచి 50 ఇస్తేనే వారు కాస్త ప్రసాదం చేతికిస్తున్నారు. లేదంటే ఎంతసేపైనా అలగే నిలబెడుతున్నారు. ఎంతో భక్తి శ్రద్ధలతో తాము మొక్కులు చెల్లించుకొని చిటికెడు ప్రసాదం కావాలంటే సిబ్బంది డబ్బులు అడగటం బాధ కల్గిస్తోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రెడ్డిగూడెం నుంచి జంపన్నవాగుకు వెళ్లే దారిలో భక్తుల రద్దీ

ఇసుకేస్తే రాలని జనం

మేడారం బృందం, ఫిబ్రవరి 22: తెలంగాణ కుంభమేళా మేడారం మహాజాతరలో గురువారం జంపన్నవాగు వద్ద ఇసుకేస్తే రాలనంత జనం వచ్చారు. బుధవారం సారలమ్మ గద్దెకు చేరుకోగా, గురువారం సమ్మక్క గద్దెకు రానుంది. దీంతో భక్తులు తమ ఇష్టదైవాలైన సమ్మక్క, సారలమ్మను దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అయితే రెడ్డిగూడెం బొడ్రాయి నుంచి జంపన్నవాగు వరకు భారీ సంఖ్యలో భక్తుల తాకిడి ఉంది. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు కలుగజేసుకొని భక్తులను నియంత్రించడంతో ట్రాఫిక్ అంతరాయం లేకుండా భక్తులు సాఫీగా సాగిపోయారు.

కిక్కిరిసిన వైద్యశాల

- ఒకే రోజు 39,027 మందికి వైద్యసేవలు



మేడారంలో రోగులతో నిండిపోయిన 30 పడకల ఆస్పత్రి

మేడారం బృందం, ఫిబ్రవరి 22: మేడారం జాతరలో భక్తులకు వైద్య సేవలు అందించేందుకు గాను ఏర్పాటు చేసిన వైద్యశాల కిక్కిరిసి పోయింది. జాతరకు వచ్చిన భక్తులు వివిధ కారణాలతో ఆస్పత్రిలో చేరుతున్నారు. ప్రధానంగా వాంతులు, విరోచనాలు, జ్వరం, ఆయాసం, గుండెనొప్పి ఇతరత్రా కారణాలతో ఆస్పత్రిలో చేరుతుండగా వైద్య సేవలు అందిస్తున్నారు. గురువారం ఒక్కరోజే 39,027 మందికి వైద్య సేవలు అందించినట్లు వైద్యాధికారులు వెల్లడించారు. శ్వాస ఇబ్బందులతో 2,434 మంది, గాయపడిన వారు 2,296 మంది, జ్వర బాధితులు 964 మంది, తేలు కాటుకు గురైన 68 మందికి వైద్య సేవలు అందించినట్లు ములుగు, భూపాలపల్లి డీఎంహెచ్‌వోలు అప్పయ్య, మధుసూదన్ తెలిపారు.

30 పడకలతో ఇబ్బందులు..

గద్దెల ప్రాంగణం సమీపంలో ఐటీడీఏ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన వైద్యశాలలో 30 పడకలు మాత్రమే ఏర్పాటు చేయడంతో చాలా మందికి సరైన వైద్య సేవలందక ఇబ్బందులు పడ్డారు. మరోవైపు అత్యవసరం నిమిత్తం ఆస్పత్రికి వచ్చే వారికి సకాలంలో వైద్యం అందించడంలో వైద్యాధికారులు అలసత్వం వహిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఆస్పత్రికి వచ్చిన కొద్దిసేపటికి అధికారులు స్పందించి తీరిగ్గా చికిత్స అందిస్తుండటం పట్ల భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆపద సమయంలో ఆస్పత్రికి వచ్చే వారికి వెనువెంటనే చికిత్స అందించేలా ఉన్నతాధికారులు చొరవ చూపాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

జంపన్నవాగుల్లో యబ్బి



జంపన్నవాగులో శిగమూగుతున్న శివసత్తి

మేడారం బృందం, ఫిబ్రవరి 22: మేడారం మహాజాతరలో సమ్మక్క, సారలమ్మను దర్శించుకునే ముందు జంపన్నవాగులో భక్తులు పుణ్య స్నానమాచరించడం ఆనవాయితీ. గురువారం శివసత్తులు జంపన్నవాగుల్లో యబ్బి అంటూ.. దేవుడు ఊగారు. భక్తులు వారి కష్టసుఖాలను చెప్పుకుంటూ శివసత్తుల ద్వారా తమ భవిష్యత్ ఎలా ఉంటుందోనని అడిగి తెలుసుకున్నారు.

నిద్ర సుఖమెరుగదు..

మేడారం బృందం, ఫిబ్రవరి 22: ఆకలి రుచి ఎరుగదు.. నిద్ర సుఖమెరుగదు.. అనే నానుడిని నిజం చేస్తూ ఓ భక్తుడు ఇలా నిద్రపోతూ కనిపించాడు. గురువారం మేడారంలోని జంపన్నవాగు సమీపంలో మధ్యాహ్నం ఎండ, నీడ అనే తేడా లేకుండా ఆదమరిచి ఓ వ్యక్తి నిద్రిస్తున్నాడు. అక్కడికి వచ్చిన భక్తులు ఆశ్చర్యంగా చూడటం కనిపించింది.



జంపన్నవాగు ఒడ్డుకు ఆదమరిచి నిద్రిస్తున్న భక్తుడు

6 లక్షలు దాటిన ఆర్టీసీ ప్రయాణికులు

మేడారం బృందం, ఫిబ్రవరి 22: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు మేడారానికి పోటెత్తుతున్నారు. మేడారం జాతర తుది అంకానికి చేరుకుంటుండటంతో తల్లులకు మొక్కులు చెల్లించేందుకు భక్తులు పెద్ద ఎత్తున ఆర్టీసీ బస్సుల్లో తరలి వస్తున్నారు. ఆర్టీసీ అధికారుల లెక్కల ప్రకారం ఈ నెల 18వ తేదీ నుంచి ఇప్పటి వరకు సుమారు 6 లక్షల మంది భక్తులు బస్సుల్లో ప్రయాణించిట్లు సమాచారం. దాదాపు 4వేల బస్సులను రాష్ట్ర వ్యాప్తంగా మేడారంకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అధికారులు ఇప్పటి వరకు 9,500 పైచిలుకు ట్రిప్పులను నడిపారు. శుక్ర, శనివారం సమ్మక్క, సారలమ్మలు భక్తులకు పూర్తి స్థాయిలో దర్శనం ఇవ్వనున్న నేపథ్యంలో ఈ రెండు రోజులు ఆర్టీసీకి మరింత కీలకం కానున్నాయి.



సమ్మక్క గద్దెల వద్ద భక్తజనం (విహంగ వీక్షణం)

అణువణువునా పోలీసు నిఘా



గద్దెల ప్రాంగణంలో అనుమానితులను విచారిస్తున్న సీసీఎస్ పోలీసులు

మేడారం బృందం, ఫిబ్రవరి 22: మేడారం మహాజాతరలో సీసీఎస్ పోలీసులు గట్టి నిఘా పెట్టారు. 15 మందితో కూడిన బృందం గద్దెల ప్రాంగణంలో డేగకళ్లతో పరిశీలిస్తున్నారు. భక్తుల మధ్య సివిల్ డ్రెస్‌లో అనుమానితులను అదుపులోకి తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు 65 మందిని అదుపులోకి తీసుకొని మేడారం పీఎస్‌కు తరలించారు. విచారించిన తరువాత వారి ఫింగర్ ప్రింట్ ఆధారంగా వారిపై ఉన్న కేసులను గుర్తిస్తున్నారు. అంతేకాకుండా పట్టుబడిన వారి వద్ద లభించిన ఆధారాలు, డబ్బుల ఆధారంగా లోతుగా దర్యాప్తు చేసి కూపీ లాగుతున్నారు. గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తులు అయితే తాడ్వాయి, ములుగు పీఎస్‌కు తరలిస్తున్నారు. జాతరలో దొంగతనాలు చేస్తున్న వారు చిరువ్యాపారులుగా, పారిశుధ్య కార్మికుల రూపంలో మనీ పర్సులు, ఆభరణాలు, మూటల, సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. జాతర మొత్తంలో 230 మంది సీసీఎస్ పోలీస్‌లు విధులు నిర్వహిస్తూ దొంగతనాలను అరికడుతున్నారని సీసీఎస్ డీఎస్పీ సుభాష్ తెలిపారు. ప్రధానంగా సీసీ బృందంలో ఒక డీఎస్పీ ఇద్దరు ఇన్‌స్పెక్టర్లతో పాటు 18 మంది ఎస్సైలు, సీసీఎస్ సిబ్బంది ఉన్నారు.

వనం వచ్చె.. సంబరం తెచ్చె..

మేడారం, ఫిబ్రవరి 22: మేడారం మహాజాతరను పురస్కరించుకుని ప్రధాన ఘట్టమైన సమ్మక్క రాకకు ముందు సమ్మక్క పూజారులు గద్దెకు వనం(వెదురు లంక) తెచ్చి మేడారంలో గురువారం సంబరం తెచ్చారు. సమ్మక్క పూజారులు నియమ నిష్టలతో ఉదయం నిద్రలేచి, ఇళ్లు, వాకిలి, గుడి గద్దెలు శుద్ధి చేసుకుని దీపదూప నైవేద్యాలు సమర్పించి డోలు వాయిద్యాలతో అడవికి వెళ్లి వనాన్ని తీసుకువచ్చారు. సమ్మక్క గుడికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి, దూపదీప నైవేద్యాలతో హారతులు ఇచ్చి వనం భుజాన మోస్తూ ఊరేగింపుగా గద్దె వద్దకు తరలివచ్చారు. ఈ క్రమంలో భక్తులు, ఆదివాసీలు, గ్రామస్తులు వనానికి నీళ్లారబోస్తూ నీరాజనాలు పలికారు. గద్దెలకు చేరుకుని పక్కనే ఉన్న రహస్య పూజా మందిరంలో వేపచెట్టు వద్ద పూజలు చేసి సమ్మక్క గద్దెపై వనాన్ని (వెదురు లంక)ను నిలిపారు. అనంతరం నాగులమ్మ పూజా మందిరంలో దూపదీప నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. దీనితో మేడారంలో సమ్మక్క తల్లి రాకకు ముందు సంబరాలు మొదలయ్యాయి.



గద్దెలపైకి వనం(వెదురు లంక)ను తీసుకొస్తున్న సమ్మక్క పూజారులు



భక్తుల సేవలో రెస్క్యూ టీం



మేడారం బృందం, ఫిబ్రవరి 22: మేడారం గద్దెల ప్రాంగణంలో 2 రెస్క్యూ టీంలు సేవలు అందిస్తున్నాయి. ఒక్కో బృందంలో 12 మంది ఉన్నారు. గురువారం కంకవనాన్ని గద్దెల పైకి తెచ్చే క్రమంలో సమ్మక్క పూజారి వెంకటేష్ అస్వస్థత చెందగా రెస్క్యూ టీం వెంటనే పూజారికి అక్సిజన్ అందించి పక్కనే ఉన్న తాత్కలిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అంతేగాకుండా గద్దెల ప్రాంగణంతో పాటు జాతర వ్యాప్తంగా మొబైల్ సేవలు అందిస్తున్నారు.

మాస్కుల పంపిణీ



మేడారం, ఫిబ్రవరి 22: మేడారం మహాజాతర సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం భక్తులకు మాస్కులను ఉచితంగా పంపిణీ చేశారు. సుమారు 10 లక్షలకు పైగా మాస్కులను భక్తులకు అందించనున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య తెలిపారు. జాతరకు వచ్చే భక్తులు తప్పకుండా మాస్కులు ధరించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన సూచించారు.

తలనీలాలు సమర్పణ



మేడారం బృందం, ఫిబ్రవరి 22: కోరిన కోర్కెలు నెరవేర్చాలని, నెరవేరిన భక్తులు సమ్మక్క, సారలమ్మ వనదేవతలకు తలనీలాలు సమర్పిస్తున్నారు. జంపన్నవాగు వద్ద ఏర్పాటు చేసిన కరకట్టల వద్ద వందలాది మంది క్షురకులు గుండ్లు గీస్తుంటే వేలాది మంది భక్తులు తమ మొక్కులను చెల్లించుకుంటున్నారు. తలనీలాల సమర్పణ అనంతరం జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి తల్లులను దర్శించుకుంటున్నారు.

చార్జింగ్ కార్లు...

మేడారం, ఫిబ్రవరి 22: మహాజాతరలో దివ్యాంగులు, వృద్ధుల కోసం చార్జింగ్ బ్యాటరీ కార్ల వినియోగాన్ని దేవాదాయ, .ధర్మాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ప్రారంభించారు. వృద్ధులు, దివ్యాంగులు అధికంగా వస్తున్న నేపథ్యంలో ఈ అత్యవసర సేవలను వినియోగంలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కారు పనితీరును పరిశీలించి ట్రయల్ రన్ వేశారు. జాతరలో నడవలేని వృద్ధులు, దివ్యాంగులను తల్లుల వద్దకు తీసుకువెళ్లేలా ఈ వాహనాలు ఉపయోగ పడుతాయని పేర్కొన్నారు. ఈ ఉచిత సేవలను భక్తులు వినియోగించుకోవాలని సూచించారు.



సాధారణ దర్శనమే మేలు..



మేడారం, ఫిబ్రవరి 22: మహాజాతర నిర్వహణలో భాగంగా దేవాదాయ శాఖ వీవీఐపీ దర్శనాలను ఏర్పాటు చేసింది. అయితే గతం కంటే భిన్నంగా ఈసారి ఎక్కువ మొత్తంలో వీవీఐపీ పాస్‌లు ఇవ్వడంతో వీవీఐపీ క్యూలైన్ సాధారణ క్యూలైన్‌గా దర్శనమిచ్చింది. సాధారణ దర్శనం సాఫీగా జరిగి ప్రత్యేక దర్శనాలు మాత్రం రద్దీగా కనిపించాయి. దీంతో పైరవీలు, పరిచయాలు, వీఐపీలు, వీవీఐపీల పేర్లతో వచ్చిన భక్తులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో ప్రత్యేక దర్శనం కంటే సాధారణ దర్శనమే మేలని భక్తులు చర్చించుకున్నారు.

తప్పిపోకుండా ఆనవాళ్లు



కర్రకు జెండా కట్టి ఒకరి వెంట ఒకరు వెళుతున్న ఓ కుటుంబం

మేడారం బృందం, ఫిబ్రవరి 22: మేడారం మహాజాతర అంటేనే లక్షలాది మంది భక్తులు, పెద్దలు, చిన్న పిల్లలు తల్లుల దర్శనార్థం వస్తుంటారు. ఈ క్రమంలో జంపన్నవాగులో స్నానం చేసేందుకు వచ్చే భక్తులు తమ కుటుంబ సభ్యులు తప్పిపోకుండా పొడగాటి కర్రకు జెండా కట్టి అదే తమకు ఆనవాళ్లు అని దానిని గుర్తుంచుకొని వెంబడించాలని చెబుతుంటారు. కుటుంబ సభ్యులంతా ఒకరి వెంట ఒకరు తప్పిపోకుండా గమ్య స్థానానికి చేరుకుంటున్నారు.

ఫొటోగ్రఫీయే జీవనాధారం



శ్రీశైలం నుంచి వచ్చిన ఫొటోగ్రాఫర్

మేడారం బృందం, ఫిబ్రవరి 22: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీశైలం నుంచి పలువురు ఫొటోగ్రాఫర్లు మేడారం మహాజాతరకు చేరుకున్నారు. జంపన్నవాగులో స్నానం చేసేందుకు వచ్చే భక్తులతో ఒప్పందం కుదుర్చుకొని ఒక్కో ఫొటోకు రూ.100 చొప్పున తీసుకుని వెంటనే ఫొటో కాపీని అందజేస్తున్నారు. దేశంలో ఎక్కడ జాతర జరిగినా అక్కడికి వెళ్లి ఫొటోలు తీసి డబ్బులు సంపాదించడం తమకు జీవనాధారమని సదరు ఫొటోగ్రాఫర్లు చెబుతున్నారు.



'పర్యావరణాన్ని పరిరక్షించాలి'

వడ్డేపల్లి, ఫిబ్రవరి 22 : ప్లాస్టిక్‌ను సమూలంగా నిర్మూలించి పర్యావరణాన్ని పరిరక్షించాలని జాతర శానిటేషన్ ప్రత్యేక అధికారి, బయాలజిస్టు జి. మాధవరెడ్డి అన్నారు. గురువారం గ్రేటర్ వరంగల్ 44వ డివిజన్ పరిధిలోని అమ్మవారిపేట సమ్మక్క- సారలమ్మ జాతరలో పర్యావరణ హితాన్ని కోరుతూ భక్తులకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను విడనాడడం ద్వారా క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా రక్షణ పొందవచ్చునని భక్తులకు సూచించారు. కార్యక్రమంలో శానిటరి సూపర్‌వైజర్ భాస్కర్, శానిటరి ఇన్‌స్పెక్టర్ యాదయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



అమ్మవారిపేట జాతరలో మాట్లాడుతున్న మాధవరెడ్డి

జయహో.. సమ్మక్క

- గద్దెపైకి చేరిన అమ్మవారు
- జన సంద్రంమైన అగ్రంపహాడ్
- దర్శనానికి పోటెత్తిన భక్తజనం
- ప్రాంగణాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి
- వివిధ రాష్ట్రాల నుంచి తరలి వచ్చిన భక్తులు
- శివసత్తుల పూనకాలతో మార్మోగుతున్న జాతర



అగ్రంపహాడ్‌లో భక్తుల మొక్కులు



అగ్రంపహాడ్‌లో సమ్మక్కను తీసుకొస్తూ

ఆత్మకూరు, ఫిబ్రవరి 22 : వేలాది మంది భక్తుల జయజయధ్వానాల మధ్య అగ్రంపహాడ్‌లోని సమ్మక్క తల్లి గురువారం రాత్రి గద్దెపైకి చేరడంతో భక్తులు పులకించిపోయారు. ఇద్దరు దేవతలు గద్దెలపైకి చేరడంతో భక్తుల మొక్కులతో అగ్రంపహాడ్ కిటకిటలాడుతోంది. సమ్మక్క జన్మస్థలమైన ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్ గ్రామం నుంచి తల్లి సమ్మక్క దేవతను గురువారం సాయంత్రం వనం నుంచి గద్దెపైకి ప్రధాన పూజారి గోనెల సారంగపాణి ఇతర పూజారుల బృందం, అధికారులు సంప్రదాయ బద్ధంగా డోలీ చప్పుళ్ల వాయిద్యాలతో పాటు ఎదుర్కోళ్లు, మేకపోతులతో భక్త జనం స్వాగతం పలకగా వొడ్డెలు అమ్మవారిని గద్దెపైకి చేర్చారు. దీంతో ఇద్దరు దేవతలకు మొక్కులు చెల్లింపుతో సందడి నెలకొంది. శివసత్తుల పూనకాలతో తల్లీ బిడ్డలకు పసుపు కుంకుమలు, పాలకాయలు, బంగారం(బెల్లం)తో గద్దెలు, పరిసర ప్రాంగణాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు లక్షల సంఖ్యల్లో ఆగ్రంపహాడ్‌కు తరలి వస్తున్నారు.

భక్తుల దర్శనాలకు ఇబ్బంది కాకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ ఇబ్బంది కాకుండా పరకాల సీఐ రవిరాజ్, మామునూరు సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో పర్యవేక్షిస్తున్నారు. గతంలో కంటే జనం అధికంగా వస్తుండడంతో దేవాదాయ శాఖ అధికారులు సర్వదర్శనంతో పాటు ప్రత్యేక దర్శనం క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ప్రత్యేక దర్శనాలకు రూ. 500, మరో ప్రత్యేక దర్శనం రూ. 100ను ఏర్పాటు చేశారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోలు, కాలి నడకన జారతకు తరలి వచ్చి మొక్కులు చెల్లించి వచ్చే జాతరకు వళ్లీ వస్తామంటూ తల్లీ చల్లంగా చూడమని కోరుకుంటూ తిరుగు ముఖం పట్టారు. జాతర చైర్మన్ శీలం రమేష్ యాదవ్, జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. పరకాల



అగ్రంపహాడ్‌లో సమ్మక్కకు పూజలు





అగ్రంపహాడ్‌లో భక్తుల సందడి

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి

ఆగ్రంపహాడ్ సమ్మక్క - సారలమ్మ జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి గురువారం జాతర ప్రాంగణంలో తిరుగుతూ భక్తుల సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. జాతర సందర్భంగా అమ్మవార్లకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు.

ఆర్డీవో, తహసీల్దార్లు జగన్మోహన్‌రెడ్డి, విక్రమ్‌కుమార్, ఈవో శేషగిరి రావు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాటు చేశారు. జాతర ప్రాంగణంలో ఎంపీపీ మార్క సుమలత, రజినీకర్ గౌడ్, జడ్పీటీసీ కక్కెర్ల రాధిక రాజు గౌడ్, జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కమలాపురం రమేష్, మాజీ ఎంపీపీ భీరం సునంద సుధాకర్‌రెడ్డి, మాజీ జాతర చైర్మన్ బోరిగం స్వామి, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిపేటలో..

వడ్డేపల్లి, ఫిబ్రవరి 22: కాజీపేట మండలం కొత్తపల్లి హవేలి శివారు దామెర (ఉర్సు) గుట్టల వద్ద నిర్వహిస్తున్న అమ్మవారిపేట సమ్మక్క - సారలమ్మ జాతర ప్రాంగణం శివసత్తుల పూనకాలతో పులకించింది. నగర శివారుతో పాటు వివిధ గ్రామాల ప్రజలు తండోపతండాలుగా జాతరకు తరలి రావడంతో అమ్మవారిపేట జాతర ప్రాంగణం సందడిగా మారింది. గురువారం సాయంత్రం సంధ్యావేళ సమ్మక్క దేవతను భారీ ఊరేగింపుతో దామెర గుట్టల నుంచి తరలించి వొడ్డెలు గద్దెపై ప్రతిష్ఠించడంతో మహా జాతర భక్తుల నినాదాలు, కేరింతలు, పులకరింతలతో మార్మోగింది. అమ్మవారిపేట పరిసరాల్లోని దామెరగుట్ట సొరంగంలో ఉన్న సమ్మక్క దేవత కుంకుమ భరణీలకు పెద్ద వొడ్డె బౌరిశెట్టి శ్యాంసుందర్ గిరిజన సంప్రదాయ ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమ్మక్క దేవత గౌరవార్థం డిప్యూటీ పోలీసు కమిషనర్ (డీసీపీ) ఎంప బారి గాలిలోకి తుపాకీతో కాల్పులు జరిపి గౌరవందనాన్ని అందజేశారు. అనంతరం డప్పు చప్పుళ్ల.. భాజాభజంత్రీలు.. శివసత్తుల పూనకాలు.. అచారమంతుల ఆట పాటలు .. భక్తుల కోలాహలం, యువకుల నృత్యాలు, కోలాటం ఆటలతో అమ్మవారిని భారీ ఊరేగింపుతో తరలించి గద్దెపై ప్రతిష్ఠించారు. తల్లీ బిడ్డల రాకతో జాతర మహా ఘట్టం ప్రారంభమైంది. సమ్మక్క దేవతకు వొడ్డెలు, గిరిజన పూజారులు తోట రాములు, బొల్లం సంజీవ్, మల్లయ్య తదితరులు సంస్కృతి సంప్రదాయాలు ఉట్టి పడే విధంగా భక్తిప్రపత్తులతో కొబ్బరి కాయలు కొట్టి అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేసి చీరే , సారే సమర్పించుకున్నారు.

తరలి వచ్చిన భక్తులు..

అమ్మవారిపేట సమ్మక్క- సారలమ్మ జాతరకు వరంగల్ నగరంలోని ఎస్ఆర్ఆర్ తోట, ఉర్సు , కరీమాబాద్, రంగశాయిపేట, శంభునిపేట, మామునూరు, నక్కలపెల్లి, అల్లీపూర్, తిమ్మాపూర్ , జక్కలొద్ది, ఖిలావరంగల్, అమ్మవారిపేట, కొత్తపల్లి, భట్టుపల్లి, కొండపర్తి, హనుమకొండ, నగరంలోని వివిధ డివిజన్ల నుంచి భక్తులు అశేషంగా తరలి వచ్చి మొక్కులు చెల్లించారు.

అమ్మవార్లను దర్శించుకున్న పలువురు

అమ్మవారిపేట జాతరలోని సమ్మక్క- సారలమ్మ గద్దెలను పలువురు మొక్కులు సమర్పించుకున్నారు. కార్పొరేటర్లు జలగం అనితరంజిత్, మరుపల్ల రవి, పోశాల పద్మ స్వామి గౌడ్, పల్లం పద్మారవి, పీఏసీఎస్ డైరెక్టర్ ఆవునూరి కుమారస్వామి, జాతర చైర్మన్ కోడూరి భిక్షపతి, ధర్మకర్తలు దాసి రాందేవ్, భైరి నాగరాజు, భైరి హరినాథ్, ఆవునూరి రాంమూర్తి, మైదం వీరస్వామి, చింత ప్రకాష్, ఆవునూరి రామన్న దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.



అమ్మవారిపేటలో సమ్మక్కకు తీసుకొస్తూ..



అమ్మవారిపేటలో సమ్మక్కకు మొక్కులు

పన్ను వసూళ్ల లక్ష్యాలు సాధించండి

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 22 : ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యాలు సాధించాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఫర్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ దివ్య దేవరాజన్ జీడబ్ల్యూఎంసీ అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో జీడబ్ల్యూఎంసీ అధికారులకు పలు సూచనలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌కు ముందే లక్ష్యాలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వేసవి క్రమంలో తాగునీటి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్ అనిసూర్ రషీద్ పాల్గొన్నారు.

సమ్మక్క తల్లి కరుణించు...

ధర్మసాగర్, ఫిబ్రవరి22 : ధర్మసాగర్ మండలం నారాయణగిరి, వేలేరు మండలం పీచర గ్రామాలలో సమ్మక్క, సారలమ్మ జాతర అత్యంత భక్తి శ్రద్ధలతో ఎంతో వైభవంగా గురువారం జరిగింది. డప్పు చప్పుళ్లతో భారీ ఊరేగింపుతో గిరిజన సంప్రదాయం ప్రకారం నారాయణగిరిలోని అప్పని భాస్కర్ ఆధ్వర్యంలో నర్సింహస్వామి గుట్ట నుంచి, వేలేరు మండలం పీచరలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో చిలకలగుట్ట నుంచి సమ్మక్క దేవతను తీసుకువచ్చి పూజారులు గద్దెలపై ప్రతిష్ఠించారు. బుధవారం సారలమ్మ, గురువారం సమ్మక్క గద్దెలపైకి చేరుకోవడంతో భక్తులు వేలేరు, ధర్మసాగర్ మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి కుటుంబ సమేతంగా తరలివచ్చి మొక్కలు చెల్లించుకుంటున్నారు.



ధర్మసాగర్ మండలం నారాయణగిరిలో గద్దెపైకి చేరిన సమ్మక్క

అతి పెద్ద గిరిజన జాతర మేడారం

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్, ఫిబ్రవరి 22: సమ్మక్క, సారలమ్మ జాతరను మేడారంలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అనేక జిల్లాల్లో, గ్రామాల్లో నిర్వహించుకుంటున్నారని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గురువారం వేలేరు మండలం పీచరలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మక్క, సారలమ్మ జాతరను కడియం శ్రీహరి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సందర్శించి వనదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ ఆసియాలోకెల్ల అతి పెద్ద గిరిజన జాతర మేడారం జాతరని తెలిపారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు సుఖ శాంతులతో ఉండాలని దేవతలను వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సమ్మిరెడ్డి, జడ్పీటీసీ సరిత, జాతర చైర్మన్ మహేందర్, రామ్‌గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



వేలేరు మండలం పీచరలో అమ్మవారికి మొక్కులు సమర్పిస్తున్న ఎమ్మెల్యే కడియం

కాంగ్రెస్‌లో మార్నేని చేరికను వ్యతిరేకిస్తున్నాం

కార్యకర్తల సమావేశంలో నాయకులు

ఐనవోలు, ఫిబ్రవరి 22: వరంగల్ డీసీసీబీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మార్నేని రవీందర్‌రావు కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట మహేందర్‌గౌడ్ తెలిపారు. రవీందర్‌రావు కాంగ్రెస్‌లో చేరుతారనే ఊహాగానాలను వ్యతిరేకిస్తూ గురువారం ఐనవోలులో మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవీందర్‌రావు కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని పార్టీ సీనియర్ నాయకులు, యువ నాయకులు అంగీకరించడంలేదన్నారు. ఆయనను పార్టీలో చేర్చుకోవద్దన్న అందరి అభిప్రాయాల మేరకు తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీటీసీ బొల్లేపల్లి మధుగౌడ్, జిల్లా, మండల నాయకులు మార్నేని వెంకటేశ్వర్‌రావు, బీరం దేవేందర్‌రెడ్డి, నకరకంటి మోహన్‌గౌడ్, రహింపాషా, కొత్తూరి సునిల్, మేట చిరంజీవి, శంకర్‌రెడ్డి, అనుముల రవీందర్, గిరుక రాజు, బొల్లేపల్లి రఘు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

ఆత్మహత్యకు కారణమైన వ్యక్తికి ఐదేళ్ల జైలు

వరంగల్ లీగల్, ఫిబ్రవరి 22 : వ్యాపారం విషయంలో ఏర్పడిన వివాదంలో ఒకరి ఆత్మహత్యకు కారణమైన వ్యక్తికి ఐదేళ్ల కఠిన కారాగారా శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా ప్రధాన అసిస్టెంట్ సెషన్స్ జడ్జి భృంగి శ్రీనివాసులు గురువారం తీర్పు చెప్పారు. అదే విధంగా దాడి చేసినందుకు మరో రెండు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు. కాజీపేట వెంకటాద్రినగర్‌కు చెందిన కురువ రాఘవేంద్ర తన కుటుంబంతో కూలీ పనులు చేసుకొని జీవిస్తున్నాడు. 2020లో కాజీపేట సోపిడికి వెళ్లే దారిలో శనిగరపు సతీష్‌కు చెందిన రేకుల షెడ్‌ను నీళ్ల బాటిళ్ల అమ్మకం నిమిత్తం రాఘవేంద్ర కిరాయికి తీసుకున్నాడు. ఈ క్రమంలో సతీష్ పదిరోజుల తర్వాత పక్క షెడ్‌లో ఇదే నీళ్ల బాటిళ్ల వ్యాపారం ప్రారంభించడంతో ఇద్దరి మధ్య వివాదం ఏర్పడింది. షెడ్డు తనకు కిరాయికిచ్చి తను చేస్తున్న వ్యాపారమే సతీష్ చేయడం సరికాదని రాఘవేంద్ర సతీష్‌కు పలు మార్లు విజ్ఞప్తి చేశాడు. అయినప్పటికీ సతీష్‌లో మార్పు రాకపోగా తరచూ రాఘవేంద్రను వేధించేవాడు. ఈ క్రమంలోనే 2020 సెప్టెంబరు 14న రాత్రి వారిమధ్య జరిగిన గొడవలో సతీష్ రాఘవేంద్రను కొట్టడంతో అవమానం భరించలేక షాపు ముందే రాఘవేంద్ర పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. ఎంజీఎంకు తరలించగా చికిత్సపొందతూ మర్నాడు మరణించాడు. రాఘవేంద్ర భార్య సునీత శనిగరపు సతీష్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయగా నేరం రుజువవడంతో న్యాయయూర్తి గురువారం పైవిధంగా తీర్పుచెప్పడంతో పాటు రెండు శిక్షలు ఏకకాలంలో అనుభవించాల్సిందిగా పేర్కొన్నారు.

నేడు కేయూ పరిధిలో జాతర సెలవు

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 22 : కాకతీయ యూనిర్సిటీ క్యాంపస్‌తో పాటు ఇతర అనుబంధ కళాశాలలకు ఫిబ్రవరి 23న శుక్రవారం సెలవు ప్రకటించినట్లు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 24న శనివారం యథావిధిగా వర్సిటీ క్యాంపస్‌తోపాటు కళాశాలలు పనిచేస్తాయని తెలిపారు. 23న సెలవుకు బదులుగా మార్చి 9న రెండో శనివారం వర్సిటీ పనిచేస్తోందని వెల్లడించారు. అయితే ఇప్పటికే ప్రకటించిన పరీక్షలు ఏమైనా ఉంటే యథావిధిగా జరుగుతాయని పరీక్షలకు సెలవు వర్తించదని స్పష్టం చేశారు.

కేయూ ఫార్మ్-డి పరీక్షల ఫీజు గడువు మార్చి 2

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 22 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని 2022-23 అకాడమిక్‌కు సంబంధించి ఫార్మ్‌డీ మొదటి, రెండో, మూడో, నాల్గవ, ఐదో సప్లిమెంటరీ, ఇంప్రూమెంట్ పరీక్షల ఫీజులను మార్చి 2వ తేదీలోగా అపరాధ రుసుం లేకుండా చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డిలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 250 అపరాధ రుసుంతో మార్చి 5 వరకు ఫీజులు చెల్లించుకోవాలని కోరారు.

మోరీలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 22: మండలంలోని ముల్కనూర్‌లో గల ఒడ్డెర కాలనీ సమీపంలోని మోరీలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబు తెలిపారు. హనుమకొండ ప్రాంతానికి చెందిన గుర్తు తెలియని వ్యక్తి తాపీ మేస్త్రీగా పనిచేసేందుకు ముల్కనూర్‌కు వచ్చాడన్నారు. అతని అచూకీ కోసం వివిధ ప్రాంతాలకు సమాచారం అందించినట్లు ఎస్ఐ సాయిబాబు తెలిపారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిసి ఉంటే ముల్కనూర్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు.

మహిళా పోలీసులు ఎంతో కీలకం

(7వ పేజీ తరువాయి)

కొనియాడారు. రాష్ట్రాభివృద్ధిలో మహిళల పాత్ర అతి కీలక మైందన్నారు. తీసుకునే శిక్షణతో శారీరక, మానసిక, ఆర్థిక, క్రమశిక్షణతో పోలీసు శాఖకు మంచి గుర్తింపు తీసుకురావాలని ఆయన సూచించారు. అనంతరం అడిషనల్ డీజీపీ విజయ్‌కుమార్‌ను పోలీసు శిక్షణ కళాశాల అధికారులు ఘనంగా సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో టీఎస్ఎస్పీ ఫోర్త్ బెటాలియన్ కమాండెంట్ శివప్రసాదరెడ్డి, పోలీసు శిక్షణ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.రమేష్, డీఎస్పీలు వెంకటేశ్వరరావు, రవీందర్, అసిస్టెంట్ కమాండెంట్లు భిక్షపతి, పాండు నాయక్, పోలీసు ఉన్నతాధికారులు నరేష్, అశోక్, సుధాకర్, చంద్రశేఖర్, నవీన్, విజయ్ కుమార్, మహేష్, దశరథం, అరుణ, దీపక్, రాజన్‌బాబు, దేవేందర్‌రెడ్డి, శ్రీలేఖ, రాధిక, పోలీసు శిక్షణ కళాశాల వైద్యాధికారి డాక్టర్ సుధీర్, ఫార్మసిస్టు వెంకటేశ్వర్లు, పీఆర్వో రామాచారి పాల్గొన్నారు.

కర్ణాటక సీఎంతో డీసీసీబీ చైర్మన్ల భేటీ



కర్ణాటక సీఎంతో భేటీ అయిన చైర్మన్లు

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 22 : బెంగుళూరులో జరిగిన జాతీయ కోఆపరేటివ్ బ్యాంక్స్ సెమినార్‌కు రాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంక్స్ చైర్మన్లు హాజరయ్యారు. బుధ, గురువారం రెండు రోజుల పాటు జరిగిన సెమినార్‌కు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ది రామయ్య, డిప్యూటీ సీఎం శివకుమార్, కోఆపరేటివ్ శాఖ మంత్రి రాజన్న అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కొండూరు రవిందర్ రావు, వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవిందర్‌రావులు కర్ణాటక సీఎం, డిప్యూటీ సీఎంలతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. బ్యాంక్‌ల ఆధ్వర్యంలో తెలంగాణలో అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. కాగా, బీఆర్ఎస్ నుంచి విజయం సాధించి వరంగల్ డీసీసీబీ చైర్మన్‌గా కొనసాగుతున్న మార్నేని రవిందర్‌రావు కర్ణాటక నేతలను ప్రత్యేకంగా కలువడం చర్చనీయాంశంగా మారింది. రెండు రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పిలుపు మేరకు హైదరాబాద్ వెళ్లి కాంగ్రెస్‌లో చేరేందుకు చర్చలు జరిపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రాష్ట్ర శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇన్‌చార్జిగా వ్యవహరించిన శివకుమార్‌ను మార్నేని రవిందర్‌రావు కలువడం పార్టీ మారుతాడని జరుగుచున్న చర్చకు ఊతం ఇచ్చినట్లు అయింది. శుక్రవారం తన అనుచరులతో భేటీ జరిపి కాంగ్రెస్‌లో చేరే తేదీని ఖరారు చేసే అవకాశాలున్నట్లు ప్రచారం సాగుతోంది.

వంగపహాడ్‌లో ఎమ్మెల్యే పర్యటన

హన్మకొండ క్రైం, ఫిబ్రవరి 22 : గ్రేటర్ వరంగల్ రెండవ డివిజన్ వంగపహాడ్ గ్రామంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు పర్యటించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజల వద్దకు వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పర్యటించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారా.. లేదా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డివిజన్ అధ్యక్షుడు పొన్నాల రఘు, రాజేష్‌గౌడ్, అనిల్‌రెడ్డి, రవిందర్, నందం, దోమ ప్రవీణ్, రవిందర్, మంద కొమురయ్య, లెనిన్, రాములు తదితరులు ఉన్నారు.


నివేదన

గీతాసారం



ఆత్మ రమణీయత

మన అంతర్గతమైన (లోపలి), బహిర్గతమైన (వెలుపలి) ప్రపంచాలకు ఇంద్రియాలు ద్వారాల్లాంటివి. కాబట్టి వాటిని అర్థం చేసుకోవాలని భగవద్గీత పదేపదే చెబుతుంది. 'ఒకటిగా పని చేసే న్యూరాన్లు (నాడీ కణాలు) ఒక్కటిగానే ముడిపడి ఉంటాయి' అని నాడీశాస్త్రం ప్రతిపాదిస్తుంది. దానినే 'హార్డ్ వైరింగ్' అంటారు. మన మెదడులో 100 బిలియన్ కోట్ల న్యూరాన్లు ఉన్నాయి. వాటిలో కొన్ని మన డిఎన్ఎ కారణంగా ముడిపడి, అసంకల్పితంగా జరిగే ప్రాథమిక దేహక్రియలకు వినియోగమవుతాయి. మరికొన్ని జీవితకాలంలో మనం చేసే కర్మల ద్వారా ముడిపడతాయి. మొదటిరోజు డ్రైవింగ్ వీల్ ముందు కూర్చున్నప్పుడు... కారు నడపడం మనకు కష్టంగా అనిపిస్తుంది. తరువాత నెమ్మదిగా దానికి అలవాటు పడతాం. ఎందుకంటే... అప్పటివరకూ వాడుకలోలేని న్యూరాన్లను మన మెదడు హార్డ్ వైరింగ్ ద్వారా జోడించి, డ్రైవింగ్‌కు సంబంధించిన అన్ని చర్యల్లో పాల్గొనేలా చేస్తుంది. దీనికి సమయం పడుతుంది. మామూలు నడక, ఆటలతో మొదలుకొని ఒక సర్జన్ జరిపే శస్త్ర చికిత్స దాకా అన్ని రకాల నైపుణ్యాల విషయంలోనూ ఇదే జరుగుతుంది. హార్డ్ వైరింగ్ మెదడు తాలూకు శక్తిని బాగా ఆదాచేస్తుంది. తద్వారా మన జీవితాలను సులభతరం చేస్తుంది. శిశువుకు అనేక పనులు చేసే సామర్థ్యం ఉంటుంది. ఆ తరువాత కుటుంబం, సహచరులు, సమాజం మధ్యలో సాగే పెంపకంలో... అనేక నాడీ బంధాలు (ప్యాటర్న్స్) ఏర్పడతాయి. ఈ నాడీబంధాలు బాహ్య ప్రపంచం నుంచి నిర్దిష్టమైన ప్రేరణలకు, అనుభూతులకు అలవాటు పడడం వల్ల... ఆ ప్రేరణలను, అనుభూతులను పొందడానికి మనం తీవ్రంగా కృషి చేస్తాం. ఈ అలవాట్లనే మనం 'కోరికలు' అని కూడా అనవచ్చు. మన నాడీబంధాలు పొగడ్తలను ఆశించి, ఆస్వాదిస్తాయి కాబట్టి... వాటిని వినడానికి మనం ఇష్టపడతాం. ఈ నాడీబంధాలే మనలో ఉత్పన్నమయ్యే ఆకాంక్షలకు, కలిగే దురభిప్రాయాలకు, మనలో ఏర్పడే అంచనాలకు పునాదులు. ఈ నాడీబంధాలన్నిటి కలయిక, వాటి అలవాట్ల మీద ఆధారపడే మన ప్రవర్తనలన్నిటినీ కలిపితే అదే అహంకారం. దాన్ని ఛేదించినప్పుడు మాత్రమే మనల్ని మనలో కేంద్రీకరించుకోగలం. తద్వారా బాహ్య ప్రేరణలతో నిమిత్తం లేకుండా... శాశ్వతమైన సంతోషాన్ని పొందగలం. దీన్నే శ్రీకృష్ణుడు 'ఆత్మ రమణీయత' అని చెబుతున్నాడు. గీతోపదేశం ప్రకారం జీవించడం అంటే... భగవద్గీత అందించిన అనేక సాధనాలను, నియంత్రణలను పాటించి... ఈ నాడీబంధాల నుంచి మనల్ని మనం విముక్తి చేసుకోవడమే. ఈ విధంగా విముక్తమయినప్పుడు... మన దుఃఖానికి కారణమైన విభజనల నుంచి, భేదాభిప్రాయాల నుంచి కూడా విముక్తి పొందుతాం. శాశ్వతమైన ఆనందాన్ని పొందుతాం.



కె. శివప్రసాద్
ఐఎఎస్

సందేశం



ప్రవక్త మాసం

ఇస్లాం మాసాల్లో ఎనిమిదవది షాబాన్. ఇది ప్రత్యేక ప్రాధాన్యం ఉన్న నెల. అంతిమ దైవ ప్రవక్త మహమ్మద్ ఒక సందర్భంలో మాట్లాడుతూ "షాబాన్ నా నెల. రజబ్... అల్లాహ్ నెల. రంజాన్ నా జాతి నెల. మానవులను పాపాల నుంచి షాబాన్ మాసం దూరం చేస్తుంది. రంజాన్ పూర్తిగా పరిశుద్ధం చేస్తుంది" అని పేర్కొన్నారు. ఆయన షాబాన్ కోసం ఒక నెల రోజుల ముందు నుంచే ప్రార్థనలతో సంసిద్ధమయ్యేవారు. "ఓ అల్లాహ్! మాకు రజబ్, షాబాన్ మాసాల్లో సమృద్ధిని, శుభాలను ప్రసాదించు. రంజాన్ నెలవరకూ మమ్మల్ని చేర్చు" అని వేడుకొనేవారు. "రజబ్, రంజాన్ మాసాల మధ్య నెల షాబాన్. దాసుల పుణ్యాల వివరాలు అల్లాహ్ వద్దకు వెళ్ళేది ఈ నెలలోనే. నా కర్మ ఫలాలు అల్లాహ్ వద్దకు వెళ్ళే ఈ సమయంలో... ఉపవాస దీక్షతో ఉండడానికి నేను ఇష్టపడతాను" అని మహా ప్రవక్త తెలిపారు. ఆయన షాబాన్ మాసంలో ప్రత్యేక ఉపవాసాలు చేసేవారు. అయితే చివరి పదిహేను రోజులూ ఉపవాసాలకు మినహాయింపు ఇచ్చేవారు. "అల్లాహ్ ఈ మాసంలో శుభాలను, పుణ్యాలను సమృద్ధిగా ప్రసాదిస్తాడు. పాపాలు దూరమవుతాయి. కాబట్టి వివేకవంతుడైన విశ్వాసులు ఈ మాసాన్ని నిర్లక్ష్యం చెయ్యకూడదు" అని మహా పండితుడైన అబ్దుల్ ఖాదర్ జిలానీ స్పష్టం చేశారు. పవిత్ర రంజాన్ మాసాన్ని స్వాగతించడానికి విశ్వాసులు ఈ మాసంలో తమనుతాము సంసిద్ధులను చేసుకోవాలి. వీలైనంత ఎక్కువగా ప్రార్థనలు చేసి, దైవ సామీప్యాన్ని పొందాలి.

● మహమ్మద్ వహీదుద్దీన్

దైవమార్గం



విశ్వ రక్షకుడు

మనం స్నేహితుడికో, బంధువుకో ఒక మాట ఇస్తాం. మాట ఇవ్వడం సులభమే. దాన్ని నిలబెట్టుకోవడం చాలా కష్టం. అది అనేక అంశాలమీద ఆధారపడి ఉంటుంది. మాట ఇచ్చినవారు బంధుమిత్రులైతే మావల్ల కాలేదని తప్పించుకుంటారు. సొంత కుటుంబ సభ్యులైనప్పుడు... వారి మీద ఎంత ప్రేమ ఉన్నప్పటికీ... మాట నిలబెట్టుకోలేక నిస్సహాయులుగా నిలిచిపోవాల్సి ఉంటుంది. మానవ బలహీనతలు, సాధ్యాసాధ్యాలను నిర్దేశించే పరిస్థితుల ప్రభావం ఆ విధంగా ఉంటుంది. కానీ ఇచ్చిన మాట తప్పకుండా... కష్టాలు, నష్టాలు, ప్రమాదాలు సంభవించిన సమయంలో ఆదుకొనేవాడు ఒక్కడే. దేవుడు. "ఇదంతా కేవలం విశ్వాసమే కదా! దేవుడు కనిపిస్తాడా?" అనే ప్రశ్న తలెత్తవచ్చు. కానీ 'బైబిల్'లోని 'ఆదికాండం'లో ఆదాము, అబ్రహం, మోషే తదితర వ్యక్తులకు దేవుడు ప్రత్యక్షంగా కనిపించకపోయినా... ఆయన స్వరం వినిపించేది. అభయం ఇచ్చేది. వారు నిత్యం దేవుడి ఆదేశాలకు అనుగుణంగా నడుచుకొనేవారు.

"నిన్ను విడువను. నిన్ను ఎడబాయను. నీ వెనుక ఉన్నది నేనే. నీకు భయమెందుకు. నీ చేయి పట్టి నడిపించేది నేనే. నేను తప్ప నీకు మరెవ్వరున్నారు? ఆపత్కాలంలో నిన్ను ఆదుకొనేది నేనే. నీకు" అంటూ 'బైబిల్'లోని 'యెహోషువా', 'హెబ్రీ' తదితర అధ్యాయాల్లో దేవుడు ఇచ్చిన అభయం స్పష్టంగా కనిపిస్తుంది. ఆ మాటను నిలబెట్టుకోవడం కోసం, రక్షణ అందించడం కోసం దేవుడు తన కుమారుణ్ణి (ఏసు ప్రభువును) మనకు తోడుగా పంపాడు. మానవులకు ఇచ్చిన వాగ్దానాన్ని ఏసు ద్వారా దేవుడు నెరవేర్చాడు. 'నేను మీకు తోడున్నా'నని ధైర్యం చెప్పి, మనల్ని ముందుకు నడిపించేది విశ్వానికే రక్షకుడైన దైవం తప్ప మరెవ్వరు?

● డాక్టర్ దేవదాసు బెర్నార్డ్ రాజు
9866755024

సహజయోగ



"మిమ్మల్ని సృష్టించిన శక్తితో మీరు అనుసంధానమయ్యేదాకా... మీ జీవిత పరమార్థాన్ని మీరు తెలుసుకోలేరు" అంటారు పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి. ఆమె ప్రవచనాలు కేవలం మాటలకే పరిమితం కాదు. ప్రచారాన్ని ఆమె కోరుకోలేదు. తాను నమ్మిన సత్యాన్ని, బోధించిన ధర్మాన్నీ స్వయంగా ఆచరించి చూపించారు. సర్వమత సౌభ్రాతృత్వం కోసం, ధర్మ సంస్థాపన కోసం దేశ, విదేశాల్లో పర్యటించి... తన బోధనలతో ఎందరికో మార్గదర్శిగా నిలిచారు. వివిధ మతాల ప్రవక్తలు ప్రవచించిన మూల సూత్రాలను కొందరు పక్కదారి పట్టిస్తున్న సమ

బ్రహ్మ చైతన్య సారథి

యంలో... వాటిలోని అసలు సత్యాన్ని సహజయోగ ద్వారా నిర్మలాదేవి బహిర్గతపరిచారు. ఆమె 1970 మే 5న... తన స్వీయ తపోశక్తి ద్వారా 'సహజయోగ'ను ఆవిష్కరించారు. అప్పుడే ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్రలో ఒక కొత్త అధ్యాయం మొదలైంది.

'సహ' అంటే మనతో, 'జ' అంటే జన్మించిన శక్తి, 'యోగ' అంటే బాహ్యాపరంగా ఉన్న శక్తితో కలయిక అని అర్థం. కుల, మత, జాతి, ప్రాంత, వయో, లింగ భేదాలు లేకుండా... ఎవరైనా ఎప్పుడైనా ఈ సహజయోగాన్ని అతి సునాయాసంగా ఆచరించవచ్చు. దైనందిన జీవితంలో మనం ఎదుర్కొనే శారీరక, మానసిక, భౌతిక, ఆధ్యాత్మిక సమస్యలన్నిటికీ పరిష్కారంగా... మానవుడు ఎంతో కాలం నుంచి, ఎన్నో జన్మల నుంచి అన్వేషిస్తున్న సత్యాన్ని సహజయోగ ధ్యానం ద్వారా శ్రీ మాతాజీ ఆవిష్కరించారు. దాన్ని ఎటువంటి స్వార్థ చింతనా లేకుండా మానవాళికి అందించారు. ఎవరి దగ్గరా ధనాన్ని ఆశించకుండా... తన సొంత డబ్బుతో, భర్త అందించిన సహకారంతో వివిధ దేశాలు పర్యటించి... సహజయోగాన్ని ప్రపంచవ్యాప్తంచేశారు.

'నిన్ను నువ్వు తెలుసుకో' అనేది అన్ని మతాలలోని మూల సారాంశం. అదే సత్యం. భగవంతుడనేవాడు ఎక్కడో కాదు, నీలోనే ఆత్మగా ఉన్నాడు. అదే సత్యం. ఎన్నో యుగాల, జన్మల ఈ సత్యాన్వేషణ... సహజయోగంలోని ఆత్మసాక్షాత్కారంతో ముగుస్తుంది. ప్రపంచవ్యాప్తంగా... దేశం ఏదైనప్పటికీ... సహజయోగులు హిందూ దేవతలను, అల్లాను, క్రీస్తును, బుద్ధుణ్ణి, మహావీరుణ్ణి, గురునానక్‌ను... ఇలా అన్ని మతాల దేవతలనూ సమానంగా చూస్తారు. అందరూ ఒక్కటేననే భావనతో ఆరాధిస్తారు. కులమతాలు కేవలం మానవ సృష్టి. భగవంతుడికి దానితో ఎలాంటి సంబంధం లేదు. వివిధ దేశాల యువతీ యువకులకు వివాహాలు జరిపించి... సహజయోగ వివాహాల ద్వారా వసుధైక కుటుంబ భావనను శ్రీమాతాజీ ఆచరణలో చూపించారు. ఆమె ఏర్పాటు చేసిన వివిధ సంస్థలు గొప్ప సేవలు అందిస్తున్నాయి. హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో, అమెరికా, ఇటలీ, కెనడాలలో సహజయోగా ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్స్ పలు దేశాలకు చెందిన విద్యార్థులకు ఎలాంటి తారతమ్యాలు లేకుండా... ఆధ్యాత్మిక వాతావరణంలో, క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్పిస్తున్నాయి. ముంబయి, ఢిల్లీ నగరాల్లో అంతర్జాతీయ సహజ ఆరోగ్య, పరిశోధన కేంద్రాల్లో... సహజయోగ సాధన ద్వారా అనారోగ్య సమస్యలను చక్కదిద్దుకొని, ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకొనే పద్ధతులపై శిక్షణ ఇస్తున్నారు. నోయిడాలోని 'నిర్మల్ ప్రేమాశ్రమం' అభాగ్య మహిళలకు, అనాథలకు ఆశ్రయం కల్పిస్తోంది. శ్రీమాతాజీ దేశమంతటా తిరిగి... విద్యార్థులు, ఉద్యోగులు, గృహిణులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారంగా... సహజయోగాన్ని ఉచితంగా అందించారు. ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ఈ కార్యక్రమం కొనసాగుతోంది. అదేవిధంగా సహజయోగ ద్వారా కలిగే వైబ్రేషన్స్‌తో... సహజమైన సాగు పద్ధతుల ద్వారా ఆరోగ్యవంతమైన పంటలను పండించి, అధిక దిగుబడిని పొందే విధానాన్ని రైతులకు ఉచితంగా బోధిస్తున్నారు. మద్యపానం, మత్తు పానీయాలు, మత్తుమందుల లాంటి వ్యసనాలను వదలాలని చెప్పడమే కాదు, సహజయోగ ద్వారా వాటిని మానడం సాధ్యమని శ్రీమాతాజీ నిరూపించారు.

ప్రతి ఒక్కరిలో సరైన పరివర్తనకు దోహదం చేసే నవ సమాజ నిర్మాణం, వసుధైక కుటుంబం, సర్వమానవ సౌభ్రాతృత్వం, ద్వేషరహితమైన, ప్రేమపూరితమైన సమాజం ఏర్పడడం సుసాధ్యమేనని సహజయోగ ద్వారా శ్రీ మాతాజీ ఆచరించి చూపించారు.. మానవాళికి సహజయోగాన్ని కానుకగా ఇచ్చిన ఆమె 2011 ఫిబ్రవరి 23న ఈ లోకంలో తన అవతారాన్ని చాలించారు. ఆ రోజును ప్రపంచవ్యాప్తంగా ఉన్న సహజయోగ కేంద్రాలలో ప్రతి సంవత్సరం 'ప్రపంచ బ్రహ్మ చైతన్య దినోత్సవం'గా ఆమె మార్గాన్ని అనుసరించేవారు నిర్వహిస్తారు.



డాక్టర్ పి. రాకేష్
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

మానవత్వం అంటే...

ఈ జీవితం ఒక కానుక. ఇది పదేపదే లభించేది కాదు. ఈ జీవితం తాలూకు పరిపూర్ణ ప్రయోజనాన్ని మనం పొందాలి. మీలాంటివారు ఎందరో ఉండవచ్చు, కానీ మీ చిరునవ్వు మీకు మాత్రమే సొంతం. అలాగే మీ వేదన కూడా మీకు మాత్రమే ప్రత్యేకం. మీకు సంబంధించిన ప్రతీదీ మీకే ప్రత్యేకమైనది. కానీ మీరు దేనికోసం జీవిస్తున్నారు? ఉన్నదాని కోసమా? లేనిదాని కోసమా?

'శాంతికి మూలం నాలోనే ఉంది' అనేది గుర్తించేవరకూ ఆ మూలశక్తితో మనం అనుబంధాన్ని ఏర్పరచుకోలేం. అది ఏనాడైతే మనలో ప్రస్ఫుటం అవుతుందో... అప్పుడు అందరికోసం ఒక చక్కని వాతావరణం ఏర్పడుతుంది. అప్పుడు మనం కూడా మన సంతోషాలను ఇతరులతో పంచుకోవడానికి సిద్ధమవుతాం. ఈ ప్రపంచంలో రెండు రకాల మనుషులు ఉంటారు. ఒక రకమైన వ్యక్తులతో మనం ఒక్క నిమిషం కూడా గడపలేం. రెండో రకం వారితో ఉన్నప్పుడు మనకు ఆనందం, సంతోషం కలుగుతుంది. మనలోని ప్రతి ఒక్కరూ తోటివారికి కాస్త సంతోషం, కాస్త ఆనందం ఇచ్చేలా మారిపోతే ఎంతో బాగుంటుంది కదా!

చింతన




ఒక రోజు నేను బస్టాప్ సమీపంలో ఉన్నాను. అక్కడ బస్సు ఆగింది. అది ఎక్కాలని ఒక వృద్ధుడు పరిగెడుతూ వస్తున్నాడు. అతను ఆ బస్సు ఎక్కలేకపోయాడు. అంతలో బస్సు నెమ్మదిగా కదిలి, వేగం అందుకుంది. ఆ వృద్ధుడు వేగంగా పరిగెత్తడానికి ప్రయత్నించినా, దాన్ని అందుకోలేకపోయాడు. ఏదో విధంగా డ్రైవర్ దగ్గరకు వెళ్ళి, బస్సు ఆపాలని నేను చెప్పాలనుకున్నాను. ఇంతలో మోటార్ సైకిల్ మీద ఎవరో అబ్బాయి వచ్చాడు. బస్సును గట్టిగా తట్టి "ఒక ప్రయాణికుడు బస్సు ఎక్కలేకపోయాడు. వెనుక నుంచి పరిగెత్తుకుంటూ వస్తున్నాడు. చూడండి" అని చెప్పాడు. డ్రైవర్ వెంటనే బస్సు ఆపాడు. వృద్ధుడు బస్సు ఎక్కాడు. ఆ అబ్బాయి వెళ్ళిపోయాడు.

అతను కృతజ్ఞతలు కోరుకోలేదు. "నాకు కృతజ్ఞతలు చెప్పలేదేం?" అని ఆ వృద్ధుణ్ణి వెంబడించి అడగలేదు. మనం దేవదూతల గురించి మాట్లాడుకుంటాం. ఆ అబ్బాయి కూడా దేవదూత లాంటివాడే. అతి కష్టమైన పనిని సులభతరం చేశాడు. ఎక్కడి నుంచి వచ్చాడో తెలీదు. తిరిగి ఎటు వెళ్ళాడో కనిపించలేదు. నేను చూస్తూ ఉండగానే మాయమైపోయాడు. అతను ప్రత్యేకమైన మనిషిలా కూడా కనిపించలేదు. కానీ మానవ రూపంలో వచ్చిన దేవదూతలా... ఒక చిన్న పని చేసి వెళ్ళిపోయాడు. మనమందరం అలా చెయ్యగలం. దీనికోసం మనకు ఎలాంటి శిక్షణ అవసరం లేదు. తోటివారికి ఏదో విధంగా సాయం చెయ్యడం చాలా గొప్ప విషయం. కానీ దాని గురించి మనం ఏమాత్రం పట్టించుకోం. కానీ మానవత్వం అంటే అదే. మానవత్వం అంటే తెలుసుకోనంతవరకూ మనిషి దాన్ని ప్రదర్శించలేడు. ఏదైనా విపత్తు సంభవించినప్పుడు, ఎవరికైనా కష్టం వచ్చినప్పుడు మనం తోటివారికి ఎంతో కొంత సాయం చెయ్యగలమని గుర్తించడం చాలా ముఖ్యం. ఈ ప్రపంచంలో మానవులు పుట్టడం, గిట్టడం అనేది వేల ఏళ్ళ నుంచీ జరుగుతోంది. మనం ఒకరికోసం ఒకరం ఏం చెయ్యగలం? అనేదే ప్రధానం. కాస్తంతైనా చేయూత అందించగలగడం ముఖ్యం. ఇవన్నీ చిన్నచిన్న విషయాలే. కానీ వాటిని గుర్తుంచుకోవడం చాలా అవసరం.



ప్రేమ్ రావత్
9246275220
www.premrawat.com

హరేకృష్ణ



సింహగురు

హరినామ సంకీర్తనోద్యమాన్ని ప్రారంభించి, ఎలాంటి తారతమ్యాలు లేకుండా ప్రతి ఒక్కరికీ కృష్ణ ప్రేమను పంచిపెట్టిన మహాత్ముడు శ్రీ చైతన్య మహా ప్రభువు. శ్రీ చైతన్యులు నిష్క్రమించిన అనంతరం ఆయన సంప్రదాయం ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొంది. ఆయన బోధనలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. అపసంప్రదాయాలు చోటుచేసుకోసాగాయి. ఆ సమయంలో అవతరించిన శ్రీల భక్తి వినోద ఠాకూర్... శ్రీ చైతన్యుల మార్గాన్ని పునఃస్థాపించారు. ఒడిశా రాష్ట్రంలోని జగన్నాథపురి పట్టణ మేజిస్ట్రేట్‌గా పని చేసిన ఆయన వందకు పైగా గ్రంథాలు రాశారు. మరెన్నో రచనలతో శ్రీ చైతన్య సిద్ధాంతసారానికి ప్రామాణికతను స్థాపించారు. ఒక శక్తిమంతమైన భగవత్‌తత్త్వ ప్రబోధకుణ్ణి తనకు పుత్రుడిగా ప్రసాదించమని శ్రీ చైతన్యులను ఆయన నిత్యం ప్రార్థించేవారు. ఆ ప్రార్థనల ఫలితంగా ఆయనకు 1874 ఫిబ్రవరి 6న... పూరీ జగన్నాథ క్షేత్రంలో ఒక కుమారుడు జన్మించాడు. పుట్టిన పిల్లవాడి బొడ్డు ప్రేగు జంధ్యంలా దేహంపై అల్లుకోవడం చూసి... అందరూ ఆశ్చర్యపోయారు. ఆ బాలుడికి బిమలదత్త ప్రసాద్‌గా తల్లితండ్రులు నామకరణం చేశారు.

ఆరు మాసాల తరువాత జగన్నాథ రథోత్సవంలో... వందలమంది లాగుతున్న రథం భక్తి వినోద ఠాకూర్ ఇంటి ముందు ఆగిపోయింది. బిమలప్రసాద్‌ను జగన్నాథుడి ఆశీర్వాదం కోసం అతని తల్లి రథం పైకి తీసుకు వెళ్ళి, స్వామి పాదాల దగ్గర ఉంచగా... స్వామి మెడలోని పూలమాల ఆ పిల్లవాణ్ణి చుట్టుముట్టి నేలపై వాలింది. అది చూసిన బిమలదత్తుడి తల్లితండ్రులు... తమ బిడ్డ కచ్చితంగా జగన్నాథుని వరప్రసాదమేనని నిర్ధారించుకున్నారు. భక్తివినోదుల ఇంట బిమల ప్రసాద్‌గా వెలసిన ఆ ఆణిముత్యమే... బ్రహ్మ-మధ్వ-గౌడీయ వైష్ణవ సంప్రదాయ పరంపరలో 31వ ఆచార్యులైన శ్రీల భక్తి సిద్ధాంత సరస్వతి ఠాకూర్. తన చిన్న వయసులో... భగవంతుడి నివేదనకై ఉంచిన మామిడి పండును బిమలప్రసాద్ తిన్నాడు. అది అపరాధమని తండ్రి హితవు చెబుతూ, స్వల్పంగా మందలించారు. ఆనాటి నుంచి బిమలప్రసాద్ జీవితాంతం మామిడి పండ్లను తినడం మానేశారు. బాల్యంలో చేసిన చిన్న తప్పిదం విషయంలో తీసుకున్న ఈ నిర్ణయం... ఆయన దృఢ సంకల్పానికి నిదర్శనం. ఎవరైనా మామిడి పండు సమర్పిస్తే "నేను అపరాధిని. ఆ పండు తినలేను" అంటూ సున్నితంగా తిరస్కరించేవారు.

పదేళ్ళ వయసులో తండ్రి నుంచి హరేకృష్ణ, నృసింహ మంత్రోపదేశాల్ని ఆయన పొందారు. తండ్రి సూచన మేరకు నవద్వీపంలోని ప్రఖ్యాత వైష్ణవ సాధువైన శ్రీల గౌర కిశోర దాస బాబాను గురువుగా స్వీకరించి, దీక్ష పొందారు. అప్పటి నుంచి తండ్రితో పలు తీర్థస్థలాలను సందర్శిస్తూ... 'వైష్ణవ మంజూష' అనే గ్రంథాన్ని రచించారు. అనంతరం పూరీ క్షేత్రంలో శ్రీమద్భాగవతంపై ప్రవచనాలు ప్రారంభించారు. నిర్భయంగా, బలమైన వాదనలతో తత్త్వోపన్యాసాలను చేసే సామర్థ్యం సరస్వతీ ఠాకూరుకు 'సింహగురు' అనే బిరుదు తెచ్చి పెట్టింది. భారతదేశంతోపాటు బర్మా (మయన్మార్), బ్రిటన్, జర్మనీ దేశాల్లో మొత్తం 64 గౌడీయ మఠాలను ఆయన స్థాపించారు. నవద్వీపంలో భూస్థాపితమైన శ్రీచైతన్యుల జన్మస్థలాన్ని వెలికి తీసి, ధనలాలసులైన వారి వ్యతిరేకతను ఎదుర్కొని పునర్నిర్మించారు. మద్రాసు, కృష్ణనగర్, కోల్‌కతాల్లో 'బృహత్ మృదంగాలు'గా పేర్కొనే మూడు ముద్రణాలయాల ద్వారా శ్రీ గౌరంగ మహా ప్రభువు బోధలపై పుస్తకాలను, పత్రికలను ప్రచురించి, ప్రచారం సాగించారు. మొత్తం 61 గ్రంథాలను ఆయన రచించారు. ఎనిమిది పత్రికలను ప్రచురించేవారు. 1914లో తండ్రి భక్తివినోదుల నిష్క్రమణతో... శ్రీ చైతన్యుల సంకీర్తనోద్యమాన్ని ముందుకు కొనసాగించే బాధ్యత పూర్తిగా సరస్వతి ఠాకూర్ పైన పడింది. ఆధ్యాత్మిక జీవనానికి భౌతిక అర్హతలేవీ లేవని ఆయన వాదించేవారు. కుల, మత, ప్రాంత, లింగ భేదాలేవీ పరిగణించకుండా.. వ్యక్తిలో ఆధ్యాత్మిక జీవనంపై ఉన్న ఆసక్తికే ప్రాధాన్యతనిచ్చి... దీక్షను ప్రసాదించేవారు. భగవత్ సందేశ ప్రచారానికి ఆయన ఎన్నో వినూత్న మార్గాలను అవలంబించారు. జీవితంలోని చివరి క్షణం వరకూ శ్రీకృష్ణ భక్తియుత సేవల్లో, శాస్త్ర ప్రబోధనల్లో ఆయన గడిపారు. 1936 డిసెంబర్ 31న... 62 ఏళ్ళ వయసులో... పూరీ క్షేత్రంలో... ఈ లోకాన్ని వీడి శ్రీ కృష్ణ సన్నిధానాన్ని చేరుకున్నారు. ఎటువంటి బేధాలు లేకుండా ప్రజలందరూ భగవన్నామాలను జపించాలనేదే ఆయన ప్రధాన సందేశం. నిత్య సాధన కోసం 'హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే/ హరే రామ హరే రామ రామ రామ హరే హరే' మహా మంత్రాన్ని ఆయన లోకానికి అందించారు.



శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్, హైదరాబాద్, 9396956984

గురువు- దొంగ

ఒక గ్రామానికి కొంత దూరంలో ఒక జెన్ గురువు ఉండేవాడు. ఆయన చిన్న గుడిసెలో నివసించేవాడు. రోజూ ఆ గ్రామానికి వచ్చి భిక్షాటన చేసేవాడు. తన ఆకలి తీరడానికి సరిపోయే పదార్థాలు మాత్రమే తీసుకొనేవాడు. సొమ్ము దొరికితే ఎవరికైనా ఇచ్చేసేవాడు. తన గుడిసెకు వెళ్ళి ఆ ఆహారం తిని, విశ్రమించేవాడు. ఒక రోజు ఆయన రాత్రి నిద్రపోతూ ఉండగా... అతని గుడిసెలోకి ఒక దొంగ ప్రవేశించాడు. అక్కడ ఒక చిన్న దీపం వెలుగుతోంది. ఆ గుడ్డి వెలుగులోనే... ఏవైనా విలువైన వస్తువులు దొరుకుతాయేమోనని వెతుకుతున్నాడు.

ఈలోగా గురువు మేలుకున్నాడు. తన గుడిసెలోకి దొంగ వచ్చాడని అర్థమయింది. "అయ్యో పాపం! ఇంత చీకటిలో, ఇంత చలిలో ఎంతో దూరం నడిచి వచ్చాడు. నా గుడిసెలో కనీసం తిండి గింజలు కూడా లేవు. ఏమీ ఇవ్వలేకపోతున్నాను" అని బాధపడుతూ... అటూ ఇటూ కదిలాడు.

ఇది గమనించిన దొంగ ఆయన దగ్గరకు వచ్చి గురువు ముఖంలోకి చూశాడు. ఆయన కళ్ళ నుంచి నీరు కారుతోంది. "నేను దొంగననీ, దొంగతనానికి వచ్చాననీ అర్థమయిందా? మీరు ఎందుకు ఏడుస్తారు? బాధపడకండి. నేను ఏవీ తీసుకుపోను. హాయిగా నిద్రపోండి" అన్నాడు దొంగ జాలిగా.

అప్పుడు గురువు అతని రెండు చేతులనూ పట్టుకొని "నా దుఃఖానికి కారణం అదికాదు నాయనా! నువ్వు ఇంత చలిలో, ఎంతో కష్టపడి ఇంత దూరం వస్తే... ఏమీ ఇవ్వలేకపోతున్నానని విచారంగా ఉంది. నువ్వు ఉత్త చేతులతో వెనక్కి వెళ్ళడం బాగుండదు. దయచేసి ఇదిగో... ఈ దుప్పటి తీసుకుపో. కాదనకు" అంటూ కన్నీరు తుడుచుకున్నాడు గురువు.

అవి పైపై మాటలు కావనీ, ఆయన హృదయం లోతులనుంచి వస్తున్నాయనీ దొంగ గమనించాడు. ఆ గురువుకు ఉన్నది ఒకే దుప్పటి. ఒంటిమీద సరైన దుస్తులు కూడా లేవు. బాగా చలి వేస్తోంది. ఆ దుప్పటి తీసుకోవడానికి దొంగకు మనసు ఒప్పుకోలేదు. కానీ దాన్ని తీసుకోవాలని ఆయన మనస్ఫూర్తిగా ప్రాధేయపడుతున్నాడు. ఆ దొంగ కాదనలేకపోయాడు. అతను దుప్పటి తీసుకొని వెళ్తూ ఉండగా గురువు ఆ దొంగతో "అయ్యా! మరొక్కసారి రండి. ఒక రోజు ముందు తెలియజెయ్యండి. ఎంతో కొంత విలువైన వస్తువును తెచ్చి ఉంచుతాను" అన్నాడు. దొంగ వెళ్ళిపోయాడు. గురువు సంతోషంగా నిద్రపోయాడు.

మళ్ళీ ఇలా జరుగకూడదని గురువు భావించాడు. ఏరోజుకారోజు భిక్షగా వచ్చిన డబ్బును ఇదివరకటిలా పూర్తిగా దానాలు చెయ్యకుండా, కొంత మొత్తం దాచడం మొదలుపెట్టాడు. ఆ సొమ్మును చిన్న కుండలో పెట్టి, గుడిసెలో ఒక మూల ఉంచాడు.

ఒక రోజు రాత్రి ఇంకో దొంగ వచ్చాడు. గురువును చూసి అతను జంకుతూ తిరిగి వెళ్ళబోయాడు. అప్పుడు గురువు "మిత్రమా! ఇటురా. ఆ మూల కుండలో కొంత డబ్బు ఉంది. దాన్ని తీసుకుపో. అంతకన్నా ఎక్కువ ఇవ్వనందుకు నన్ను క్షమించు" అన్నాడు.

దొంగ ఆ సొమ్ము తీసుకొని బయటకు నడుస్తున్నాడు.

"ఇదిగో ఇలా చూడు! ఆ సొమ్ము ఇచ్చినందుకు కృతజ్ఞతలైనా చెప్పకపోతే ఎలా?" అన్నాడు గురువు.

దొంగ కృతజ్ఞతలు చెప్పి వెళ్ళిపోయాడు. ఆ తరువాత మరోచోట దొంగతనం చేస్తూ అతను దొరికిపోయాడు. అతణ్ణి న్యాయాధికారి ముందు రక్షకభటులు నిలబెట్టారు. గురువు సొమ్మును కూడా అతను తీసుకున్నట్టు విచారణలో తేలింది. గురువును న్యాయస్థానానికి పిలిపించారు. దొంగను చూపిస్తూ "ఇతను మీ సొమ్ము దొంగిలించాడు కదా!" అని ప్రశ్నించారు.

అప్పుడు గురువు వాళ్ళతో "ఇతను నాకు తెలుసు. ఒక రాత్రి నాకు అతిథిగా వచ్చాడు. అతను నా సొమ్ము దొంగిలించలేదు. నా విన్నపాన్ని మన్నించి తీసుకువెళ్ళాడు. పైగా దాన్ని ఇచ్చినందుకు నాకు కృతజ్ఞతలు కూడా తెలిపాడు" అని చెప్పాడు. దొంగను న్యాయస్థానం విడిచిపెట్టింది. అతనిలో పరివర్తన కలిగింది. ఆ గురువుకు శిష్యుడిగా మారిపోయాడు. శిక్షలతోనో, బోధనలతోనో కాకుండా చిన్న చర్యతో పరివర్తన తేవచ్చుననడానికి ఇదొక ఉదాహరణ.

● రాచమడుగు శ్రీనివాసులు

జెన్ కథ



'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/umpwITGలో చదవండి.



చెన్నైలో ఉండి బతికిపోయాడు

సంగీత దర్శకుడిపై డైరెక్టర్ ఫైర్



'సిద్ధార్థ్‌రాయ్' చిత్రం షూటింగ్ నిర్ణీత సమయం లోనే పూర్తి చేశాం. కానీ సంగీత దర్శకుడు రధన్ వల్ల పోస్ట్ ప్రొడక్షన్ ఆలస్యమైంది. అవుట్ పుట్ విషయంలో నన్ను బాగా విసిగించాడు. తనతో చాలా విషయాల్లో వాగ్వివాదం జరిగింది. తను మంచి టెక్నీషియనే కానీ నన్ను మానసికంగా చిత్రవధ చేశాడు. చెన్నైలో ఉండి బతికిపోయాడు. లేకుంటే పెద్ద గొడవే జరిగేది. ఇలాంటి సంగీత దర్శకులకు తెలుగు చిత్ర పరిశ్రమ దూరంగా ఉండాలి' అని దర్శకుడు వీ యశస్వి విజ్ఞప్తి చేశారు. ఆయన దర్శకత్వంలో దీపక్ సరోజ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'సిద్ధార్థ్ రాయ్'. జయ అడపాక, ప్రదీప్ పూడి, సుధాకర్ బోయిన సంయుక్తంగా నిర్మించారు. నేడు ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా యశస్వి మాట్లాడుతూ 'సుకుమార్‌గారికి ఈ సినిమా బాగా నచ్చి, 'నీ తర్వాత సినిమా నా బేనర్‌లోనే చేస్తున్నాం' అని ప్రకటించారు. నేను ఊహించినదానికన్నా దీపక్ అద్భుతంగా నటించాడు. సిద్ధార్థ్‌రాయ్ ఒక డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. ఇలాంటి కథ, పాత్ర ఇప్పటివరకూ రాలేదు' అని అన్నారు. దీపక్ సరోజ్ మాట్లాడుతూ 'సిద్ధార్థ్‌రాయ్' కథ విన్నాక ఆనందబాష్పాలు వచ్చాయి. నటుడిగా నన్ను నిరూపించుకోవచ్చని ఈ సినిమా చేశాను. ఈ సినిమా కోసం యశస్వి చాలా కష్టపడ్డారు. నా పాత్ర ప్రేక్షకులకు గుర్తుండిపోతుందని నమ్ముతున్నాను' అని అన్నారు. ఇందులో తన పాత్ర చాలా ప్రత్యేకంగా ఉంటుందని కథనాయిక తన్వీ చెప్పారు.

నో లాజిక్ ఓన్లీ మ్యాజిక్

శ్రీవిష్ణు, రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శి కలయికలో వచ్చిన 'బ్రోచేవారెవరురా' చిత్రం ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తింది. ఇప్పుడు మరోసారి ఈ కాంబినేషన్ సెట్టయింది. ఈ చిత్రానికి 'ఓం భీమ్ బుష్' అనే ఆసక్తికర టైటిల్‌ను ఖరారు చేశారు. 'నో లాజిక్ ఓన్లీ మ్యాజిక్' అనేది ఉపశీర్షిక. 'హుషారు' ఫేమ్ శ్రీహర్ష కొనుగంటి దర్శకత్వంలో వీ సెల్యూలాయిడ్‌తో కలసి సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. యూవీ క్రియేషన్స్



సమర్పిస్తోంది. గురువారం మేకర్స్ ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసి, మార్చి 22న సినిమాను రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రీతీ ముకుందన్, అయేషాఖాన్ కథానాయికలు. ఈ చిత్రానికి సంగీతం: సన్నీ ఎంఆర్. సినిమాటోగ్రఫీ: రాజ్ తోట













అమ్మాయిల ధనాధన్



నేటినుంచే డబ్ల్యూపీఎల్
తొలి మ్యాచ్‌లో ముంబైతో ఢిల్లీ ఢీ

రాత్రి 8 గం. నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో

షెడ్యూల్

ఫిబ్రవరి 23	ముంబై x ఢిల్లీ
ఫిబ్రవరి 24	బెంగళూరు x యూపీ
ఫిబ్రవరి 25	గుజరాత్ x ముంబై
ఫిబ్రవరి 26	యూపీ x ఢిల్లీ
ఫిబ్రవరి 27	బెంగళూరు x గుజరాత్
ఫిబ్రవరి 28	ముంబై x యూపీ
ఫిబ్రవరి 29	బెంగళూరు x ఢిల్లీ
మార్చి 1	యూపీ x గుజరాత్
మార్చి 2	బెంగళూరు x ముంబై
మార్చి 3	గుజరాత్ x ఢిల్లీ
మార్చి 4	యూపీ x బెంగళూరు
మార్చి 5	ఢిల్లీ x ముంబై
మార్చి 6	గుజరాత్ x బెంగళూరు
మార్చి 7	యూపీ x ముంబై
మార్చి 8	ఢిల్లీ x యూపీ
మార్చి 9	ముంబై x గుజరాత్
మార్చి 10	ఢిల్లీ x బెంగళూరు
మార్చి 11	గుజరాత్ x యూపీ
మార్చి 12	ముంబై x బెంగళూరు
మార్చి 13	ఢిల్లీ x గుజరాత్
మార్చి 15	ఎలిమినేటర్
మార్చి 17	ఫైనల్

గమనిక: (తొలి 11 మ్యాచ్‌లు బెంగళూరులో, ఆ తర్వాత మ్యాచ్‌లన్నీ ఢిల్లీలో జరుగుతాయి. ఆరంభ మ్యాచ్ రా. 8 గంటలకు, మిగతా మ్యాచ్‌లన్నీ రాత్రి 7.30కు మొదలవుతాయి)

బెంగళూరు: యువ క్రికెటర్లను వెలికితీయడమే లక్ష్యంగా రూపుదిద్దుకొన్న మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో అంచెకు శుక్రవారం తెరలేవనుంది. సీజన్ తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంప్, హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని ముంబై ఇండియన్స్‌తో గతేడాది రన్నరప్, మెగ్ లానింగ్ నేతృత్వంలోని ఢిల్లీ క్యాపిటల్స్ తలపడనుంది. గతేడాది ముంబైలో జరిగిన తొలి అంచె పోటీల్లో విదేశీ ప్లేయర్లే ఎక్కువగా ఆకట్టుకొన్నారు. అయితే, ఈసారి మాత్రం భారత యువ క్రికెటర్లు వెలుగులోకి వస్తారనే అంచనాలున్నాయి. ఈ సీజన్‌లో బెంగళూరు, ఢిల్లీ వేదికలుగా లీగ్ జరగనుంది. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ మెగ్ లానింగ్ గత ఎడిషన్‌లో అత్యధిక పరుగులు సాధించగా.. వెస్టిండీస్‌కు చెందిన ముంబై బౌలర్ హేలీ మాథ్యూస్ 16 వికెట్లతో పర్పుల్ క్యాప్ సొంతం చేసుకొంది. కానీ, భారత ప్లేయర్లు మాత్రం తమదైన ముద్ర వేయడంలో తడబడ్డారు. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు తరపున ఆడిన అన్‌క్యాప్డ్ ప్లేయర్ శ్రేయాంక పాటిల్ మాత్రమే ప్రతిభను చాటగలిగింది. కాగా, యువ ప్లేయర్ల గురించి ఎంత చర్చ నడిచినా.. స్టార్ ప్లేయర్లు స్మృతి మంధాన, ఎలిస్ పెర్రీ, సోఫియా డివైన్ లాంటి వాళ్లు లీగ్‌కు ప్రధాన ఆకర్షణ కానున్నారు.



హర్మన్



లానింగ్

కాష్వీ దూరం: వేలంలో భారీగా రూ. 2 కోట్లతో అదరహో అనిపించిన అన్‌క్యాప్డ్ ప్లేయర్ కాష్వీ గౌతమ్ (గుజరాత్ జెయింట్స్) గాయంతో ఈసారి లీగ్‌కు దూరమవడం ఆ జట్టుకు నిరాశే. బౌలర్ టిటాస్ సాధుతోపాటు అన్‌క్యాప్డ్ బ్రిందా దినేష్ (యూపీ వారియర్స్)పై భారీ అంచనాలున్నాయి. ఆసియా క్రీడల ఫైనల్లో సాధు అద్భుత ప్రదర్శనతో లంకపై భారత్ గెలిచింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ తరఫున ఆడుతున్న టిటాస్‌పై ఆ జట్టుకు భారీ ఆశలున్నాయి. బెంగళూరు కెప్టెన్ స్మృతి మంధాన ఈసారి తన జట్టును విజేతగా నిలపాలనే పట్టుదలతో ఉండగా.. అత్యుత్తమ బ్యాటర్లయిన హీలీ, చమరి ఆటపట్టుతోపాటు బిగ్‌బాష్ అనుభవమున్న దీప్తి శర్మతో యూపీ బలంగా కనిపిస్తోంది. ముంబై సారథి హర్మన్‌ప్రీత్ బ్యాటింగ్‌పై కూడా భారీ అంచనాలున్నాయి. అనుభవానికి యువరక్తం తోడవడంతో ఈసారి లీగ్ మరింత మజాగా సాగే అవకాశం ఉంది. ఐదు జట్లు పోటీపడుతున్న ఈ లీగ్‌లో ఫైనల్, ఎలిమినేటర్ సహా మొత్తం 22 మ్యాచ్‌లు జరగనున్నాయి. మార్చి 17న జరిగే ఫైనల్‌తో లీగ్ ముగియనుంది.

హైదరాబాద్, వైజాగ్‌లో రెండేసి మ్యాచ్‌లు

ఐపీఎల్ తొలి విడత షెడ్యూల్

తేదీ	మ్యాచ్	వేదిక	సమయం
మార్చి 22	చెన్నై X బెంగళూరు	చెన్నై	రా. 8
మార్చి 23	పంజాబ్ X ఢిల్లీ	మొహాలి	మ. 3.30
మార్చి 23	కోల్‌కతా X హైదరాబాద్	కోల్‌కతా	రా. 7.30
మార్చి 24	రాజస్థాన్ X లఖ్‌నవూ	జైపూర్	మ. 3.30
మార్చి 24	గుజరాత్ X ముంబై	అహ్మదాబాద్	రా. 7.30
మార్చి 25	బెంగళూరు X పంజాబ్	బెంగళూరు	రా. 7.30
మార్చి 26	చెన్నై X గుజరాత్	చెన్నై	రా. 7.30
మార్చి 27	హైదరాబాద్ X ముంబై	హైదరాబాద్	రా. 7.30
మార్చి 28	రాజస్థాన్ X ఢిల్లీ	జైపూర్	రా. 7.30
మార్చి 29	బెంగళూరు X కోల్‌కతా	బెంగళూరు	రా. 7.30
మార్చి 30	లఖ్‌నవూ X పంజాబ్	లఖ్‌నవూ	రా. 7.30
మార్చి 31	గుజరాత్ X హైదరాబాద్	అహ్మదాబాద్	మ. 3.30
మార్చి 31	ఢిల్లీ X చెన్నై	విశాఖపట్నం	రా. 7.30
ఏప్రిల్ 1	ముంబై X రాజస్థాన్	ముంబై	రా. 7.30
ఏప్రిల్ 2	బెంగళూరు X లఖ్‌నవూ	బెంగళూరు	రా. 7.30
ఏప్రిల్ 3	ఢిల్లీ X కోల్‌కతా	విశాఖపట్నం	రా. 7.30
ఏప్రిల్ 4	గుజరాత్ X పంజాబ్	అహ్మదాబాద్	రా. 7.30
ఏప్రిల్ 5	హైదరాబాద్ X చెన్నై	హైదరాబాద్	రా. 7.30
ఏప్రిల్ 6	రాజస్థాన్ X బెంగళూరు	జైపూర్	రా. 7.30
ఏప్రిల్ 7	ముంబై X ఢిల్లీ	ముంబై	రా. 3.30
ఏప్రిల్ 7	లఖ్‌నవూ X గుజరాత్	లఖ్‌నవూ	రా. 7.30

మార్చి 22 నుంచి ఐపీఎల్

- ఆరంభ మ్యాచ్‌లో చెన్నైతో బెంగళూరు ఢీ
- తొలి 17 రోజుల షెడ్యూల్ విడుదల



న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఐపీఎల్‌ను భారత్‌లోనే నిర్వహిస్తారా? లేక విదేశాలకు తరలిస్తారా? అనే సస్పెన్స్‌కు తెరపడింది. అభిమానులు ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్న మెగా లీగ్ షెడ్యూల్‌ను బీసీసీఐ గురువారం విడుదల చేసింది. అయితే, ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పాక్షికంగా అంటే.. తొలి 17 రోజులకు (మార్చి 22 నుంచి ఏప్రిల్ 7 వరకు) సంబంధించిన మ్యాచ్‌ల తేదీలను మాత్రమే ప్రకటించింది. అయితే, ఫైనల్ మే 26న నిర్వహించే అవకాశాలున్నాయి. ఎన్నికల కమిషన్ పోలింగ్ తేదీలను ప్రకటించిన తర్వాత ప్రభుత్వం, పోలీసులతో సమన్వయం చేసుకొని రెండో దశ షెడ్యూల్‌ను విడుదల చేయనున్నట్టు బీసీసీఐ తెలిపింది. వచ్చే నెల 22న చెన్నైలో జరిగే ఆరంభ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంప్ చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)తో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తలపడనుంది. ప్రకటిత షెడ్యూల్‌లో 10 నగరాల్లో జరిగే 21 మ్యాచుల్లో ప్రతి జట్టూ 3 నుంచి 5 మ్యాచ్‌లు ఆడనుంది. 2009లో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఐపీఎల్‌ను దక్షిణాఫ్రికాలో నిర్వహించగా.. 2014 ఎడిషన్‌ను యూఏఈలో ఆడించారు. అయితే, 2019లో ఎన్నికలు జరిగినా భారత్ నుంచి తరలించలేదు. తొలి వారాంతంలో జరిగే డబుల్ హెడర్‌లో పంజాబ్‌తో ఢిల్లీ, కోల్‌కతాతో సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనున్నాయి. కాగా, తొలి దశలో జరిగే రెండు మ్యాచ్‌లకు విశాఖపట్నంను ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు తమ హోంగ్రౌండ్‌గా ఎంపిక చేసుకొంది. ప్రస్తుతం డబ్ల్యూపీఎల్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో ఢిల్లీలోని అరుణ్‌జైట్లీ స్టేడియం పిచ్ కొంత పాడయ్యే అవకాశం ఉండడంతో క్యాపిటల్స్ ఫ్రాంచైజీ ఈ నిర్ణయం తీసుకొన్నట్టు సమాచారం. దీంతో సాగర తీరం వైజాగ్‌లో మార్చి 31న చెన్నైతో, ఏప్రిల్ 3న కోల్‌కతాతో ఢిల్లీ ఆడనుంది. సన్‌రైజర్స్ ఉప్పల్ వేదికగా మార్చి 27న ముంబై, ఏప్రిల్ 5న సీఎస్‌కేతో తలపడనుంది. ఈ సీజన్‌లో మొత్తం 10 జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. ప్రతి జట్టు 14 మ్యాచ్‌లు ఆడనుండగా.. తమ గ్రూప్‌లోని మిగతా నాలుగు జట్లతో రెండేసిసార్లు తలపడనుంది. మరో గ్రూప్‌లోని నాలుగు జట్లతో ఒక్కో మ్యాచ్, ఐదో టీమ్‌తో రెండుసార్లు ఆడనుంది. ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా రోహిత్ శర్మ స్థానంలో హార్దిక్ పాండ్యా పగ్గాలు చేపట్టడం ఈ సీజన్ విశేషం. ఇక, గత సీజన్‌లో చెన్నైను విజేతగా నిలిపిన ధోనీ.. ఏడాది తర్వాత మళ్లీ అభిమానుల ముందుకు రానున్నాడు.

ఐపీఎల్‌కు షమి దూరం



న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో గత సీజన్ రన్నరప్ గుజరాత్ టైటాన్స్‌కు గట్టి షాక్ తగిలింది. ఆ జట్టు స్టార్ పేసర్ మహ్మద్ షమికి గాయం తిరగబెట్టడంతో ఐపీఎల్‌కు దూరం కానున్నట్టు సమాచారం. షమి చీలమండకు సర్జరీ చేయించాల్సిన అవసరం ఉందని, త్వరలోనే అతను లండన్‌కు వెళ్లనున్నట్టు బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. ఈ కారణంగానే షమి లీగ్‌లో ఆడకపోవచ్చని తెలుస్తోంది. అయితే ఈ విషయాన్ని బీసీసీఐ, గుజరాత్ టైటాన్స్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. తమ జట్టును వరుసగా రెండుసార్లు ఫైనల్‌కు చేర్చిన షమి లేకపోవడంతోపాటు హార్దిక్ ముంబై కెప్టెన్‌గా మారడం కూడా గుజరాత్‌కు ఎదురుదెబ్బే అనుకోవాలి. 2022లో ఐపీఎల్ అరంగేట్రం చేసిన గుజరాత్ అదే ఏడాది విజేతగా నిలిచింది. ఇక, గతేడాది రన్నరప్‌తో సరిపెట్టుకుంది.

సిరీస్‌పైనే గురి



ఉ. 9.30 నుంచి స్పోర్ట్స్18, జియో సినిమాలో..

రోహిత్

- ఇంగ్లండ్‌తో భారత్ నాలుగో టెస్టు నేటి నుంచి
- పేసర్ ఆకాశ్‌దీప్‌నకు చాన్స్!

రాంచీ: ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు టెస్టుల సిరీస్‌లో భారత్ ఇప్పటికే 2-1తో తిరుగులేని ఆధిక్యంలో ఉంది. ఇక సిరీస్‌ను దక్కించుకునేందుకు మన జట్టుకిదే అద్భుత చాన్స్. ఈనేపథ్యంలో శుక్రవారం నుంచి జరిగే నాలుగో టెస్టులో రోహిత్ సేన విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. ఇంగ్లండ్‌కు సిరీస్‌లో నిలిచే చాన్స్ ఇవ్వకుండా రాంచీలోనే నెగ్గి వరుసగా 17వ సిరీస్‌ను ఖాతాలో వేసుకోవాలనుకుంటోంది. అటు స్టోక్స్ సేన మాత్రం వరుసగా రెండు ఓటములతో తీవ్ర ఒత్తిడిలో పడిపోయింది. వారికిది కచ్చితంగా గెలిచి తీరాల్సిన మ్యాచ్. లేకపోతే సిరీస్ గల్లంతవుతుంది. రాజ్‌కోట్‌లో 434 రన్స్ తేడాతో ఓడడంతో ఇంగ్లండ్ బజ్‌బాల్ గేమ్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. అయినా కోచ్ మెకల్లమ్ మాత్రం తమ దూకుడు తగ్గదని స్పష్టం చేశాడు.



స్టోక్స్

సిరాజ్‌దే పేస్ బాధ్యత: ఫామ్‌లో ఉన్న పేసర్ బుమ్రాకు నాలుగో టెస్టులో విశ్రాంతినిచ్చారు. దీంతో సిరాజ్‌పైనే పేస్ భారం పడనుంది. కానీ అతను షార్ట్ పిచ్ బంతులు వేస్తూ ఇంగ్లండ్ బ్యాటర్లను ఇబ్బందిపెట్టాలనుకుంటున్నాడు. అయితే బుమ్రా మాదిరి లైన్ అండ్ లెంగ్త్‌కు కట్టుబడితేనే ప్రయోజనం ఉంటుంది. మరోవైపు రెండో పేసర్ విషయంలో ముకేశ్, ఆకాశ్‌దీప్ మధ్య పోటీ నెలకొంది. రంజీల్లో బెంగాల్ తరఫున ఆకాశ్ మెరుగ్గా ఆడాడు. అలాగే ఇంగ్లండ్ లయన్స్‌తో ఆడిన రెండు అనధికార టెస్టుల్లోనూ 10 వికెట్లు తీశాడు. ఆకాశ్ ఓవరాల్‌గా 30 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో 104 వికెట్లు తీశాడు. దీంతో ముకేశ్‌కన్నా సెలెక్టర్లు ఆకాశ్‌వైపే మొగ్గు చూపవచ్చు. బ్యాటింగ్‌లో యశస్వీ జైస్వాల్, సర్ఫరాజ్, గిల్ అదరగొడుతున్నారు. రజత్‌కు మరో చాన్స్ దక్కొచ్చు. కొత్త కీపర్ ధ్రువ్ జురెల్ కూడా ఆకట్టుకుంటున్నాడు. స్పిన్నర్లు జడేజా, అశ్విన్, కుల్దీప్ తుది జట్టులో కొనసాగనున్నారు.

ఎలా ఆడాలి?: న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్, ఆస్ట్రేలియాలపై విజయాలతో భారత్‌ను కూడా బెదరగొడదామనుకున్న ఇంగ్లండ్ బజ్‌బాల్‌కు ఇక్కడ బ్రేకులు పడ్డాయి. క్రాలే, డకెట్ మాత్రమే స్ట్రోక్‌ప్లేతో ఆకట్టుకుంటున్నారు. సీనియర్లు రూట్, బెయిర్‌స్టో భారంగా మారారు. అటు స్టోక్స్ రాణించడం లేదు. భారత బౌలర్ల ధాటికి బజ్‌బాల్ ఆట ఫలితం ఇవ్వడం లేదు. ఈనేపథ్యంలో నాలుగో టెస్టులో వీరి ఆట ఎలా సాగుతుందో చూడాల్సిందే. పేసర్ ఉడ్ స్థానంలో ఒలీ రాబిన్సన్‌ను తీసుకున్నారు.

తుది జట్లు

భారత్ (అంచనా): రోహిత్ (కెప్టెన్), యశస్వీ, గిల్, రజత్, సర్ఫరాజ్, ధ్రువ్ జురెల్, జడేజా, అశ్విన్, కుల్దీప్, సిరాజ్, ఆకాశ్/ముకేశ్.

ఇంగ్లండ్: క్రాలే, డకెట్, పోప్, రూట్, బెయిర్‌స్టో, స్టోక్స్ (కెప్టెన్), ఫోక్స్, హార్ట్‌లీ, బషీర్, రాబిన్సన్, అండర్సన్.

పిచ్

తొలి రెండు రోజులు పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించనుంది. ఆ తర్వాత టర్న్ అయ్యే చాన్స్ ఉందని బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ అన్నాడు.

పవర్‌లిఫ్టర్‌కు మంత్రి కోమటిరెడ్డి చేయూత



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): వరల్డ్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌కు ఎంపికైన తెలంగాణ క్రీడాకారిణి తేజావత్ సుకన్యకు అవసరమైన సహకారం అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హామీ ఇచ్చారు. గురువారం సచివాలయంలో కోమటిరెడ్డిని కలిసిన సుకన్య మే నెల 17న అమెరికాలో జరిగే ప్రపంచ టోర్నీకి ఎంపికైన విషయాన్ని తెలిపింది. కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా సహకారమందిస్తానని సుకన్యకు మంత్రి భరోసా ఇచ్చారు. ఆ పోటీల్లో సత్తా చాటి, రాష్ట్రానికి పసిడి పతకంతో తిరిగి రావాలని ఆయన ఆకాంక్షించారు.

పోరాడి ఓడిన హైదరాబాద్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టుకు రెండో ఓటమి ఎదురైంది. గురువారం చెన్నైలోజరిగిన ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ 0-3తో అహ్మదాబాద్ డిఫెండర్స్ చేతిలో పరాజయం పాలైంది.

ఆసియా కప్ ఫైనల్లో ధీరజ్ బృందం



బాగ్దాద్: ఆసియా కప్ లెగ్ 1 ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో తెలుగు కుర్రాడు బొమ్మదేవర ధీరజ్ రెండు విభాగాల్లో ఫైనల్‌కు దూసుకెళ్లాడు. ఈ టోర్నీలో ఓవరాల్‌గా భారత ఆర్చర్లు ఆరు టీమ్ ఈవెంట్లలో ఫైనల్ చేరి పతకాలు ఖాయం చేశారు. పురుషుల రికర్వ్ టీమ్ ఈవెంట్‌లో ధీరజ్, ప్రవీణ్, తరుణ్‌దీప్‌లతో కూడిన భారత జట్టు ఆతిథ్య ఇరాక్‌ను ఓడించి బంగ్లాదేశ్‌తో ఫైనల్ ఫైట్‌కు సిద్ధమైంది. ఇక, రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో ధీరజ్, సిమ్రన్‌జీత్ ద్వయం సిరియా, కతార్ జట్లపై గెలిచి ఫైనల్ చేరింది. మహిళల రికర్వ్ టీమ్ ఈవెంట్ సెమీఫైనల్లో దీపికా కుమారి, సిమన్‌జీత్, భజన్ కౌర్‌లతో కూడిన భారత బృందం.. ఇరాక్‌ను ఓడించింది. పురుషుల కాంపౌండ్ టీమ్ ఈవెంట్ సెమీస్‌లో ప్రథమేష్, ప్రియాన్ష్, కుశాల్‌లతో కూడిన భారత త్రయం 233-223తో ఇరాక్‌ను చిత్తుచేసింది. మహిళల టీమ్ ఈవెంట్‌లో అదితి, ప్రియ, పర్నీత్‌లతో కూడిన భారత జట్టు సెమీస్‌లో 234-210తో అఫ్ఘానిస్థాన్‌పై నెగ్గింది. కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్లో అదితి, ప్రియాన్ష్ ద్వయం 157-146తో బంగ్లాను ఓడించి ఫైనల్లో ప్రవేశించింది.

పారాలింపిక్స్‌కు ముగ్గురు తెలుగు క్రీడాకారులు



హైదరాబాద్: పారాలింపిక్స్‌కు ముగ్గురు తెలుగు క్రీడాకారులు అర్హత సాధించారు. ఢిల్లీలో జరుగుతున్న పారా సైక్లింగ్ చాంపియన్‌షిప్‌లో ఏపీకి చెందిన అర్షద్ షేక్, పవన్, తెలంగాణ సైక్లిస్ట్ ఆర్యవర్ధన్ రజత పతకాలు సాధించారు. వీరంతా హైదరాబాద్‌లోని ఆదిత్య మెహతా ఫౌండేషన్ ద్వారా శిక్షణ తీసుకుంటున్నారు.

10 లక్షల కోట్ల డాలర్ల బాటలో భారత్

త్వరలో మూడో అతిపెద్ద ఎకానమీగా అవతరణ ● డబ్ల్యూఈఎఫ్ ప్రెసిడెంట్ బోర్గే బ్రెండే



న్యూఢిల్లీ: భారత జీడీపీ 10 లక్షల కోట్ల డాలర్ల మైలురాయి వైపుగా దూసుకెళ్తున్నదని, మరో 2-3 ఏళ్లలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని ప్రపంచ ఆర్థిక ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) అధ్యక్షుడు బోర్గే బ్రెండే అన్నారు. ప్రపంచ దేశాల్లో ఈ స్థాయి ఆశావహ స్థితి మరెక్కడా చూడలేదని పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు. సమయం ఆసన్నమైనప్పుడు భారత ప్రభుత్వంతో కలిసి ఇక్కడ డబ్ల్యూఈఎఫ్ ఇండియా సదస్సును నిర్వహిస్తామన్నారు.

బ్రెండే ఇంకా ఏమన్నారంటే..

- ప్రపంచంలోని బడా ఆర్థిక వ్యవస్థలన్నింటిలోకెల్లా భారత్ శరవేగంగా వృద్ధి చెందుతోంది. ఈ ఏడాది డబ్ల్యూఈఎఫ్ సదస్సులోనూ ఇన్వెస్టర్లలో భారత్‌పై అమితాసక్తి కనిపించింది. రాబోయే కాలంలో కూడా ఇది కొనసాగుతుందని నాకనిపిస్తోంది.
- భారత్ ప్రస్తుతం 7 శాతం వృద్ధిరేటుతో దూసుకెళ్తోంది. గడిచిన కొన్నేళ్లలో భారత్‌లో కీలక సంస్కరణలు చోటు చేసుకున్నాయి. దాంతో అమెరికా, చైనాకు దీటుగా ఎదుగుతోంది.
- విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) గణనీయంగా పెరుగుతున్నాయి. గతంలో చైనా సహా పలు వర్ధమాన మార్కెట్లలో జరిగే తయారీ కార్యకలాపాలు భారత్‌కూ తరలివస్తున్నాయి.
- భారత డిజిటల్ పోటీ సామర్థ్యం ప్రశంసనీయం. ప్రపంచంలో ప్రస్తుతం సంప్రదాయ వస్తు వర్తకం కంటే డిజిటల్ వర్తకమే అధికంగా జరుగుతోంది. డిజిటలీకరణ విషయంలో 140 కోట్ల జనాభా కలిగిన భారత్ కీలక దేశంగా మారింది.

వచ్చే పదేళ్లు 6-8% వృద్ధి: వైష్ణవ్

వచ్చే పదేళ్లు భారత జీడీపీ నిలకడగా 6-8 శాతం వృద్ధిరేటును నమోదు చేసుకోనుందని కేంద్ర సమాచార, ఐటీ మంత్రి అశ్వనీ వైష్ణవ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచంతోపాటు కొత్త ఆలోచనలకు భారత తలుపులు తెరిచే ఉంటాయని గురువారం 'రైసిన్ డైలాగ్ 2024' కార్యక్రమంలో ప్రసంగించిన సందర్భంగా ఆయన అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఉద్దేశించి అన్నారు. దేశంలో భారీగా పెట్టుబడులు పెట్టాలని వారిని ఆహ్వానించారు. వచ్చే ఐదేళ్లలో తమ ప్రభుత్వం తయారీ, విద్య ద్వారా పేదరిక నిర్మూలన, హెల్త్‌కేర్ రంగంలో పెద్దఎత్తున సాంకేతికత వినియోగం వంటి విషయాలకు ప్రాధాన్యం ఇవ్వనుందని మంత్రి సంకేతాలిచ్చారు.

నిఫ్టీ మరో ఆల్‌టైమ్ హై

ముంబై: ఒక రోజు విరామం అనంతరం స్టాక్ మార్కెట్‌లో మరోసారి రికార్డుల మోత మోగింది. తీవ్ర ఆటుపోట్లకు లోనైన సెన్సెక్స్ నిఫ్టీ చివరి గంటలో కోలుకున్నాయి. సెన్సెక్స్ 535.15 పాయింట్ల లాభంతో 73,158.24 వద్ద ముగియగా నిఫ్టీ 162.40 పాయింట్ల లాభంతో 22,217.45 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో నిఫ్టీ 22,252.50 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకింది. నిఫ్టీకి ఈ రెండూ కొత్త రికార్డులే. ఈ బుల్‌రన్ ఇలాగే కొనసాగితే నిఫ్టీ త్వరలోనే 22,280 స్థాయికి, దాన్ని అధిగమిస్తే 22,810 పాయింట్ల వరకు దూసుకుపోయే అవకాశం ఉందని టెక్నికల్ అనలిస్టుల అంచనా. ఒకవేళ అమ్మకాల ఒత్తిడి ఎదురైనా 22,011 వద్ద గట్టి మద్దతు లభిస్తుందని భావిస్తున్నారు.

ఆల్‌టైమ్ హైలో నిక్కీ: జీడీపీ వృద్ధిరేటు అంతంత మాత్రంగానే ఉన్నా జపాన్ స్టాక్‌మార్కెట్ మాత్రం కొత్త రికార్డులు నమోదు చేస్తోంది. గురువారం నిక్కీ 225 పాయింట్ల లాభంతో 1989 పాయింట్ల ఆల్‌టైమ్ హై వద్ద ముగిసింది.

2030 నాటికి 10 లక్షల కోట్ల డాలర్ల మార్కెట్ క్యాప్

మోదీ సర్కారు గడిచిన పదేళ్లలో చేపట్టిన సంస్కరణలు రాబోయే దశాబ్దాల్లో భారత్ బలమైన వృద్ధికి బాటలు వేశాయని జెఫ్రీస్ ఈక్విటీ రీసెర్చ్ పేర్కొంది. 2030 నాటికి భారత స్టాక్ మార్కెట్ విలువ 10 లక్షల కోట్ల డాలర్లకు చేరుకోవచ్చని తాజా నివేదికలో అంచనా వేసింది. గడిచిన 10, 20 ఏళ్లలో స్థిరంగా 10-12 శాతం సమ్మిళిత వార్షిక వృద్ధిరేటును (సీఏజీఆర్) నమోదు చేసుకోవడం ద్వారా భారత్ ఐదో అతిపెద్ద ఈక్విటీ మార్కెట్‌గా ఎదిగిందని ప్రస్తావించింది. నిరంతర సంస్కరణలు వేగంగా వృద్ధి చెందుతున్న బడా ఆర్థిక వ్యవస్థగా భారత్‌కున్న హోదాను కొనసాగేందుకు దోహదపడనున్నాయి. గడిచిన పదేళ్లలో ఏటేటా 7 శాతం సంచిత వృద్ధి ద్వారా భారత్ జీడీపీ ప్రస్తుతం 3.6 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరుకుంది. దాంతో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల జాబితాలో 8 నుంచి 5వ స్థానానికి ఎగబాకింది. వచ్చే నాలుగేళ్లలో 5 లక్షల కోట్ల డాలర్ల జీడీపీతో జపాన్, జర్మనీని వెనక్కి నెట్టి మూడో అతిపెద్ద ఎకానమీగా అవతరించనుందని జెఫ్రీస్ పేర్కొంది.

డీహెచ్‌ఎఫ్‌ఎల్ మాజీ ప్రమోటర్ల బ్యాంక్, డీమ్యాట్ ఖాతాల జప్తు
ఆదేశాలు జారీ చేసిన సెబీ

న్యూఢిల్లీ: దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (డీహెచ్‌ఎఫ్‌ఎల్) మాజీ ప్రమోటర్లు ధీరజ్ వాధవాన్, కపిల్ వాధవాన్‌ల బ్యాంక్ ఖాతాలతోపాటు వారి డీమ్యాట్ ఖాతాల్లోని షేర్లు, మ్యూచువల్ ఫండ్ల యూనిట్ల జప్తునకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఆదేశించింది. వారి నుంచి రూ.22 లక్షలకు పైగా బకాయిల వసూలు కోసం సెబీ గురువారం ఈ ఆదేశాలు జారీ చేసింది. సమాచార వెల్లడి నిబంధనల ఉల్లంఘన కేసులో గత ఏడాది జూలైలో విధించిన జరిమానాను వీరు చెల్లించడంలో విఫలమైన నేపథ్యంలో సెబీ ఈ నిర్ణయం తీసుకుంది.

బైజూస్ రవీంద్రన్‌పై ఈడీ లుకౌట్ నోటీసు

న్యూఢిల్లీ: ఎడ్యుటెక్ కంపెనీ బైజూస్ ప్రమోటర్ రవీంద్రన్ కష్టాలు మరింత తీవ్రమయ్యాయి. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) కింద ఆయనకు జారీ చేసిన లుకౌట్ నోటీసును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరింత కఠినం చేసింది. ఆయన విదేశాలకు వెళ్లినా, విదేశాల నుంచి వచ్చినా ఇమ్మిగ్రేషన్ అధికారులు ఆ విషయాన్ని వెంటనే తమకు తెలియజేయాని ఆదేశాలు జారీ చేసింది. దర్యాప్తు అధికారి అనుమతితో మాత్రమే రవీంద్రన్ రాకపోకలు సాగించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

నేడు వాటాదారుల ఈజీఎం: మరోవైపు బైజూస్ ఈక్విటీలో 30 శాతం వాటా ఉన్న ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థలు శుక్రవారం అత్యవసర సర్వసభ్య సమావేశానికి పిలుపు ఇచ్చాయి. కంపెనీ విలువ 2,200 కోట్ల డాలర్ల (సుమారు రూ.1.82 లక్షల కోట్లు) నుంచి 20 కోట్ల డాలర్లకు (సుమారు రూ.1,660 కోట్లు) పడిపోవడానికి కారణమైన రవీంద్రన్, ఆయన కుటుంబ సభ్యులను బోర్డు నుంచి తొలగించడమే ఈ సమావేశం ప్రధాన అజెండా కానుంది. ఈ ఈజీఎంను ఆపాలని రవీంద్రన్, ఆయన కుటుంబ సభ్యులు చేసిన అభ్యర్థనను కర్ణాటక హైకోర్టు ఇప్పటికే తోసిపుచ్చింది. అయితే రవీంద్రన్, ఆయన కుటుంబ సభ్యులను తొలగిస్తూ ఈజీఎంలో తీర్మానం చేసినా, అది మార్చి 13న జరిగే తమ విచారణకు లోబడి ఉంటుందని స్పష్టం చేసింది.

బ్రైట్‌కామ్ గ్రూప్ పద్దుల తనిఖీకి ఎంసీఏ ఆదేశం

హైదరాబాద్: బ్రైట్‌కామ్ గ్రూప్‌లో అవకతవకల ఆరోపణల నేపథ్యంలో ఆ కంపెనీ పద్దులు తనిఖీ చేయాలని కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంసీఏ) హైదరాబాద్‌లోని రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్‌ను ఆదేశించింది. పద్దులను తారుమారు చేశారంటూ వచ్చిన అన్ని ఆరోపణలపై సమగ్రంగా దర్యాప్తు జరుగుతుందని ఎంసీఏ అధికారులు ప్రకటించారు. హైదరాబాద్‌కు చెందిన ఈ డిజిటల్ మార్కెటింగ్ కంపెనీ ఇప్పటికే ఫెమా కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తును ఎదుర్కొంటోంది.

27న వొడాఫోన్ ఐడియా బోర్డు భేటీ

న్యూఢిల్లీ: వొడాఫోన్ ఐడియా నిధుల సమీకరణకు సిద్ధమవుతోంది. దీనిపై నిర్ణయం తీసుకునేందుకు కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఈ నెల 27న సమావేశమవుతోంది. దేశ, విదేశీ మదుపరులకు ఈక్విటీ షేర్లు లేదా కన్వర్టబుల్ డిబెంచర్లు జారీ చేయడం ద్వారా నిధులు సమీకరించాలని కంపెనీ మేనేజ్‌మెంట్ భావిస్తోంది.

బిజినెస్

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ షేర్ల దూకుడు

హైదరాబాద్ కేంద్రంగా పని చేసే ఒలెక్ట్రా గ్రీన్ టెక్ కంపెనీ షేర్లు గురువారం బీఎస్‌ఈలో ఇంట్రా డేలో 7.73 శాతం పెరిగి రూ.2,222 ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిని తాకాయి. చివరికి రెండు శాతం లాభంతో రూ.2,103.85 వద్ద ముగిశాయి. బృహన్ ముంబై ఎలక్ట్రిక్ సప్లయ్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్ (బీఈఎస్‌టీ) నుంచి రూ.4,000 కోట్ల విలువైన 2,400 ఎలక్ట్రిక్ బస్సుల సరఫరాకు ఆర్డర్ లభించిందన్న వార్తలు ఇందుకు దోహదం చేశాయి. గత ఏడాది కాలంలో ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ షేర్లు మదుపరులకు దాదాపు 447 శాతం లాభాలు పంచాయి.

అపోలో మైక్రోసిస్టమ్స్‌కు ఎస్‌బీఐ రుణం

హైదరాబాద్: తాము హైదరాబాద్‌లోని హార్డ్‌వేర్ పార్క్‌లో చేపడుతున్న కొత్త ప్రాజెక్టు కోసం ఎస్‌బీఐ రూ.110 కోట్ల రుణం మంజూరు చేసిందని అపోలో మైక్రో సిస్టమ్స్ లిమిటెడ్ (ఏఎంఎస్‌ఎల్) ప్రకటించింది, రక్షణ ఉత్పత్తుల తయారీ కోసం తాము తెలంగాణ ప్లాంట్‌పై రూ.210 కోట్లు పెట్టుబడి పెడుతున్నట్టు కంపెనీ వెల్లడించింది. ఈ రుణంతో పాటుగా తమకు గతంలో ఇచ్చిన రుణసదుపాయం రెన్యూ చేసి 2025 ఫిబ్రవరి 8వ తేదీ వరకు అంటే 12 నెలల పాటు గడువు పొడిగింపునకు కూడా ఎస్‌బీఐ అనుమతించినట్టు తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,630 ▼	57,500 ▼	76,500 ▼
ముంబై	62,160 ▼	56,930 ▼	70,400 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



22వ తేదీ	
హైదరాబాద్	534
23వ తేదీ	
చిత్తూరు	603
గోదావరి	515
విజయవాడ	515
విశాఖపట్నం	525
వరంగల్	536

డజను గుడ్లు రూ.72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	140
వరంగల్	140
కరీంనగర్	140
మహబూబ్‌నగర్	140
కర్నూలు	140
విశాఖపట్నం	127
గోదావరి	144
విజయవాడ	144
గుంటూరు	144
ఒంగోలు	144
చిత్తూరు	142



సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

సీఎం చిత్రపటానికి అర్చకుల క్షీరాభిషేకం

- పెండింగ్ వేతనాలు చెల్లించినందుకు రేవంత్‌కు కృతజ్ఞతలు

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న తమ వేతనాలను విడుదల చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ధూప దీప నైవేద్య అర్చకులు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మంథని, ఉప్పల్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా పలు ఆలయాల్లో ఆయన పేరు మీద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధూపదీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నంబోట్ల ఫణి కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 6500 మంది అర్చకులకు ఏడు నెలల పెండింగ్ వేతనాలు విడుదల చేసి గ్రామీణ ప్రాంత అర్చకుల కుటుంబాలను సీఎం రేవంత్ ఆదుకున్నారని అన్నారు. సీఎంతో పాటు వేతన సమస్య పరిష్కారానికి కృషి చేసిన మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్‌కు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవశర్మ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ మాట తీరు మార్చుకోవాలి: నిరంజన్‌రెడ్డి

- సీఎం వాస్తవాలు మాట్లాడాలి: శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు పద్ధతిగా లేవని బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌ను ఇష్టానుసారం తిట్టడం తగదని, ఆయన మాట తీరు మార్చుకోవాలని సూచించారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతున్న మాటలకు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. పాలమూరు జిల్లా అభివృద్ధిపై సీఎం హోదాలోనైనా రేవంత్ వాస్తవాలు మాట్లాడితే బాగుంటుందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సూచించారు. కేసీఆర్ పాలనలో వలసలు ఆగాయన్నారు. కొడంగల్ ఎత్తిపోతలపై పునరాలోచించాలని కోరారు. 15 శాతం పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టును నాలుగైదు నెలల్లో పూర్తిచేయొచ్చని, దానిపై అధికారులతో సమీక్షించుకోవాలని సూచించారు. బీఆర్ఎస్‌కు ఏ పార్టీతో పొత్తు అవసరం లేదన్నారు.

టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా దుర్గారావు



చంద్రబాబుతో వెలివెల దుర్గారావు

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం తెలంగాణ అధ్యక్షుడిగా వెలివెల దుర్గారావు నియమితులయ్యారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆమోదంతో దుర్గారావు అధ్యక్షుడిగా 63 మంది సభ్యులతో రాష్ట్రంలో కొత్తగా వాణిజ్య విభాగం కమిటీని ఏర్పాటు చేశామని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి గురువారం తెలిపారు. రాష్ట్రంలోని 17 పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని నాయకులకు ఈ కమిటీలో ప్రాతినిధ్యం కల్పించినట్లు ఆయన చెప్పారు. త్వరలో పార్టీ వాణిజ్య విభాగానికి జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు దుర్గారావు తెలిపారు.

తలసరి ఆదాయ వృద్ధిలో రాష్ట్రమే నెం.1: కేటీఆర్

గత ఐదేళ్లలో తలసరి ఆదాయం వృద్ధిలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కె.తారకరామారావు అన్నారు. గత ఐదేళ్లలో తలసరి ఆదాయం వృద్ధికి సంబంధించిన గణాంకాలను ఆయన గురువారం ఎక్స్(ట్విటర్)లో ప్రస్తావిస్తూ.. ఈ గణాంకాలు తెలంగాణ అభివృద్ధిని చాటిచెబుతున్నాయని, ధన్యవాదాలు కేసీఆర్ అని పేర్కొన్నారు.

జూనియర్ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేత!

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జూనియర్ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు పి.మధుసూదన్‌రెడ్డిపై సస్పెన్షన్‌ను ఎత్తివేశారు. ఈ మేరకు గురువారం విద్యాశాఖ కార్యదర్శి వెంకటేశం ఉత్తర్వులను జారీ చేశారు. 2019 అక్టోబరులో ఏసీబీ కేసులో ఆయనను అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనపై సస్పెన్షన్ వేటు చేశారు. 2018లో ఇంటర్మీడియట్ పరీక్షల్లో గందరగోళం నెలకొనడానికి గ్లోబరీనా సంస్థయే కారణమని మధుసూదన్‌రెడ్డి అప్పట్లో విమర్శించారు. ఈ విమర్శ కారణంగానే తనపై ఏసీబీ కేసులు, అరెస్ట్, సస్పెన్షన్ వంటి చర్యలకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో తాజాగా ఆయనపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేశారు. సస్పెండ్ అయిన సమయంలో ఆయన పోస్టింగ్ సరూర్‌నగర్ జూనియర్ కాలేజీలో ఉండేది. అయితే, ఇప్పుడు అక్కడ కాకుండా నాన్‌లోకల్‌లో ఆయనకు పోస్టింగ్ ఇవ్వాలని విద్యాశాఖ కార్యదర్శి ఆదేశించారు.



ఎమ్మెల్యేకు చెందిన కళాశాల షెడ్ల కూల్చివేత!

- చెరువులో మర్రి రాజశేఖర్‌రెడ్డి కాలేజీ
- 20 ఏళ్లుగా ఆక్రమణలో దుండిగల్ చిన్నదామెర చెరువు
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల పరిధిలో కళాశాల నిర్మాణాలు
- కోర్టు, ప్రభుత్వ ఆదేశాలతో అధికారుల చర్యలు

దుండిగల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి (మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అల్లుడు), ఆయన తండ్రి లక్ష్మణ్‌రెడ్డికి చెందిన ఏరోనాటికల్, ఎంఎల్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాలల అక్రమ నిర్మాణాల కూల్చివేత గురువారం ప్రారంభమైంది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్‌లో స్థానికుల నుంచి భూములు కొని వీరు 20 ఏళ్ల కిందట ఈ కళాశాలను నిర్మించారు. అయితే, పక్కనే ఉన్న చిన్న దామెర చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్ భూములలో ఆక్రమణలకు పాల్పడ్డారు. దుండిగల్ పంచాయతీ, మున్సిపాలిటీ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను మేనేజ్ చేస్తూ వస్తున్నారు. అయితే, దీనిపై కొందరు హైకోర్టులో ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లో ఆక్రమణకు గురైన 15 చెరువులపై చర్యలు తీసుకోవాలంటూ న్యాయస్థానం తీర్పునివ్వడం, రాష్ట్ర ప్రభుత్వం కూడా చర్యలు తీసుకోవాలని ఆదేశాలివ్వడంతో అధికార యంత్రాంగం కదిలింది. నాలుగు రోజుల క్రితం చెరువుల రక్షణ కోసం హై కోర్టు నియమించిన కమిటీ కళాశాలను సందర్శించింది. ఈ నెల 20న మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ చిన్న దామెర చెరువును, ఎఫ్‌టీఎల్‌లోని భవనాలను పరిశీలించారు. బుధవారం జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి ఎంఎల్ఆర్ఐటీ కళాశాలపైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో దుండిగల్ తహసీల్దార్ మతిన్, కమిషనర్ కల్వకుంట్ల సత్యనారాయణ, ఇరిగేషన్ ఏఈ సార తదితరులు గురువారం ఎక్స్‌కావేటర్లు, సిబ్బందితో వచ్చారు. కళాశాల బస్సుల పార్కింగ్ కోసం వేసుకున్న రోడ్డును తొలగించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో ఐదు రేకుల షెడ్లు, క్యాంటీన్, కళాశాల భవనం ఒకటి ఉన్నట్లు అధికారుల సర్వేలో తేలింది. గురువారం క్యాంటీన్, మరో నాలుగు షెడ్లు, అక్రమంగా వేసిన మట్టి రోడ్డును తొలగించారు. భవనానికి నోటీసులు ఇచ్చి కూల్చివేస్తామని అధికారులు తెలిపారు. అక్రమ నిర్మాణాలను పూర్తిగా కూలగొట్టాలంటే కనీసం మూడు రోజులు పడుతుందని చెప్పారు. తెలిపారు. కాగా, కూల్చివేతల కంటే ముందు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను గుర్తించి మార్కింగ్ చేశారు. దాని పరిధిలోని అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని స్పష్టం చేశారు.

మా ఇలవేల్పు యాదాద్రీశుడు!

- సీఎం రేవంత్ రెడ్డి సతీమణి గీత
- కుటుంబంతో కలిసి నృసింహుడి దర్శనం
- ఆలయ మర్యాదలతో అర్చకుల స్వాగతం



సీఎం రేవంత్ సతీమణి గీత, కుటుంబసభ్యులను ఆశీర్వదిస్తున్న అర్చక బృందం

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 22: యాదగిరిగుట్ట లక్ష్మీనారసింహుడు తమ ఇలవేల్పు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీమణి గీత అన్నారు. తన తల్లిదండ్రుల వివాహం యాదగిరీశుడి సన్నిధిలోనే జరిగిందని చెప్పారు. గురువారం తల్లిదండ్రులు పారిజాత, పద్మారెడ్డి, కుమార్తె నైమిష, అల్లుడు సత్య నారాయణ రెడ్డి, మనుమడు రియాంశ్‌తో కలిసి ఆమె యాదాద్రీశుడిని దర్శించుకున్నారు. సాయంత్రం 5.15 గంటలకు తన కుటుంబసభ్యులతో కలిసి గీత యాదగిరిగుట్టకు వచ్చారు. ప్రెసిడెన్షియల్ సూట్‌లోని విల్లాలో కాసేపు సేద తీరారు. అక్కడే మనుమడు రియాంశ్‌కు తలనీలాల మొక్కులో భాగంగా ఐదు కత్తెర్లు సమర్పించారు. 6.30కు గీత, ఆమె కుటుంబసభ్యులు కొండపైకి చేరుకుని పడమటి దిశలోని లిఫ్టు గుండా ప్రధానాలయ ఉత్తర తిరువీధిలోకి.. అక్కడి నుంచి ఉత్తర పంచతల రాజగోపురం నుంచి ప్రధానాలయంలోనికి ప్రవేశించారు. అక్కడ దేవస్థాన అర్చకులు ఆలయ మర్యాదలతో వారికి ఘనంగా స్వాగతం పలికారు. కుటుంబసభ్యులతో కలిసి గీత.. ప్రధానాలయ ముఖమండపంలోని ధ్వజస్తంభానికి మొక్కి, గర్భాలయంలోని స్వయంభువుల దర్శనాలకు తరలివెళ్లారు. మూలమూర్తులను, ప్రతిష్ఠా అలంకార సువర్ణమయ మూర్తులను దర్శించుకుని ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవమూర్తుల చెంత సువర్ణ పుష్పార్చన పూజల్లో పాల్గొన్నారు. హుండీలో కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజల అనంతరం అర్చకులు ఆమెకు క్షేత్ర విశిష్టతను వివరించి ప్రాకార మండపంలో చతుర్వేదాశీర్వచనం చేశారు. దేవస్థాన ఈవో రామకృష్ణారావు స్వామివారి అభిషేకం లడ్డూ ప్రసాదాలను అందజేశారు. ప్రధానాలయం నుంచి రాత్రి 7 గంటలకు బయటకు వచ్చిన ఆమె దేవస్థాన అర్చకులు, సిబ్బందితో యాదగిరిగుట్ట దేవస్థానానికి తన పుట్టింటికి ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. కుటుంబసభ్యులతో కలిసి ఇష్టదైవాన్ని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. 7.20గంటలకు ప్రెసిడెన్షియల్ సూట్ వద్దకు వెళ్లి అక్కడినుంచి 7.30గంటలకు హైదరాబాద్‌కు ప్రయాణమయ్యారు.

యూపీఏ హయాం.. కుంభకోణాలమయం

అందుకే దేశ ప్రజలు బీజేపీకి పట్టం కట్టారు.. ఇప్పుడు ప్రపంచ దేశాలను భారత్ శాసిస్తోంది

- మోదీ వల్లే ఇది సాధ్యమైంది: కిషన్‌రెడ్డి
- 17ఎంపీ సీట్లు గెలిస్తేనే రాష్ట్రానికి నిధులు
- మీ ఓటు రాముడికా.. రాక్షసులకా?: బండి
- 'పట్నం'కు బుద్ధి చెప్పాలి: ఎంపీ లక్ష్మణ్
- అప్పుకోసం కేంద్రం చుట్టూ సీఎం చక్కర్లు
- 6 గ్యారెంటీల్లో అమలైంది ఒక్కటే: ఈటల
- రాష్ట్రవ్యాప్తంగా విజయ సంకల్ప యాత్రలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి

"యూపీఏ హయాంలో అనేక కుంభకోణాలు జరిగాయి. 2జీ స్పెక్ట్రం, కామన్‌వెల్త్ గేమ్స్, బొగ్గు స్కామ్ తోపాటు ఇతర కుంభకోణాల్లో అధికారిక లెక్కల ప్రకారమే రూ.12లక్షల కోట్లు అవినీతి జరిగింది" అని యని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ తీరుతో విసుగు చెంది 2014లో బీజేపీకి ప్రజలు పట్టం కట్టారని పేర్కొన్నారు. విజయ సంకల్పయాత్రలో భాగంగా ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ పాలనలో అన్ని రంగాల్లో దేశం అభివృద్ధి చెందిందని చెప్పారు. ప్రపంచ దేశాలను శాసించే స్థాయికి భారత్ చేరుకుందని, మోదీ వల్లే ఇదంతా సాధ్యమైందని స్పష్టంచేశారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.

పోడుభూములకు పట్టాలు ఇవ్వాలి

ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద నిధులు లేవని, అప్పుల కోసం సీఎం రేవంత్ కేంద్రం చుట్టూ చక్కర్లు కొడుతున్నారని బీజేపీ నేత ఈటల రాజేందర్ విమర్శించారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పటి వరకు ఒక్క పథకాన్ని మాత్రమే అమలు చేసిందన్నారు. రుణమాఫీ, రైతుబంధు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు రూ.2500, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి, ఉట్నూర్, జైనూరు మండలాల్లో చేపట్టిన బీజేపీ విజయ సంకల్ప యాత్రలో ఆయన మాట్లాడారు. ఆదివాసీలతోపాటు తరతరాలుగా గిరిజనేతరులు సాగు చేస్తున్న భూములకు కూడా హక్కు పత్రాలు ఇవ్వాలని, పంట రుణాలతో పాటు రైతు బంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల పేరిట గత ప్రభుత్వం పచ్చి దగా చేసిందని ధ్వజమెత్తారు. కాగా, చేవెళ్ల అభివృద్ధిని విస్మరించిన చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ప్రజలు రాజకీయంగా బొంద పెట్టడం ఖాయమని ఎమ్మెల్యే ఎ.మహేశ్వర్ రెడ్డి అన్నారు. చేవెళ్లలో బీజేపీ విజయ సంకల్ప యాత్రలో భాగంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో షాబాద్ మండలం సీతారాంపూర్‌లోని 1,100ఎకరాల ఆలయ భూమిని అప్పనంగా పారిశ్రామిక వేత్తలకు అప్పగించారని, వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకునే దాకా పోరాటం చేస్తామన్నారు. పట్నం మహేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఊసరవెల్లిలా రంగులు మార్చుతూ ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరుతారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ విమర్శించారు. రంగారెడ్డి జిల్లాలోని షాబాద్, నాగరగూడ, హైతాబాద్ గ్రామాల్లో విజయ సంకల్ప యాత్ర సాగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ పని అయిపోయిందన్నారు.

హామీలు ఎలా అమలు చేస్తారు?

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ 17 సీట్లు గెలిస్తేనే కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు అందుతాయని బండి సంజయ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ఆయన మాట్లాడుతూ రెండు నెలల్లోనే రూ.10వేల కోట్ల అప్పు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. హామీలను ఎలా అమలు చేస్తుందని నిలదీశారు. 'రేవంతన్న మంచోడే.. 200యూనిట్ల ఉచిత విద్యుత్తు, రూ.500కు గ్యాస్ సిలిండర్లు ఇస్తామంటున్నాడు. కానీ వాటికి నిధులు ఎక్కడి నుంచి తెస్తారు? కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాదు. మళ్లీ మోదీపైనే ఆధారపడాలి. అందుకే బీజేపీని గెలిపించేందుకు వారూ సహకరించాలి"అని కోరారు. తాము కేసీఆర్‌తో పొత్తుపెట్టుకునే అవకాశమే లేదన్నారు. దేశంలో రాముడి పాలన కావాలో.. లేక రాక్షసుల పాలన కావాలో ఓటర్లు తేల్చుకోవాలని సూచించారు.

జలాశయాలపై ఫ్లోటింగ్ సోలార్ విద్యుదుత్పత్తి

- డీపీఆర్‌లు సిద్ధం చేయండి
- డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం



హైదరాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్ అవసరాలు తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. పునరుత్పాదక విద్యుత్తును ప్రోత్సహించడంలో భాగంగా జలాశయాలపై ఫ్లోటింగ్ (తేలియాడే) సోలార్ విద్యుదుత్పత్తి చేయబోతున్నామని పేర్కొన్నారు. గురువారం సచివాలయంలో జలాశయాలపై ఫ్లోటింగ్ సోలార్ విద్యుదుత్పత్తిపై మంత్రి ఉత్తమ్‌తో కలిసి సింగరేణి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు జలాశయాల్లో 1,000మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ విద్యుదుత్పత్తి లక్ష్యంగా ప్లాంట్ల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీటి ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసి మత్స్య సంపదకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా డీపీఆర్‌లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కాలుష్యరహిత విద్యుదుత్పత్తికి ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తుందన్నారు. మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. ఫ్లోటింగ్ సోలార్ విద్యుదుత్పత్తికి ఇరిగేషన్‌శాఖ నుంచి ప్రోత్సాహం ఉంటుందన్నారు. ప్రభుత్వ నిధులతో చేపట్టే జలాశయాలపై ఫ్లోటింగ్ సోలార్ విద్యుదుత్పత్తికి సింగరేణి ముందుకు రావడంపై హర్షం వ్యక్తంచేశారు. సింగరేణి సీఎండీ బలరాం మాట్లాడుతూ సింగరేణి ఆధ్వర్యంలో 300 మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తికి పనులు మొదలుపెట్టామన్నారు. మల్లన్నసాగర్, లోయర్ మానేర్ జలాశయాలపై ఫ్లోటింగ్ సోలార్ విద్యుదుత్పత్తి ప్రణాళికలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

నీ కుర్చీనే నీకు తెలియకుండా లాగేశారు

నువ్వేనా కాంగ్రెస్ గురించి మాట్లాడేది?.. ఎంపీ బండి సంజయ్‌పై జగ్గారెడ్డి విసుర్లు

- ముందు మోదీ పథకాలపై స్పష్టత ఇవ్వు
- ఆ తర్వాత కాంగ్రెస్ పథకాలపై మాట్లాడు
- కేసీఆర్ ప్యాకేజీతో పార్టీ అధ్యక్షుడివైన నీకు కాంగ్రెస్ గురించి మాట్లాడే అర్హత లేదు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిపై ధ్వజం



గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): "నీ కుర్చీనే నీకు తెలియకుండా లాగేసుకున్నరు నీ పార్టీ వాళ్లు. ఆ సోయి కూడా లేకుండా పోయింది నీకు. కుర్చీని కాపాడుకునే శక్తి లేని నువ్వు.. కాంగ్రెస్ గురించి మాట్లాడుతున్నవా?" అని బీజేపీ నేత బండి సంజయ్‌పై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫైర్ అయ్యారు. ఏ కారణం లేకుండా బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి బండి సంజయ్‌ను తప్పించి.. ఆఘమేఘాల మీద కిషన్‌రెడ్డిని ఆ సీట్లో ఎందుకు కూర్చోపెట్టారో సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. కేసీఆర్ ప్యాకేజీలో భాగంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పదవి దక్కించుకున్న కిషన్‌రెడ్డి కూడా కాంగ్రెస్ గురించి మాట్లాడేటోడు అయ్యాడా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌ను తిడుతున్నాడని చెప్పి.. బండి సంజయ్‌ను రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పించారని, కేసీఆర్ ప్యాకేజీలో భాగంగానే కిషన్‌రెడ్డి ఆ ప్లేస్‌లోకి వచ్చారంటూ బీజేపీ నేతలే చెబుతున్నారన్నారు. గాంధీభవన్‌లో గురువారం జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ ఇచ్చిన హామీల అమలు గురించి ముందుగా స్పష్టత ఇచ్చి.. ఆ తర్వాత కాంగ్రెస్ హామీల గురించి కిషన్‌రెడ్డి మాట్లాడాలని సూచించారు. ఏది మాట్లాడాలో.. ఏది మాట్లాడకూడదన్న ఇంగిత జ్ఞానం కూడా కిషన్‌రెడ్డికి లేనట్లుగా ఉందన్నారు. "కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు నెలలే అయింది. వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకాన్ని అమలు చేసింది. ఇది కిషన్‌రెడ్డి కళ్లకు కనిపించట్లేదా?"అని ప్రశ్నించారు. నల్లధనం తెచ్చి పేదల ఖాతాల్లో రూ.15లక్షల చొప్పున వేస్తామని చెప్పిన మోదీ.. ఇంతవరకు దాన్ని అమలు చేయలేదని గుర్తు చేశారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేశారని దుయ్యబట్టారు. ఇక, కిషన్‌రెడ్డికి కాంగ్రెస్‌ను ప్రశ్నించే అర్హత ఎక్కడిదని నిలదీశారు. "ఇద్దరం కలిసి ఆర్టీసీ బస్సెక్కుదాం. ఉచిత ప్రయాణ పథకం అమలవుతుందా? లేదా? అని అందులో ప్రయాణిస్తున్న మహిళలను అడుగుదాం. నువ్వు ఒక్క సారి వస్తే మహిళలు ఎంత సంతోషంగా ఉన్నారో తెలుస్తది. నీకు ఆ ధైర్యం ఉందా?" అని కిషన్‌రెడ్డిని నిలదీశారు. బీజేపీ సంసారమే సక్కగ లేదని, తమ పార్టీ ఇన్‌చార్జిల గురించి ఆ పార్టీ నేతలకు ఎందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలపై బురద చల్లాలని చూస్తున్న బీజేపీ నేతలు.. ముందు వారి పార్టీపైన ఉన్న బురద కడుక్కోవాలని సూచించారు. "బెంజ్ కారు పెద్ద పనా? నెలకు రూ.లక్ష కడితే కారు వస్తది. బెంజ్ కారు గిఫ్ట్‌గా ఇచ్చారనడం నవ్వులాట. ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌కు ఫైండ్ పాడై ఏదేదో మాట్లాడుతున్నాడు. ఎలా విమర్శించాలో కూడా బీజేపీకి తెలియట్లేదు"అని ఎద్దేవాచేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో తాను ఓడిపోయినా.. ప్రజలను సంతోషంగా ఉంచే ప్రభుత్వం వచ్చినందుకు గర్వంగా ఉందన్నారు. కాంగ్రెస్ గెలిచిందన్న ఆనందంలో తాను ఓడిపోయిన బాధ మర్చిపోయానన్నారు. జగ్గారెడ్డి.. పదవులకు ఆశపడేటోడు కాదని, తన అవసరం ఉంటే.. పార్టీ గుర్తించి పదవి ఇస్తుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 14 సీట్లు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పొద్దుతిరుగుడు కొనుగోళ్లు

- నేడు సిద్దిపేట జిల్లాలో కేంద్రాలు
- తర్వాత మిగతా జిల్లాల్లోనూ..
- ఎమ్మెస్పీకే విక్రయించాలి: తుమ్మల



హైదరాబాద్, ఖమ్మం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద కనీస మద్దతు ధరకు పొద్దుతిరుగుడు పంటను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పొద్దుతిరుగుడు పంట ధర రోజురోజుకు పడిపోతున్న క్రమంలో రైతులు నష్టపోకుండా శుక్రవారం నుంచి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలు జారీ చేశారు. తొలుత సిద్దిపేట జిల్లాలో కేంద్రాలు ఏర్పాటు చేసి.. ఆ తర్వాత అవసరానికి అనుగుణంగా నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి తదితర జిల్లాల్లోనూ సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఈ యాసంగి సీజన్‌లో 21,350 ఎకరాల్లో రైతులు పొద్దుతిరుగుడు సాగు చేశారు. సిద్దిపేట జిల్లాలో రైతులు కాస్త ముందుగా సాగు చేయటంతో.. పంట చేతికొచ్చింది. రైతులు మార్కెట్‌కు తీసుకెళ్తే క్వింటాలుకు రూ.4,200 చొప్పున మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. పొద్దుతిరుగుడు కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ) క్వింటాలుకు రూ.6,760 ఉండగా.. ట్రేడర్ల నిర్వాకంతో రైతులు క్వింటాలుకు రూ.2,500 మేర నష్టపోవాల్సి వస్తోంది. పంట సేకరణకు రాష్ట్రంనుంచి కేంద్రానికి ప్రతిపాదనలు వెళ్లినా ఇంతవరకు అనుమతి రాలేదు. కేంద్రం అనుమతినిచ్చినా, ఇవ్వకపోయినా ముందుగా మార్క్‌ఫెడ్ సెంటర్లు తెరవాలని రాష్ట్ర సర్కారు నిర్ణయించింది. పొద్దుతిరుగుడు పండించిన రైతులు తొందరపడి తక్కువ ధరకు అమ్ముకోవద్దని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కనీస మద్దతు ధరకు అమ్ముకోవాలని రైతులకు సూచించారు. మరోవైపు, ఇదే విషయమై మాజీ మంత్రి హరీశ్‌రావు మంత్రి తుమ్మలకు బహిరంగ లేఖ రాశారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పొద్దుతిరుగుడు పంటను మద్దతు ధరకు కొనాలని అందులో కోరారు.

రైతు ఆందోళనకు నా మద్దతు

ఢిల్లీలో రైతులు చేస్తున్న ఆందోళనకు మంత్రిగానే కాకుండా ఒక రైతుగా తన మద్దతు ప్రకటిస్తున్నానని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. గురువారం ఖమ్మం జిల్లా తల్లాడ మండలం అన్నారుగూడెంలో ఉద్యానవన శాఖ సబ్సిడీతో నిర్మించిన ప్రైవేటు ఏసీ గోదాంను మంత్రి తుమ్మల ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు కావాలని కోరుతూ హరియాణా, పంజాబ్ రైతులు రోడ్డెక్కి చేస్తున్న ఉద్యమానికి మంత్రిగా తెలుపుతున్నానన్నారు.

ఎంపీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌తో కలిసే..

- మోదీకి పాదపూజ చేస్తున్న ఏపీ సీఎం జగన్
- రైతులపై దాడులు అమానుషం: నారాయణ

హైదరాబాద్, :ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్, సీపీఐ కలిసే పోటీ చేస్తాయని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పేర్కొన్నారు. ఖమ్మం, నల్లగొండ, భువనగిరి, వరంగల్, పెద్దపల్లి స్థానాల్లో ఏదో ఒకటి కేటాయించాలని కోరామన్నారు. కాంగ్రెస్, సీపీఐ మధ్య సీట్ల సర్దుబాటు కుదిరితే మంచి ఫలితాలు వస్తాయని, ఒక్క సీటు కూడా ఇవ్వకపోతే తామేం చేయాలని ప్రశ్నించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సమావేశం అనంతరం నారాయణ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 30 స్థానాల్లో పోటీ చేసేందుకు కార్యాచరణ రూపొందించుకున్నామన్నారు. ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం దాడులు చేయడం అమానుషమని, ఇప్పటికైనా వారి డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏపీ సీఎం జగన్.. మోదీకి పాదపూజ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్రానికి శాపంగా మారిందని, బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర సంపదనంతా తీసుకెళ్లి గోదావరి పాలు చేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. రైతుల ఉద్యమానికి మద్దతుగా 26న ధర్నాలు నిర్వహిస్తావన్నారు.

బీజేపీని గద్దెదించడమే లక్ష్యం: రాఘవులు

బీజేపీ అధికారంలో ఉంటే దేశ సమైక్యతకు ప్రమాదకరం అని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గద్దెదించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ, పన్ను బకాయిలు చెల్లించకుండా రాష్ట్రాలను మున్సిపాలిటీల స్థాయికి కేంద్రం దిగజార్చిందని విమర్శించారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రెండు ఎంపీ స్థానాల్లో సీపీఎం పోటీ చేస్తుందని చెప్పారు. పొత్తు ఉంటుందా లేదా అనేది కాంగ్రెస్ తేల్చాలని కోరారు. కలిసి ఎన్నికలకు వెళ్లే అవకాశాలు ఉన్నాయన్నారు.

ప్రేమను నిరాకరించాడని ట్యూటర్‌పై యువతి కక్ష

- ఆయన భార్య, కూతురి ఫొటోలు అభ్యంతరకరంగా మార్చి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్
- నిందితురాలి అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షల శిక్షణ కేంద్రంలోని అధ్యాపకుడు, తన ప్రేమను నిరాకరించడానే కోపంతో ఓ యువతి దుర్మార్గంగా ప్రవర్తించింది. ఆయన భార్య, 11ఏళ్ల కూతురు ఫొటోలను మార్ఫింగ్‌తో అభ్యంతరకర స్థితిలోకి మార్చి ఫేక్ ఐడీలతో సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. నిందితురాలు ఏపీలోని అనంతపురానికి చెందిన 24ఏళ్ల యువతి! ఆమె గ్రూప్-1 శిక్షణ నిమిత్తం హిమాయత్‌నగర్‌లోని ఓకోచింగ్ సెంటర్‌లో చేరింది. అక్కడ ఓ అధ్యాపకుడికి ప్రపోజ్ చేసింది. తనకు అప్పటికే పెళ్లయిందని ఆయన చెప్పినా, ప్రేమ పేరిట వేధింపులకు గురిచేసింది. చివరికి తన ప్రేమను తిరస్కరించాడని కక్ష పెంచుకొని.. ఆ అధ్యాపకుడి కుటుంబీకుల సమాచారం సేకరించింది. ఆయన భార్య, 11 ఏళ్ల కుమార్తె ఫొటోలను మార్ఫింగ్ చేసి.. పలు కోచింగ్ సెంటర్లకు సంబంధించిన ఇన్‌స్టా పేజీలపై అప్‌లోడ్ చేసింది. దీనిపై బాధితుడు ఈనెల 2న సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు, సాంకేతిక వివరాలను ఆధారంగా చేసుకొని నిందితురాలిని అరెస్టు చేశారు. ఆమె నుంచి రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోక్సో యాక్ట్‌తో పాటు ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.



సచివాలయంలో మంత్రి పొంగులేటి ఆకస్మిక తనిఖీ

- సమయపాలన పాటించని రెవెన్యూ విభాగం
- 11.45 గం.లు దాటినా రాని అధికారులు, సిబ్బంది
- మంత్రి తీవ్ర ఆగ్రహం.. చర్యలకు ఆదేశాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ విభాగాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఉదయం 11.45 గంటల వరకు కూడా పూర్తి స్థాయిలో అధికారులు, సిబ్బంది హాజరు కాలేదు. దీంతో మంత్రి పొంగులేటి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది ఉద్యోగులు ముందస్తు సమాచారం లేకుండా ఆఫీసుకు గైర్హాజరు కావడం, మరి కొంత మంది సమయపాలన పాటించకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. సమయానికి విధులకు రాకపోవడం బాధ్యతరాహిత్యమని, వీరిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. మంత్రి ఉద్యోగుల హాజరు పట్టికలు పరిశీలించారు. రెవెన్యూ విభాగంలోని ఐదు సెక్షన్లో ఏ సెక్షన్ లో కూడా పూర్తిస్థాయిలో ఉద్యోగులు సమయానికి హాజరు కాలేదు. దీంతో మంత్రి మాట్లాడుతూ ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అధికారులు విధుల్లో అలక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

జెన్‌కో జేఎండీగా డి.కృష్ణ భాస్కర్ నియామకం

టీఎస్ జెన్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (ఫైనాన్స్ అండ్ కమర్షియల్)గా డి.కృష్ణ భాస్కర్‌ను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రి వద్ద ప్రత్యేక కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయనకు జేఎండీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ గురువారం జీవో జారీ చేశారు.

నాపై కుట్రపూరిత ఆరోపణలు చేస్తున్నారు

- న్యాయవాదిపై పరువునష్టం దావా వేసిన టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

డీజీపీ పదవి నుంచి గౌరవప్రదంగా రిటైరైన తనపై కుట్రపూరితంగా ఆరోపణలు చేస్తున్నారని రాపోలు భాస్కర్ అనే న్యాయవాదిపై టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పరువునష్టం దావా వేశారు. తాను టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా నియామకమైన వెంటనే ఆరోపణలకు తెరతీశారంటూ హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాపోలు భాస్కర్ తనపై ఆరోపణలు చేస్తూ ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేశారని.. ఆ ఫిర్యాదును పరిశీలించే సమయం కూడా ఇవ్వకుండా సామాజిక మాధ్యమాలు, మీడియాలో ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. కేసు పెండింగ్‌లో ఉండగా మహేందర్‌రెడ్డిపై ఎలాంటి వ్యాఖ్యలూ చేయరాదని భాస్కర్‌ను ఆదేశించిన కోర్టు.. తదుపరి విచారణ మార్చి 11కు వాయిదా వేసింది.

'సాగర్' మరమ్మతులకు కేఆర్ఎంబీ ఓకే

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 22: నాగార్జునసాగర్ ప్రాజెక్టుపై ప్రతి ఏటా వానాకాలం ప్రారంభానికి ముందు చేపట్టే మరమ్మతు పనులను తెలంగాణ నిర్వహించేందుకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) అనుమతినిచ్చింది. గతేడాది నవంబరులో సాగర్ ప్రాజెక్టుపై ఏపీ నీటి పారుదలశాఖ అధికారులు, పోలీసులు చొరబడి కంచె ఏర్పాటు చేయడం వివాదానికి దారితీసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కేంద్రం అనుమతులు లేనిదే ఏ పనులను చేయవద్దని సీఆర్‌పీఎఫ్ తెలంగాణను అడ్డుకుంది. మరోవైపు ప్రాజెక్టుపై నిర్వహణ ఎవరిదో తేలేంత వరకు ఎలాంటి పనులు చేపట్టవద్దని కోరుతూ కేఆర్ఎంబీకి ఏపీ లేఖ రాసింది. దీంతో స్పందించిన కేఆర్ఎంబీ.. రెండ్రోజులు అధికారులను ప్రాజెక్టు పరిశీలనకు పంపింది. ఈక్రమంలోనే గురువారం సాగర్‌కు చేరుకున్న కేఆర్ఎంబీ ఎస్ఈ వరలక్ష్మి, ఈఈ శివశంకర్.. ప్రాజెక్టుపై ఎక్కడికక్కడ నిలిచిపోయిన క్రేన్ ట్రాక్ మరమ్మతులు, కుడికాల్వ గేట్లపై రోడ్డు నిర్మాణ పనులు, స్పిల్‌వే మరమ్మతులు, సీసీ కెమెరాలు, సోలార్ ఫెన్సింగ్ పనులను పరిశీలించారు. ఎప్పటిలాగే నిర్వహణ పనులు తెలంగాణ చేపట్టేందుకు అనుమతినిచ్చారు.

సింగరేణిలో 272 ఉద్యోగాలకు నోటిఫికేషన్

- మార్చి 1 నుంచి దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఉద్యోగాల భర్తీకి గురువారం నోటిఫికేషన్ విడుదలైంది. మొత్తం 272 ఖాళీలను భర్తీ చేయనుండగా.. ఇందులో 256ఎగ్జిక్యూటివ్ క్యాడర్, 16 నాన్ ఎగ్జిక్యూటివ్ క్యాడర్ పోస్టులున్నాయి. వీటిలో మేనేజింగ్ ట్రైనీ (మైనింగ్)139, ఫైనాన్స్ అకౌంట్స్, పర్సనల్, ఐఈ, హైడ్రో జియాలజిస్ట్, సివిల్ విభాగాల్లో 74, జూనియర్ ఎస్టేట్ ఆఫీసర్ 10, జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్ 3, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ 30 పోస్టులున్నాయి. నాన్ ఎగ్జిక్యూటివ్ క్యాడర్‌లో సివిల్ గ్రేడ్-సీ పోస్టులు 16ఉన్నాయి. ఆయా పోస్టులకు మార్చి 1నుంచి 18 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చని సీఎండీ ప్రకటనలో వివరించారు.

మూసీకి ఇరువైపులా గోడ

- 55కిలోమీటర్ల మేర నిర్మాణం
- ఎలాంటి వరదనైనా తట్టుకునేలా ధృడంగా..

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో మూసీ ప్రవాహం క్రమపద్ధతిలో ఉండేందుకు నదికి ఇరువైలా గోడ (రిటైనింగ్ వాల్)ను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలిసింది. లండన్‌లోని థేమ్స్ నది మాదిరిగానే మూసీనదిని 55కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయాలని సర్కారు నిర్ణయించి. ఆమేరకు సుందరీకరణకు అడుగులు వేస్తోంది. కోల్‌కతాలోని హుగ్లీ నదికి కూడా రెండువైపులా రిటైనింగ్ వాల్ నిర్మించారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఎంఆర్‌డీసీఎల్ అధికారులు లండన్‌లో థేమ్స్ నదిని పరిశీలించిన సందర్భంలో క్రమపద్ధతిలో నది ప్రవహించడం వల్ల పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి అవకాశాలుంటాయని అంచనా వేశారు. అందులో భాగంగా మూసీనది ఇరువైపులా గోడను నిర్మించాలని నిర్ణయించిన్నట్లు తెలిసింది. ఈ గోడ సాధారణంగా కాకుండా ఎలాంటి ప్రవాహాన్నయినా తట్టుకొని ఉండేవిధంగా లంబకోణ త్రిభుజ ఆకారంలో గోడను నిర్మించాలని భావిస్తున్నారు. ఇరువైపులా ఈ విధమైన గోడ నిర్మాణంతో మున్ముందు బయటి భాగంలో ఫుట్‌పాత్‌లను, రోడ్లను ఏర్పాటు చేసుకోవడానికి అవకాశాలున్నాయని అంచనాలేస్తున్నారు. మూసీనది ఎత్తుపల్లాలను పరిశీలించి అనువైన ప్రాంతాల్లో కానీ, ఐదు కిలోమీటర్లకు ఒక చెక్ డ్యామ్ నిర్మించాలని భావిస్తున్నారు. దీంతో మూసీనది నిండుగా ప్రవహించనుంది. ఇరువైపులా గోడ ఉండటంతో క్రమపద్ధతిలో ప్రవాహం వల్ల బోటింగ్‌కు అవకాశాలుంటాయని భావిస్తున్నారు. సుందరీకరణలో భాగంగా మూసీనదిని మూడు జోన్లుగా విభజించారు. ఉస్మాన్‌సాగర్ నుంచి పురానాపూల్ వరకు ఎకోలాజికల్ జోన్‌గా.. పురానాపూల్ నుంచి చాదర్‌ఘాట్ వరకు హెరిటేజ్ జోన్‌గా.. చాదర్‌ఘాట్ నుంచి ఉప్పల్ వరకు మెట్రో జోన్‌గా నిర్ణయించారు. తొలిదశలో ఈ మూడు జోన్లను ప్రాధాన్య క్రమంలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

అధికారులపై సోమేశ్ ఒత్తిడి?

(మొదటిపేజీ తరువాయి)

రంగంలోకి దిగి.. సదరు ఉన్నతాధికారులపై ఒత్తిడి పెంచినట్లు తెలిసింది. ఐటీసీ అక్రమాల అంశాన్ని వదిలేయాలని, దాని గురించి పెద్దగా పట్టించుకోవద్దంటూ వారిని వారిస్తున్నట్లు సమాచారం. విచారణను నివారించే ప్రయత్నాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. అధికారులు మాత్రం లోతైన విచారణకే సిద్ధమవుతున్నారు. వాస్తవానికి వాణిజ్య పన్నుల శాఖ రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో ఐజీఎస్టీ లావాదేవీల గుర్తింపు మాడ్యూల్‌ను పెట్టకపోవడానికి ఇద్దరు అధికారుల ఒత్తిడే కారణమని ఉన్నతాధికారులు తేల్చారు. ఆ మేరకు ఇద్దరు అధికారులకు వాణిజ్య పన్నుల కమిషనర్ టీకే శ్రీదేవి మెమోలను జారీ చేశారు. ఇటీవల ఒక అధికారిని పన్నుల శాఖ శిక్షణ కేంద్రానికి, మరో అధికారిని ఆదిలాబాద్‌కు బదిలీ చేశారు. ఈ ఇద్దరు అధికారులు సోమేశ్‌కుమార్ కనుసన్నల్లోనే పని చేశారని, అందుకే మాడ్యూల్ పెట్టకుండా జాగ్రత్త పడ్డారని సమాచారం.

మరో రెండు వరాలకు వేళాయె!

(మొదటిపేజీ తరువాయి)

పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని, ఇప్పుడు గృహ జ్యోతి, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలను అమల్లోకి తేవాల్సి ఉందని చెబుతూ అందుకు సంబంధించిన ఏర్పాట్లు, అనుసరించాల్సిన విధి విధానాలపై చర్చించారు. 200 యూనిట్లలోపు వినియోగించే గృహ విద్యుత్ వినియోగదారులకు మార్చి నుంచి జీరో బిల్లులు జారీ చేయాలని స్పష్టం చేశారు. అనుమానాలు/అపోహలకు తావు లేకుండా 'గృహ జ్యోతి' పథకాన్ని పారదర్శకంగా అమలు చేయాలన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగి.. 200 యూనిట్లలోపు కరెంట్ వాడే వారందరికీ మార్చి మొదటి వారంలో జీరో బిల్లులు జారీ చేయాలని నిర్దేశించారు. ప్రజా పాలన దరఖాస్తుల్లో రేషన్ కార్డు (ఆహార భద్రత కార్డు), యునీక్ సర్వీస్ నంబర్లను పొందుపరచడంతో తప్పుల కారణంగా జీరో బిల్లుకు అర్హత కోల్పోకుండా చూడాలని, ఆయా వివరాలను సవీకరించుకునే అవకాశం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ మేరకు విద్యుత్తు బిల్లుల కలెక్షన్ సెంటర్లు, సర్వీస్ సెంటర్లలో సవరణ ప్రక్రియకు అవకాశం ఇవ్వాలని నిర్దేశించారు. తప్పులను సవరించుకున్న అర్హులందరికీ తదుపరి నెల (మార్చిలో సరి చేసుకుంటే ఏప్రిల్‌లో.. ఏప్రిల్‌లో సవరించుకుంటే మేలో జీరో బిల్లు) నుంచి పథకం అమలు చేయాలన్నారు. ప్రతి గ్రామంలోనూ ప్రజలందరికీ తెలిసేలా విద్యుత్తు శాఖ తగినంత ప్రచారం చేపట్టాలని సూచించారు. అర్హులందరికీ లబ్ధి చేకూరేలా చూడాల్సిన బాధ్యత అధికారుల మీదే ఉందని స్పష్టం చేశారు. ఇక, ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోని వారుంటే . వారికి తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో అప్లికేషన్లు పెట్టుకునే వెసులుబాటును నిరంతర ప్రక్రియగా అమలు చేయాలని సూచించారు. ప్రజా పాలన దరఖాస్తుదారుల్లో అర్హులందరికీ రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించాలని, దీనిపై గ్యాస్ ఏజెన్సీలతో చర్చలు జరపాలని సీఎం రేవంత్ అధికారులకు సూచించారు. ప్రభుత్వం తరఫున చెల్లించాల్సిన సబ్సిడీ నిధులను వెంటవెంటనే వారికి చెల్లించేందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్, ట్రాన్స్‌కో/జెన్‌కో సీఎండీ సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రితోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌తో జైకా ప్రతినిధుల భేటీ

జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ (జైకా) ప్రతినిధులు గురువారం సీఎం రేవంత్ రెడ్డిని సచివాలయంలో కలిశారు. వీరిలో జైకా ఇండియా చీఫ్ సైటో మిత్సునోరితోపాటు ప్రతినిధులున్నారు. రాష్ట్రంలో ఇన్నోవేషన్, స్టార్టప్ సంస్కృతిని ప్రోత్సహించేందుకు ఇటీవలే జైకా రూ.1,336 కోట్ల రుణాన్ని రాష్ట్రానికి మంజూరు చేసింది. దీనిపై సీఎం సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఆంత్రప్రెన్యూర్లను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించిందని వారితో పేర్కొన్నారు. జైకా నిధులతో రాష్ట్రంలో స్టార్టప్ వ్యవస్థ మరింత బలపడుతుందన్నారు.

తప్పుడు నివేదికలొద్దు

గొప్పలకు పోవద్దు.. అలా చేసినందుకే జల జీవన్ మిషన్ నిధులు రావట్లేదు

- వేసవిలో తాగునీటి సరఫరాకే ప్రాధాన్యం
- సమన్వయంతో పని చేయండి
- ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందికి వేతనాలివ్వండి
- అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి



సచివాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు ఉత్తమ్, పొంగులేటి

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ ద్వారా 99 శాతం ఇళ్లకు తాగు నీరు ఇచ్చామని గత ప్రభుత్వం కేంద్రానికి తప్పుడు నివేదికలు ఇచ్చిందని, ఫలితంగా జల జీవన్ మిషన్ కింద రాష్ట్రానికి నిధులు ఆపేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. గొప్పలకు పోయి తప్పుడు నివేదికలు ఇవ్వవద్దని అధికారులకు సూచించారు. ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించినప్పుడు చాలా గ్రామాల్లో తాగు నీరు అందడం లేదని తన దృష్టికి వచ్చిందని తెలిపారు. జూలై నెలాఖరు వరకు ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్లతో రెండు రోజుల్లో సమీక్ష నిర్వహించాలని సీఎస్ శాంతి కుమారిని ఆదేశించారు. నగరాలు, పట్టణాలు, పల్లెలు, తండాలు, గూడేలు, ఎస్సీ కాలనీలనే తేడా లేకుండా ప్రతి నివాస ప్రాంతానికి తాగునీరు అందేలా పురపాలక, సాగునీటి పారుదల, పంచాయతీరాజ్ శాఖలు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని నిర్దేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి సమస్య రాకుండా చూడాలని, వేసవి సమీపిస్తున్నందున తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. తాగునీటి సరఫరాలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సచివాలయంలో గురువారం సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా, తాగునీటి కోసమంటూ నాగార్జున సాగర్ నుంచి ఏపీ 9 టీఎంసీలకు పైగా నీరు తీసుకుపోతోందని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దాంతో, అంత పెద్ద మొత్తంలో తాగునీరు ఎక్కడ వినియోగిస్తారని సీఎం ప్రశ్నించారు. సరైన గణాంకాలు తీసుకుని ఇతర అవసరాలకు నీరు తరలించకుండా చూడాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నుంచి తాగునీరు తీసుకునేందుకు కృష్ణానది యాజమాన్య బోర్డుకు లేఖ రాయాల్సి ఉంటుందని, తాగునీటికి ఎంత నీరు అవసరమో సమగ్రంగా సమీక్షించి వెంటనే కేఆర్ఎంబీకి లేఖ రాయాలని సూచించారు. నూతన పథకాలు వచ్చాక గతంలో ఉన్న అనేక తాగునీటి వనరులను వదిలేశారని, ప్రస్తుతం వాటిని వినియోగంలోకి తీసుకు వచ్చేలా అధికారులు పని చేయాలని సీఎం సూచించారు. ఈ సందర్భంగా కాగ్నా నది గురించి సీఎం ప్రస్తావించారు. కాగ్నా నుంచి తాండూర్, కొడంగల్ నియోజక వర్గాలకు నీటిని సరఫరా చేసే అవకాశం ఉందని, మిషన్ భగీరథ వచ్చాక నిర్లక్ష్యం చేశారని తెలిపారు. రాష్ట్రంలో ఇలాంటి వాటిని పరిశీలించి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అవసరమైనచోట బోర్లు మరమ్మతులు చేయించాలని, ఇందు కోసం ఎమ్మెల్యేలకు కేటాయించిన నిధులను వినియోగించుకోవాలని సూచించారు.

రెండేళ్లుగా వేతనాల్లేవ్

గ్రామీణ నీటి సరఫరా విభాగంలోని సిబ్బందికి వేతనాలు ఇవ్వడం లేదని తన దృష్టికి వచ్చిందని సీఎం రేవంత్ వ్యాఖ్యానించగా.. రెండేళ్లుగా ఇవ్వడం లేదని అధికారులు వివరించారు. దాంతో, క్షేత్రస్థాయి సిబ్బందికి వేతనాలు అందేలా నిధులు విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. విడుదలైన నిధులు బడా బాబులకు కాకుండా సిబ్బందికి అందేలా చూడాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనూ తాగునీటికి సమస్య రాకుండా చూడాలని పురపాలక శాఖ అధికారులను ఆదేశించారు. దాంతో, ప్రస్తుతానికి నగరంలో తాగునీటికి సమస్య లేదని అధికారులు వివరించారు. కాకపోతే, తాగునీటి సరఫరాలో నగరంలో పోలీసుల నుంచి కొంత ఇబ్బంది ఉందని అధికారులు సీఎంకు చెప్పడంతో వేసవి ముగిసే వరకు తాగునీరు సరఫరా చేసే ట్యాంకర్లకు ఇబ్బంది లేకుండా క్షేత్ర స్థాయి సిబ్బందికి తగిన ఆదేశాలు ఇవ్వాలని పోలీసు ఉన్నతాధికారులను సీఎం ఆదేశించారు.

మెగా డీఎస్సీలో 11వేల పోస్టులు!

- ప్రభుత్వానికి విద్యాశాఖ ప్రతిపాదనలు
- అనుమతి రాగానే అనుబంధ నోటిఫికేషన్?

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సుమారు 11వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలను సమర్పించారు. ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపిన వెంటనే ఖాళీల భర్తీ కోసం నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే, కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులను పెంచి భర్తీ చేయాలని భావిస్తోంది. ఇందులో భాగంగా విద్యాశాఖ నుంచి ఖాళీల వివరాలను కోరింది. గత నోటిఫికేషన్‌లోని పోస్టులకు అదనంగా మరో 6వేల ఖాళీల వివరాలను అధికారులు ప్రభుత్వానికి సమర్పించారు. దీన్నే మెగా డీఎస్సీగా పిలుస్తున్నారు. అయితే, గతంలో జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేసి మళ్లీ కొత్తగా నోటిఫికేషన్‌ను జారీ చేస్తారా.. లేక పాత నోటిఫికేషన్‌కే అనుబంధ నోటిఫికేషన్‌ను ఇస్తారా.. అనే విషయంలో ఇంకా స్పష్టత లేదు. గత నోటిఫికేషన్ ప్రకారం ఇప్పటికే అభ్యర్థులు దరఖాస్తులను చేసుకున్నందున, అనుబంధ నోటిఫికేషన్‌ను ఇచ్చే అవకాశం ఎక్కువని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా, గతంలో వివిధ ఉద్యోగాల భర్తీ కోసం జారీ చేసిన నోటిఫికేషన్లకు సంబంధించిన పరీక్షల ఫలితాలను టీఎస్‌పీఎస్సీ అధికారులు వెల్లడించారు. 2017లో జారీ అయిన నోటిఫికేషన్ ప్రకారం స్కూల్ అసిస్టెంట్ హిందీ పోస్టులను కోర్టు కేసుల కారణంగా భర్తీ చేయకుండా నిలిపివేశారు. ఈ కేసుల వివాదం ముగియడంతో గురువారం ఈ ఫలితాలను వెల్లడించారు. రెసిడెన్షియల్ స్కూళ్లలో పనిచేసే ప్రిన్సిపల్ పోస్టుల ఫలితాలను కూడా ప్రకటించారు. కాగా, మోడల్ స్కూల్ అడ్మిషన్ల కోసం దరఖాస్తుల గడువును మార్చి 2వ తేదీ వరకు పొడిగించారు. విద్యార్థులు 6వ తరగతి అడ్మిషన్లతో పాటు, 7 నుంచి 10వ తేదీ వరకు ఖాళీ సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

రెండేళ్లలోపు ఎస్ఎల్‌బీసీ టన్నెల్, డిండి ఎత్తిపోతల పూర్తవ్వాలి

- టన్నెల్ తవ్వకాన్ని యుద్ధప్రాతిపదికన చేపట్టాలి
- పనుల పురోగతిపై వారానికోసారి సమీక్ష చేయాలి
- అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ ఆదేశం



హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లలోపు శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్(ఎస్ఎల్‌బీసీ) టన్నెల్, డిండి ఎత్తిపోతల పథకం పూర్తవ్వాలని అధికారులను నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ తవ్వకాన్ని యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు. గత ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణంలో తీవ్ర నిర్లక్ష్యం చూపిందని, ఫలితంగా టన్నెల్ పనులు ముందుకు కదల్లేదని గుర్తు చేశారు. గురువారం సచివాలయంలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్, డిండి ఎత్తిపోతల పథకాలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఇతర అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రెండేళ్లలోపు డిండి, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు పూర్తిచేసేందుకు వీలుగా పనుల పురోగతిపై వారానికోసారి సమీక్షలు చేయాలని చెప్పారు. ఎస్ఎల్‌బీసీకి ప్రస్తుత ప్రభుత్వం అన్నిరకాలుగా సహకారాన్ని అందించనుందన్నారు. 44 కిలోమీటర్ల సొరంగ మార్గం పనుల్లో 9 కిలోమీటర్ల పనులు మాత్రమే చేయాల్సి ఉందని తెలిపారు. నిర్ణీత వ్యవధిలోగా పనులు పూర్తిచేసేలా లక్ష్యం నిర్దేశించుకుని ముందుకెళ్లాలని చెప్పారు. పనులకు సంబంధించిన సమస్యలు, సాంకేతిక అంశాలపై అధికారులతో ఒక కమిటీని వేయాలని మంత్రి ఆదేశించారు. ఇక డిండి, పెండ్లి పాకాల జలాశయాల నిర్మాణం వెంటనే పూర్తి చేయాలన్నారు. డిండి ఎత్తిపోతల పథకం పనులు 95శాతం దాకా పూర్తయ్యాయని, భూసేకరణకు రూ.90 కోట్లు అవసరం ఉన్నాయని చెప్పారు. డిండి ఎత్తిపోతలకు కేంద్రం నుంచి రావాల్సిన అనుమతులు వెంటనే తెచ్చేందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు.

'సూపర్ స్పెషాలిటీ' ఆస్పత్రులపై మంత్రి సమీక్ష



వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఆస్పత్రుల నిర్మాణ పనుల పురోగతిపై ఆయన సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. వరంగల్‌లో 2,100 పడకల సామర్థ్యంతో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, హైదరాబాద్‌లోని అల్వాల్‌లో నిర్మిస్తున్న 1,200 పడకల టిమ్స్ నిర్మాణ పనులను సమీక్షించారు. అలాగే ఎల్బీనగర్, సనత్‌నగర్‌లో నిర్మిస్తున్న ఆస్పత్రుల భవనాల పనులను అడిగి తెలుసుకున్నారు. నిమ్స్ హాస్పిటల్ ఆవరణలో 2000 పడకల సామర్థ్యంతో నిర్మిస్తున్న మరో భవన నిర్మాణ పనులను కూడా సమీక్షించారు. నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు.

'సిలిండర్'కు మార్గం సుగమం!

- సబ్సిడీ సొమ్ము గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లకే
- ప్రభుత్వం, ఏజెన్సీల మధ్య ఒప్పందం
- లబ్ధిదారుడు రూ.500 చెల్లిస్తే చాలు
- 39.5 లక్షల లబ్ధిదారుల గుర్తింపు.. దాదాపు వెయ్యికోట్ల భారం

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ బుక్ చేస్తారు! అందుకు రూ.500 చెల్లిస్తారు! ఆ మొత్తం తీసుకుని గ్యాస్ ఏజెన్సీలు మీకు సిలిండర్ ఇచ్చేస్తాయి! మిగిలిన మొత్తాన్ని అవి ప్రభుత్వం నుంచి వసూలు చేసుకుంటాయి! ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం, గ్యాస్ ఏజెన్సీల మధ్య గురువారం ఒప్పందం కుదిరింది. సిలిండర్ ధర ఎంత ఉన్నప్పటికీ రూ.500 తీసుకుని మహాలక్ష్మి పథకంలోని అర్హులైన లబ్ధిదారులకు దానిని సరఫరా చేయాలని నిర్దేశించింది. రూ.500కే సిలిండర్ పథకంపై గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించిన తర్వాత.. గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులతో పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్, ఇతర అధికారులు సమావేశమయ్యారు. ప్రభుత్వ నిర్ణయాన్ని డిస్ట్రిబ్యూటర్లకు సూటిగా వివరించారు. 'మీరు లబ్ధిదారుల నుంచి ఒక్కో గ్యాస్ సిలిండర్‌కు రూ.500 మాత్రమే వసూలు చేయాలి. మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం డిస్ట్రిబ్యూటర్లకు చెల్లిస్తుంది" అని స్పష్టం చేశారు. సబ్సిడీతో వినియోగదారులకు ఎలాంటి లింకు పెట్టొద్దని తేల్చి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని డిస్ట్రిబ్యూటర్లు అంగీకరించారు. తద్వారా, సిలిండర్ పథకాన్ని ఎలా అమలు చేస్తారనే ఊహాగానాలకు; విడతలవారీగా జరిగిన చర్చల ప్రక్రియకు తెరపడింది. ప్రస్తుతం సిలిండర్ ధర రూ.955 ఉంది. మహాలక్ష్మి పథకంలో ఎంపికైన లబ్ధిదారులు రూ.500 చెల్లిస్తే సరిపోతుంది. మిగిలిన రూ.455 సబ్సిడీని సంబంధిత గ్యాస్ ఏజెన్సీకి రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. నిజానికి, సిలిండర్‌పై రూ.40 సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం వినియోగదారు బ్యాంకు ఖాతాకు జమ చేస్తోంది. ఫలితంగా, రూ.460కే మహాలక్ష్మి లబ్ధిదారులకు సిలిండర్ దక్కినట్లు అవుతుంది. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకొని.. 39.50లక్షల మంది లబ్ధిదారులను ప్రభుత్వం ఎంపిక చేసింది. తెల్ల రేషన్ కార్డు, ఆధార్ నంబరు, గ్యాస్ కనెక్షన్ నెంబరు, అడ్రస్ తదితర వివరాలు సరిగా ఉన్నవారి జాబితాను ఫైనల్ చేశారు. తొలి విడతలో 39.50 లక్షల మందికి పథకాన్ని అమలు చేస్తారు. ఇందుకు సబ్సిడీ భారం మోయటానికి ఏడాదికి సుమారు వెయ్యి కోట్ల ఖర్చు అవుతుందని అధికారులు అంచనావేశారు. కేంద్రం గ్యాస్ సిలిండర్ ధరను పెంచినా.. లబ్ధిదారుల సంఖ్య పెరిగినా ఆ భారం మరింత ఎక్కువవుతుంది. అర్హులుంటే ఆ తర్వాత కూడా ఎంపిక ప్రక్రియను కొనసాగిస్తారు. పోర్టల్, ఇతరత్రా పనులన్నీ పూర్తి చేసి వారంలోగా పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. పౌర సరఫరాల శాఖతో పాటు అనుబంధశాఖల అధికారులు, గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు ఈ మేరకు కసరత్తు చేస్తున్నారు. అయితే, సిలిండర్ల కొనుగోలుకు ముందుగా పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని, కొంత అడ్వాన్స్ చెల్లిస్తే ఆర్థికంగా కాస్త వెసులుబాటు ఉంటుందని డిస్ట్రిబ్యూటర్లు రాష్ట్ర ప్రభుత్వం ముందు ప్రతిపాదన పెట్టారు. ముఖ్యమంత్రితో చర్చించిన తర్వాతే దీనిపై హామీ ఇవ్వగలమని కమిషనర్ చౌహాన్ స్పష్టంచేసినట్లు తెలిసింది.

మూడేళ్ల సగటుతో కోటా ఖరారు

ఒక్కో కుటుంబానికి ఏటా ఎన్ని సిలిండర్లు ఇవ్వాలనే అంశంపైనా ప్రభుత్వం ఓ నిర్ణయానికి వచ్చింది. ఒక వినియోగదారుడు మూడేళ్లలో ఎన్ని సిలిండర్లు వినియోగించాడో.. దాని సగటును తీసుకొని కోటాను ఖరారు చేయాలని నిర్ణయించింది. ఉదాహరణకు.. ఓ వినియోగదారు ఈ ఏడాదిలో 6; గతేడాది 4; అంతకుముందు సంవత్సరం 8 సిలిండర్లు వినియోగిస్తే.. సగటున ఏడాదికి 6సిలిండర్లు కోటా కింద వస్తాయి. వాటికే సబ్సిడీ వర్తిస్తుంది. అంతకు మించి వాడితే మొత్తం సొమ్ము కట్టాల్సిందే. మూడేళ్ల సగటు వినియోగం ఐదున్నా, ఆరున్నా, ఏడున్నా, ఎనిమిది ఉన్నా సబ్సిడీ వర్తిస్తుంది. ఇందుకు గరిష్ఠ కటాఫ్‌ను ఏడాదికి 12సిలిండర్ల వరకు పెట్టే అవకాశాలున్నట్లు తెలిసింది. ఉజ్వల పథకంలో గ్యాస్ కనెక్షన్లు తీసుకున్న లబ్ధిదారులకు సబ్సిడీని ఎలా అమలు చేయాలనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. వీరికి ఇప్పటికే రూ.340 చొప్పున సబ్సిడీ వస్తోంది.

కరెంట్ కట్ చేస్తే కొలువులు ఊడతాయ్!

సర్కార్‌ను బద్నాం చేసేందుకే కొన్నిచోట్ల విద్యుత్తు కోతలు: సీఎం రేవంత్

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): "గత ప్రభుత్వ హయాంలో నియమితులైన కొందరు క్షేత్ర స్థాయి సిబ్బంది అత్యుత్సాహంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు ఉద్దేశపూర్వకంగా విద్యుత్తు కోతలు విధిస్తున్నారనే సమాచారం మాకుంది. ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేందుకు, కరెంట్ సరఫరాపై దుష్ప్రచారం చేసేందుకు కొందరు కుట్రలు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. సాంకేతిక సమస్యలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగానే విద్యుత్తు సరఫరాకు అంతరాయాలు రావాలి. తప్పితే, ఉద్దేశపూర్వకంగా ఎవరైనా కరెంట్ కోతలకు కారణమైతే వారిపై చర్యలు తప్పవు. రాష్ట్రంలో ఎక్కడైనా అకారణంగా కరెంట్ సరఫరాకు అంతరాయం కలిగిస్తే, దానికి కారకులైన బాధ్యులు/ అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ఎక్కడైనా ఐదు నిమిషాలకు మించి విద్యుత్ సరఫరా నిలిచిపోతే, అందుకు గల కారణాలపై వెంటనే సమీక్ష నిర్వహించాలని అధికారులకు నిర్దేశించారు. సచివాలయంలో గురువారం వివిధ పథకాల అమలుపై సమీక్షకు ముందు విద్యుత్తు కోతలు అంటూ జరుగుతున్న ప్రచారంపై అధికారులను సీఎం ఆరా తీశారు. ఇటీవల పలు చోట్ల విద్యుత్తు సరఫరా నిలిపేసిన ఘటనలను ఉదాహరిస్తూ విద్యుత్తు శాఖ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, గత ఏడాది జనవరి, ఫిబ్రవరితో పోలిస్తే.. గత రెండు నెలల్లో విద్యుత్తు వినియోగం పెరిగిందని, దానికి తగ్గట్లుగా కరెంట్ సరఫరా చేస్తున్నామని ట్రాన్స్‌కో/ జెన్‌కో సీఎండీ ఎస్ఏఎం రిజ్వీ స్పష్టం చేశారు. "ఫిబ్రవరిలో ఒకటో తేదీ నుంచి 13వ తేదీ వరకు రోజుకు సగటున 264.95 మిలియన్ యూనిట్ల వినియోగం ఉండగా.. గత ఏడాది ఇదే వ్యవధిలో 242.44 మిలియన్ యూనిట్లు మాత్రమే. గత ఏడాది జనవరిలో 230.54 మిలియన్ యూనిట్ల రోజువారీ సగటు వినియోగం ఉండగా.. ఈ ఏడాది జనవరిలో అంతకంటే ఎక్కువగా 243.12 మిలియన్ యూనిట్ల వినియోగం రికార్డయింది" అని వివరించారు. ఇటీవల మూడు సబ్ స్టేషన్ల పరిధిలో కొంతసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని నివేదించారు. దానికి కారణాలు ఏమిటని సీఎం ప్రశ్నించగా.. సబ్ స్టేషన్లలో లోడ్ హెచ్చుతగ్గులను డీఈలు సరిచూసుకుంటూ ఉండాలని, అలా చూసుకోకపోవడంతోనే సమస్య తలెత్తిందని వివరించారు. అలా నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ ఆదేశించారు. ఏవైనా మరమ్మతులు, ఇతర అంశాలకు సరఫరా నిలిపివేయాల్సి వస్తే ముందుగానే ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని వినియోగదారులకు సమాచారం ఇవ్వాలని నిర్దేశించారు."రాష్ట్రంలో డిమాండ్‌కు అనుగుణంగా సరిపడ విద్యుత్‌ను అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. డిమాండ్‌కు తగ్గట్లుగా సరఫరా చేస్తున్నాం. ఎక్కడా కోతలు విధించడం లేదు. గతంతో పోలిస్తే రాష్ట్రంలో విద్యుత్తు వినియోగం పెరిగింది. డిమాండ్ అధికంగా ఉండే ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో వినియోగానికి తగ్గట్లు విద్యుత్‌ను అందించడానికి వీలుగా అనేక చర్యలు చేపట్టాం. గతంతో పోలిస్తే.. విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరిగింది. కొందరు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇదేం పద్ధతి!? డిమాండ్‌కు తగ్గట్లుగా విద్యుత్‌ను సరఫరా చేస్తున్నా.. కోతలు పెడుతున్నారంటూ జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాల్సిన బాధ్యత మీదే' అని విద్యుత్తు శాఖ అధికారులకు సీఎం రేవంత్ నిర్దేశించారు.

సంబురంగ సమ్మక్కొచ్చె!




సమ్మక్కను గద్దెపై ప్రతిష్ఠిస్తున్న పూజారులు ; చిలకలగుట్ట వద్ద గాల్లోకి కాల్పులు జరిపి సమ్మక్కకు వందనం సమర్పిస్తున్న ములుగు ఎస్పీ శబరీష్, చిత్రంలో మంత్రి సీతక్క

(మొదటిపేజీ తరువాయి)

తీసుకొచ్చే కార్యక్రమం గురువారం ఉదయమే మొదలైంది. గిరిజన పూజారులు తెల్లవారుజామునే మేడారంలోని సమ్మక్కగుడికి చేరుకున్నారు. గుడి ప్రాంగణాన్ని శుభ్రం చేసి మామిడి తోరణాలను కట్టారు. అలికి ముగ్గులు వేశారు. తర్వాత పూజారులు అడవికి వెళ్లి వనాన్ని తీసుకొచ్చారు. డప్పుచప్పుళ్ల మధ్య వనాన్ని తీసుకువస్తుండగా సమ్మక్క గుడి సమీపంలో బొడ్రాయి వద్ద మహిళలు నీళ్ల బిందెలతో ఎదురొచ్చి పూజారుల కాళ్లు కడిగి మంగళ హారతులు పట్టారు. పూజారులు వనాన్ని మేడారంలోని సమ్మక్క గద్దెపై ఉంచి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. మధ్యాహ్నం పూజారుల్లో ఒకరైన సిద్దబోయిన మునేందర్ ఇంట్లో అడేరాలను (పసిడి కుండలు) సిద్ధం చేశారు. డోలు వాయిద్యాల మధ్య వాటిని సమ్మక్క గుడికి తరలించారు. పూజల అనంతరం మేకలు, కోళ్లను బలిచ్చారు. సాయంత్రం అసలు ఘట్టం మొదలైంది. ప్రధాన వడ్డె అయిన కొక్కెర క్రిష్ణయ్యతో పాటు పూజారులు సిద్దబోయిన మునేందర్, సిద్దబోయిన మహేశ్, సిద్దబోయిన లక్ష్మణ్‌రావు, చందా గోపాల్ రావు, పరమయ్య, జలకపు వడ్డె మల్లెల ముత్తయ్య, కొమ్ము వడ్డె సిద్దబోయిన స్వామి, జనార్దన్ చిలుకల గుట్టకు బయలు దేరారు. పూజారులు చిలుకలగుట్టపైకి కొంత దూరం వెళ్లిన తర్వాత ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్య మినహా మిగతావారు మధ్యలోనే ఆగిపోయారు. క్రిష్ణయ్య ఒక్కరే గుట్ట పైభాగాన తల్లి స్థావరం వద్దకు వెళ్లానేజ అక్కడ సుమారు మూడు గంటల పాటు పూజలు చేశారు. అనంతరం.. అక్కడ కుంకుమ భరిణ రూపంలో ఉన్న సమ్మక్కను తీసుకొని మధ్యలో వేచి ఉన్న మిగతా పూజారులతో కలిసి గుట్ట కిందకు నడిచారు. తల్లిని కిందకు తీసుకొస్తున్నట్లు ఇవ్వగానే ఆదివాసీ కళాకారులు, యువకులు నృత్యాలు చేశారు. వారితో మంత్రి సీతక్క పాదం కలిపారు. గుట్ట కిందకు తల్లిని తీసుకు



రాగానే ప్రభుత్వం తరఫున మంత్రి సీతక్క స్వాగతం పలికారు. మంత్రి వెంట గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ శరత్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్, సైబరాబాద్ సీపీ తరుణ్‌జోషి ఉన్నారు. సాయుధ పోలీసు బలగాలు తల్లిని తీసుకువస్తున్న పూజారులకు రక్షణ వలయంగా నిలుచున్నారు. సాయంత్రం 6.51గంటలకు సమ్మక్కతల్లికి గౌరవ సూచకంగా ములుగు ఎస్పీ శబరీశ్ ఏకే 47 రైఫిల్‌ను గాలిలోకి పేల్చి వందనం సమర్పించారు. అలాగే చిలుకల గుట్ట ప్రధాన ద్వారం వద్ద 7.07గంటలకు మరోసారి గాల్లోకి తుపాకీ పేల్చారు. దారి మధ్యలో చెలపయ్య చెట్టు దగ్గర అమ్మవారికి జంతుబలి ఇచ్చిన అనంతరం ముందుకు కదిలారు. మార్గమధ్యలో మహిళలు బిందెలతో నీళ్లారబోసి.. మంగళహారతులు పట్టారు. పెద్ద ఎత్తున కోళ్లను, మేకలను బలి ఇచ్చారు. సమ్మక్క ప్రయాణించే మార్గాన్ని ముగ్గులతో అందంగా అలంకరించారు. తరలివస్తున్న సమ్మక్కను దర్శించుకునేందుకు దారి పొడవునా వేలాది మంది భక్తులు బారులు తీరి నిల్చున్నారు. పూజారులతో పాటు గద్దెల వరకు వెంటనడిచారు. సమ్మక్క రాక సందర్భంగా శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. రాత్రి 9:28 గంటలకు సమ్మక్క గద్దెకు చేరింది. గురువారం పలువురు ప్రముఖులు మేడారాన్ని సందర్శించి తల్లులకు పూజలు చేశారు. కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలు, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు తల్లులను దర్శించుకున్నారు. అలాగే మాజీ స్పీకర్ సిరికొండ మధుసూధనా చారి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత తదితరులు గద్దెలను సందర్శించిన వారిలో ఉన్నారు. శుక్రవారం గవర్నర్ తమిళి సై ఇ సీఎం రేవంత్‌తదితరులు మేడారం రానున్నారు. గురువారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్, కొత్తకొండ గ్రామాల్లోని సామక్క-సారలమ్మ తల్లులకు మంత్రి పొన్నం దర్శించుకున్నారు.

పూజారుల్లో ఒకరికి అస్వస్థత

మేడారం మహాజాతరలో కీలకంగా వ్యవహరించే సమ్మక్క తల్లి పూజారుల కుటుంబసభ్యుడైన సిద్దబోయిన వెంకటేశ్ అస్వస్థతకు గురయ్యారు. సమక్క గద్దె వద్ద పూజల్లో నిమగ్నమైన ఆయన ఎండవేడిమి తట్టుకోలేక ఒక్కసారిగా కుప్పకూలారు. సింగరేణి రెస్క్యూ టీమ్ హుటాహుటిన ఆయన్ను పక్కనే ఉన్న 30 పడకల ఆస్పత్రికి తరలించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య అక్కడికి చేరుకొని వెంకటేశ్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని చికిత్స అందించారు. కొద్దిసేపటికి వెంకటేశ్ తేరుకొని తిరిగి గద్దెల ప్రాంగణానికి వెళ్లారు. జంపన్నవాగు వద్ద చింతల కొమురయ్య (65) అనే

మేడారానికి జాతీయ హోదా ఇవ్వలేం

మేడారం పర్యటనలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

వరంగల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వలేమని, దేశంలోని ఏ ఆలయానికి కానీ, జాతరకు కానీ అలాంటి హోదా ఇవ్వలేదని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ అంశంపై ఇటీవల కొన్ని పత్రికలు, సోషల్ మీడియాలో అనేక రకాల ప్రచారం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మేడారం జాతరలో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఇప్పటికే ట్రైబల్ సర్క్యూట్ టూరిజం కింద రూ.80కోట్లతో ములుగు జిల్లాలోని పలు ప్రాంతాల్లో హోటళ్లు, గెస్ట్‌హౌస్‌లు నిర్మించామని వివరించారు. ఈ జాతరకు రూ.3.14కోట్లు కేంద్రం మంజూరు చేసినట్లు వెల్లడించారు. రామప్ప తరహాలోనే మేడారం జాతరకు యునెస్కో గుర్తింపు వచ్చేలా దృష్టి సారిస్తామని చెప్పారు. ములుగు జిల్లా మేడారంలో జరుగుతున్న సమ్మక్క-సారలమ్మ మహాజాతరలో పాల్గొన్న ఆయన, వన దేవతలకు నిలువెత్తు బంగారం(బెల్లం) మొక్కుగా సమర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమ్మక్క-సారలమ్మ పేరుతో ములుగులో కేంద్రీయ గిరిజన యూనివర్సిటీని రూ.900కోట్లతో ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. ప్రధాని మోదీ ఆదేశాల మేరకు సెంట్రల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో తరగతుల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ ఏడాదే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభిస్తామని వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం ప్రధాని మోదీ యూనివర్సిటీ భవనాలకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. వరంగల్‌లోని వేయి స్తంభాల ఆలయ కల్యాణ మండపం పనులను నెలాఖరులోగా పూర్తి చేసి, ప్రారంభిస్తామని వెల్లడించారు. కాగా, మేడారం మహా జాతరకు శుక్రవారం గవర్నర్ తమిళిసై, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి అర్జున్‌ముండా రానున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు.



అమ్మవారికి నిలువెత్తు బంగారం సమర్పిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

మేడారానికి హెలికాప్టర్ సేవలు ప్రారంభం



మేడారం, ఫిబ్రవరి 22 : మేడారం మహాజాతరకు వెళ్లే భక్తుల కోసం హెలికాప్టర్ సేవలు గురువారం ప్రారంభమయ్యాయి. జాతరకు ఇబ్బందులు పడకుండా వెళ్లాలనుకునే వారి కోసం కొన్ని సంవత్సరాలుగా బెంగుళూరుకు చెందిన ఏవియేషన్ సంస్థ జాతర సమయంలో కాజీపేట నుంచి మేడారం వరకు షటిల్ సర్వీస్ నడుపుతున్న విషయం తెలిసిందే. తాజాగా... కాజీపేట నగరంలోని సెయింట్ గ్యాబ్రియల్ పాఠశాల నుంచి మేడారం గద్దెల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వరకు సర్వీసులు ప్రారంభమయ్యాయి. హనుమకొండ నుంచి మేడారం వరకు ఒక్కొక్కరికి రూ.28,999 చొప్పున నిర్ణయించారు. హైదరాబాద్ నుంచి అయితే... నలుగురు వ్యక్తులకు రూ.5.15 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. హెలికాప్టర్ ప్రయాణ రుసుం అధికంగా ఉండటంతో భక్తులలో పెద్దగా ఆసక్తి కనిపించడం లేదు. వాస్తవానికి ఈ సేవలు బుధవారమే ప్రారంభం కావలసి ఉండగా బుకింగ్‌లు లేకపోవడంతో ఆలస్యంగా ప్రారంభించారు. గురువారం మాత్రం ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు కాజీపేట నుంచి మేడారం వరకు ప్రయాణించడంతో హెలికాప్టర్ సేవలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. కాగా, ఈ సర్వీస్‌లో భాగంగా భక్తులకు మేడారం ప్రత్యేక దర్శనం చేయించి తిరిగి కాజీపేటలో దింపుతారు. ఈ సర్వీస్ సేవలు పొందడం కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ హెలిటాక్సీ.కామ్ వెబ్‌సైట్‌ను సందర్శించి టికెట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది.



నల్గొండ జిల్లా ముదిమాణిక్యంలో బాదామి చాళుక్యుల ఆలయం

కృష్ణాతీరంలో బాదామి చాళుక్య ఆలయాలు

నల్గొండ జిల్లాలో వెలుగులోకి

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని కృష్ణాతీరం చారిత్రక సంపదకు నెలవు. ఇక్కడ ఎన్నో చారిత్రక ఆధారాలు లభించాయి. తాజాగా నల్గొండ జిల్లా ముదిమాణిక్యం గ్రామ సమీపంలో బాదామి చాళుక్యుల ఆలయాలు వెలుగులోకి వచ్చాయి. గ్రామంలో ఉన్న బాదామి చాళుక్యుల కాలం నాటి గుళ్లు, లఘుశాసనాలను పబ్లిక్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ హిస్టరీ, ఆర్కియాలజీ, హెరిటేజ్(ప్రిహ), తెలుగు వర్సిటీకి చెందిన డా.ఎం.ఏ. శ్రీనివాసన్, ఎస్.అశోక్ కుమార్‌ల బృందం కనుగొంది. కృష్ణా నది ఒడ్డున నెలవైన రెండు ఆలయాలను క్రీస్తు శకం 543 నుండి 750 మధ్యకాలంలో నిర్మించి ఉంటారని తెలుగు విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఎ. శ్రీనివాసన్ తెలిపారు. ఇది కాదంబనాగార శైలిని రేఖానాగార పద్ధతిలో నిర్మించడం ఈ ఆలయాల విశిష్టత అని వివరించారు. ఇదే గ్రామంలోని ఉన్న ఐదుగుళ్లలో(పంచకూట) ఒక గుడిలోని స్తంభంపై 'గండశోణద్రు' అని రాసి ఉన్న ఈ లఘుశాసనం ఉంది. దీనిని 8 లేదా 9వ శతాబ్దంలో నిర్మించారు. ఈ లఘు శాసనాన్ని ఒక వీరుడి బిరుదుగా భావిస్తున్నామని ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఎపిగ్రఫీ శాఖ డైరెక్టర్ డా. మునిరత్నం వివరించారు. అలాగే ముదిమాణిక్యం గ్రామం మధ్య ఉన్న రామాలయంలో 350 ఏళ్ల కిందటి ఒక స్తంభాన్ని కనుగొనట్లు శాసనపరిశోధకులు ప్రిహ ఉపాధ్యక్షుడు డి. సూర్యకుమార్ తెలిపారు. బాదామి చాళుక్యుల ఆలయాలు తెలంగాణలోని అలంపూర్‌లో తప్ప మరెక్కడ లేవని తెలుగు విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఎ.శ్రీనివాసన్ తెలిపారు.

లక్ష సంవత్సరాలనాటి పనిముట్టు లభ్యం

వికారాబాద్ జిల్లా దోమ మండలం, చెల్లాపూర్ గ్రామ శివారులోని బుర్కగడ్డలో పాతరాతియుగం తొలినాళ్ల నాటి రాతి పనిముట్టును కనుగొన్నట్లు తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ తెలిపారు. ఇది పాతరాతియుగం తొలినాళ్ళకు చెందిన రాతి గొడ్డలని, వయసు సుమారు లక్ష సంవత్సరాలకుపైనే ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు.

గదిలో వ్యక్తి నిద్రిస్తుండగా భవనం కూల్చివేత

» శిథిలాలు మీద పడి అక్కడికక్కడే వ్యక్తి మృతి

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఓ పాత భవనాన్ని కూల్చివేసే క్రమంలో దారుణం జరిగింది. భవనంలోని ఓ గదిలో వ్యక్తి నిద్రిస్తున్న సంగతి తెలియక జేసీబీలతో భవనాన్ని కూల్చివేశారు. దీంతో, ఆ వ్యక్తి శిథిలాల చిక్కుకొని అక్కడికక్కడే చనిపోయాడు. కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం... శ్రీకాకుళం జిల్లా పాతపట్నంకు చెందిన స్వామిరెడ్డి రాజు(45) మూసాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్‌కు చెందిన పాత భవనంలో అద్దెకుంటున్నాడు. భార్యతో మనస్పర్థలు రావడంతో ఒంటరిగా ఉంటున్న రాజు మద్యానికి బానిసయ్యాడు. ఇదిలా ఉండగా, తన పాత ఇంటిని కూల్చివేసి కొత్త భవనం నిర్మించాలని శ్రావణ్ కుమార్ నిర్ణయించుకొన్నాడు. మంగళవారమే రాజుతోపాటు మిగతా గదుల్లో నివాసముండే వారందరిని ఖాళీ చేయించాడు. భవన కూల్చివేత పనులను ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించాడు. సదరు కాంట్రాక్టరు బుధవారం సాయంత్రం కూల్చివేత పని పూర్తి చేశాడు. రాత్రి 2 గంటల సమయంలో భవన వ్యర్థాలను తొలగిస్తుండగా శిథిలాల కింద మృతదేహం కనిపించింది. అది స్వామిరెడ్డి రాజుదేనని గుర్తించారు. రాజు తాగిన మత్తులో వచ్చి గదిలో నిద్రపోయి ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాంట్రాక్టర్ రాజు, జేసీబీ డ్రైవర్ అంజన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వాన్ని మోసగించి ఎంవోయూ

» ఒప్పందానికి 5 రోజుల ముందే ఐఎంజీ కంపెనీ ఏర్పాటు

» ఎంవోయూ రద్దుకు చట్టం చేయడం సబబే

» హైకోర్టుకు వెల్లడించిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఐఎంజీ అకాడమీస్ భారత్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఉమ్మడి ఏపీ ప్రభుత్వాన్ని మోసం చేసి.. 850 ఎకరాల భూకేటాయింపునకు ఒప్పందం (ఎంవోయూ) చేసుకుందని అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి హైకోర్టుకు తెలిపారు. ఆ ఒప్పందాన్ని చట్టం ద్వారా రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేశారు. 2003లో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం రూ.50 వేలకు ఎకరం చొప్పున 400 ఎకరాలు, రూ.25 వేలకు ఎకరం చొప్పున 450 ఎకరాలు, బంజారాహిల్స్ నుంచి మాదాపూర్ ప్రధాన రహదారిలో 1 నుంచి 5 ఎకరాల కేటాయింపునకు ఐఎంజీ భారత్‌తో ఒప్పందం చేసుకుంది. రూ.వందల కోట్ల విలువైన భూమిని కేవలం రూ.3.12 కోట్లకు కేటాయించారని.. అర్హత లేకపోయినా సదరు కంపెనీ అక్రమంగా ప్రభుత్వ భూములు పొందే ప్రయత్నం చేస్తోందని పేర్కొంటూ తర్వాత ఏర్పడిన ప్రభుత్వం ఎంవోయూను, సేల్‌డీడ్‌ను రద్దు చేయడానికి చట్టం చేసింది. దీనిపై ఐఎంజీ సంస్థ 2006లో హైకోర్టును ఆశ్రయించింది. తాజాగా ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం గురువారం విచారణ కొనసాగించింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ వాదనలు వినిపించారు. 2003 ఆగస్టు 9న ఎంవోయూ జరగ్గా అంతకు ఐదు రోజుల ముందే ఐఎంజీ కంపెనీని ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రభుత్వ వాదనలు ఇంకా పూర్తికాకపోవడంతో విచారణ ఈ నెల 28కి వాయిదా పడింది.

బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని ఆత్మహత్య

» ఈ విద్యా సంవత్సరంలో ఇది ఐదో ఘటన

భైంసా/బాసర, ఫిబ్రవరి 22: నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో గురువారం రాత్రి శిరీష (17) అనే విద్యార్థిని హాస్టల్ గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సంగారెడ్డి జిల్లా దావూర్ మండలం మానూర్ గ్రామానికి చెందిన శిరీష ఈ విద్యా సంవత్సరమే ట్రిపుల్ ఐటీలో ప్రవేశం పొంది పీయూసీ (ప్రీ యూనివర్సిటీ కోర్సు) మొదటి సంవత్సరం చదువుతోంది. గురువారం రాత్రి భోజనానికి వెళ్లి వచ్చిన విద్యార్థులు హాస్టల్ గదిలో ఆమె ఆత్మహత్య చేసుకుని ఉండడం గమనించి షాక్‌కు గురయ్యారు. శిరీష వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యకు పాల్పడిందా? లేక ఒత్తిడితోనా? లేని పక్షంలో మరే ఇతర కారణాలు ఉన్నాయా? అన్న విషయం తెలియాల్సి ఉంది. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారణ జరుపుతున్నారు. కాగా, తన బావ ఇటీవల ఆత్మహత్య చేసుకోవడంతో ఆ విషాదాన్ని తట్టుకోలేక తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు శిరీష ఘటనాస్థలంలో ఉంచిన సూసైడ్ నోట్‌లో పేర్కొంది. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమైన నాటి నుంచి ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఇది ఐదో ఆత్మహత్య ఘటన.

గంజాయి కేసులో షణ్ముఖ్ అరెస్ట్



హైదరాబాద్ సిటీ/నార్సింగ్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ యూట్యూబర్, డ్యాన్సర్, బిగ్‌బాస్ ఫేమ్ షణ్ముఖ్ జస్వంత్.. గంజాయి కేసులో అరెస్ట్ అయ్యాడు! షణ్ముఖ్ అన్న సంపత్ వినయ్ తనను వివాహం పేరుతో నమ్మించి తొమ్మిదేళ్లుగా శారీరకంగా వాడుకుంటూ మోసం చేశాడని విశాఖకు చెందిన ఓ వైద్యురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు అతడి ఫ్లాట్‌కు వెళ్లిన పోలీసులకు.. అక్కడ 18 గ్రాముల గంజాయి దొరికింది. దీంతో అన్నదమ్ములిద్దరినీ అరెస్ట్ చేశారు. బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. ఒక వీడియో సాంగ్‌లో నటించేందుకు ఆమె సంపత్‌ను తొలిసారి కలిసింది. అయితే, ఆమె తల్లి అభ్యంతరాల కారణంగా ఆ సాంగ్‌లో నటించలేదు. ఆ తర్వాత కొద్దిరోజులకు షణ్ముఖ్ ఆమెకు ఫోన్ చేసి తన అన్న ఆమెను ప్రేమిస్తున్నాడని, పెళ్లిచేసుకుంటాడని చెప్పి, అతడికి దగ్గర చేశాడు. 2015 నుంచి ఇద్దరూ రిలేషన్‌షిప్‌లో ఉన్నారు. పెళ్లి చేసుకుందామని సంపత్‌ను ఎప్పుడు అడిగినా రేపు, మాపు అని దాటవేసేవాడని.. లాంగ్‌ట్రిప్పుల పేరుతో తీసుకెళ్లి హోటల్ గదుల్లో గడిపేవాడని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పలుమార్లు వేధించినా, భౌతికదాడులకు పాల్పడినా.. అతనే భర్త అవుతాడనే నమ్మకంతో సహించినట్లు వెల్లడించారు. అతడికి పుట్టినరోజు, ఇతర సందర్భాల్లో ఖరీదైన కానుకలు కూడా ఇచ్చినట్లు తెలిపారు. 2018లో గర్భం దాల్చానని.. అతడి ఒత్తిడితో అబార్షన్ చేసుకున్నానని పేర్కొన్నారు. రెండుసార్లు పెళ్లి తేదీలు ఖరారు చేసి... వాయిదా వేసినా ఓర్పుతో సహించానని, కానీ గత నెల 27న అతడు గుట్టుచప్పుడు కాకుండా మరోయువతిని పెళ్లి చేసుకున్నాడని బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వివరించారు. తామిద్దరూ కలిసి దిగిన ఫొటోలు, తమ వీడియోలను ఆమె ఆధారాలుగా పోలీసులకు అప్పగించారు. కాగా.. బాధితురాలి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు నార్సింగ్ ఏసీపీ రమణగౌడ్ తెలిపారు. నిందితుడు నివాసం ఉన్న ఫ్లాట్‌లో గంజాయి లభించిందని.. దీంతో, అక్కడ నివాసం ఉంటున్న షణ్ముఖ్‌పై మాదకద్రవ్యాల చట్టం కింద (ఎన్డీపీఎస్ యాక్ట్) కేసు నమోదు చేసి, అతణ్ని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. అలాగే సంపత్‌పై అత్యాచారం, వేధింపులు, భౌతికదాడికి సంబంధించిన సెక్షన్లతో కేసు పెట్టి, అరెస్టు చేసి, రిమాండుకు తరలించినట్టు తెలిపారు. వారి ఫ్లాట్‌లో గంజాయి ఎలా వచ్చింది? దాన్ని వాడడానికి తెచ్చారా? లేక విక్రయించడానికా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'చలో అనంతపురం' సక్సెస్

ఆంక్షలు, నిర్బంధాలను దాటుకుని అనంతకు వెల్లువెత్తిన జర్నలిస్టులు

» 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడికి ఆగ్రహస్వరం

» 'తిరగబడేదాకా తెచ్చుకోవద్దు జగన్' అంటూ నినాదాలతో హోరెత్తిన అనంత నగర వీధులు



'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ గూండాల దాడికి నిరసనగా అనంతపురంలో జర్నలిస్టు సంఘాల ర్యాలీ

అనంతపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి)/కావలి, తిరుపతి (తిలక్‌రోడ్) : అనంతపురం వెళ్లకుండా ముందస్తు అరెస్టులు..గృహ నిర్బంధాలు..జర్నలిస్టుల ఇళ్లకు వెళ్లి నోటీసులు.. పోలీస్‌స్టేషన్లకు పిలిచి బెదిరింపులు.... అయినా 'చలో అనంతపురం'లో కలాల కవాతును ఇవేవీ ఆపలేకపోయాయి. 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ గూండాల దాడిపై జర్నలిస్టుల ఆగ్రహం వెల్లువెత్తింది. పత్రికా స్వేచ్ఛను తొక్కిపెట్టిన శక్తులను ధిక్కరిస్తూ అనంత వీధుల్లో వందలాది మంది జర్నలిస్టులు గురువారం కదం తొక్కారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర శాఖ పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుంచి పెద్దఎత్తున రిపోర్టర్లు, మీడియా జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్లు కదిలివచ్చారు. జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నా ముఖ్యమంత్రి జగన్‌కు స్పందించే తీరిక కూడా లేదా అంటూ నిలదీశారు. దాడి జరిగి నాలుగు దాటిపోయినా ముఖ్యమంత్రి, డీజీపీ నోరుమెదపకోవడం.. 'సిగ్గు సిగ్గు' అంటూ ఆగ్రహ స్వరంతో నినదించారు. ఇప్పటికైనా జర్నలిస్టులు, పత్రికా కార్యాలయాలపై దాడులను నియంత్రించకపోతే 'చలో అనంతపురం'తో ఆగమని, తాడేపల్లి ప్యాలెస్‌ను ముట్టడిస్తామని జర్నలిస్టు నేతలు తీవ్రంగా హెచ్చరించారు. అనంతపురం నగరంలోని సంగమేశ్వర సర్కిల్‌కు ఉదయం పది గంటలకల్లా పలు జిల్లాల నుంచి జర్నలిస్టులు పెద్దఎత్తున చేరుకున్నారు. పదకొండు గంటలకు అక్కడనుంచి ర్యాలీ మొదలయింది. ప్లకార్డులు, బ్యానర్లు, సంఘాల జెండాలు పట్టుకుని ప్రదర్శనగా సాగారు. అనంతపురం వీధులు జర్నలిస్టుల నినాదాలతో హోరెత్తాయి. ర్యాలీ సాగే కొద్దీ నిరసన తెలపడానికి వస్తున్నవారి సంఖ్య అంతకంతకు పెరుగుతూపోయింది. కలెక్టరేట్ వద్ద ఏర్పాటుచేసిన ధర్నా వేదిక వద్దకు చేరేసరికి ఆ ప్రాంతమంతా జర్నలిస్టులతో కిక్కిరిసిపోయింది. ఉమ్మడి అనంతపురం జిల్లాతోపాటు ఉమ్మడి కడప, కర్నూలు జిల్లాల నుంచి వచ్చిన జర్నలిస్టులు ధర్నాలో పాల్గొన్నారు. మద్దతుగా కదిలిన టీడీపీ, జనసేన, సీపీఐ, సీపీఎం, ఆయా పార్టీల అనుబంధ సంఘాలు, ఏపీఎన్జీవో, పెన్షనర్స్ అసోషియేషన్, స్వచ్ఛంద సేవా సంస్థలు, కార్మిక సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు, శ్రేణులతో ప్రాంగణం నిండిపోయింది. శ్రీకృష్ణపై దాడిచేసిన వైసీపీ గూండాలందరినీ అరెస్టు చేయాలని, వారిపై రౌడీషీట్ తెరవాలని జర్నలిస్టు నేతలు డిమాండ్ చేశారు. 'తిరగబడేదాకా తెచ్చుకోకుండా కఠిన చర్యలు తీసుకోండి' అని హెచ్చరించారు. అనంతరం ఏపీయూడబ్ల్యూజే, ఐజేయూ నాయకులు.. అనంతపురం జిల్లా ఎస్పీ అన్బురాజన్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. శ్రీకృష్ణపై దాడికి పాల్పడిన అందరిపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి కోరారు.

ప్యాలెస్ ముట్టడిస్తాం: ఏపీయూడబ్ల్యూజే

జర్నలిస్టులు, పత్రికా కార్యాలయాలపై దాడులను నియంత్రించకపోతే 'చలో అనంతపురం'తో ఆగబోమని, తాడేపల్లి ప్యాలెస్ ముట్టడిస్తామని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు హెచ్చరించారు.

కేంద్రం ఇచ్చిందే రూ.15 కోట్లు!

» ట్రైకార్ సబ్సిడీపై ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ వివరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 22: గిరిజనులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఎంఎస్ఎంఈ స్కీమ్ కింద కేంద్రం ఇస్తున్న రాయితీ నిధులు దారిమళ్లుతున్నాయంటూ 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ట్రైకార్ సబ్సిడీ స్వాహా' కథనంపై ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ స్పందించారు. ఆ పథకం కింద 2018-19, 2019-20, 2020-21 సంవత్సరాల్లో వరుసగా రూ.3 కోట్లు, రూ.2కోట్లు, రూ.కోటి చొప్పున రూ.6 కోట్లు కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు మంజూరు చేసిందని.. వాటిలో రూ.5.4 కోట్లను ఐటీడీఏ పీవోలకు ట్రైకార్ విడుదల చేసిందని ఆయన వివరించారు. 2021-22లో ప్రభుత్వం మరో రూ.9 కోట్లు మంజూరు చేసిందని వెల్లడించారు. ఈ పథకం కింద యూనిట్ల మంజూరుకు సంబంధించి ఐటీడీఏ పీవోలు 122 సవివర ప్రాజెక్టు నివేదికలను సమర్పించారని.. వాటిని ఇక్రిశాట్, నేషనల్ కన్‌స్ట్రక్షన్ అకాడమీ, వీహబ్, మత్స్య శాఖ పరిశీలించినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకూ ఈ పథకం కింద 155 యూనిట్లు శాంక్షన్ కాగా.. వాటిలో 81 యూనిట్లు గ్రౌండ్ అయ్యాయని తెలిపారు. ఈ పథకం కింద కేంద్రం మంజూరు చేసిందే రూ.15 కోట్లయితే.. 2020-22 నడుమ రూ.130 కోట్లు మంజూరయ్యాయనడం, వాటిలో రూ.62 కోట్లు విడుదల చేయగా, అందులో రూ.40 కోట్ల నిధులు దారిమళ్లాయనడం ఆధారరహితమని ఆయన పేర్కొన్నారు.

కేసీఆర్ అవినీతిపై విచారణ చేయండి

» రాష్ట్రపతికి ఫిర్యాదు చేసిన రవీంద్రనాయక్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ అవినీతిపై సీబీఐ, ఈడీ దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలంటూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు మాజీ ఎంపీ రవీంద్రనాయక్ ఫిర్యాదు చేశారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో నిధులు భారీ మొత్తంలో దుర్వినియోగమయ్యాయని, ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం రవీంద్రనాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు కేసీఆర్ పాలనలో కబ్జాకు గురయ్యాయని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన అసైన్డ్ భూములను లాక్కోని కేసీఆర్ సర్కారు రియల్ ఎస్టేట్ బ్రోకర్లకు ఇచ్చిందని ఈ ఘటనపై దర్యాప్తు జరపాలన్నారు.

జేఈఈ, నీట్ 'కోటా' రివిజన్ మెటీరియల్ సిద్ధం


హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నీట్, జేఈఈ-2024 ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు 'కోటా' డిజిటల్ రివిజన్ (ఫైనల్ ప్రిపరేషన్) మెటీరియల్ సిద్ధమైంది. ఈ విషయాన్ని ఐఐటీ-జేఈఈ/నీట్ ఫోరం తెలిపింది. ఈ డిజిటల్ మెటీరియల్‌లో 2024 సంబంధించిన స్టడీ మెటీరియల్, 2024 'కోటా' గ్రాండ్ టెస్టులు, ప్రీవియస్ టెస్టులు, ర్యాంక్ బూస్టర్ టెస్టులు, ఎన్‌సీఈఆర్‌టీ నీట్ క్వశ్చన్ బ్యాంక్ ఉంటాయి. వీటిని వాట్సాప్ ద్వారా పొందవచ్చని ఫోరం తెలిపింది. వాట్సాప్ ద్వారా పొందే వారు నీట్ 24అని జేఈఈ వారు జేఈఈ 24 అని టైపు చేసి 98490-16661కు వాట్సాప్ మెసేజ్ చేయాలని ఫోరం సూచించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి | దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● శుక్రవారం 23 ఫిబ్రవరి 2024

టీఎస్ ఈఏపీసెట్ నోటిఫికేషన్

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(టీఎస్‌సీహెచ్‌ఈ)- స్టేట్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(టీఎస్ ఈఏపీసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షను హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయుహెచ్) నిర్వహిస్తోంది. దీని ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, అనుబంధ ప్రొఫెషనల్ కళాశాలల్లో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ, నర్సింగ్ తదితర గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.



కోర్సులు

- బీఈ, బీటెక్; బీటెక్(బయోటెక్నాలజీ/డెయిరీ టెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/ఫుడ్ టెక్నాలజీ); బీఫార్మసీ; బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/హార్టికల్చర్); బీఎస్సీ ఫారెస్ట్రీ; బీవీఎస్సీ అండ్ ఏహెచ్; బీఎఫ్ఎస్సీ
- ఫార్మా-డీ(డాక్టర్ ఆఫ్ ఫార్మసీ)
- బీఎస్సీ నర్సింగ్

అర్హత: అభ్యర్థులు చేరదలచుకున్న కోర్సును అనుసరించి మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ/బయోటెక్నాలజీ/బయాలజీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్ నిర్వహించే డిప్లొమా ఎగ్జామ్ ఉత్తీర్ణులు/రాసేవారు దరఖాస్తు చేసుకోవచ్చు. బైపీసీ అభ్యర్థులు బయోటెక్నాలజీ కోర్సుల్లో చేరాలంటే మేథమెటిక్స్‌లో బ్రిడ్జ్ కోర్సు ఎగ్జామ్ ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులకు కనీసం 45 శాతం, రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి.

- బీఎస్సీ (నర్సింగ్/ఫారెస్ట్రీ)లో ప్రవేశానికి ఇంటర్ స్థాయిలో బైపీసీ/ఎంబైపీసీ చదివి ఉండాలి. బీఎస్సీ ఆనర్స్ కోర్సుల్లో ప్రవేశానికి అగ్రికల్చర్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. ఫిషరీ సైన్సెస్‌లో ఒకేషనల్ కోర్సు పూర్తిచేసిన వారు బీఎఫ్ఎస్సీకి అప్లయ్ చేసుకోవచ్చు.

వయసు: ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో చేరేవారికి 2024 డిసెంబరు 31 నాటికి 16 ఏళ్లు నిండి ఉండాలి. ఫార్మా-డీ కోర్సులో ప్రవేశానికి 17 ఏళ్లు నిండి ఉండాలి. మిగిలిన కోర్సుల్లో చేరాలంటే 17 నుంచి 22 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది.

దరఖాస్తు

- ఎంపీసీ గ్రూప్ అభ్యర్థులు 'ఇ' కోడ్ దరఖాస్తు ఫారాన్ని; బైపీసీ గ్రూప్ అభ్యర్థులు 'ఏపీ' కోడ్ దరఖాస్తు ఫారాన్ని సబ్మిట్ చేయాలి.
- బీఈ/బీటెక్/బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ / డెయిరీ టెక్నాలజీ/ఫుడ్ టెక్నాలజీ)/బీఫార్మసీ(ఎంపీసీ)/ఫార్మా-డీ(ఎంపీసీ) కోర్సులకు ఇంజనీరింగ్ (ఇ) కేటగిరీ కింద; బీఎస్సీ/ బీఎస్సీ ఆనర్స్/ బీవీఎస్సీ అండ్ ఏహెచ్/బీఎఫ్ఎస్సీ/బీఫార్మసీ (బైపీసీ)/ ఫార్మా-డీ(బైపీసీ)/బీటెక్ (ఎఫ్‌టీ/ బయోటెక్నాలజీ) (బైపీసీ) కోర్సులకు అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ(ఏపీ) కేటగిరీ కింద దరఖాస్తు చేసుకోవాలి.

టీఎస్ ఈఏపీసెట్ 2024 వివరాలు

- ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. మొత్తం 160 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు నిర్దేశించారు. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం మూడు గంటలు. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే కనీసం 25 శాతం మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నిబంధన వర్తించదు.
- ఇంజనీరింగ్(ఇ) స్ట్రీమ్ అభ్యర్థులకు మేథమెటిక్స్ నుంచి 80 ప్రశ్నలు; ఫిజిక్స్, కెమిస్ట్రీ నుంచి ఒక్కోదానిలో 40 ప్రశ్నలు ఇస్తారు.
- అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ(ఏపీ) స్ట్రీమ్ అభ్యర్థులకు బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ నుంచి ఒక్కోదానిలో 40 ప్రశ్నలు ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఫిబ్రవరి 26 నుంచి
- **ఏదేని ఒక స్ట్రీమ్‌నకు దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.900; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **రెండు స్ట్రీమ్‌లకు దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ1800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 6
- **కరెక్షన్ విండో ఓపెన్:** ఏప్రిల్ 8 నుంచి 12 వరకు
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 1 నుంచి
- **టీఎస్ ఈఏపీసెట్ 2024 తేదీలు:** ఇంజనీరింగ్(ఇ) స్ట్రీమ్‌కు మే 9, 10; అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ(ఏపీ) స్ట్రీమ్‌కు మే 11, 12
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్(నాలుగు జోన్‌లు), నల్లగొండ, కోదాడ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సత్తుపల్లి, కరీంనగర్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, నర్సంపేట్, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు.
- **వెబ్‌సైట్:** eapcet.tsche.ac.in

లిటిల్స్



టోపీ వర్తకుడు- కోతులు

ఒక ఊరిలో ఓ టోపీల వ్యాపారి ఉండేవాడు. అతడు ఇంట్లోనూ టోపీలు అమ్మేవాడు. రంగు రంగుల టోపీలుండేవి. పిల్లల నుంచి పెద్దల వరకూ ఇంట్లోనే కుట్టించి అమ్మేవాడు. అయితే అతనికి బయట గ్రామాలకు వెళ్లి టోపీలు అమ్ముకోవటానికి ఇష్టపడేవాడు. దీంతో ఒక రోజు తన మిత్రులను చూసినట్లుంటుందని దగ్గరి గ్రామానికి వెళ్లాడు. వెళ్తూ టోపీల బుట్టనూ తీసుకెళ్లాడు. టోపీలు పెద్దగా అమ్ముడవ్వలేదు. వాటినన్నింటినీ మూటగట్టి గంపలో పెట్టుకుని తన గ్రామానికి పయనం అయ్యాడు.

అసలే ఎండాకాలం.. కొంత దూరం వెళ్తూనే అలసట వచ్చింది. కాస్త తీసుకొచ్చిన సద్దిని తిని తల వాల్చాడంతే. చల్లగాలి.. చెట్టు కింద నీడకు వెంటనే నిద్రపోయాడు. నిద్రపోయి చూస్తే టోపీలు మాయమయ్యాయి. అయ్యో.. నా టోపీలంటూ గట్టిగా అరిచాడు. ఎవరూ పలకరే. అనవసరంగా ఇంత దూరం వచ్చాను. ఇంట్లో అమ్ముకుంటేనే బావుండేది. ఇలా ఊరికే వచ్చానే.. అనుకుంటూ బాధపడసాగాడు. ఆ తర్వాత కింద కూర్చుని పైకి చూస్తే పదుల కోతులు టోపీలు తల మీద పెట్టుకుని కనిపించాయి. ఇది కలయా? నిజమా? అనుకున్నాడు.



టోపీలు ఇవ్వకుంటే చంపేస్తాని బెదిరించాడు. చేత్తో రాయి విసిరినట్లు కోప్పడ్డాడు. అచ్చు అలానే కోతులన్నీ కోప్పడ్డాయి. కాలితో తంతానంటూ అరిచాడు. ఆ కోతులు కూడా చెట్టుమీద కాళ్లను గట్టిగా విసిరినట్లు అన్నాయి. ఈ వ్యాపారి ఏమి చేసినా కోతులు అనుకరిస్తున్నాయి. వెంటనే కుడిచేత్తో ఎడమచేతిమీద గట్టిగా కొట్టాడు. కోతులూ అంతే విధంగా అనుకరించాయి. దీంతో కోపం వచ్చింది. ఓ ఆలోచన కూడా వచ్చింది.

తన తల మీద ఒక టోపీ ఉంది. దాన్ని తల మీద నుంచి తీసి మళ్లీ పెట్టుకున్నాడు. కోతులన్నీ మాట్లాడుకున్నట్లు జాగ్రత్తగా టోపీలను వాటి తలమీద నుంచి తీసిన తర్వాత మళ్లీ తలమీదనే పెట్టుకున్నాయి. వెంటనే తన తలమీద టోపీని కిందకి విసిరేసాడు. వెంటనే కోతులన్నీ టోపీలను కిందకి విసిరేసాయి. క్షణాల్లో ఆ టోపీలను ఏరుకుని ఓ గుడ్డలో కట్టుకుని పోలోమని ఇంటికి బయలుదేరాడు. దారిలో కోతులూ.. మనుషుల్లానే అని గొణుక్కుంటూ ఇంటి దారి పట్టాడు. ఆ తర్వాత మరెన్నడూ వ్యాపారం చేయటానికి ఆ వర్తకుడు ఇతర గ్రామాలకు వెళ్లలేదు.

10 తేడాలను గుర్తించండి



5 తేడాలను గుర్తించండి







డైలీ సుడోకు - 237

		6			4	9		3
					6		7	
		5	2		7	8	4	
			4					
9		7				3		2
					2			
	6	3	8		9	7		
	7		3					
1		2	7			4		

సుడోకు - 236 సమాధానం

3	4	9	8	2	1	5	6	7
6	5	7	9	3	4	8	1	2
1	2	8	7	5	6	4	9	3
4	3	1	6	8	9	2	7	5
8	9	6	2	7	5	1	3	4
2	7	5	4	1	3	9	8	6
5	6	4	1	9	7	3	2	8
7	1	2	3	4	8	6	5	9
9	8	3	5	6	2	7	4	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

బిట్ మెస్రాలో ఎంబీఏ

మెస్రాలోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బిట్)- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి రెండు సెమిస్టర్లలో బేసిక్ మేనేజ్‌మెంట్ కోర్సులు; చివరి రెండు సెమిస్టర్లలో స్పెషలైజేషన్ కోర్సులు ఉంటాయి. మూడో సెమిస్టర్‌లో సమ్మర్ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. నిర్దేశిత జాతీయ పరీక్ష స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి మెరిట్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు. మెస్రా సహా లాల్‌పూర్, నోయిడా, పట్నా క్యాంపస్‌లలో ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది.

స్పెషలైజేషన్‌లు: ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్సెస్, మార్కెటింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆపరేషన్స్, బిజినెస్ అనలిటిక్స్



అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 అక్టోబరు 31 నాటికి డిగ్రీ సర్టిఫికెట్, మార్కుల షీట్లు సబ్మిట్ చేయాలి. క్యాట్/ఎక్స్ఏటీ/సీమ్యాట్/మ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలు:** మార్చి 15 నుంచి 17 వరకు
- **ప్రోగ్రామ్‌నకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** మార్చి 19
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఆగస్టు 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.bitmesra.ac.in

ఇమ్యూనాలజీలో పీహెచ్‌డీ

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యూనాలజీ(ఎన్ఐఐ)- పీహెచ్‌డీ 2024-25 మాన్‌సూన్ సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. సంస్థ నిర్వహించే కంప్యూటర్ బేస్డ్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్/జేజీఈఈబీఐఎల్ఎస్ 2024 స్కోర్, ఆన్‌లైన్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.37,000ల జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్) ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు: ఇమ్యూనాలజీ, ఇన్ఫెక్షియస్ అండ్ క్రానిక్ డిసీజ్ బయాలజీ, మాలిక్యులర్ అండ్ సెల్యులర్ బయాలజీ, కెమికల్ బయాలజీ, స్ట్రక్చరల్ బయాలజీ, కంప్యూటేషనల్ బయాలజీ.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎమ్మెస్సీ(బయాలజీ/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/ఫిజిక్స్)/ఎంటెక్/ఎంబీబీఎస్/ఎంఫార్మసీ/ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులకు ఇంటర్, డిగ్రీ స్థాయుల్లో కనీసం 60 శాతం మార్కులు, పీజీ స్థాయిలో 55 శాతం మార్కులు ఉండాలి. సీఎస్ఐఆర్/యూజీసీ/ఐసీఎంఆర్/డీబీటీ/డీఎస్‌టీ ఫెలోషిప్‌లను అనుమతిస్తారు.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఈడబ్ల్యుఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఫిబ్రవరి 26
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 25
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** ఏప్రిల్ 8 నుంచి
- **ఎన్ఐఐ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్:** ఏప్రిల్ 28
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** మే 6న
- **మొదటి రౌండ్ ఇంటర్వ్యూలు:** జూన్ 4, 6
- **రెండో రౌండ్ ఇంటర్వ్యూలు:** జూన్ 10, 12
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** జూలై 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.nii.res.in

కొమెడ్‌కె యూజీ-ఈటీ

రిమైండర్

కన్సార్షియం ఆఫ్ మెడికల్, ఇంజనీరింగ్ అండ్ డెంటల్ కాలేజెస్ ఆఫ్ కర్ణాటక(కొమెడ్‌కె)- ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి ఉద్దేశించిన అండర్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్(యూజీఈటీ) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 400 సెంటర్లలో ఈ ఎగ్జామ్‌ని నిర్వహిస్తారు. ఇందులో సాధించిన మెరిట్, కౌన్సెలింగ్‌ల ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. సింగిల్ విండో సిస్టమ్‌ను అనుసరిస్తారు. కొమెడ్‌కెలో సభ్యత్వమున్న 190 ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూషన్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. బీఈ/బీటెక్ ప్రోగ్రామ్‌లలో మొత్తం 20,000 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇంజనీరింగ్ విభాగాలు, పార్టిసిపేటింగ్ కళాశాలల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు. బీఆర్క్ ప్రోగ్రామ్‌ను ఈ ఎగ్జామ్ నుంచి మినహాయించారు. దీనికి సంబంధించి విడిగా ప్రకటన విడుదల చేస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. గ్రూప్ సబ్జెక్టులలో కనీసం 45 శాతం మార్కులు ఉండాలి. కెమిస్ట్రీకి బదులుగా బయోటెక్నాలజీ/బయాలజీ/కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్స్ చదివిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డిప్లొమా అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు. లేటరల్ ఎంట్రీ అడ్మిషన్స్ ఉండవు.

కొమెడ్‌కె యూజీఈటీ 2024 వివరాలు: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ). ఇందులో మొత్తం 180 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 60 ప్రశ్నలు అడుగుతారు. పదకొండు, పన్నెండు తరగతులకు నిర్దేశించిన సీబీఎస్ఈ సిలబస్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 180. నెగెటివ్ మార్కులు లేవు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. పరీక్ష సమయం మూడు గంటలు. విద్యార్థుల సౌలభ్యం కోసం సంస్థ 11 విభిన్న మాక్ టెస్ట్‌లను నిర్వహిస్తోంది. వీటికోసం విడిగా రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. ఫిబ్రవరి 15 నుంచి ఈ టెస్ట్‌లు అందుబాటులో ఉంటాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1800
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 5
- **కరెక్షన్ విండో ఓపెన్:** ఏప్రిల్ 12 నుంచి 16 వరకు
- **టెస్ట్ అడ్మిషన్ టికెట్(టీఏటీ) డౌన్‌లోడింగ్:** మే 6 నుంచి
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, భీమవరం, చీరాల, చిత్తూరు, గుత్తి, గుంటూరు, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, పుట్టపర్తి, రాజమండ్రి, శ్రీకాకుళం, తాడిపత్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్లగొండ, వరంగల్.
- **కొమెడ్‌కె యూజీఈటీ 2024 తేదీ:** మే 12
- **ఫైనల్ కీ విడుదల:** మే 21
- **స్కోర్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** మే 24 నుంచి
- **వెబ్‌సైట్:** www. comedk.org

COMEDK

జాబ్ కార్నర్

ఏఆర్‌వో సికింద్రాబాద్ పరిధిలో అగ్నివీరుల నియామకాలు

సికింద్రాబాద్‌లోని ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్..'అగ్నిపథ్' కింద 2024-25 సంవత్సరం నియామకాలకు సంబంధించి అగ్నివీరుల ఎంపిక కోసం అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఈ జిల్లాల అభ్యర్థులు అర్హులు: ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, జగిత్యాల, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, కుమురంభీం ఆసిఫాబాద్, మహబూబ్‌నగర్, మెదక్, మహబూబాబాద్, మంచిర్యాల, నాగర్ కర్నూల్, మేడ్చల్ మల్కాజిగిరి, నాగర్‌కర్నూల్, నల్లగొండ, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్, వనపర్తి, వరంగల్, హనుమకొండ, యాదాద్రి భువనగిరి, ములుగు, నారాయణపేట.

కేటగిరీలు

1. అగ్నివీర్ జనరల్ డ్యూటీ(ఆల్ ఆర్మ్స్)
2. అగ్నివీర్ టెక్నికల్(ఆల్ ఆర్మ్స్)
3. అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్/స్టోర్ కీపర్ టెక్నికల్(ఆల్ ఆర్మ్స్)
4. అగ్నివీర్ ట్రేడ్స్‌మన్(టెన్త్ పాస్)(ఆల్ ఆర్మ్స్)
5. అగ్నివీర్ ట్రేడ్స్‌మన్(8వ తరగతి ఉత్తీర్ణత)(ఆల్ ఆర్మ్స్)

వయోపరిమితి: 17 1/2 నుంచి 21 సంవత్సరాల మధ్య ఉండాలి. అభ్యర్థి 2003 అక్టోబరు 1 నుంచి 2007 ఏప్రిల్ 1 మధ్య జన్మించి ఉండాలి.

అర్హత: పోస్టును అనుసరించి ఎనిమిదో తరగతి, పదో తరగతి/మెట్రిక్యులేషన్, 10+2/ఇంటర్మీడియట్(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్ లేదా ఆర్ట్స్, కామర్స్, సైన్స్), సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

ఎత్తు(సెం.మీల్లో): అగ్నివీర్ జీడీ/ట్రేడ్స్‌మన్-166, అగ్నివీర్ టెక్నికల్-165, అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్-162.

ఛాతీ కొలత: గాలి పీల్చినప్పుడు 5 సెం.మీ విస్తరణతో 77 సెం.మీ.ఉండాలి. **పరీక్ష ఫీజు:** రూ.250

ఎంపిక ప్రక్రియ: ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష, రిక్రూట్‌మెంట్ ర్యాలీ(ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్/ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్), వైద్య పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: మార్చి 22

ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం: ఏప్రిల్ 22

వెబ్‌సైట్: joinindianarmy.nic.in/

రైల్వేలో టెక్నీషియన్స్

మొత్తం ఖాళీలు: 9000

దేశవ్యాప్తంగా అన్ని రైల్వే రీజియన్లలో టెక్నీషియన్ పోస్టుల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. రీజియన్ల వారీగా ఖాళీలు, విద్యార్హతలు, రాత పరీక్ష, సిలబస్ తదితర పూర్తి వివరాలను త్వరలోనే రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రకటిస్తుంది.

ఆర్ఆర్‌బీ రీజియన్లు: అహ్మదాబాద్, అజ్మీర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీగఢ్, చెన్నై, గువాహటి, జమ్మూ అండ్ కశ్మీర్, కోల్‌కతా, మాల్దా, ముంబయి, ముజఫర్‌పూర్, పట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్, సిలిగురి, తిరువనంతపురం, గోరఖ్‌పూర్.

పోస్టుల వివరాలు:

1. టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్: **1,100 పోస్టులు**
2. టెక్నీషియన్ గ్రేడ్-3: **7,900 పోస్టులు**

వయోపరిమితి: 2024 జూలై 1 నాటికి టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్ పోస్టులకు 18-36 ఏళ్లు; టెక్నీషియన్ గ్రేడ్-3 పోస్టులకు 18-33 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

ప్రారంభ వేతనం: నెలకు టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్ పోస్టులకు రూ.29,200. టెక్నీషియన్ గ్రేడ్-3 పోస్టులకు రూ.19,900.

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికోద్యోగులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్, మైనారిటీ, ఈబీసీ అభ్యర్థులకు రూ.250. ఇతరులకు రూ.500.

ఎంపిక ప్రక్రియ: ఫస్ట్ స్టేజ్ సీబీటీ-1, సెకండ్ స్టేజ్ సీబీటీ-2, కంప్యూటర్ బేస్డ్ ఆప్టిట్యూడ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: మార్చి 9

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 8

వెబ్‌సైట్: indianrailways.gov.in/

